

'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 264

గురువారం 8-6-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



తొలి రోజే 'తల'పోటు..

భారత్ బౌలర్లు విఫలం.. ఆసీస్ 327/3.. 146 పరుగులు చేసిన హెడ్ - 12లో



సెమీస్‌లో స్వియాటెక్

ఫ్రెంచ్ ఓపెన్ సింగిల్స్‌లో దూసుకెళ్తున్న డిఫెండింగ్ చాంపియన్ - 12లో

దక్షిణ ఉక్రెయిన్‌ను ముంచెత్తిన వరద



ఉక్రెయిన్ భూభాగాలపై రష్యా దురాక్రమణకు దిగాక ఇన్నాళ్లూ బాంబుదాడులకు భయపడి ప్రాణాలు అరచేత పట్టుకుని వలసపోయిన జనం ఇప్పుడు వరద ధాటికి సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్నారు. నీపర్ నదీ ప్రవాహంపై నిర్మించిన కఖోవ్కా ఆనకట్ట, జలవిద్యుత్ ప్లాంట్‌పై బాంబుల వర్షం నేపథ్యంలో డ్యామ్ బద్దలై వరదనీరు దిగువ ప్రాంతాలను ముంచెత్తింది. దీంతో దక్షిణ ఉక్రెయిన్ ప్రాంతాలు జలమయమయ్యాయి. కొందరు ఇళ్లపైకి ఎక్కి అక్కడే గడిపారు. 'రష్యా కుట్రపూరితంగా ఈ డ్యామ్‌ను నేలమట్టం చేసింది. వేలాది మంది ప్రజలకు కనీసం తాగు నీరు లేకుండా పోయింది' అని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆవేదన వ్యక్తం చేశారు. 6లో

కోర్టు ఆవరణలో గ్యాంగ్‌స్టర్ హత్య


సంజీవ్ మహేశ్వరి జీవా

ఉత్తరప్రదేశ్‌లోని లక్నో సివిల్ కోర్టు ఆవరణలో గ్యాంగ్‌స్టర్ సంజీవ్ మహేశ్వరి జీవాను లాయర్ల వేషంలో వచ్చిన వారు కాల్చి చంపారు. ఈ ఘటనలో ఒక పోలీసు, ఓ బాలిక గాయపడ్డారని, నిందితుడిని అక్కడికక్కడే పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు.

- వివరాలు 6లో

ఎన్నికల చిత్రం మారుతోంది!



మన దేశంలో ఎన్నికల తీరుతెన్నులను 2014కు ముందు, తర్వాత అని స్పష్టంగా ఒక విభజన రేఖ గీయొచ్చు. కేంద్రంలో నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల్లో విభిన్నమైన ధోరణులు కనిపించాయి. ఒకప్పుడు వివిధ రాష్ట్రాల్లో బహుముఖ పోరు ఉంటే, ఇప్పుడు రెండు పార్టీలే నేరుగా తలపడుతున్న రాష్ట్రాల సంఖ్య పెరుగుతోంది. బీజేపీ వివిధ రాష్ట్రాల్లో బలపడడం, కాంగ్రెస్ బలహీనపడడం, రాష్ట్రాల్లో మొదటి, రెండు స్థానాల్లో ఉండే కీలక పార్టీల వైపే ఓటర్లు మొగ్గు చూపిస్తూ ఉండడంతో ఎన్నికల ట్రెండ్స్ మారిపోతున్నాయి. ఇటీవల జరిగిన కర్ణాటక ఎన్నికల్లో త్రిముఖ పోరు నెలకొంటుందని అందరూ భావించినప్పటికీ జేడీ(ఎస్) తన ప్రాభవాన్ని కోల్పోయి బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్యే నేరుగా పోటీ జరగడం అతి పెద్ద ఉదాహరణ. 6లో

న్యూస్‌రీల్

'స్థానిక' ఖాళీలకు నేడే ఉప ఎన్నిక



వివిధ కారణాలతో స్థానిక సంస్థల్లో ఖాళీలు ఏర్పడిన పదవులకు గురువారం ఉప ఎన్నికలు జరగనున్నాయి. పూర్వ పశ్చిమగోదావరి జెడ్పీ చైర్మన్, విజయనగరం డిప్యూటీ మేయర్‌తో పాటు 4 మున్సిపాలిటీల్లో 2 చైర్మన్, 3 వైస్ చైర్మన్ పదవులకు, 4 మండలాల్లో ఎంపీపీ, 9 మండలాల్లో ఉపాధ్యక్ష పదవులకు ఉప ఎన్నికలు నిర్వహిస్తారు. **వివరాలు 14లో**

ఆర్డినెన్స్ విషయంలో అండగా ఉంటాం



ఆప్ అధినేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ బుధవారం లక్నోలో సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్‌తో భేటీ అయ్యారు. ఢిల్లీలో పాలనా సేవలపై సర్వాధికారం విషయంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్‌ను తాము వ్యతిరేకిస్తామని.. కేజ్రీవాల్‌కు అండగా ఉంటామని అఖిలేశ్ యాదవ్ ప్రకటించారు. **వివరాలు 6లో**

హజ్ యాత్ర ప్రారంభం



గన్నవరం విమానాశ్రయం నుంచి తొలిసారి పవిత్ర హజ్ యాత్ర ప్రారంభమైంది. 170 మందితో కూడిన హజ్ యాత్రికుల తొలి బృందం ప్రత్యేక విమానంలో జెడ్డాకు బయలుదేరింది. విమానాన్ని డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, హజ్ కమిటీ చైర్మన్ షేక్ గౌస్ లాజమ్, ఇతర మత పెద్దలు జెండా ఊపి ప్రారంభించారు. **వివరాలు 5లో**

ఇదండీ సంగతి



ఉద్యోగికి 'గ్యారెంటీ' భరోసా

సీపీఎస్‌తో పోలిస్తే మరింత మెరుగ్గా జీపీఎస్

- రిటైర్‌మెంట్ తర్వాత చివరి నెల బేసిక్‌లో 50 శాతం మొత్తం పెన్షన్‌తో పాటు ఏటా 2 డీఆర్‌లు
- త్వరలో 12వ పీఆర్సీ ఏర్పాటు
- 10వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ
- 6,840 కొత్త పోస్టుల మంజూరు
- ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ విలీనం
- మంత్రివర్గ సమావేశం అనంతరం మీడియాకు వెల్లడించిన మంత్రి వేణుగోపాలకృష్ణ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో శాశ్వత, కాంట్రాక్టు, సీపీఎస్ ఉద్యోగులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) ఉద్యోగులకు మెరుగైన పెన్షన్ అందించేలా గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్)ను రూపొందించింది. దీనిద్వారా ఉద్యోగ విరమణ తర్వాత ఆర్థిక భద్రత చేకూరనుంది. రిటైర్ అయిన ఉద్యోగి చివరి నెల మూలవేతనంలో 50 శాతం పెన్షన్, ప్రతి ఆర్నెల్లకు ఒకసారి కరువు భృతి (డీఆర్) ఇవ్వడం ద్వారా మెరుగైన పెన్షన్‌ను అందించనుంది. దీంతో పాటు ఉద్యోగులు అడగకుండానే 12వ పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ) ఏర్పాటుతోపాటు 10 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ లాంటి కీలక అంశాలకు బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన

మిగతా 2వ పేజీలో ▶

ఉద్యోగులపై సీఎం చిత్తశుద్ధి చాటుకున్నారు

- ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు
- జీపీఎస్‌ను స్వాగతిస్తున్నాం: రెవెన్యూ జేఏసీ.. రుణపడి ఉంటాం: కాంట్రాక్ట్ లెక్చరర్స్
- కాంట్రాక్ట్ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు: ఎమ్మెల్సీలు

2లో

షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు

- 2024 మార్చిలో నోటిఫికేషన్
- ఈ తొమ్మిది నెలలు అత్యంత కీలకం
- మంత్రులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దిశానిర్దేశం
- ఎన్నికల హామీల్లో 99.5% అమలు చేశాం.. ప్రజల్లో సానుకూలత
- ఈ నెల 15 నుంచి 'సురక్షా చక్ర' కార్యక్రమం

3లో


గుంటూరులో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఏపీ ఎన్జీవో నాయకులు, ఉద్యోగులు

విచారణకు శైలజా కిరణ్ సహకరించలేదు

పదే పదే ఆటంకాలు కల్పించారు

- ఆర్థికాంశాలపై ప్రశ్నించే అధికారులను అడ్డుకునేందుకు మార్గదర్శి సిబ్బంది ప్రయత్నించారు.. 25 శాతం విచారణ కూడా పూర్తి కాలేదు
- చట్టానికి లోబడే మార్గదర్శి కేసు విచారణ చేస్తున్నాం.. శైలజతోపాటు రామోజీని మరోసారి విచారిస్తాం
- త్వరలో మార్గదర్శి నిధుల అటాచ్‌మెంట్ కోసం పిటిషన్
- చందాదారుల ప్రయోజనాల పరిరక్షణకే నిధుల అటాచ్‌మెంట్
- సీఐడీ అదనపు ఎస్పీ రవికుమార్


మీడియాతో మాట్లాడుతున్న సీఐడీ అధికారులు రవికుమార్, శ్రీకాంత్

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాల కేసులో నిందితులుగా ఉన్న చెరుకూరి రామోజీరావు, శైలజా కిరణ్ విచారణకు ఏమాత్రం సహకరించడంలేదని, అయినప్పటికీ తాము చట్టానికి లోబడే విచారణ జరుపుతున్నామని సీఐడీ అదనపు ఎస్పీ రవికుమార్ స్పష్టం చేశారు. ఈనాడు, ఈటీవీ మీడియా సంస్థలు ఉద్దేశపూర్వకంగానే సీఐడీ విచారణపై నిరాధార ఆరోపణలతో తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. ఆయన బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో

మిగతా 3వ పేజీలో ▶

సీఐడీ దర్యాప్తుపైనా.. వక్రీకరణేనా రామోజీ?

- దర్యాప్తునకు సహకరించని శైలజా కిరణ్
- అన్ని ప్రశ్నలకు.. 'తెలియదు' అంటూ దాటవేత వైఖరే.. చట్టాలు, నిబంధనలు తమకు వర్తించవనే తీరే
- కానీ సహకరించినట్టుగా సీఐడీ అధికారే చెప్పారంటూ 'ఈనాడు' అబద్ధపు రాతలు
- ఇక ఆమెను విచారించాల్సిన అవసరమే లేదని సొంత తీర్పులు

3లో


విచారణకు సహకరించారు

- రవికుమార్, దర్యాప్తు అధికారి

సీఐడీ అధికారి మాటలను వక్రీకరిస్తూ 'ఈనాడు'లో ప్రచురించిన తప్పుడు వార్త

రేపు కేరళకు 'నైరుతి'!



- ఉధృతమైన పశ్చిమ గాలులు
- మరింత విస్తరణకు అనుకూల పరిస్థితులు
- రాష్ట్రంలో కొనసాగనున్న వడగాడ్పులు.. అక్కడక్కడ ఈదురుగాలులతో వర్షాలు

14లో

రైతుకు మరింత దన్ను

- 2023-24 ఖరీఫ్ సీజన్‌కు గానూ 14 రకాల పంటలకు కనీస మద్దతు ధర పెంచిన కేంద్రం
- వరి మద్దతు ధరపై రూ.143 పెంపు
- సాధారణ రకం క్వింటాల్ రూ.2,183, గ్రేడ్-ఎ రకం రూ.2,203
- పెసరపై ఏకంగా రూ.803 పెంపు, మద్దతు ధర రూ.8,558

6లో



రోగులకు వైద్యసేవల కల్పన, వారి సంరక్షణలో కీలకపాత్ర పోషించే నర్సుల అందుబాటు విషయంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రభాగాన ఉంది. క్షేత్రస్థాయిలో వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలులో ముఖ్యపాత్ర పోషించే ఏఎన్‌ఎంలు ఎక్కువగా ఉన్న రాష్ట్రం కూడా మనదే కావడం గమనార్హం. నర్సులు, ఏఎన్‌ఎం, జీఎన్‌ఎంల సంఖ్యలో సంబంధిత విద్యలో ఏపీ ముందంజలో ఉందని ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ (ఐఎన్‌సీ) వెల్లడించింది. ఇందుకు సంబంధించి 2021-22 వార్షిక నివేదికను ఐఎన్‌సీ విడుదల చేసింది. ఆ నివేదిక ప్రకారం.. నర్సులు, జీఎన్‌ఎం, ఏఎన్‌ఎంల సంఖ్యలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, మహారాష్ట్రలు ముందున్నాయి.

- సాక్షి, అమరావతి

ఏపీలో 1.39 లక్షల మంది ఏఎన్‌ఎంలు..

దేశవ్యాప్తంగా రిజిస్టర్డ్ ఏఎన్‌ఎంలు 9.82 లక్షల మంది ఉన్నారు. అయితే, ఏపీలోనే అత్యధికంగా 1.39 లక్షల మంది ఉన్నారు. రాజస్థాన్‌లో 1.10 లక్షలు, ఉత్తరప్రదేశ్‌లో 75వేల మంది ఉన్నారు. పొరుగు రాష్ట్రమైన తెలంగాణ కేవలం 10,219 మందితో 19వ స్థానంలో ఉంది. అయితే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక రాష్ట్రవ్యాప్తంగా 15వేలకు పైగా గ్రామ, వార్డు సచివాలయాలను నెలకొల్పి సచివాలయానికొక ఏఎన్‌ఎంను నియమించిన విషయం తెలిసిందే.

ఏపీలోనే ఏఎన్‌ఎంలు ఎక్కువ

దేశంలో 9.82 లక్షల మంది ఉంటే ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 1.39 లక్షల మంది

నర్సుల అందుబాటులో దేశంలో మూడో స్థానంలో ఏపీ

నర్సింగ్ విద్యలోనూ ఏపీ టాప్-5లో

ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ 2021-22 వార్షిక నివేదిక వెల్లడి

రిజిస్టర్డ్ నర్సులు దేశవ్యాప్తంగా 24.71 లక్షల మంది ఉన్నారు. తమిళనాడులో అత్యధికంగా 3.32 లక్షల మంది ఉండగా, కేరళలో 3.15 లక్షల మంది, మూడోస్థానంలో ఉన్న ఏపీలో 2.62 లక్షల మంది ఉన్నారు. తెలంగాణ 53,314 మందితో 14వ స్థానంలో ఉంది.

కొత్త కోర్సులు.. సెమిస్టర్ విధానం

నర్సింగ్ విద్యలో కౌన్సిల్ అనేక మార్పులు చేసింది. వైద్య రంగంలో వస్తున్న ఆధునిక మార్పుల నేపథ్యంలో సిలబస్‌లో సవరణలు చేసింది. బీఎస్సీ నర్సింగ్ విద్యలో ఇప్పుడు సెమిస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ సంవత్సరమే ఇది అమల్లోకి వచ్చింది. మరోవైపు.. డాక్టర్ ఆఫ్ నర్సింగ్ ప్రోగ్రాంను, ఈ-లెర్నింగ్ కోర్సులను ప్రవేశపెట్టింది. ఫౌండేషన్, కోర్, ఎలక్టివ్ కోర్సులు ప్రారంభించింది. గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో పేషెంట్ సెంటర్డ్ కేర్‌ను తీసుకొచ్చింది. ఇందులో రోగి వ్యక్తిగత ప్రాధాన్యతలు, అవసరాలను గుర్తించి సంపూర్ణమైన సేవలు అందించాల్సి ఉంటుంది.

నర్సింగ్ కౌన్సిల్ కొన్ని సూచనలు కూడా చేసింది. అవి..

- హెల్త్‌కేర్ రంగంలో వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలి.
- రోగి విషయంలో తీసుకోవాల్సిన నిర్ణయాలపై సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలి.
- వ్యక్తిగత పనితీరుతో రోగికి ఎలాంటి ప్రమాదం కలిగించకుండా వ్యవహరించాలి.
- స్కిల్ ల్యాబ్, క్లినికల్ లెర్నింగ్ పద్ధతులపై దృష్టి సారించాలి.

నర్సింగ్ విద్యలోనూ టాప్-5లో..

ఇక నర్సింగ్ విద్యలోను ఏపీ దేశంలోని టాప్-5 రాష్ట్రాల్లో ఒకటిగా ఉంది. 2022 మార్చి నాటికి ప్రభుత్వ, ప్రైవేట్ నర్సింగ్ కాలేజీల్లో బీఎస్సీ నర్సింగ్ సీట్లకు సంబంధించి కర్ణాటక మొదటి స్థానంలో ఉంది. ఈ రాష్ట్రంలో మొత్తం 19,860 సీట్లు ఉండగా, తమిళనాడులో 12వేలు, మధ్యప్రదేశ్‌లో 9వేలు, రాజస్థాన్‌లో 8,165 ఉన్నాయి. ఏపీ 8,030 సీట్లతో ఐదో స్థానంలో ఉంది. తెలంగాణ 4,980 సీట్లతో తొమ్మిదో స్థానంలో ఉంది. ఇక ఏఎన్‌ఎం విద్యకు సంబంధించి 910 సీట్లతో ఏపీ దేశంలో 12వ స్థానంలో, 455 సీట్లతో తెలంగాణ 17వ స్థానంలో ఉంది. మరోవైపు.. జీఎన్‌ఎం (జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫరీ) సీట్లు తెలంగాణలో 3,962 ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో 7,125 ఉన్నాయి. ఇవి దేశంలోనే అత్యధికంగా కర్ణాటకలో 24,731 సీట్లున్నాయి. ఇక ఏఎన్‌ఎం స్కూళ్లు ఆంధ్రప్రదేశ్‌లో 31 ఉండగా, తెలంగాణలో 16 మాత్రమే ఉన్నాయి. అత్యధికంగా మహారాష్ట్రలో 545 స్కూళ్లు ఉన్నాయి. ఈ విషయంలో తెలంగాణ 18వ స్థానంలో ఉంది. జీఎన్‌ఎం స్కూళ్లు ఆంధ్రప్రదేశ్‌లో 163 ఉండగా, తెలంగాణలో 88 ఉన్నాయి. కర్ణాటకలో ఇవి అత్యధికంగా 520 ఉన్నాయి.

క్లుప్తంగా...

డీఏ, డీఆర్.. అంటే..

కరువు భత్యం (డీఏ):

ధరల పెరుగుదల నుంచి ఉద్యోగులకు ఉపశమనం కల్పించడానికి, ద్రవ్యోల్బణం పెరుగుదల మేరకు కేంద్ర ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు ఒకసారి డీఏ(కరువుభత్యం) పాయింట్లు నిర్ణయిస్తుంది. ఆ పాయింట్ల ఆధారంగా పీఆర్సీ నిర్ధారించిన ఫార్ములా ప్రకారం రాష్ట్రంలో డీఏ నిర్ణయిస్తారు. ఉద్యోగులకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈమేరకు డీఏ పెంచుతారు. ఉద్యోగుల మూల వేతనం మీద డీఏ పెంపు వర్తిస్తుంది.

కరువు భృతి (డీఆర్):

ఉద్యోగులకు డీఏ పెంచినట్లే, డీఏకు సమానంగా పెన్షనర్లకు డీఆర్ పెంచుతారు. ఉద్యోగుల మాదిరే 6 నెలలకు ఒకసారి డీఆర్ పెంచుతారు. బేసిక్ పెన్షన్ మీద ఈ పెంపు వర్తిస్తుంది.

'సీఎం జగన్‌ది సాహసోపేత నిర్ణయం'

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ, ఉద్యోగుల కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నేతృత్వంలో మంత్రివర్గ సమావేశం నిర్ణయం తీసుకోవడంపై సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో ఉద్యోగ సంఘాలకు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం సాహసోపేతమని ఆయన పేర్కొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

గుంటూరు మెడికల్: ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా, ఉద్యోగుల పక్షపాతిగా సీఎం వైఎస్ జగన్ తీసుకుంటున్న సంచలనాత్మక నిర్ణయాలు ఎంతో హర్షణీయమని ఏపీఎన్జీవో గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు చెప్పారు. ఉద్యోగుల ప్రయోజనాలే లక్ష్యంగా రాష్ట్ర కేబినెట్ బుధవారం తీసుకున్న పలు నిర్ణయాలపై హర్షం వ్యక్తం చేస్తూ గుంటూరులోని ఏపీఎన్జీవో కార్యాలయంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ఉద్యోగులంతా సీఎం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఏపీఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్‌షరీఫ్ మాట్లాడుతూ సీఎం మాట తప్పకుండా.. ఉద్యోగులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని తెలిపారు. సంఘం జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సతీష్ కుమార్, సంయుక్త కార్యదర్శి సుకుమార్, గుంటూరు నగర అధ్యక్షుడు చింతల కళ్యాణ్ కుమార్, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

బడి పిల్లలకు 'టోఫెల్' ట్రైనింగ్

- పాఠశాల దశలోనే నైపుణ్యాల పెంపుపై ప్రభుత్వం దృష్టి
- టోఫెల్ ప్రైమరీ, జూనియర్ పరీక్షలకు సిద్ధమయ్యేలా శిక్షణ
- ఈటీఎస్‌తో ఒప్పందాన్ని ఆమోదించిన మంత్రివర్గం
- 12న జగనన్న విద్యాకానుక, 28 నుంచి అమ్మ ఒడి కార్యక్రమాలు
- మంత్రి వేణుగోపాలకృష్ణ వెల్లడి

సాక్షి, అమరావతి: విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందిస్తూ 'టోఫెల్' పరీక్షలకు సిద్ధం చేయనుంది. ఈమేరకు పరీక్షల నిర్వహణకు ఈటీఎస్‌తో ఒప్పందాన్ని మంత్రివర్గం ఆమోదించింది. ప్రతి మండలానికి రెండు జూనియర్ కళాశాలలను నెలకొల్పనుంది. ఇందులో ఒకటి ప్రత్యేకంగా బాలికల కోసమే కాగా మరొకటి కో–ఎడ్యుకేషన్ విధానంలో ఏర్పాటు కానుంది. ఈనెల 12న జగనన్న విద్యాకానుక (జేవీకే)తోపాటు 28వతేదీ నుంచి వారం రోజుల పాటు 'అమ్మఒడి' కార్యక్రమాల ద్వారా చదువుల ఆవశ్యకతను చాటి చెప్పాలని నిర్ణయించింది. పాఠశాలల్లో అమలయ్యే కార్యకలాపాల సమగ్ర పర్యవేక్షణకు ప్రతి రెవెన్యూ డివిజనల్‌లో ఒక డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారిని



నియమించనుంది. ఈమేరకు బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి జగన్ అధ్యక్షతన సమావేశమైన మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. ఈ ఏడాది టెన్త్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను 'జగనన్న ఆణిముత్యాల' పేరుతో జూన్ 15న నియోజకవర్గ స్థాయిలో, 17న జిల్లా, 20న రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం ఘనంగా సన్మానించనున్నట్లు తెలిపారు.

3 కొత్త మెడికల్ కాలేజీల్లో 2,118 పోస్టులు

వచ్చే ఏడాది మరో మూడు కొత్త మెడికల్ కాలేజీలు (పులివెందుల, పాడేరు, ఆదోని) ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఒక్కో కాలేజీకి 706 పోస్టుల చొప్పున 2,118 పోస్టుల మంజూరుకు కేబినెట్ ఆమోదించింది. రాజమహేంద్రవరం, విజయనగరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల వైద్య కళాశాలల్లో ఈ ఏడాదే తరగతులు ప్రారంభమవుతున్నాయి. 6 నుంచి 9 నెలల వ్యవధిలో అత్యంత వేగంగా పనులు చేపట్టి ప్రభుత్వం వీటిని అందుబాటులోకి తెచ్చింది. 2019తో పోలిస్తే పీజీ సీట్ల సంఖ్య కూడా రెట్టింపైంది. ఉద్దానం కిడ్నీ ఆస్పత్రిల్లో 41 మంది స్పెషాల్టీ, సూపర్ స్పెషాల్టీ వైద్యులను రెగ్యులర్ పద్ధతిలో నియమించేందుకు కేబినెట్ ఆమోదించింది. ఉద్దానం ఆస్పత్రిని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా తీర్చిదిద్దనున్నాం.

పాఠశాల స్థాయి నుంచే 'టోఫెల్'

విద్యార్థులను గ్లోబల్ సిటిజన్స్‌గా తీర్చిదిద్దడంలో భాగంగా ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేలా టోఫెల్ పరీక్ష కోసం సన్నద్ధం చేయనుంది. ఈ పరీక్షల నిర్వహణకు ఈటీఎస్‌తో ఒప్పందాన్ని మంత్రివర్గం ఆమోదించింది. టోఫెల్ ప్రైమరీ (3–5 తరగతులు), టోఫెల్ జూనియర్ (6–10 తరగతులు) పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్ అందచేస్తారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బోధించే ఇంగ్లీష్ టీచర్‌ను ప్రభుత్వం 3 రోజుల శిక్షణ కోసం అమెరికాకు పంపిస్తుంది.

డెయిరీలను నాశనం చేసిన చంద్రబాబు

మాజీ సీఎం చంద్రబాబు స్వప్రయోజనాల కోసం సహకార డెయిరీలను నిర్వీర్యం చేశారని మంత్రి వేణు మండిపడ్డారు. హెరిటేజ్ కోసం చిత్తూరు డెయిరీ మూసి వేశారన్నారు. సీఎం జగన్ పాడి రైతుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ అమూల్ ద్వారా మేలైన సేకరణ ధర లభించేలా చర్యలు చేపట్టారన్నారు. ఏపీలో పాలఉత్పత్తి పెరిగిందన్నారు. పాడిరైతును ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా 28.35 ఎకరాల చిత్తూరు డైరీ భూములను అమూల్‌కు 99 ఏళ్ల లీజుకు ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. తద్వారా చిత్తూరు డెయిరీని పునరుద్ధరించాలన్న పాడిరైతుల కల నెరవేరుతుందన్నారు.

ఆమోదించిన ఇతర ప్రతిపాదనలు..

- రూ.5 లక్షల లోపు ఆదాయం ఉన్న దేవాలయాల నిర్వహణ అర్చకులు, ధర్మకర్తలకు అప్పగించే ప్రతిపాదనకు ఆమోదం. ఐదేళ్ల పాటు ఇది అమల్లో ఉంటుంది. దేవదాయ శాఖ భూముల పరిరక్షణ చర్యల్లో భాగంగా ఆక్రమణలు తొలగించేందుకు వీలుగా చట్ట సవరణ నిర్ణయానికి మంత్రివర్గం ఆమోదం.
- చిత్తూరు జిల్లా సాదుంలో బీసీ బాలికల గురుకుల కళాశాలలో రెండు, శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస బీసీ బాలికల గురుకుల పాఠశాలలో రెండు పోస్టుల భర్తీకి కేబినెట్ ఆమోదం.
- నాడు–నేడు పనులు పూర్తైన 476 జూనియర్ కాలేజీల్లో వాచ్‌మెన్ల నియామకం.
- ఆధార్ గుర్తింపు కార్డు చట్టబద్ధత ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం.
- 2017 బధిరులు ఒలింపిక్స్ టెన్నిస్ మిక్స్‌డ్ డబుల్స్‌లో కాంస్య పతక విజేత, ఇండియన్ డెఫ్ టెన్నిస్ కెప్టెన్ షేక్ జాఫ్రిన్ (కర్నూలు జిల్లా)ను సహకారశాఖలో డిప్యూటీ రిజిస్ట్రార్‌గా గ్రూప్–1 సర్వీసులో నియమిస్తూ జోన్ –4లో సూపర్ న్యూమరరీ పోస్టు మంజూరుకు ఆమోదం.
- నరసాపురం ఫిషరీస్ యూనివర్సిటీలో 65 పోస్టులు, ఫిషరీస్ సైన్స్ కాలేజీలో 75 పోస్టులు మంజూరు. విశాఖలోని ప్రభుత్వ మానసిక చికిత్సాలయంలో నూతనంగా అడోల్‌సెంట్ అండ్ చైల్డ్ సైకియాట్రి డిపార్ట్‌మెంట్ ఏర్పాటుతో పాటు చైల్డ్ సైకియాట్రి సూపర్ స్పెషాలిటీ యూనిట్‌లో 11 పోస్టులు, కడప మానసిక వైద్యశాలలో కొత్తగా 116 పోస్టులు మంజూరు.
- రాజానగరం అసెంబ్లీ పరిధిలో సీతానగరం పీహెచ్‌సీ ఇక సీహెచ్‌సీగా మార్పు.
- శ్రీకాకుళం జిల్లా ఎచ్చర్ల మండలం ఎస్‌ఎం పురం, చిత్తూరు జిల్లా చిత్తూరు పట్టణం, ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం అన్నంగి, రాజమహేంద్రవరంలో ఏర్పాటు కానున్న నాలుగు ఐఆర్ బెటాలియన్లలో ఒక్కో చోట 980 చొప్పున మొత్తం 3,920 పోస్టుల మంజూరు.
- గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా పాలసీకి కేబినెట్ ఆమోదం. ఏడాదికి 0.5 మిలియన్ టన్నుల హైడ్రోజన్, 2 మిలియన్ టన్నుల అమ్మోనియాను వచ్చే ఐదేళ్లలో ఉత్పత్తి చేయడం లక్ష్యం.ఈ పరిశ్రమల స్థాపనతో దాదాపు 12 వేల ఉద్యోగాల కల్పన
- అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో రూ.1800 కోట్లతో 300 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్న రెన్యూ వోయేమాన్ పవర్ కంపెనీకి గ్రీన్ సిగ్నల్
- ఆంధ్రప్రదేశ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ సెక్షన్ 5 (రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఉద్యోగులను ప్రభుత్వ సర్వీసులోకి విలీనం చేస్తూ) సవరణ ప్రతిపాదనకు ఆమోదం.
- గుంటూరు జిల్లా తాడేపల్లిలో నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్(ఎన్‌సీడీసీ) ఏర్పాటుకు 2 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయింపు.
- వైఎస్సార్ జిల్లా సీ.కె.దిన్నె మండలం మామిళ్లపల్లెలో 3.70 ఎకరాలు, కడప మండలం చిన్నచౌక్‌లో 3.70 ఎకరాల ప్రభుత్వ భూమి కడప జిల్లా బెస్త సంఘానికి కేటాయింపు ప్రతిపాదనకు ఆమోదం. అనంతపురం జిల్లా పాలసముద్రంలో గతంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ నార్కొటిక్స్ సంస్థకు కేటాయించిన 10 ఎకరాల భూమి అదే ప్రాంగణంలో కేంద్రీయ విద్యాలయకు కేటాయింపు.
- నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం చేవూరులో 40 సెంట్లు, రావూరులోని 9.46 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఏపీ మారిటైం బోర్డుకు రామాయపట్నం నాన్ మేజర్ పోర్టు కోసం బదలాయింపు.
- ఏర్పేడు మండలం వికృతిమాలలో 15.15 ఎకరాల ప్రభుత్వ భూమి స్వామి నారాయణ్ గురుకుల్ ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుకు కేటాయింపు.
- డిజిటల్ లైబ్రరీలు, సచివాలయాలు, ఆర్బీకేలు, స్కూళ్లు, పీహెచ్‌సీలకు హైబ్యాండ్ విడ్త్‌తో 5జీ సేవలు అందించేందుకు వీలుగా ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ రూ.445.7 కోట్ల రుణం తీసుకునేందుకు కేబినెట్ ఆమోదం.
- ఒడిశా రైలు ప్రమాద ఘటనలో ఏపీ ప్రభుత్వం చూపిన చొరవను అభినందించిన కేంద్ర ఆరోగ్య శాఖ, ఒడిశా ప్రభుత్వం. సీఎం జగన్ సూచనలతో 50 అంబులెన్సుల తరలింపు. రాష్ట్ర ప్రభుత్వం చర్యలను హర్షిస్తూ ఆమోదించిన మంత్రివర్గం.



కేబినెట్ సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రులు

ఉద్యోగికి 'గ్యారెంటీ' భరోసా

▶ మొదటి పేజీ తరువాయి

సమావేశమైన మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అనంతరం సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మీడియాకు వివరాలు వెల్లడించారు. మాట ప్రకారం సీఎం జగన్ కాంట్రాక్టు ఉద్యోగుల దశాబ్దాల కలను నెరవేర్చారని చెప్పారు. రాష్ట్ర భవిష్యత్తు, ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జీపీఎస్‌ను తీర్చిదిద్దినట్లు వివరించారు. రిటైర్డ్ ఉద్యోగులకు పూర్తి భద్రతనిచ్చేలా రూపొందించిన జీపీఎస్ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మంత్రి వేణు ఇంకా ఏమన్నారంటే..

ఉద్యోగుల జీతాలను దాటేస్తుంది..

సీపీఎస్ ఉద్యోగులకు రిటైర్‌మెంట్ తర్వాత ఆర్థిక భద్రత లేకపోవడంపై కేబినెట్‌లో సుదీర్ఘంగా చర్చ జరిగింది. సీపీఎస్‌ను రద్దు చేస్తూ సంతకం చేసేందుకు పెద్ద సమయం కూడా పట్టదు. కానీ ఆ తర్వాత ఓపీఎస్‌ను మళ్లీ అమల్లోకి తెస్తే భవిష్యత్తు తరాలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుంది. పెన్షన్ల మొత్తం ఉద్యోగుల జీతాలను కూడా దాటేసి మోయలేని స్థాయికి చేరుకుంటుంది. 2041 నాటికి రాష్ట్ర బడ్జెట్‌లో రూ.65,234 కోట్లు పెన్షన్ల కోసమే చెల్లించాల్సి వస్తుంది. రుణాలపై చెల్లింపులతో కలిపి రాష్ట్ర సొంత ఆదాయంలో 220 శాతానికి చేరుకుంటుంది. 2070 నాటికి ఈ చెల్లింపులు సుమారు రూ.3,73,000 కోట్లకు చేరుతుంది. ఏదో ఒక దశలో ఈ మోయలేని భారాన్ని తట్టుకోలేక 2003 మాదిరిగానే మళ్లీ ఓపీఎస్‌ను రద్దు చేయాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. అన్ని విధాలా ఆలోచించి సీపీఎస్‌కు బదులుగా జీపీఎస్‌ను తీసుకొచ్చాం.

సీపీఎస్‌తో అనిశ్చితి..

ప్రస్తుత సీపీఎస్ విధానం 01-09-2004 తర్వాత ఉద్యోగాల్లో చేరిన వారికి వర్తిస్తుంది. ఇందులో ప్రభుత్వ ఉద్యోగులు తమ బేసిక్‌లో 10 శాతం జీతాన్ని పెన్షన్ ఫండ్‌కు బదిలీ చేస్తుండగా అంతే మొత్తాన్ని ప్రభుత్వం జమ చేస్తోంది. ఉద్యోగ విరమణ తర్వాత కార్పస్‌లో 60 శాతాన్ని ఉద్యోగి తీసుకుని 40 శాతం సొమ్మును యాన్యుటీ పెన్షన్ స్కీంలో పెట్టుబడిగా పెట్టాల్సి ఉంది. ఇదంతా మార్కెట్ ఒడిదుడుకులకు లోబడి ఉంటుంది. పూర్తి అనిశ్చితి ఏర్పడితే రావాల్సిన పెన్షన్‌కూ గ్యారెంటీ ఉండటం లేదు. బేసిక్ శాలరీలో 20.3 శాతమే పెన్షన్‌గా వచ్చే అవకాశం ఉండగా అది కూడా వడ్డీరేట్లపై ఆధారపడి వస్తుండటంతో భద్రత ఉండటం లేదు.

జీపీఎస్‌తో గ్యారంటీ ఇలా..

సీపీఎస్‌కు ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీపీఎస్ విధానం ఉద్యోగ విరమణ తర్వాత పెన్షన్‌కు పూర్తి గ్యారంటీ ఇస్తుంది. ఇందులోనూ సీపీఎస్‌లో చెల్లించినట్లే ఉద్యోగి 10 శాతం పెన్షన్ వాటాగా చెల్లిస్తే ప్రభుత్వం కూడా అంతే కడుతుంది. ఉద్యోగ విరమణ సమయంలో చివరి జీతంలో బేసిక్‌లో 50 శాతం పెన్షన్‌గా అందుతుంది. ఇక్కడ సీపీఎస్‌తో పోలిస్తే పెన్షన్ 150 శాతం అధికంగా ఉంటుంది. ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ప్రతి ఆర్నెల్లకు ఒకసారి ప్రకటించే డీఏలను పరిగణలోకి తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రెండు డీఆర్‌లు ఇస్తుంది. ఉదాహరణకు రిటైరైన ఉద్యోగి చివరి నెల బేసిక్ జీతం రూ.లక్ష ఉంటే అందులో రూ.50 వేలు పెన్షన్‌గా వస్తుంది. ఏడాదికి రెండు డీఆర్‌లతో కలుపుకొని ఇది ఏటా పెరుగుతుంది. 62 ఏళ్లకు రిటైర్ అయ్యే వ్యక్తి మరో ఇరవై ఏళ్ల తర్వాత అంటే 82 ఏళ్ల వయసులో జీపీఎస్ ద్వారా రూ.1,10,000 పెన్షన్‌గా తీసుకుంటారు. తద్వారా రిటైర్డ్ ఉద్యోగి జీవన ప్రమాణాలను కాపాడినట్లు అవుతుంది. సీపీఎస్‌లో ఇలాంటి వెసులు బాటు లేదు.

6,840 కొత్త పోస్టుల మంజూరు

నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెచ్చింది. వివిధ శాఖల్లో సుమారు 6,840 కొత్త పోస్టుల మంజూరుకు కేబినెట్ ఆమోదించింది. వీటిల్లో 3,920 రిజర్వ్ పోలీసు ఉద్యోగాలు సహా నూతన వైద్య కళాశాలలు, పలు విద్యా సంస్థల్లో భారీ ఎత్తున కొత్త పోస్టులను కల్పించింది.

ప్రభుత్వంలోకి వైద్య విధాన పరిషత్

ఏపీ వైద్య విధాన పరిషత్ 1986 యాక్ట్‌ను రద్దు చేసి 'డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్' శాఖగా మార్చి ప్రభుత్వంలో విలీనం చేయడానికి వీలుగా చట్ట సవరణకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వైద్య విధాన పరిషత్ స్వయం ప్రతిపత్తి నుంచి ప్రభుత్వంలోకి మారడం ద్వారా 14,658 మంది ఉద్యోగులకు మేలు జరుగుతుంది. వీరికి ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే 010 పద్దు కింద వేతనాలను చెల్లించనుంది.

దేశానికే ఆదర్శంగా జీపీఎస్

దేశంలో కొన్ని రాష్ట్రాలు మళ్లీ ఓపీఎస్‌ను అమలు చేస్తున్నట్లు ప్రకటించినా అమల్లోకి తీసుకురాలేకపోతున్నాయి. ఏం చేయాలో తెలియక మల్లగుల్లాలు పడుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులకు మంచి చేయాలనే ఉద్దేశంతో సుదీర్ఘ కసరత్తు చేసి జీపీఎస్‌ను తీసుకొస్తున్నాం. ఇది దేశానికే ఆదర్శంగా నిలవనుంది. 2070 నాటికి జీపీఎస్ వల్ల రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన వ్యయం క్రమంగా పెరుగుతూ రూ.1,33,506 కోట్లకు చేరుకుంటుంది. ఇందులో రూ.1,19,520 కోట్లు ప్రభుత్వమే బడ్జెట్ నుంచి భరించాల్సి వస్తుంది.

మాట ఇచ్చి.. నెరవేర్చి

సీఎం వైఎస్ జగన్ పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇది 2014 జూన్ 2 నాటికి ఐదేళ్ల సర్వీసు ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులందరికీ వర్తిస్తుంది. కటాఫ్ తేదీకి 10 ఏళ్లు ఉండాలని అధికారులు సిఫార్సు చేస్తే సీఎం జగన్ ఐదేళ్లకు తగ్గించారు. దీంతో మేనిఫెస్టో హామీల్లో 99.50 శాతం అమలు చేసినట్టైంది. జిల్లాల పునర్విభజన తర్వాత కొత్త జిల్లాల్లోనూ ఒకేలా హెచ్‌ఆర్‌ఏ ఉండేందుకు అన్ని జిల్లా కేంద్రాల్లో 16 శాతం హెచ్‌ఆర్‌ఏ ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ఫలితంగా కొన్ని జిల్లా కేంద్రాల్లో 12 శాతంగా ఉన్న హెచ్‌ఆర్‌ఏ 16 శాతానికి పెరుగుతుంది. 2022 జనవరి 1వతేదీ నుంచి డీఏ, డీఆర్ 2.73 శాతం ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదించింది. దీనివల్ల ప్రభుత్వంపై నెలకు రూ.200 కోట్ల అదనపు భారం పడనుంది.

సెల్యూట్ సీఎం సార్

- జీపీఎస్ ద్వారా ఉద్యోగులకు ఎంతో మేలు
- నిరుద్యోగులకు ఊరటనిచ్చేలా కేబినెట్ నిర్ణయాలు
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఉద్యోగ సంఘాలు, జేఏసీల నేతల కృతజ్ఞతలు

సాక్షి, అమరావతి/లబ్బీపేట/రామచంద్రపురం/గుంటూరు మెడికల్/గాంధీనగర్: కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు అన్ని వర్గాలకు మేలు చేకూర్చేలా ఉన్నాయని పలు ఉద్యోగ సంఘాల నేతలు, జేఏసీల నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను నెరవేర్చి ఎన్నో వేల కుటుంబాలకు మేలు చేకూర్చారని పేర్కొంటూ సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

13,000 మంది ఉద్యోగులకు మేలు

ఏపీ వైద్య విధాన పరిషత్ (ఏపీవీవీపీ)ను ప్రభుత్వ శాఖగా మారుస్తూ కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై ఏపీవీవీపీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లి కృష్ణ, ప్రధాన కార్యదర్శి సురేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయంతో 13,000 ఉద్యోగుల కుటుంబాలకు మేలు చేకూరనుందని చెప్పారు. సీఎం జగన్ తీసుకున్న నిర్ణయంతో అందరు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే తమకూ 010 పద్దు ద్వారా జీతాలు చెల్లింపులు చేపడతారని వెల్లడించారు. కాగా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని ఏరియా ఆసుపత్రి వద్ద ఏపీవీవీపీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది సీఎంకు ధన్యవాదాలు తెలుపుతూ నినాదాలు చేశారు.



రామచంద్రపురంలో సీఎంకు ధన్యవాదాలు తెలుపుతున్న ఏపీవీవీపీ ఉద్యోగులు

నిరుద్యోగులకు ఎంతో ఊరట

ఏపీలోని నిరుద్యోగులకు ఊరట కలిగించేలా కేబినెట్ నిర్ణయాలు ఉన్నాయని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ తెలిపారు. జాబ్ క్యాలెండర్‌కు 10,000 పోస్టులను గుర్తించడంపై హర్షం వ్యక్తం చేశారు. టెట్ కమ్ డీఎస్సీ, డిజిటల్ గ్రంథాలయ శాఖ, పోలీస్, ఎస్ఐ, ఫైర్, జైల్ వార్డెన్స్, మెడికల్ అండ్ హెల్త్, సచివాలయాలు, వర్సిటీల్లో ఉన్న బోధన,బోధనేతర సిబ్బంది భర్తీ దిశగా ప్రభుత్వం అడుగులు వేయడం శుభ పరిణామమన్నారు.

జీపీఎస్ అమలుపై కృతజ్ఞతలు

ఒకేసారి 1.34 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియ చేపట్టి తమ జీవితాల్లో వెలుగులు నింపడమే కాకుండా జీపీఎస్ అమలుతో పెన్షన్ భరోసా కల్పించినందుకు ప్రభుత్వానికి గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కృతజ్ఞతలు తెలిపింది. సీఎం జగన్‌కు తాము మనస్ఫూర్తిగా సెల్యూట్ చేస్తున్నట్లు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జాని పాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్టి రత్నం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరి, రామకృష్ణా రెడ్డి, హరీంద్ర, కిరణ్, కార్యనిర్వాహక కార్యదర్శి సుభాని, పుల్లారావు తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ఎంతో మేలు

సీపీఎస్‌కు బదులుగా జీపీఎస్ విధానానికి కేబినెట్ ఆమోదం తెలపడంపై సీఎం వైఎస్ జగన్‌కు పీటీడీ(ఆర్టీసీ) వైఎస్సార్ యూనియన్ కృతజ్ఞతలు తెలిపింది. 50 శాతం కనీస పింఛన్‌తో పాటు డీఏలు వర్తించే విధంగా కొత్త విధానాన్ని ప్రవేశపెట్టడంపై హర్షం వ్యక్తం చేసింది. ఈ విధానంతో ఆర్టీసీ ఉద్యోగులకు గరిష్టంగా లబ్ధి చేకూరుతుందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడు జీఎం నాయుడు, ఉపాధ్యక్షురాలు లత తెలిపారు.

జీపీఎస్‌తో ఎంతో మేలు



కేబినెట్‌లో ఉద్యోగులకు సంబంధించి 5 అంశాలకు ఆమోదం లభించింది. డీఏ కోసం ఇచ్చిన జీవోను ర్యాటిఫై చేశారు. అన్ని జిల్లా కేంద్రాలకు సమానంగా 16% హెచ్‌ఆర్‌ఏ అమలు చేస్తామన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించారు. కాంట్రాక్ట్ ఎంప్లాయిస్‌ను రెగ్యులరైజ్ చేస్తూ తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకం. కొత్త పీఆర్సీ కమిషన్ వేయడం అభినందనీయం. ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగులకు మేలు చేసేలా జీపీఎస్ తీసుకువచ్చారు. ఈ స్కీమ్ కిందకు వచ్చే వారికి చివరి పే స్కేల్‌లో 50% ఇస్తూ, దానికి అదనంగా డీఏ ఇచ్చేలా తీసుకున్న నిర్ణయం హర్షణీయం. పాత పెన్షన్ స్కీమ్‌కు, జీపీఎస్‌కు మధ్య ఒకటే తేడా ఉంది. పీఆర్సీ ఒక్కటే లేదు. డీఏ కూడా ఫిక్స్ చేశారు. ప్రతీ ఆర్నెల్లకు 2% డీఏ ఇవ్వాలని నిర్ణయించారు. హౌస్‌సైట్స్ విషయంలో సీఎం సానుకూలంగా ఉన్నారు. జగనన్న లేఅవుట్లలో 10% కేటాయించారు. 20% డిస్కౌంట్ ఇచ్చారు. ప్రత్యేకంగా స్థలాలు కేటాయించేందుకూ సుముఖంగా ఉన్నారు. 10 ఏళ్లు సర్వీస్ పూర్తి చేసిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్ట్ ఉద్యోగులుగా మార్చి క్రమబద్ధీకరించాలని కోరుతున్నాం. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– కాకర్ల వెంకట్రామిరెడ్డి, ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు

ఉద్యోగులపై సీఎం చిత్తశుద్ధి చాటుకున్నారు

ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు



సాక్షి,అమరావతి: ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి సీఎం వైఎస్ జగన్ తన చిత్తశుద్ధి చాటుకున్నారని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన మీడియాతో.. మాట్లాడుతూ మంత్రివర్గ సమావేశంలో ఉద్యోగులకు మేలు చేసే నిర్ణయాలకు సీఎం ఆమోదం తెలపడంపై కృతజ్ఞతలు తెలిపారు. గడువుకు ముందే 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేస్తుండటం గొప్ప విషయమన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించడం ద్వారా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని అమలు చేయడం అభినందనీయమన్నారు. ఏపీ వైద్య విధాన పరిషత్ ఉద్యోగులకు 010 ద్వారా జీతాలు చెల్లించే నిర్ణయం జీవితాల్లో ప్రభుత్వం వెలుగులు నింపిందన్నారు. 11వ పీఆర్సీ, డీఏ బకాయిలను విడతల వారీగా చెల్లించడానికి అంగీకరించడం మంచి విషయమన్నారు. తమకు జీపీఎస్ ఆమోదయోగ్యమేనని చెప్పారు. గతంలో జరిగిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశాల్లో జీపీఎస్ కోసం 32% కంటే ఎక్కువ ఇవ్వలేమని మంత్రులు, ఉన్నతాధికారులు చెప్పారని, కానీ సీఎం పెద్ద మనసు చేసుకుని 50% పెన్షన్‌కు డీఏ కలిపి ఇస్తామని చెప్పడం ఆయన గొప్ప మనసుకు నిదర్శనమన్నారు.

తెలంగాణ కంటే బాగా చేశారు

వైఎస్ జగన్ ఉద్యోగుల పట్ల అభిమానాన్ని చాటుకున్నారు. 10,000 మందికిపైగా కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడం గొప్ప విషయం. తెలంగాణలో కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసినా అక్కడ చాలా తక్కువ మంది. ఏపీలో చాలా ఎక్కువ మందిని చేస్తున్నారు.

– శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి, ఏపీ ఎన్జీఓ అసోసియేషన్

జీపీఎస్‌ను స్వాగతిస్తున్నాం

జీపీఎస్‌ను స్వాగతిస్తున్నాం. 12వ పీఆర్సీతో పాటు పే రివిజన్ కమిషన్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు ఎన్నో చర్యలు తీసుకున్నారు.


– వీఎస్ దివాకర్, చైర్మన్, ఏపీ రెవెన్యూ జేఏసీ

రుణపడి ఉంటాం

సీఎంకు మేమంతా రుణపడి ఉంటాం. పీఆర్సీ ఇస్తున్నామని ఎన్నికలకు 3 నెలలు ముందు చెప్పి గత ప్రభుత్వంలో మాకు అన్యాయం చేశారు. కాంట్రాకట్ ఉద్యోగుల పక్షాన జగన్ ఉన్నారు.

– రామచంద్రారెడ్డి, అధ్యక్షుడు, ఏపీ కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్

10,117 మందికి మేలు



ప్రభుత్వ నిర్ణయంతో 10,117 మంది ఉద్యోగులకు మేలు చేకూరుతుంది. కొత్త పీఆర్సీ కోసం కమిటీ వేయడం, అన్ని జిల్లాల్లో హెచ్‌ఆర్‌ఏ 12 % నుండి 16% పెంచడం, సీపీఎస్ కన్నా మెరుగైన పెన్షన్ విధానం జీపీఎస్‌ను ప్రతిపాదించడం ఉద్యోగులకు మేలు చేసే అంశాలు.

– ఎంవీ రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ

జీవితాల్లో వెలుగులు

కాంట్రాక్ట్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయడం ద్వారా వారి జీవితాల్లో సీఎం వెలుగులు నింపారు. సీపీఎస్ ఉద్యోగుల కష్టాలు తీరేలా వారికి మెరుగైన రీతిలో న్యాయం జరిగేలా కొత్త విధానం నిర్ణయించడం ముదావహం.


– కల్పలత, ఎమ్మెల్సీ

జగనన్న ఫొటో ఇంట్లో పెట్టుకుంటాం

మమ్మల్ని గత ప్రభుత్వం రెగ్యులర్ చేస్తుందని చివరి వరకు చూశాం. ఎన్నికల స్టంట్‌గా బేసిక్ పే అమలు చేయమని గత ప్రభుత్వంలో జీఓ ఇచ్చిపోతే జగనన్న వచ్చాక బేసిక్ పే ఇచ్చారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేసిన ఘనత ఒక్క జగనన్నకే దక్కింది. జగనన్న ఫొటో ఇంట్లో పెట్టుకుంటాం.

– లక్ష్మి, కాంట్రాక్ట్ ఉద్యోగి

సీఎం జగన్‌ది సంక్షేమ సంతకం



ఇచ్చిన హామీల అమల్లో పేటెంట్ రైట్ ఏదైనా ఉంటే అది సీఎం వైఎస్ జగన్‌దే. సీపీఎస్ స్థానంలో జీపీఎస్ అమలు చేస్తూ నిర్ణయం తీసుకోవడం సంతోషకరం. సీఎం జగన్ సంతకమే సంక్షేమ సంతకం. కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయడంతో వారంతా సీఎం జగన్‌కు రుణపడి ఉంటారు.

– పి.గౌతంరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్

దశాబ్దాల కలను నెరవేర్చారు

కాంట్రాక్ట్ ఉద్యోగుల దశాబ్దాల కలను సీఎం జగన్ నెరవేర్చారు. ఈ మేలును ఎన్నటికీ మరువలేము. కేబినెట్‌లో క్రమబద్ధీకరణ తీసుకున్న క్షణం మా ఇళ్లలో పండుగ వాతావరణం కనిపించింది. సుదీర్ఘ నిరీక్షణకు సీఎం జగన్ చరమగీతం పలికారు.

– రవికుమార్, కొలకలూరి రత్నాకర్‌బాబు, ఏపీ స్టేట్ కాంట్రాక్ట్ ఫార్మాసిస్ట్స్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్

చాలా సంతోషంగా ఉన్నాం

సీఎం జగన్ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ నిర్ణయం ఎంతో సంతోషానిచ్చింది. ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్ట్ లెక్చరర్లుగా పనిచేస్తోన్న వారికి మేలు జరుగుతుంది. ఇప్పుడు 1,500 మందిని క్రమబద్ధీకరిస్తారు. వీరితోపాటే మిగిలిన వారినీ క్రమబద్ధీకరించాలని కోరుతున్నాం.


– గాంధీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘం

రుణపడి ఉంటాము

చంద్రబాబు సీఎంగా ఉండి 1994లో పోస్టుల్లో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమించారు. ఇప్పుడు కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ సీఎం జగన్ సానుకూల నిర్ణయం తీసుకోవడం అభినందనీయం. మా కుటుంబాలు సీఎం జగన్‌కు రుణపడి ఉంటాయి.

– ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్

స్వాగతిస్తున్నాం..



12వ పీఆర్సీ ఏర్పాటు చేయాలని కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. కొత్త డీఏ అమలు, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ నిర్ణయం హర్షణీయం. ఉద్యోగ, కార్మిక, పెన్షనర్ల సమస్యలు, డిమాండ్లపై కేబినెట్‌లో సానుకూల నిర్ణయాలు తీసుకున్న సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు.


–డీ శ్రీను, రాష్ట్ర అధ్యక్షుడు, డీపీఆర్టీయూ

10వేల కుటుంబాల్లో వెలుగులు

పాదయాత్ర సమయంలో వైఎస్ జగన్‌ను కలిసి వైద్య శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ అంశాన్ని ఆయన దృష్టికి తీసుకుని వెళ్లాము. తాను అధికారంలోకి వస్తే ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తానని జగన్ హామీ ఇచ్చి ఇప్పుడు దాన్ని నెరవేర్చారు. క్రమబద్ధీకరణ నిర్ణయంతో 10 వేల కుటుంబాల్లో వెలుగులు నింపారు.

– అరవ పాల్, అధ్యక్షుడు ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్

పీఆర్సీ ఏర్పాటు హర్షణీయం



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు న్యాయబద్ధంగా రావలసిన 12వ పేరివిజన్ కమిషన్ ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయం. దీనికి సహకరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, మంత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు.

– వినుకొండ రాజారావు, రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్

మంచి నిర్ణయం తీసుకున్నారు

రాష్ట్ర చరిత్రలో ఏ సీఎం తీసుకోని గొప్ప నిర్ణయాన్ని జగన్ తీసుకున్నారు. ఈ నిర్ణయంతో 7 వేల మందికి లబ్ధి చేకూరనుంది. 2014 నాటికి సర్వీస్‌లో ఉన్నవారందరినీ క్రమబద్ధీకరించినట్లయితే మరో 4 వేల మందికి మేలు జరుగుతుంది. ప్రస్తుతం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో 110 మంది రెగ్యులర్ అవుతున్నారు.

– బి.కృష్ణ, ప్రధాన కార్యదర్శి, ఏపీ పాలిటెక్నిక్ కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్

షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు

2024 మార్చిలో నోటిఫికేషన్.. ఈ తొమ్మిది నెలలు అత్యంత కీలకం

- మంత్రులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దిశానిర్దేశం
- ఎన్నికల హామీల్లో 99.5% అమలు చేశాం.. అన్ని వర్గాల ప్రజల్లో సానుకూలత
- ఎమ్మెల్యేలతో కలసి సమన్వయంతో పని చేయాలి
- సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా చేసిన మంచిని ప్రజలకు చెప్పండి
- ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి
- పార్టీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేయండి
- కలసికట్టుగా పనిచేస్తే 2024 ఎన్నికల్లోనూ విజయం మనదే
- చంద్రబాబు మేనిఫెస్టోను పట్టించు కోవాల్సిన అవసరం లేదని వ్యాఖ్య
- చంద్రబాబు మోసాలను మరోసారి ప్రజలకు గుర్తు చేయాలని సూచన

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలు వస్తాయంటూ కొన్నాళ్లుగా టీడీపీ, ఎల్లో మీడియా కలసికట్టుగా చేస్తున్న ప్రచారాన్ని సీఎం వైఎస్ జగన్ మరోసారి కొట్టిపారేశారు. షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు జరుగుతాయని స్పష్టం చేశారు. '2019 మార్చిలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది. 2024 ఎన్నికల నోటిఫికేషన్ కూడా మార్చిలోనే వస్తుంది. అంటే ఎన్నికలకు ఇంకా తొమ్మిది నెలల సమయం ఉంది' అని మంత్రులతో సీఎం జగన్ పేర్కొన్నారు. బుధవారం వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో మంత్రి మండలి సమావేశం అనంతరం అజెండా ముగిశాక అధికారులు నిష్క్రమించారు. ఆ తర్వాత మంత్రులతో సమకాలీన రాజకీయ పరిస్థితులపై సీఎం జగన్ చర్చించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ ఉద్యోగులకు ఊరట కల్పించేలా జీపీఎస్ విధానాన్ని తేవడంతో పాటు కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ హామీని నిలబెట్టుకుంటూ సుమారు పది వేల మంది రెగ్యులరైజేషన్‌ను తాజాగా ఆమోదించామన్నారు. 12వ పీఆర్సీ ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిన విషయాన్ని గుర్తు చేస్తూ ఎన్నికల హామీల్లో 99.5 % అమలు చేశామని చెప్పారు.

మేనిఫెస్టోనే మాయం చేసిన చంద్రబాబు

మరో తొమ్మిది నెలల్లో ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఈ తొమ్మిది నెలలు మరింత కష్టపడాలని మంత్రులకు సీఎం జగన్ సూచించారు. సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా చేసిన మంచిని ప్రజల్లోకి మరింత సమర్థంగా తీసుకెళుతూ అదే సమయంలో విపక్షాలు, ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని దిశా నిర్దేశం చేశారు. ఎమ్మెల్యేలతో సమన్వయంతో వ్యవహరిస్తూ పార్టీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేయాలని మంత్రులకు సూచించారు. చంద్రబాబు విడుదల చేసిన మేనిఫెస్టోను పట్టించుకోవాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. '2014 ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని చంద్రబాబు పూర్తిగా అమలు చేసిన దాఖలాలు లేవు. వ్యవసాయ రుణాల మాఫీ పేరుతో రైతులను, డ్వాక్రా రుణాల మాఫీ పేరుతో పొదుపు సంఘాల అక్కాచెల్లెమ్మలను.. ఇలా అన్ని వర్గాలను మోసగించారు. ప్రజలెక్కడ నిలదీస్తారో అనే భయంతో టీడీపీ వెబ్‌సైట్ నుంచి ఎన్నికల మేనిఫెస్టోనే మాయం చేసిన చరిత్ర చంద్రబాబుది. దీన్ని ప్రజలకు మరోసారి గుర్తు చేయండి' అని సీఎం జగన్ మార్గనిర్దేశం చేశారు. సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలనతో అన్ని వర్గాల ప్రజల్లో ప్రభుత్వం పట్ల సానుకూలత ఉందన్నారు. కలసికట్టుగా పని చేస్తే 2024 ఎన్నికల్లోనూ విజయం మనదేనని మంత్రులతో పేర్కొన్నారు

15 నుంచి 'సురక్షా చక్ర'!

ఎలాంటి వివక్ష లేకుండా పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంతృప్త స్థాయిలో ప్రయోజనం చేకూరుస్తూ మేలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇంకా ఎవరైనా మిగిలిపోతే పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఇప్పటికే అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. ఈ దిశగా తాజాగా మరో అడుగు ముందుకు వేసింది. అర్హులు ఎవరూ ప్రయోజనం పొందకుండా మిగిలిపోకూడదన్న సంకల్పంతో ఈనెల 15వ తేదీ నుంచి 'సురక్షా చక్ర' కార్యక్రమం ద్వారా గృహ సారథులు, వలంటీర్లు నెల రోజుల పాటు ప్రతి ఇంటినీ జల్లెడ పట్టి మరీ పరిశీలన చేపట్టనున్నారు. ఇంకా ఎవరైనా అర్హులు మిగిలిపోతే వారిని గుర్తించి లబ్ధి చేకూరేలా చర్యలు చేపట్టనున్నారు. తమకు అన్నీ అందుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేసిన వారిని ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరనున్నారు.

చిన్న మున్సిపాల్టీలకు ఈ-ఆటోలు

నేడు ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- చెత్త సేకరణకు 36 చిన్న మున్సిపాల్టీలకు 516 ఆటోలు
- రూ.21.18 కోట్ల వ్యయంతో కొనుగోలు
- ఈ ఆటోల డ్రైవర్లుగా మహిళలకు ప్రాధాన్యత
- రాష్ట్రాన్ని క్లీన్ ఆంధ్రప్రదేశ్‌గా మార్చడమే లక్ష్యంగా పలు చర్యలు

సాక్షి, అమరావతి: రాష్ట్రాన్ని క్లీన్ ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధృడ సంకల్పం. ఈ లక్ష్యంతో చిన్న మున్సిపాలిటీల్లోనూ చెత్త సేకరణకు పర్యావరణహితంగా ఉండే విద్యుత్తు ఆటోలను (ఈ-ఆటోలను) ప్రవేశపెడుతున్నారు. తద్వారా ఆ మున్సిపాల్టీలకు నిర్వహణ భారం కూడా తగ్గుతుంది. గురువారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జెండా ఊపి వీటిని ప్రారంభించనున్నారు. రూ.4.10 లక్షల విలువైన 516 ఈ-ఆటోలను మొత్తం రూ.21.18 కోట్ల వ్యయంతో కొనుగోలు చేశారు. వీటిని 36 మున్సిపాల్టీలకు పంపిణీ చేస్తారు. ఈ ఆటో సామర్థ్యం 500 కిలోలు. మహిళా సాధికారతకు పెద్ద పీట వేస్తూ 'ఈ- ఆటోల' డ్రైవర్లుగా మహిళలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

జగనన్న స్వచ్ఛ సంకల్పం

జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ఇప్పటికే రూ.72 కోట్లతో 123 మున్సిపాలిటీల్లోని 40 లక్షల కుటుంబాలకు తడి, పొడి, హానికర వ్యర్థాల సేకరణకు నీలం, ఆకుపచ్చ, ఎరుపు రంగుల్లోని 120 లక్షల చెత్త బుట్టలను ప్రభుత్వం పంపిణీ చేసింది. గ్రేడ్-1 ఆపై మున్సిపాలిటీల్లో చెత్త సేకరణకు 2,525 పెట్రోల్, డీజిల్, సీఎన్జీ గార్బేజ్ టిప్పర్లను వినియోగిస్తోంది. అలాగే గుంటూరు, విశాఖపట్నంలలో వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టులు ప్రారంభించింది. త్వరలో రోజుకు 400 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో మరో ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. రూ.157 కోట్లతో 81 మున్సిపాలిటీలలో 135 గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లు నిర్మిస్తున్నారు. 71 సమీకృత ఘన వ్యర్థాల నిర్వహణ ప్రాజెక్టులు, తడి చెత్త నిర్వహణకు 29 వేస్ట్ టు కంపోస్ట్, నాలుగు బయో మిథనేషన్ ప్రాజెక్టులు నడుస్తున్నాయి. లక్ష లోపు జనాభా ఉన్న 66 మున్సిపాలిటీల్లో రూ.1,445 కోట్లతో 206 టీపీఐఎస్‌లు, లక్ష లోపు జనాభా ఉన్న 55 మున్సిపాలిటీల్లో ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. తాజాగా చిన్న మున్సిపాలిటీల్లో ఈ-ఆటోలు ప్రవేశపెడుతున్నారు.

అమిత్‌షాతో ఏం మాట్లాడారో చంద్రబాబునే అడగండి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు



సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిసినప్పుడు ఏం మాట్లాడారో ఆయన్నే అడగాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు మీడియా ప్రతినిధులకు సూచించారు. విజయవాడలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. విలేకరుల ప్రశ్నకు ఆయన బదులిస్తూ 'ఆ ఇద్దరి భేటీ గురించి రాష్ట్ర పార్టీకి, రాష్ట్రంలోని బీజేపీ నాయకులకు సమాచారం లేదు. చంద్రబాబు కలవడాన్ని నేను వ్యతిరేకించను. నెగెటివ్‌గా మాట్లాడను. చంద్రబాబు మీడియా వాళ్లందరికీ రాష్ట్రంలో అందుబాటులోనే ఉంటారుగా.. అమిత్‌షాతో ఏం మాట్లాడారో ఆయన్నే అడగండి..' అని పేర్కొన్నారు. పొత్తులకు సంబంధించి ఏ నిర్ణయమైనా జాతీయ స్థాయిలో జరుగుతుందని చెప్పారు. అమిత్‌షా, జె.పి.నడ్డాలతో విశాఖ, తిరుపతిల్లో బహిరంగసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. త్వరలో కర్నూలు, హిందూపురం తదితర ప్రాంతాల్లో కేంద్రమంత్రి దేవీసింగ్ చౌహాన్ పర్యటిస్తారని చెప్పారు. రాజమహేంద్రవరంలో కేంద్రమంత్రి మురళీధరన్ పర్యటన ఖరారు కానుందన్నారు. మోదీ తొమ్మిదేళ్ల పాలనపై 13 వర్గాలతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా, బీజేపీ జాతీయ నాయకత్వం ఏ రాష్ట్రానికి సంబంధించి, ఏదైనా పార్టీతో పొత్తు చర్చలు జరిపితే, అందుకు సంబంధించి సమాచారం రాష్ట్ర పార్టీకి తెలియజేసే సంప్రదాయం ఉందని.. చంద్రబాబు భేటీ విషయం జాతీయ పార్టీ రాష్ట్ర పార్టీకి తెలియజేయలేదంటే ఆ భేటీలో పొత్తుకు సంబంధించిన అంశాలు చర్చకు వచ్చి ఉండకపోవచ్చని రాష్ట్ర పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.



వధూవరులకు సీఎం జగన్ ఆశీస్సులు

మలికిపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద రావు కుమారుడి వివాహ వేడుకల్లో సీఎం వైఎస్ జగన్ బుధవారం పాల్గొన్నారు. ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, నాగరత్నం దంపతుల తనయుడు వెంకట్రామ్‌కు విజయవాడకు చెందిన నందమూరి సాంబశివరావు, రత్నకుమారి దంపతుల కుమార్తె శ్రీ తన్మయికి బుధవారం మలికిపురం మండలం కత్తిమండలో వివాహం జరిగింది. ఈ కార్యక్రమానికి సీఎం జగన్ హాజరై వధూవరులకు ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు విశ్వరూప్, జోగి రమేశ్, ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, చింతా అనురాధ, ఎమ్మెల్యేలు ముదునూరి ప్రసాదరాజు, కొండేటి చిట్టిబాబు, పొన్నాడ సతీశ్‌కుమార్, చిర్ల జగ్గిరెడ్డి, ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, కొరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి సీఎం జగన్ పెద్ద మనసు

ఇద్దరు రోగులకు రూ.20 లక్షలు మంజూరు

మామిడికుదురు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు కుమారుడు వివాహానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బుధవారం హాజరైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పి.గన్నవరం నియోజకవర్గానికి చెందిన ఇద్దరు రోగులకు రూ.20 లక్షలు మంజూరు చేసి మరోసారి సీఎం తన పెద్ద మనసు చాటుకున్నారు. నగరం గ్రామానికి చెందిన గుమ్మాపు గోవిందరావు కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. అలాగే అంబాజీపేట మండలం గంగలకుర్రుకి చెందిన కొప్పిశెట్టి సత్యనారాయణ గతేడాది వెన్నుపూస, మెదడుకు ఆపరేషన్ చేయించుకున్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే చిట్టిబాబు సీఎం జగన్‌ను కలిసి వారిద్దరి బాధను ఆయనకు నివేదించారు. దీంతో గోవిందరావు కిడ్నీ మార్పిడికి రూ.15 లక్షలు, కొప్పిశెట్టి సత్యనారాయణకు రూ.5 లక్షలు సీఎం జగన్ మంజూరు చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే చిట్టిబాబు మీడియాకు వివరాలు వెల్లడించారు.



రోగుల పరిస్థితిని సీఎం వైఎస్ జగన్‌కు వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

వాణిజ్య పన్నుల అధికారులను విచారించిన పోలీసులు




విచారణ నిమిత్తం పటమట పోలీస్ స్టేషన్‌కు వచ్చిన వాణిజ్య పన్నుల అధికారులు

ఆటోనగర్(విజయవాడతూర్పు): వాణిజ్య పన్నుల శాఖ విజయవాడ డివిజన్-1 కార్యాలయం ఇంటెలిజన్స్ విభాగంలో జీఎస్టీ అధికారులు బి.మెహర్ కుమార్, డీసీటీవో సంధ్య(గుడివాడ), సీనియర్ అసిస్టెంట్ సంధ్య, ఆఫీస్ సబార్డినేట్ సత్యన్నారాయణలను విజయవాడ పటమట సీఐ కాశీవిశ్వనాథ్ బుధవారం విచారించారు. మంగళవారం వీరిని పోలీస్ కస్టడీకి తీసుకున్న విషయం విదితమే. బుధవారం పటమట పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి సాయంత్రం 5 గంటల వరకు సీఐ విచారించారు. అంతకు ముందు ఎనిమిది మంది ట్రేడర్లను ఆయన ఫోన్ ద్వారా విచారించి కొంత సమాచారం సేకరించారు. ఈ విచారణలో పలు ఆసక్తికరమైన విషయాలను రాబట్టినట్టు తెలుస్తోంది. వీరి వద్ద నుంచి డబ్బులు వసూలు చేసినట్టు వారు పోలీసులకు వివరించినట్టు విశ్వసనీయ సమాచారం. మరో రెండు రోజుల పాటు వీరిని విచారించనున్నట్టు సీఐ చెప్పారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లండి

- అనుబంధ విభాగాల సమావేశంలో వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి
- త్వరలో అనుబంధ విభాగాల జోనల్ స్థాయి సమావేశాలు
- అభివృద్ధి కార్యక్రమాల్లోనూ భాగస్వామ్యం



సాక్షి, అమరావతి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్, పార్టీ అనుబంధ విభాగాల ఇన్‌చార్జి వి.విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం పార్టీ అనుబంధ విభాగాలైన మహిళ, యువజన, విద్యార్థి విభాగాల అధ్యక్షులు, జోనల్ ఇన్‌చార్జిలు, జిల్లా అధ్యక్షులతో ఆయన విడివిడిగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో పార్టీ అనుబంధ విభాగాల జోనల్ స్థాయి సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. అనుబంధ విభాగాల జిల్లా, మండల, రాష్ట్రస్థాయి కమిటీల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు సవివరంగా వివరించాలని చెప్పారు. పార్టీ కార్యక్రమాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాల్లోనూ అనుబంధ విభాగాలకు భాగస్వామ్యం కల్పించే విధంగా చూస్తామన్నారు. సీఎం జగన్ విద్య, వైద్య వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణలు, మార్పులను అందరికీ తెలియజేసేలా కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ విద్యార్థి విభాగం సమావేశంలో విజయసాయిరెడ్డి దిశా నిర్దేశం చేశారు. గతంలో విద్యా వ్యవస్థ ఎలా ఉంది? ఈ నాలుగేళ్లలో సీఎం జగన్ తీసుకొచ్చిన సంస్కరణలను అందరికీ వివరించాలన్నారు. క్షేత్రస్థాయిలో కష్టపడి పని చేయాలని, 2019కి ముందు విద్యార్థి విభాగంలో పనిచేసిన నాయకులకు సీఎం జగన్ మంచి అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు.

పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేలా 15 రోజుల్లో కమిటీలను నియమిస్తామని చెప్పారు. మహిళల సాధికారతకు సీఎం జగన్ ఎంతో కృషి చేస్తున్నారని పార్టీ మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వరుదు కళ్యాణి తెలిపారు. అమ్మ ఒడి, ఆసరా వంటి పథకాల ద్వారా మహిళలకు ఎంతో తోడ్పాటును అందజేస్తున్నారన్నారు. అంతకు ముందు యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్దార్థరెడ్డి నేతృత్వంలో యువజన విభాగం సమావేశం జరిగింది. పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, జోనల్ ఇన్‌ఛార్జ్‌లు, జిల్లా అధ్యక్షుల అభిప్రాయాలను విజయసాయిరెడ్డి తెలుసుకున్నారు.

'మాల్దీవులు' మృతుల కుటుంబాలకు

రూ.5 లక్షల పరిహారం

సీఎం సహాయ నిధి నుంచి చెక్కుల అందజేత



మృతుల కుటుంబాలకు చెక్కులు అందించిన మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, అమరావతి: మాల్దీవులలో జరిగిన అగ్నిప్రమాద మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇటీవల మాల్దీవులలోని మాలేలో అగ్నిప్రమాదం జరగ్గా, మన దేశానికి చెందిన తొమ్మిది మంది మరణించారు. వీరిలో మన రాష్ట్రంలోని పశ్చిమ గోదావరి జిల్లా వారు నలుగురు, చిత్తూరు జిల్లా వాసి ఒకరు ఉన్నారు. సచివాలయంలో బుధవారం ఆయా కుటుంబసభ్యులకు పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ రూ.5లక్షల చెక్కులను అందజేశారు. అలాగే మాలేలో ప్రమాదం వార్త తెలియగానే రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి ఏపీఎన్ ఆర్టీఎస్ సహకారంతో మృతదేహాలను త్వరతగతిన రాష్ట్రానికి తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశాయి.


విచారణకు శైలజ కిరణ్ సహకరించలేదు

▶ మొదటి పేజీ తరువాయి

సీఐడీ ఐజీ సీహెచ్ శ్రీకాంత్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాము శైలజ కిరణ్‌ను ఎలాంటి వేధింపులకు గురి చేయలేదని, .ఆమె పట్ల పూర్తి మర్యాదతో వ్యవహరించామని చెప్పారు. ఆమె భోజనం, టీ, మందుల కోసం అవసరమైన ప్రతిసారీ అవకాశం కల్పించామన్నారు. మార్గదర్శి చిట్ ఫండ్స్ చట్టాన్ని ఉల్లంఘించి అక్రమాలకు పాల్పడినట్టు కచ్చితమైన ఆధారాలు లభించాయని రవికుమార్ స్పష్టం చేశారు. విచారణ కోసం మంగళవారం శైలజ కిరణ్ నివాసానికి వెళ్లినప్పుడు తమ సిబ్బందిలోని 10 మందిని అనుమతించకుండా అభ్యంతరం తెలిపారన్నారు. ఆర్థిక అక్రమాలను సంబంధించి ఆధారాలపై ప్రశ్నించాల్సిన సాంకేతిక అధికారులను అడ్డుకునేందుకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ సిబ్బంది ప్రయత్నించారని తెలిపారు. తాము చట్టం పరిధిలోనే విచారిస్తున్నప్పటికీ శైలజ కిరణ్ విచారణకు ఏమాత్రం సహకరించకుండా పదే పదే ఆటంకాలు కల్పించేందుకు యత్నించారని చెప్పారు. అక్రమాలకు పాల్పడిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీగా పూర్తి సమాచారాన్ని ఆమె వద్ద ఉంచుకోలేదని, ఇది ఉద్దేశపూర్వకంగానే చేశారని తెలిపారు. ఎండీ వద్ద పూర్తి సమాచారం ఉండాల్సిన అవసరం లేదని కూడా ఆమె వ్యాఖ్యానించారని చెప్పారు. చట్టానికి విరుద్ధంగా నిధుల మళ్లింపుపై వాస్తవాలను కప్పిపుచ్చేందుకు ఆమె పదే పదే ప్రయత్నించారన్నారు. విచారించిన ప్రతిసారీ ఏదో సాకుతో తప్పించుకోవాలన్నదే ఆమె ఉద్దేశంగా ఉందన్నారు. శైలజ కిరణ్ పదే పదే ఆటంకాలు కల్పిస్తుండటంతో తాము అడగాల్సిన ప్రశ్నల్లో 25 శాతం కూడా అడగలేకపోయామని వివరించారు. అందుకే మరోసారి నోటీసులు జారీ చేసి ఆమెను విచారిస్తామని తెలిపారు. ఈ కేసులో రామోజీరావును కూడా మరోసారి విచారిస్తామని చెప్పారు. చందాదారుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ నిధులు రూ.793.50 కోట్లను అటాచ్ చేసేందుకు న్యాయస్థానంలో త్వరలోనే పిటిషన్ దాఖలు చేస్తామని ఆయన తెలిపారు.

సీఐడీ దర్యాప్తుపైనా.. వక్రీకరణేనా రామోజీ?

దర్యాప్తునకు సహకరించని శైలజా కిరణ్



సాక్షి, అమరావతి: తనకు నచ్చినవారిని నెత్తిన పెట్టుకుంటూ.. నచ్చనివారిపై విషం చిమ్మడమే పనిగా పెట్టుకున్న 'ఈనాడు' మరోసారి తన నైజాన్ని బయటపెట్టుకుంది. మార్గదర్శి చిట్ ఫండ్స్ చందాదారుల నిధులను చట్టానికి విరుద్ధంగా తన సొంత ప్రయోజనాలకు రామోజీరావు మళ్లించారు. ఈ నేపథ్యంలో ఆ కేసుపై ప్రస్తుతం సీఐడీ చేస్తున్న దర్యాప్తుపై కూడా వాస్తవాలను వక్రీకరిస్తూ ప్రజలను తప్పుదారి పట్టించేందుకు రామోజీ యత్నించడం విస్మయపరుస్తోంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా సీఐడీ అధికారులు మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీ, రామోజీ కోడలు శైలజా కిరణ్‌ను హైదరాబాద్‌లో రెండోసారి మంగళవారం విచారించిన సంగతి తెలిసిందే. అయితే ఆమె తమకు చట్టాలు, నిబంధనలు వర్తించవనే రీతిలో సీఐడీ అధికారులకు ఏమాత్రం సహకరించలేదు. అక్రమాలకు సంబంధించిన ఆధారాలను చూపిస్తూ మరీ అధికారులు ప్రశ్నలు అడిగినా 'తెలియదు' అంటూ సమాధానాలు చెప్పకుండా దాటవేత వైఖరిని ప్రదర్శించారు. తాను విదేశాల నుంచి వచ్చానని, తనకు ఆరోగ్యం బాగోలేదని, కళ్లు తిరుగుతున్నాయంటూ సాకులు చెబుతూ విచారణకు ఏమాత్రం సహకరించలేదు.

విచారణకు అడుగడుగునా అడ్డుపడుతూ..

మంగళవారం దాదాపు 9 గంటల పాటు సాగిన విచారణ ప్రక్రియలో సీఐడీ అధికారులు తాము ముందుగా సిద్ధం చేసుకున్న ప్రశ్నావళిలో కనీసం 25శాతం ప్రశ్నలను కూడా శైలజను అడగలేకపోయారు. దీన్ని బట్టి ఆమె అడుగడుగునా విచారణకు అడ్డుపడుతూ ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేశారని స్పష్టమవుతోంది. ఆమె తనకు ఆరోగ్యం బాగోలేదని చెప్పడంతో వైద్యులు పరీక్షించేందుకు సీఐడీ అధికారులు అవకాశం ఇచ్చారు. భోజనానికి, మందులు వేసుకోవడానికి కూడా విరామం ఇచ్చారు. అయినప్పటికీ శైలజా కిరణ్ విచారణకు ఏమాత్రం సహకరించకపోవడం గమనార్హం. అంతే కాకుండా విచారణకు సీఐడీ అధికారుల తోపాటు వచ్చిన ప్రభుత్వ ఉద్యోగులైన ఆర్థిక వ్యవహారాల నిపుణులను ఇంటిలోకి రానీయకుండా అడ్డుకునేందుకు యత్నించడం రామోజీ కుటుంబం బరితెగింపునకు నిదర్శనం.

'ఈనాడు'లో అబద్ధపు రాతలు షురూ..

విచారణకు ఏమాత్రం సహకరించని రామోజీ కుటుంబం తమ పత్రిక 'ఈనాడు'లో మాత్రం అందుకు పూర్తి విరుద్ధంగా వార్తలు ప్రచురించడంపై విస్మయం వ్యక్తమవుతోంది. శైలజా కిరణ్ విచారణకు పూర్తిగా సహకరించారని సీఐడీ దర్యాప్తు అధికారి రవికుమార్ తెలిపినట్టుగా 'ఈనాడు' తనకలవాటైన రీతిలో అబద్ధపు రాతలు వండి వార్చేసింది. అంతేకాదు.. ఇక శైలజా కిరణ్ విచారణ పూర్తయిపోయిందని.. ఇక ఆమెను విచారించాల్సిన అవసరమే లేదని ఆయన వెల్లడించినట్టు కూడా నిర్ధారించేసింది.

అసలు వాస్తవం ఇది..

కాగా అసలు వాస్తవం ఏమిటంటే.. తమ విచారణకు శైలజా కిరణ్ ఏమాత్రం సహకరించలేదని దర్యాప్తు అధికారి తెలిపారు. ఈ నేపథ్యంలో ఆమెకు మరోసారి నోటీసులు ఇచ్చి విచారిస్తామని కూడా ఆయన వెల్లడించారు. దర్యాప్తు అధికారి చెప్పిన విషయాలను కాకుండా తమకు అనుకూలంగా కేసు దర్యాప్తును ప్రభావితం చేసేందుకు రామోజీరావు ఉద్దేశపూర్వకంగానే తన విష పత్రికలో అబద్ధపు రాతలు రాయించారు. ఇక మార్గదర్శి చిట్‌ఫండ్స్ ముసుగులో తమ అక్రమాలను వెలుగులోకి తెస్తున్న 'సాక్షి' మీడియాపై కూడా రామోజీరావు అక్కసు వెళ్లగక్కారు. శైలజా కిరణ్ విచారణ ప్రక్రియకు సబంధించిన వార్తలు సాక్షి మీడియాలో ప్రసారం చేశారని గగ్గోలు పెట్టారు. వాస్తవానికి సాక్షి మీడియానే కాకుండా ఇతర చానళ్లు కూడా శైలజా కిరణ్‌ను సీఐడీ విచారించడంపై ప్రముఖంగా వార్తలను ప్రసారం చేశాయి. ఓ సంచలనాత్మకమైన కేసులో.. అందులోనూ ప్రజల ప్రయోజనాలతో ముడిపడి ఉన్న కేసులో వాస్తవాలను ప్రజలకు తెలియజేయడం మీడియా బాధ్యత. కానీ, తాము ఎవరిపైన అయినా విషం చిమ్ముతాం.. ఇంకెవరూ తమపై మాత్రం వాస్తవాలను కూడా రాయకూడదనే తీరులో రామోజీరావు ఉండటం విడ్డూరంగా ఉంది. దశాబ్దాలుగా చంద్రబాబుకు కొమ్ము కాసేందుకు నాడు ఎన్టీ రామారావు నుంచి ఇతర ప్రత్యర్థి పార్టీల నేతలపై పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేసిన రామోజీ నేడు శ్రీరంగ నీతులు చెబుతుండటంపై విస్మయం వ్యక్తమవుతోంది. తమ ఆర్థిక అక్రమాల సామ్రాజ్యమైన 'మార్గదర్శి' కుప్పకూలుతుండటంతో సీఐడీ దర్యాప్తును కూడా వక్రీకరిస్తూ ప్రజలను తప్పుదారి పట్టించేందుకు రామోజీ యత్నిస్తున్నారనేది స్పష్టమవుతోంది.

బాలిక ప్రాణం తీసిన 'నింద'

- దొంగతనం చేశావంటూ దూషించిన పక్కింటివారు
- మనస్తాపంతో ఉరేసుకుని బాలిక ఆత్మహత్య

నవీపేట: పక్కింటివారు దొంగతనం నింద మోపడంతో అవమానానికి గురైన ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం శివతండా గ్రామంలో మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. తండాకు చెందిన తేజావత్ లక్ష్మి, ధనుకు నలుగురు కుమార్తెలు. మూడవ కుమార్తె నిఖితను హైదరాబాద్‌లోని ఆమె భర్త దగ్గర దింపేందుకు లక్ష్మి, ధనులు మంగళవారం సాయంత్రం తమ కూతురుతో కలసి వెళ్లారు. ఇంటి దగ్గర ఒంటరిగా ఉన్న నాలుగో కూతురు వందన (16) పక్కింట్లో ఉండే బానోత్ ప్రవీణ్ ఫోన్ తీసుకుని తల్లిదండ్రులతో మాట్లాడి ఎక్కడి వరకు వెళ్లారో తెలుసుకుంది. తర్వాత ఫోన్‌ను తిరిగి ఇచ్చేసింది. కొద్దిసేపటి తరువాత బానోత్ ప్రవీణ్, అతని తల్లి.. వందన ఇంటికి వచ్చి ఫోన్ పౌచ్‌లో దాచిన రూ.600 దొంగతనం చేశావంటూ ఇష్టానుసారం దూషించారు. దీంతో వందన రోదిస్తూ మరొకరి ఫోన్ ద్వారా ఈ విషయం తల్లిదండ్రులకు చెప్పింది. అనంతరం ఫ్యాన్ కడ్డీకి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లీ, కొడుకులు బూలిబాయి, ప్రవీణ్‌లు దూషించడంతో మనస్తాపం చెందిన వందన ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తల్లి లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎస్సై రాజారెడ్డి బుధవారం తెలిపారు.

రేపు చేప ప్రసాదం పంపిణీ

హైదరాబాద్: మూడేళ్ల అనంతరం హైదరాబాద్‌లో చేప ప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. మృగశిర కార్తె సందర్భంగా ప్రతి సంవత్సరం ఆస్తమా రోగులకు పంపిణీ చేసే చేప ప్రసాదాన్ని ఈ నెల 9వ తేదీన నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో పంపిణీ చేయనున్నారు. కరోనా నేపథ్యంలో ఈ ప్రసాదం పంపిణీని నిలిపి వేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం పరిస్థితులు మెరుగు పడటంతో చేప ప్రసాదాన్ని స్వీకరించేందుకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, రాజస్తాన్ తదితర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున రోగులు ఎగ్జిబిషన్ మైదానానికి చేరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రోగులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా వివిధ శాఖల అధికారులు చర్యలు చేపట్టారు.

దేశంలో 80 కోట్లమందికి మోదీ సంక్షేమ ఫలాలు

విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి భారతి ప్రవీణ్ పవార్

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం తొమ్మిదేళ్లగా అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ద్వారా దేశమంతటా 80 కోట్ల మందికి మోదీ సంక్షేమ పథకాలు అందాయని, లబ్ధిదారులు ఆనందంగా ఉన్నారని కేంద్రమంత్రి భారతి ప్రవీణ్ పవార్ చెప్పారు. తొమ్మిదేళ్ల మోదీ పాలన కార్యక్రమాలపై బీజేపీ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్ర పర్యటనలో ఉన్న ఆమె బుధవారం విజయవాడలోని ఆ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మోదీ పాలన ప్రపంచదేశాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. సబ్ కా సాత్, సబ్ కా వికాస్ నినాదంతో అందరికీ ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టేలా కేంద్ర ప్రభుత్వం రూట్ మ్యాప్ రూపొందించుకుందని తెలిపారు. మోదీ తొమ్మిదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై పార్టీ తెలుగులో ప్రచురించిన పుస్తకాన్ని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజుతో కలిసి ఆవిష్కరించారు.



ఉదయం పూట నడక ఆ రోజు మొత్తానికీ ఆశీర్వాదం లాంటిది.
- హానొరే డె బాల్జాక్

సాక్షి

గురువారం, 8 జూన్ 2023

చరిత్ర క్షమించని మహా నేరం

కొన్ని సంఘటనలు సమకాలీన చరిత్రను మలుపు తిప్పుతాయి. అనూహ్య పరిణామాలకు ఆరంభమవుతాయి. ఉక్రెయిన్‌లో సాగుతున్న సుదీర్ఘ యుద్ధంలో మంగళవారం నాటి ఘటన అలాంటిది. దక్షిణ ఉక్రెయిన్‌లో నిప్రో నదిపై ఉన్న కీలకమైన నోవా కఖోవ్కా ఆనకట్ట పాక్షికంగా పేల్చివేతకు గురై, ఆ పక్కనే ఉన్న అణువిద్యుత్కేంద్రం ముప్పులో పడ్డ ఘటనతో ప్రపంచం ఉలిక్కిపడింది. రష్యా సాగించిన జీవావరణ తీవ్రవాద చర్య ఇది అని ఉక్రెయిన్ నిందిస్తుంటే, ఇది పూర్తిగా ఉక్రెయిన్ విద్రోహచర్య అని రష్యా ఆరోపిస్తోంది. ఈ నిందారోపణల్లో నిజానిజాలు ఏమైనా, ప్రపంచంలోనే అత్యధిక జలసామర్థ్యం ఉన్న డ్యామ్‌లలో ఒకటైన ఈ ఆనకట్టపై పడ్డ దెబ్బతో నీళ్ళు ఊళ్ళను ముంచెత్తి, వేల మంది ఇల్లూవాకిలి పోగొట్టుకున్నారు. లక్షలాది గొడ్డూగోదా సహా జనం తాగేందుకు గుక్కెడు నీరైనా లేక ఇక్కట్లలో పడ్డారు. అన్నిటికన్నా మించి ఉక్రెయిన్ ఇప్పుడు అణుప్రమాదం అంచున ఉందనే ఆందోళన కలుగుతోంది.

ఈ డ్యామ్ పరిసర ప్రాంతాలు రష్యా నియంత్రణలోనే ఉన్నాయి. కానీ, డ్యామ్ ధ్వంసంలో తన పాత్ర లేదనేది రష్యా మాట. అది అంత తేలిగ్గా నమ్మలేం. ఇటీవల సరిహద్దు ఆవల నుంచి రష్యా భూభాగంపై దాడులు చేస్తూ, డ్రోన్లతో దెబ్బ తీస్తూ ఉక్రెయిన్ వేడి పెంచింది. ప్రతిగా రష్యా ఇప్పుడు శత్రుదేశం దృష్టిని మరల్చి, సుస్థిరతను దెబ్బతీసే ఎత్తుగడ వేసిందని ఓ వాదన. ఉక్రెయిన్‌కూ, ఆ ప్రాంతంలో వ్యవసాయానికీ కీలకమైన 5 అతి పెద్ద ఆనకట్టల్లో ఒకదానికి భారీ గండి పడేలా చేయడం అందులో భాగమే కావచ్చు. వ్యవసాయ, తాగునీటి అవసరాలకు కీలకమైన ఆనకట్టను ధ్వంసం చేసుకోవడం వల్ల ఉక్రెయిన్‌కు వచ్చే లాభమేమీ లేదు. నిజానికి, మునుపటి దాడుల్లో ఆనకట్ట నిర్మాణం బలహీనపడి ఉండవచ్చు. ఆ ప్రాంతాన్ని నియంత్రిస్తున్న రష్యా ఆక్రమణదారులు రిజర్వాయర్‌లో నీళ్ళు అసాధారణ స్థాయికి చేరినా నిమ్మకు నీరెత్తినట్టు ఉండి ఉండవచ్చు. ఆ నిర్లక్ష్యం ఫలితమే ఇప్పుడీ డ్యామ్ విధ్వంసమనేది ఒక కథనం.

ఉక్రెయిన్ దళాలు దాడులు పెంచిన మర్నాడే ఈ ప్రమాదం జరగడం గమనార్హం. శత్రువును వరదలతో ముంచెత్తడమూ తమ ఆయుధమేనంటూ గతంలో మాస్కో తన ఆలోచనను బయట పెట్టిన సంగతీ మర్చిపోలేం. దక్షిణ ఉక్రెయిన్‌లో రష్యా, ఉక్రెయిన్ సేనలను విడదీస్తున్న నిప్రో నదిపై ఈ ఆనకట్ట ఉంది. ఆహార ధాన్యాలు అధికంగా పండించే దక్షిణ మధ్య ఉక్రెయిన్‌లోని మెట్ట భూములకు సాగునీరు, రష్యా ఆక్రమిత క్రిమియా సహా అనేక భారీ నగరాలకు తాగునీరు ఈ రిజర్వాయరే అందిస్తుంది. నది దాటి ఇవతలకు వచ్చేందుకు యుద్ధంలో వ్యూహాత్మకంగానూ ఇది కీలకమైనదే. అందుకే, ఈ విధ్వంసం మానసిక పోరుకు మించినది. రిజర్వాయర్‌లో నీళ్ళన్నీ ఖాళీ అయితే పక్కనే జపోరీషియా అణువిద్యుత్కేంద్రానికి తగినంత నీటి సరఫరా జరగదు. ఇప్పటికే అందులో ఆరు రియాక్టర్లను మూసివేశారు కాబట్టి, చల్లబరిచేందుకు పొరుగునే ఉన్న కొలను నీరు సరిపోవచ్చు. అయినా సరే, ఆ అణువిద్యుత్కేంద్రాన్ని యుద్ధంలో అస్త్రంగా వాడరని చెప్పలేం. మరమ్మతులకు కనీసం అయిదేళ్ళు పట్టే ఈ ఆనకట్ట విధ్వంసం వల్ల దీర్ఘకాలిక మానవ, పర్యావరణ సంక్షోభం, సైనిక పర్యవసానాలూ తప్పవు. నదీగర్భంలో మిగిలిన చెర్నోబిల్ ప్రమాదం నాటి అణు వ్యర్థాలు వరదలతో మళ్ళీ పైకొచ్చే ప్రమాదమూ పొంచి ఉంది.

నిజానికి, ఈ డ్యామ్‌పై దాడికి దిగకుండా రష్యాను హెచ్చరించాలనీ, దాడి జరిగితే అది అతి పెద్ద విపత్తుగా పరిణమిస్తుందనీ గత అక్టోబర్‌లోనే ఉక్రెయిన్ అధ్యక్షుడు అన్నారు. డ్యామ్‌లో రష్యా సేనలు పేలుడు పదార్థాలు ఉంచాయని అప్పట్లో ఆయన అనుమానించారు. ఇప్పుడు డ్యామ్ విధ్వంసంతో ఏడాది పైచిలుకుగా సాగుతున్న ఉక్రెయిన్ యుద్ధం మరింత సంక్లిష్టం కానుందని తేలిపోయింది. అలాగని ఉక్రెయిన్ సైతం తక్కువ తినలేదు. రష్యా నుంచి జర్మనీకి వెళ్ళే కీలకమైన నార్డ్ స్ట్రీమ్ సహజవాయు పైప్‌లైన్లపై నీటిలో పేలుళ్ళ ద్వారా గత ఏడాది సెప్టెంబర్‌లో ఉక్రెయిన్ బృందం దాడులు చేసింది. ఆ సంగతి అంతకు మూడు నెలల ముందే అమెరికా గూఢచర్య సంస్థకు తెలుసని తాజాగా బయటపడింది. అప్పట్లో సహజవాయు పైప్‌లైన్లు, ఇప్పుడు భారీ ఆనకట్ట... పరస్పర విధ్వంసంలో పైచేయి కోసం తపిస్తున్న రష్యా, ఉక్రెయిన్‌లు ఇలా ఎంత దాకా వెళతాయో!

యుద్ధం ఎవరిదైనా, అందులో ఎవరి చేయి పైనా కిందా అయినా – చివరకు నష్టపోయేది ప్రజలే. యుద్ధం సాకుతో సాధారణ పౌరుల పైన, కీలకమైన ప్రాథమిక వసతి సౌకర్యాల పైన దాడులు ఏ రకంగానూ సమర్థనీయం కావు. అంతర్జాతీయ మానవతావాద చట్ట ఉల్లంఘనలుగా ఇవన్నీ యుద్ధ నేరాల కిందకే వస్తాయి. ఐరాస ప్రధాన కార్యదర్శి అభ్యర్థించినట్టు ఇలాంటి దాడులు ఆగాలి. అంతర్జాతీయ చట్టాన్ని అంతా గౌరవించాలి. ఇప్పటికైనా రష్యా, ఉక్రెయిన్‌లు రెండూ ఈ నియమాలు పాటించడం అవసరం. ఇక, ఆనకట్ట విధ్వంసంతో డ్యామ్ నుంచి కనీసం 150 మెట్రిక్ టన్నుల చమురు లీకైందని పర్యావరణ మంత్రి మాట. పర్యావరణ రీత్యా ఆ ప్రాంతం కోలుకోవడానికి కొన్ని దశాబ్దాలు పడుతుందని నిపుణుల విశ్లేషణ. గత కొన్ని దశాబ్దాల్లో ఐరోపాలో అతి పెద్ద మానవ కల్పిత పర్యావరణ విపత్తు ఇదేనంటున్నది అందుకే! విషాదం ఏమిటంటే, 1986లో చెర్నోబిల్ అణుప్రమాదం బారిన పడ్డ గడ్డపైనే మళ్ళీ ఇలాంటి మహా విపత్తు సంభవించడం! అదీ మానవత మరిచిన యుద్ధంలో మనిషి చేజేతులా చేసింది కావడం! ఇది చరిత్ర క్షమించని మహా యుద్ధనేరం. మానవాళికి మరో శాపం.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.పంచమి రా.10.51 వరకు, తదుపరి షష్ఠి. **నక్షత్రం:** శ్రవణం రా.10.58 వరకు, తదుపరి ధనిష్ఠ. **దుర్ముహూర్తం:** ఉ.9.51 నుండి 10.43 వరకు, తిరిగి ప.3.04 నుండి 3.58 వరకు, **అమృతఘడియలు:** 3.14 నుండి 2.44 వరకు, మృగశిర కార్తె ప్రారంభం.

సూర్యోదయం: 5.28
సూర్యాస్తమయం: 6.28
రాహుకాలం: ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం: ఉ. 6.00 నుండి 7.30 వరకు

మన వ్యవస్థ పట్టాలు తప్పిందెక్కడ?

విశ్లేషణ



అలోక్ కుమార్ వర్మ

భారతదేశంలో రైళ్ల వేగం సగటున గంటకు 50 కిలోమీటర్లు మాత్రమే ఉన్నప్పటికీ, ప్రమాదాలు జరుగుతున్నాయి. అభివృద్ధి చెందిన రైల్వే వ్యవస్థలున్న దేశాలలో ప్రమాదాలు అత్యంత అరుదు. ప్రధాన ట్రంక్ రూట్లలో తీవ్రమైన రద్దీ అనేది రైళ్ల వేగంలో స్తబ్ధతకూ, అభద్రతకూ దోహదపడే ప్రాథమిక అంశంగా ఉంటోంది. 1950లో చైనా రైలు నెట్ వర్క్ పొడవు భారత్‌తో పోలిస్తే సగం కంటే తక్కువ. కానీ, ప్రస్తుతం చైనా మొత్తం రైలు మార్గం పొడవు భారత్ కంటే రెండు రెట్లు ఎక్కువ. గత 20 సంవత్సరాలుగా, భారతీయ రైల్వేలు విమాన, రోడ్డు రవాణాకు తన మార్కెట్ వాటాను స్థిరంగా కోల్పోతున్నాయి. కొత్త లైన్ల నిర్మాణం చేపట్టడం, ఉన్నవి అప్‌గ్రేడ్ చేయడమే శరణ్యం.

జూన్ 2న ఒడిశాలోని బాలాసోర్‌లో రెండు ఎక్స్‌ప్రెస్ ప్యాసింజర్ రైళ్లు, ఒక నిలిచివున్న సరుకు రవాణా రైలు ఢీకొనడం, బహుశా గత 20 సంవత్సరాల్లో జరిగిన ఘోరమైన రైలు ప్రమాదం కావచ్చు. ఇటీవలి అధికారిక గణాంకాల ప్రకారం, ఇది 275 మరణాలకు దారితీసింది. 1,000 కంటే ఎక్కువ మంది గాయపడ్డారు. 2002 జూన్ 24న టాంజానియాలో జరిగిన చివరి రైలు ప్రమాదం చాలామంది మరణాలకు కారణమైంది. ఒక ప్రయాణీకుల రైలు ఒక సరుకు రవాణా రైలు పర్వత ప్రాంత రైలు మార్గంలో ఢీకొనడంతో 281 మంది చనిపోయారు.

వేగం తక్కువ ప్రమాదాలు ఎక్కువ

ఈ వాస్తవాలను పరిశీలిస్తే భారత్‌లో రైలు భద్రతా పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. జపాన్, చైనా, టర్కీ వంటి అభివృద్ధి చెందిన రైల్వే వ్యవస్థలు... ఫ్రాన్స్, స్పెయిన్, జర్మనీ, ఇటలీ, స్వీడన్, బ్రిటన్ వంటి అనేక యూరోపియన్ దేశాలలో ప్రయాణీకుల రైళ్ల ప్రమాదాలు అత్యంత అరుదు, అసాధారణం. ఈ రైల్వేలలో, అనేక ప్యాసింజర్ రైళ్లు గరిష్ఠంగా గంటకు 200–350 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. వీటి సగటు వేగం గంటకు 150–250 కిలోమీటర్లు. భారతదేశంలో రైళ్ల వేగం గంటకు దాదాపు 50 కిలోమీటర్లు. ఇంత తక్కువ వేగం ఉన్నప్పటికీ, ఘోరమైన ప్రమాదాలు జరుగుతున్నాయి. భద్రతా పనితీరు ఆధారంగా ప్రపంచంలోని ప్రధాన రైల్వేల ర్యాంకింగులను సిద్ధం చేస్తే, భారతదేశం బహుశా ఈజిప్ట్, మెక్సికో, టాంజానియా, డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, నైజీరియా, ఇంకా పాకిస్తాన్ దేశాల కంటే కొంచెం పైస్థాయిలో మాత్రమే ఉంటుంది.

వాయు, రోడ్డు రవాణాల వేగవంతమైన సాంకేతిక అభివృద్ధితో సమర్థవంతంగా పోటీ పడటానికి, అభివృద్ధి చెందిన దేశాలు 1970 నుండి ఉనికిలో ఉన్న తమ రైలు నెట్‌వర్క్‌లను విస్తరింపజేసుకుంటూ ఆధునికీకరించడం ప్రారంభించాయి. దాని భౌగోళిక పరిమాణం, జనాభా సారూప్యతల కారణంగా భారత్‌కు చైనా మంచి పోలిక అవుతుంది. 1950లో చైనా రైలు నెట్ వర్క్ మొత్తం పొడవు (21,800 కి.మీ.) భారతదేశంతో (53,596 కి.మీ.) పోలిస్తే సగం కంటే తక్కువ. భారతదేశ మొత్తం రైలు మార్గం పొడవును (62,900 కి.మీ.) 1997 నాటికి చైనా (66,000 కి.మీ.) అధిగమించింది. ప్రస్తుతం చైనా మొత్తం రైలు మార్గం పొడవు (1,55,000 కి.మీ.). ఇది భారతదేశం (68,100 కి.మీ.) కంటే రెండు రెట్లు ఎక్కువ.

చైనా తన నెట్‌వర్క్‌ను దాదాపు రెండు దశల్లో అప్‌గ్రేడ్ చేసింది. 1995 నుండి 2010 వరకు, దాని ఎనిమిది ట్రంక్ రూట్లలో (నాలుగు నిలువు, నాలుగు అడ్డం) ముందునుంచీ ఉన్న లైన్లలో గంటకు 200–250 కిలోమీటర్ల వేగాన్ని సాధించడంపై దృష్టి పెట్టింది.



తరువాత, గంటకు 200–250 కిలోమీటర్లు (హై స్పీడ్), గంటకు 300–350 కిలోమీటర్ల (అల్ట్రా హై స్పీడ్) వేగంతో నడిచే ప్యాసింజర్ రైళ్ల కోసం ప్రత్యేకంగా కొత్త లైన్లను నిర్మించింది. ప్రస్తుతం, ఇది మొత్తం 16 (ఎనిమిది నిలువు, ఎనిమిది క్షితిజ సమాంతరాలు) ట్రంక్ మార్గాలను విస్తరించే పనిలో ఉంది. 2030 నాటికి, మొత్తం రైలు మార్గం పొడవు 1,75,000 కిలోమీటర్లకు పెంచడానికి ప్రణాళిక రూపొందించారు. వీటిలో దాదాపు 55,000 కి.మీ. హై స్పీడ్, అల్ట్రా హై స్పీడ్ లైన్లుగా ఉంటాయి.

రద్దీయే అసలు సమస్య

భారత రైల్వే బోర్డు 2017–18లో ప్రాజెక్ట్ మిషన్ రఫ్తార్‌ను ప్రకటించింది. గంటకు 25 కిలోమీటర్లు ఉన్న సరుకు రవాణా రైళ్ల సగటు వేగాన్ని రెట్టింపు చేయడం, ప్యాసింజర్ రైళ్ల వేగాన్ని ఐదేళ్లలో గంటకు 50 కి.మీ. నుండి 75 కి.మీ. వరకు పెంచడం లక్ష్యాలుగా దీన్ని ప్రకటించింది. కానీ, 'కాగ్ ఆఫ్ ఇండియా' తన నివేదికలో పేర్కొన్నట్లుగా, ఈ ప్రణాళిక రైళ్ల వేగాన్ని పెంచడానికి దారితీయలేదు. చైనాలా భారతదేశం తన ప్రధాన ట్రంక్ మార్గాల్లో, ముఖ్యంగా స్వర్ణచతుర్భుజి, దానితోపాటు ఢిల్లీ, చెన్నై, ముంబై, కోల్‌కతాలను కలిపే కర్ణాలలో కొత్త జంట లైన్లను నిర్మించలేదు.

భారతీయ రైల్వే ప్రధాన ట్రంక్ రూట్లలో తీవ్రమైన రద్దీ అనేది రైళ్ల వేగంలో స్తబ్ధతకూ, భద్రత విషయంలో పేలవమైన రికార్డ్‌కూ దోహదపడే ప్రాథమిక అంశంగా ఉంటోంది. గత 20 సంవత్సరాలుగా, భారతీయ రైల్వేలు విమాన, రోడ్డు రవాణాకు తన మార్కెట్ వాటాను స్థిరంగా కోల్పోతున్నాయి. సుమారు 10,000 కి.మీ.ల ట్రంక్ రూట్లలో సామర్థ్యం 125 శాతానికి మించి ఉంటోంది. ఈ తీవ్రమైన రద్దీ కారణంగా రైల్వే ట్రాక్, ఎలక్ట్రికల్, సిగ్నలింగ్ నిర్వహణ వ్యవస్థలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. ఇది సమయపాలన లేక పోవడానికి దారితీస్తోంది. దీనివల్ల మితిమీరి పని చేయాల్సిన డ్రైవర్లు, స్టేషన్ మాస్టర్లు, ట్రాక్‌మెన్ వల్ల భద్రతపై ప్రతికూల ప్రభావం పడుతోంది.

2005లో, రైల్వే బోర్డు 2,843 కి.మీ. పొడవుతో రెండు ప్రత్యేక సరుకు రవాణా కారిడార్‌లను (డీఎఫ్‌సీలు) నిర్మించాలని నిర్ణయించింది. భవిష్యత్తులో మరో మూడు కారిడార్లను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ డీఎఫ్‌సీలు ఇప్పటికీ అసంపూర్తిగా ఉన్నాయి. వీటిని పూర్తి చేయడానికి మరో రెండు నుండి నాలుగేళ్ల పట్టవచ్చు. ప్రత్యేక ప్యాసింజర్ లైన్లకు బదులుగా ప్రత్యేక సరకుల లైన్‌లను నిర్మించడంలోని అనుచితాన్ని గ్రహించి, రైల్వే బోర్డు మరిన్ని డీఎఫ్‌సీలను నిర్మించే ప్రణాళికను వాయిదా వేసినట్లు కనిపిస్తోంది.

అనూహ్య వ్యయం

భారతదేశం 2017లో ముంబై, అహ్మదాబాద్ మధ్య స్టాండర్డ్ గేజ్‌లో స్వతంత్ర అల్ట్రా హై స్పీడ్ (బుల్లెట్ రైలు) లైన్ నిర్మాణాన్ని ప్రారంభించింది. ఇలాంటి మరిన్ని లైన్ల కోసం వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదికలను (డీపీఆర్‌లు) తయారు చేశారు. అనధికార అంచనాల ప్రకారం, ఈ లైన్‌కు ప్రతి కిలోమీటర్‌కు రూ.350 కోట్లు ఖర్చు అవుతుంది. ఈ వ్యయం 160 కిలోమీటర్ల సెమీ హైస్పీడ్ లైన్ కంటే 10 రెట్లు ఎక్కువ. అలాగే గంటకు 200–250 కిలోమీటర్ల హైస్పీడ్ లైన్ నిర్మాణ వ్యయం కంటే ఏడు రెట్లు ఎక్కువ. ముంబై–అహ్మదాబాద్ బుల్లెట్ రైలు లైన్ నిర్మాణ పురోగతి నెమ్మదిగా ఉండగా, మరిన్ని బుల్లెట్ రైలు మార్గాలను నిర్మించే ప్రణాళిక కూడా మందకొడిగా ఉంది.

బ్రాడ్ గేజ్ ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని, భారతదేశం గంటకు 200–250 కిలోమీటర్లు ప్రయాణించే హై స్పీడ్ లైన్లను నిర్మించాలి. ప్రస్తుతం ఉన్న 15,000 కిలోమీటర్ల ట్రంక్ మార్గాలను 160–200 కిలోమీటర్ల వేగానికి అప్‌గ్రేడ్ చేయాలి. దీనికీ, 10,000 కి.మీ. హై స్పీడ్ బ్రాడ్ గేజ్ లైన్ల నిర్మాణానికీ కలిపి దాదాపు రూ.7 లక్షల కోట్లు ఖర్చవుతుందని అంచనా. దీన్ని 15 సంవత్సరాలలో పూర్తి చేయవచ్చు. ఈ విస్తరించిన, అప్‌గ్రేడ్ చేసిన నెట్‌వర్క్... 2060–2070 వరకు ప్రయాణికులు, సరకు రవాణా రెండింటి అవసరాలను తీర్చగలిగే తగిన సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. తద్వారా రైల్వేలు భారత దేశ రవాణాకు జీవనాధారంగా తమ పాత్రను తిరిగి పొందగలుగుతాయి.

వ్యాసకర్త 'ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ ఇంజినీర్స్' (ఐఆర్ఎస్ఈ)లో పనిచేశారు.
('ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

విషాదకరం



ఎలాంటి వక్రోక్తి! 16,000 గుండె ఆపరేషన్లు చేసిన గుజరాత్‌కు చెందిన 41 ఏళ్ల కార్డియాలజిస్ట్ గౌరవ్ గాంధీ గుండె పోటుతో చనిపోయారు. ఆయన ఆత్మకు శాంతి కలుగుగాక. ఓం శాంతి.
- అనూ సెహగల్, ఇమేజ్ కన్సల్టెంట్

అనారోగ్య ధోరణి



ఈమధ్య కాలంలో ఎంతోమంది మహిళలకు పొత్తి కడుపులో, ముఖ్యంగా గర్భాశయంలో లేదా దాని చుట్టూ సిస్టులు లేదా ఫైబ్రాయిడ్లు(కంతులు) లేదా ట్యూమర్లు ఉంటున్నాయి. ఇది ఎంతో ఆందోళనకరం.
- ఆంబ్రీన్ జైదీ, రచయిత్రి

అవగాహనా రాహిత్యం



సైబర్ వంచకులకు ఒక రిటైర్డ్ కల్నల్ 2.5 కోట్ల రూపాయలు మోసపోయారని వార్త. నాకు ఇది అర్థం కాదు. వీళ్లు పత్రికలు చదవరా? కనీసం ఆన్‌లైన్ కథనాలు చూడరా? ఇంత సులువుగా ఎలా మోసపోతారు? లేదా సులభంగా డబ్బులు రావాలనే దురాశ వీళ్లను గుడ్డివాళ్లను చేస్తుందా?
- మోహన్ సిన్హా, జర్నలిస్ట్

శాంతి కావాలి



మణిపూర్ కేవలం శాంతిని కోరుకుంటోంది. మెయితైలు, కుకీలు– ఇరువురూ సహజీవనాన్ని కోరుకుంటున్నారు. ఎవరూ ఈ హింసను కోరుకోవడం లేదు. డిమాండ్లు పక్కనపెడితే, అన్ని వర్గాలూ సురక్షితంగా ఉన్నామన్న భావనను కాంక్షిస్తున్నాయి.
- రామీ నిరంజన్ దేశాయి, ఆంత్రోపాలజిస్ట్

అవమానకరం



కెనడాలో జరిగిన పరేడ్‌లో ఇందిరా గాంధీ హత్యను చూపించే శకటాన్ని ప్రదర్శించారు. దీన్ని కెనడా ఎలా అనుమతించింది? ఒక భారత మాజీ ప్రధాని హత్యను ఉత్సవం చేయడం కూడా భావస్వేచ్ఛ అవుతుందా? తన ఓటు బ్యాంకు కోసం జస్టిన్ ట్రూడో ఖలిస్తానీ శక్తుల మీద ఆధారపడటం సిగ్గుచేటు.
- అన్షుల్ సక్సేనా, జర్నలిస్ట్

మరెందుకిలా?



మహమ్మద్ రిజ్వాన్ (పాకిస్తాన్ క్రికెటర్) నమాజ్ చేయడానికి అమెరికా వీధుల్లో తన కారు నిలిపారని వార్త. అసలు అక్కడ దాదాపు ప్రతి చోటా 'ఫెయిత్ రూమ్స్' ఉన్నాయి. అమెరికాలోగానీ, బ్రిటన్‌లోగానీ నేనూ, నా కుటుంబమూ ఎప్పుడూ వీధుల్లో ప్రార్థించాల్సిన అవసరం రాలేదు.
- రేహమ్ ఖాన్, పాక్ పొలిటికల్ యాక్టివిస్ట్

అవి తినొద్దయితే!



పోర్చుగీస్ సంస్కృతి తాలూకు అన్ని చిహ్నాలనూ తుడిచేయాలని గోవా ముఖ్యమంత్రి అనుకుంటున్నారట. అయితే, ఆలుగడ్డ, టొమాటో, వేరుశనగ, అనాస, జీడిపప్పు, క్యాప్సికమ్, మిర్చి, జామ, సపోటా, మొసంబి... వీటన్నింటిని కూడా 16వ శతాబ్దంలో ఇండియాకు తెచ్చింది పోర్చుగీసువాళ్లే. కాబట్టి గోవా ముఖ్యమంత్రి, బీజేపీ మద్దతుదారులు ఈ విదేశీ ఆహారోత్పత్తులను కూడా నిషేధించాలి.
- అద్వైద్, చరిత్రకారుడు

ఇన్‌బాక్స్

నిజమైన నాయకుడు ఆయనే!

అమరావతిలో 1402.58 ఎకరాల భూమిలో 50,793 మంది పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించి నిజమైన కమ్యూనిస్టు అనిపించుకున్నారు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి. రాష్ట్ర వ్యాప్తంగా 33 లక్షల పేద కుటుంబాలకు పక్కా నివాసాలు ఏర్పాటు చేయడానికి పట్టాలు మంజూరు చేసింది ఏపీ ప్రభుత్వం. ఇప్పటి వరకూ రెండు దశల్లో 22 లక్షల ఇళ్ళ నిర్మాణాలకు కేంద్రం అనుమతించింది. ఇవికాక 2.62 లక్షల టిడ్కో గృహాలను మంజూరుచేయగా అందులో దాదాపు 60 వేల గృహాల నిర్మాణం పూర్తయింది. జూన్ 9వ తేదీన గుడివాడలో మరో 8.9 వేల టిడ్కో ఇళ్లు ఇవ్వనున్నారు. అమరావతిలో జగన్ ప్రభుత్వం పేదలకు భూములు పంచుతుంటే కోర్టులకు వెళ్ళి అడ్డుకునే ప్రయత్నం చేశారు. రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్లు కేటాయిస్తే సామాజిక సమతుల్యం దెబ్బ తింటుందని వితండ వాదన లేవదీశారు. దీన్నెలా అర్థం చేసుకోవాలి? విపక్షాలకు పేదల పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో వారి ఈ మాటలవల్ల అర్థం చేసుకోవచ్చు. హైకోర్టు ప్రభుత్వ చర్యను సమర్థిస్తూ తీర్పు ఇవ్వడంతో, సుప్రీంకోర్టును ఆశ్రయించారు పెత్తందార్లు. అక్కడ కూడా ఎదురుదెబ్బ తగలడంతో తేలు కుట్టిన దొంగల్లా మిన్నకుండి పోయారు. ఇంత జరుగుతున్నా వామపక్షాలు పల్లెత్తు మాట కూడా మాట్లాడలేదు.

జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన దగ్గరనుండి పేద ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను చిత్త శుద్ధితో అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న కుటుంబాలలో 90 శాతం కుటుంబాలకు ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి చేకూరుతోంది. జగన్ తన నాలుగేళ్ళ పాలనలో పేదప్రజల ఖాతాల్లోకి నేరుగా కొన్ని లక్షల కోట్ల రూపాయలను మళ్ళించారు. ఆ విధంగా పేదల కొనుగోలు శక్తిని పెంచి ఆర్థిక వ్యవస్థకు ఊపిరులూదారు. రాజ్యాధికారంలో బలహీన వర్గాలకు సరైన ప్రాతినిధ్యం కల్పించి వారి సంక్షేమం కోసం పాటుపడుతున్నారు. పేద ప్రజలకు మంచి వైద్యం, వారి పిల్లలకు కార్పొరేట్ ఇంగ్లీష్ విద్యను అందుబాటులోకి తెచ్చారు. ఈ విధంగా సమాజంలోని అంతరాలను తగ్గించి సమసమాజ నిర్మాణానికి పాటుపడుతున్న జగన్ కమ్యూనిస్ట్ కాక మరి ఏమౌతారు?

– ఈదర శ్రీనివాస రెడ్డి, గుంటూరు

తొమ్మిదేళ్లలో వజ్రం లాంటి ఆర్థిక వ్యవస్థ!

అభిప్రాయం



ఎస్. విష్ణువర్ధన్ రెడ్డి

'వజ్రం ఎప్పటికీ నిలిచి ఉంటుంది' ఇది ఓ యాడ్ క్యాప్షన్. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ కూడా ఆ వజ్రమంత బలంగా మారింది. 'ప్రపంచం మొత్తం తీవ్రమైన ఆర్థిక మాంద్యంలో ఇరుక్కున్నా భారత్‌పై పడే ప్రభావం స్వల్పమే' అని అంతర్జాతీయ ఆర్థిక నిపుణులు ఇటీవల అంతర్జాతీయ సదస్సుల్లో చెబుతున్నారు. ఎందుకంటే భారత్ ఎలాంటి విపత్తునైనా తట్టుకునే శక్తిని గత తొమ్మి దేళ్లలో సాధించింది కనుక. విదేశీ మారక ద్రవ్య నిల్వలు ఊహించనంత స్థాయికి పెరిగాయి. కొన్ని దేశాల వాణిజ్య చెల్లింపులు డాలర్లలో కాక రూపాయల్లో జరపడం ఈ సందర్భంగా గమనార్హం.

'తొమ్మిదేళ్ల కిందట మీరెలా ఉన్నారు?' ఇది దేశంలో ప్రతి ఒక్కరూ వేసుకోవాల్సిన ప్రశ్న. అప్పుడు పేదలుగా ఉన్నవారు ఇవాళ మధ్యతరగతి జీవులయ్యారు. మధ్య తరగతి జీవులుగా ఉన్నవారు ఇప్పుడు ఎగువ మధ్య తరగతి వారయ్యారు. ఇలా అవడానికి వారి కష్టం మాత్రమే కారణం కాదు. నరేంద్ర మోదీ ఆర్థిక సంస్కరణలు కూడా దోహదం చేశాయి. ప్రపంచ ఆర్థిక వృద్ధిపై అంతర్జాతీయ ఆర్థిక సంస్థ 'ఇంటర్నేషనల్ మానెటరీ ఫండ్' (ఐఎంఎఫ్) తాజా అంచనాలలో భారతదేశాన్ని ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా గుర్తించింది. జీఎస్టీ వసూళ్లలో బలమైన పెరుగుదల, మూలధన వ్యయం పెరుగుదల, ఎగుమతులలో రికార్డు వృద్ధి, మహమ్మారి ప్రభావాల నుండి కోలుకుని పరుగులు పెడుతున్న తీరు... శక్తిమంతమైన, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థను సూచిస్తున్నాయని ఐఎంఎఫ్ ప్రకటించింది. 'మహమ్మారిని ఎదుర్కొని ఆర్థిక పతనాన్ని నివారించి స్థిరమైన అభివృద్ధి దిశగా ఇండియా వెళ్లడానికి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి 2014 నుండి చేసిన స్థిరమైన ప్రయత్నాలే కారణం' అని ఐఎంఎఫ్ ప్రకటించింది.

తయారీ రంగంలో భారతదేశాన్ని స్వావలంబన దేశంగా మార్చేందుకు మోదీ ప్రభుత్వం 'ఆత్మనిర్భర్ భారత్'తో పాటు 'మేక్ ఇన్ ఇండియా' కింద అనేక కార్యక్రమాలను ప్రారంభించింది. ప్రొడక్షన్ – లింక్డ్ ఇన్సెంటివ్ (పీఎల్ఐ) పథకంతో ఈ రంగం మరింత ఊపందుకుంది. పీఎల్ఐ వెనుక ఉన్న లక్ష్యం దేశీయ తయారీని ప్రపంచవ్యాప్తంగా పోటీదారుగా మార్చడం. పీఎల్ఐ పథకాలు లక్షలాది ఉద్యోగాలను సృష్టించాయి. భారత ఆర్థిక వ్యవస్థను వేగవంతమైన వృద్ధి పథంలో ఉంచాయి. కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రభుత్వం 'ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారెంటీ' పథకం కింద కోటి కంటే ఎక్కువ చిన్న తరహా పరిశ్రమలను కాపాడింది.



దేశీయ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐలు) ఆకర్షించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలను చేపట్టింది. పెట్టుబడులకు అనువైన ఒక వాతావరణాన్ని సృష్టించడానికి 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్', ఆర్థిక వ్యవస్థకు చెందిన పలు రంగాల కోసం ఎఫ్‌డీఐ పాలసీ సరళీకరణ, శాసనపరమైన సంస్కరణలు, తదితర చర్యలను చేపట్టింది మోదీ ప్రభుత్వం. ఈ చర్యలు మంచి ఫలాలను అందించాయి. ఉదాహరణకు 2014–15 ఆర్థిక సంవత్సరానికి 45 బిలియన్ డాలర్లుగా నమోదైన ఎఫ్‌డీఐ 2021–22 ఆర్థిక సంవత్సరానికి 83.57 బిలియన్ డాలర్లకు పెరిగింది.

'నేడు ప్రపంచం భారతదేశాన్ని పెట్టుబడికి ఆకర్షణీయమైన గమ్యస్థానంగా చూస్తోంది. ప్రపంచ కంపెనీలు ఇక్కడ వ్యాపారాలను స్థాపించాలనుకుంటున్నాయి' అని ప్రపంచబ్యాంక్ తన ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఎనాలిసిస్‌లో అభిప్రాయం వ్యక్తం చేసింది.

2014కి ముందు భారత్‌లో దాదాపు 350 స్టార్టప్‌లు మాత్రమే ఉన్నాయి. మోదీ ప్రభుత్వం 'స్టార్టప్ ఇండియా' వంటి పథకాల ప్రోత్సాహంతో గత తొమ్మిదేళ్లలో స్టార్టప్‌ల సంఖ్య 260 రెట్లు పెరిగింది. నేడు దేశం 68 యూనికార్న్‌లకు నిలయంగా ఉంది. ప్రపంచ బ్యాంకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఇండెక్స్‌లో భారత్ ర్యాంకింగ్ 2014లో 142 ఉంటే 2019 నాటికి 63కి చేరుకుంది. ప్రపంచ బ్యాంకు లాజిస్టిక్ పనితీరు సూచిక-2023లో భారతదేశం ఆరు స్థానాలు ఎగబాకింది. ఇప్పుడు 139 దేశాల సూచికలో 38వ స్థానంలో ఉంది.

గతంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను పూర్తిచేయడంలో విపరీతమైన జాప్యం జరిగేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి మోదీ సర్కారు విజయగాథల్లో జాతీయ రహదారుల నిర్మాణం ఒకటిగా నిలిచిపోతుంది. అయితే 'బుల్లెట్ ట్రైన్' ప్రాజెక్టు లాంటి పలు పెద్ద ప్రాజెక్టులు నేటికీ వెలుగు చూడలేదు. 2014–15 ఆర్థిక సంవత్సరంలో దేశంలో మొత్తం జాతీయ రహదారుల నిడివి 97.8 వేల కి.మీ.లు ఉండగా 2022 డిసెంబర్ మాసాంతానికి అది 1.44 లక్షల కి.మీ.లకు చేరుకుంది. భారతీయ రైల్వే గత తొమ్మిదేళ్లలో లైన్ డబ్లింగ్, రైల్వే ట్రాక్‌ల విద్యుదీకరణ ద్వారా భారీ సామర్థ్యాన్ని సంతరించుకుంది.

'వందే భారత్ ఎక్స్‌ప్రెస్', భారతదేశపు మొట్టమొదటి స్వదేశీ సెమీ హై-స్పీడ్ రైల్ 'మేక్ ఇన్ ఇండియా' అద్భుతమైన విజయగాథ. మోదీ ప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగా టైర్-3 నగరాలకూ విమానాలు తిరుగుతున్నాయి. గత తొమ్మిదేళ్లలో 20 నగరాలకు మెట్రో రైలు ప్రాజెక్టులు చేరుకున్నాయి. మల్టీమోడల్ కనెక్టివిటీ, లాజిస్టిక్స్ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికీ, క్లిష్టమైన మౌలిక సదుపాయాల అంతరాలను పరిష్కరించడానికీ సంబంధిత మంత్రిత్వ శాఖలు/విభాగాల్లో సమగ్ర ప్రణాళిక కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'పీఎమ్ గతి శక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్'ను ప్రకటించారు.

గతంలో ప్రపంచంలో ఏ మూల ఆర్థిక మాంద్యం వచ్చినా ఇండియాలో ఇబ్బందులు పడాల్సి వచ్చేది. అనేక రంగాలు ఇబ్బందులు పడేవి. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. రాబోయే రోజుల్లో భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అగ్రగామిగా నిలుస్తుంది. ఇది తథ్యం!

వ్యాసకర్త బీజేపీ ఏపీ ప్రధాన కార్యదర్శి

క్లుప్తంగా...

చారిత్రక ఆలయ సందర్శనతో జన్మధన్యం

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్



రాహుకేతు ఆలయ శంకుస్థాపనలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ దంపతులు

కొల్లూరు: చారిత్రాక ఆలయం ఉభయ రామలింగేశ్వర క్షేత్రంలో దైవ దర్శనం చేసుకోవడంతో పాటు, పూజా కార్యక్రమాలు చేపట్టడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ చెప్పారు. బాపట్ల జిల్లా చిలుమూరు ఉభయ రామలింగేశ్వర క్షేత్రంలో బుధవారం చేపట్టిన రాహు–కేతు ఆలయ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వేద పండితులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. తొలుత సతీసమేతంగా ఆలయంలో ప్రదక్షిణలు నిర్వహించి దైవదర్శనం చేసుకున్న అనంతరం రాహు–కేతు శంకుస్థాపన కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ ట్రస్టీ హరి దుర్గానాగేశ్వరరావు, తెనాలి రెండో ఏఎంఎం కోర్టు మేజిస్ట్రేట్ జె.శ్రీసీత, రేపల్లె ఆర్డీవో పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

సప్తగిరి గ్రామీణ బ్యాంక్‌కు ఏపీవై వార్షిక అవార్డు



అవార్డు అందుకుంటున్న సప్తగిరి గ్రామీణ బ్యాంకు చైర్మన్ ప్రసాద్

సాక్షి, అమరావతి/విజయవాడ స్పోర్ట్స్: సప్తగిరి గ్రామీణ బ్యాంక్‌కు 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) వార్షిక అవార్డును కైవసం చేసుకుంది. అలాగే ఏపీవై జాతీయ ఛాంపియన్‌షిప్ కప్‌ను ఇండియన్ బ్యాంక్‌తో కలిసి సహ విజేతగా నిలిచింది. ఏపీవై ప్రారంభించిన 8ఏళ్లలో తొలిసారి బ్యాంక్ ఈ ఘనతను సాధించింది. న్యూఢిల్లీలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పీఎఫ్ఆర్‌డీఏ చైర్మన్ దీపక్ మోహంతి చేతుల మీదుగా ఈ అవార్డులను బ్యాంక్ చైర్మన్ ఏఎస్ఎన్ ప్రసాద్ అందుకున్నారు. ప్రసాద్ మాట్లాడుతూ ఈ ఘనతను సాధించేందుకు కృషి చేసిన బ్యాంక్ సిబ్బంది, బ్యాంకింగ్ కరస్పాండెంట్‌లు, ఖాతాదారులకు కృతజ్ఞతలు తెలిపారు.

మద్దుకూరికి గ్రీన్ ఇండియా అవార్డు



న్యూఢిల్లీలో గ్రీన్ ఇండియా అవార్డు అందుకుంటున్న వెంకట సుబ్బారావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో చేసిన స్వచ్ఛంద సేవలకు గానూ ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగరానికి చెందిన మద్దుకూరి వెంకట సుబ్బారావుకు గ్రీన్ ఇండియా అవార్డు లభించింది. న్యూఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో బుధవారం నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆర్‌డబ్ల్యూఏస్ అండ్ గ్రీన్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన 2వ ఆలిండియా మేయోర్స్‌అండ్ ఆర్‌డబ్ల్యూ సమ్మిట్ 2023లో మద్దుకూరి వెంకట సుబ్బారావు ఈ అవార్డును అందుకున్నారు. దేశంలో పది మందికి ఈ అవార్డు అందజేయగా, ఆంధ్రప్రదేశ్ నుంచి సుబ్బారావు అందుకున్నారు. ఆయన విజయవాడ నగర పాలక సంస్థ కంపోస్టు, వర్మీ కంపోస్టు ప్లాంట్ల వ్యవస్థాపక గౌరవ సలహాదారుగా పనిచేశారు.

'సీమ' కన్నీళ్లు తుడిచేస్తా: లోకేశ్

కడప రూరల్: తమ ప్రభుత్వం వచ్చాక అన్ని రంగాలను అభివృద్ధి చేసి రాయలసీమ కన్నీళ్లు తుడిచేస్తానని తెలుగుదేశం నాయకుడు లోకేశ్ చెప్పారు. యువగళం పాదయాత్ర నిర్వహిస్తున్న ఆయన బుధవారం వైఎస్సార్ జిల్లా కడపలో మిషన్ రాయలసీమ పేరిట సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సీమ కష్టాలు చూశాను.. సీమ కన్నీళ్లు తుడిచేస్తా.. అంటూ పలు హామీలు గుప్పించారు. రాయలసీమలో పెద్ద ఎత్తున ఉన్న మైనింగ్ పరిశ్రమను మరింతగా ప్రోత్సహిస్తామన్నారు. మైనింగ్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా యువతకు శిక్షణ ఇస్తామని చెప్పారు. డిఫెన్స్ పరికరాల తయారీ కంపెనీలను తీసుకొస్తామన్నారు. దగ్గర్లో ఉన్న బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ ఇండస్ట్రియల్ కారిడార్లను వినియోగించుకుని పారిశ్రామికాభివృద్ధిని సాధిస్తామని చెప్పారు. ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్ కంపెనీలను తీసుకొచ్చి స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఈ ప్రాంతాన్ని స్పోర్ట్స్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా తీర్చిదిద్దడంతోపాటు స్పోర్ట్స్ యూనివర్సిటీ నెలకొల్పుతామని చెప్పారు.

హజ్ యాత్ర ప్రారంభం

విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరిన తొలి బృందం

జెండా ఊపి ప్రారంభించిన డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా

ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన హజ్ యాత్రికులు



విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న హజ్ యాత్రికులు

విమానాశ్రయం(గన్నవరం)/ఏఎన్‌యూ: విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం (గన్నవరం) నుంచి బుధవారం పవిత్ర హజ్ యాత్ర ప్రారంభమైంది. 170 మందితో కూడిన హజ్ యాత్రికుల తొలి బృందం ప్రత్యేక విమానంలో జెద్దాకు బయలుదేరింది. అంతకుముందు గుంటూరు జిల్లా నంబూరులో ఏర్పాటు చేసిన హజ్ క్యాంప్ నుంచి నాలుగు ప్రత్యేక బస్సుల్లో యాత్రికులు విజయవాడ విమానాశ్రయానికి చేరుకున్నారు. భద్రతా తనిఖీలు పూర్తయిన అనంతరం.. హజ్ యాత్ర విమానాన్ని డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, హజ్ కమిటీ చైర్మన్ షేక్ గౌస్ లాజమ్, ఇతర మత పెద్దలు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం అంజాద్ మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక చొరవ వల్ల ఏపీ నుంచి తొలిసారిగా హజ్ యాత్ర ప్రారంభమైందన్నారు. గతంలో హైదరాబాద్ విమానాశ్రయానికి వెళ్లి.. అక్కడి నుంచి హజ్ యాత్రకు వెళ్లేవారన్నారు. దీనివల్ల యాత్రికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారని చెప్పారు. ఈ పరిస్థితిని గుర్తించిన ప్రభుత్వం విజయవాడ విమానాశ్రయం నుంచి హజ్ యాత్రకు పంపించేందుకు చర్యలు తీసుకుందన్నారు. దీని వల్ల యాత్రికులపై రూ.83 వేల చొప్పున అదనపు భారం పడుతుండటంతో.. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. సానుకూల స్పందన రాకపోవడంతో సీఎం జగన్ వెంటనే స్పందించి వారిపై భారం పడకుండా రూ.14.51 కోట్లు విడుదల చేశారని చెప్పారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి ఈసారి మొత్తం 1,814 మంది హజ్ యాత్రకు వెళ్లిరానున్నారని వివరించారు. ఏపీతో పాటు దేశమంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేయాలని హజ్ యాత్రికులను అంజాద్ బాషా కోరారు. తాము ఇబ్బంది పడకుండా అదనపు భారం భరించడంతో పాటు అన్ని హంగులతో ప్రభుత్వం వసతి కేంద్రం ఏర్పాటు చేసిందని యాత్రికులు చెప్పారు. తమకు అన్ని రకాల సహాయ, సహకారాలు అందించిన వైఎస్ జగన్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, యాత్రికులకు డిప్యూటీ సీఎం, హజ్ కమిటీ చైర్మన్ తదితరులు డ్రై ఫ్రూట్స్, గొడుగులు అందజేశారు. కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియా ఖానం, ఎమ్మెల్యేలు కిలారి వెంకట రోశయ్య, ముస్తఫా, ఎమ్మెల్సీలు రుహుల్లా, ఇషాక్, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్, సలహాదారు హబీబుల్లా, ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంతరెడ్డి, ఎయిర్‌పోర్ట్ భద్రతాధికారి వెంకటరత్నం, డీఎస్పీ జయసూర్య, హజ్ కమిటీ డైరెక్టర్ అబ్దుల్ బాసిత్, ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మునీర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్



983వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: భారతదేశ చరిత్రలో పెద్దఎత్తున సంక్షేమాన్ని అందించిన ముఖ్యమంత్రి ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో తప్ప దేశంలో ఎక్కడా లేరని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 983వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు. ఏపీలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అ. ధికారంలోకి వచ్చిన వెంటనే పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చాడని.. కానీ బాబు ముఖ్యమంత్రిగా ఉన్న 14 సంవత్సరాల్లో పేదలకు జానెడు జాగా ఇచ్చాడా అని ప్రశ్నించారు. కేవలం పదవీ కాంక్షతోనే చంద్రబాబు కేంద్రం కాళ్లు పట్టుకునేందుకు ఢిల్లీ యాత్రలు చేస్తున్నాడని విమర్శించారు. కేంద్రం సానుకూలంగా స్పందించి ఏపీకి నిధులు మంజూరు చేస్తుండడంతో బాబుకు వెన్నులో వణుకు పుడుతుందని చెప్పారు. రాష్ట్రంలో పేదల కోసం పోరాటం చేయాల్సిన వామపక్షాలు ప్యాకేజీలు తీసుకుని కులవాదులతో చేతులు కలపడం సిగ్గుచేటని, వీరంతా బహుజన ద్రోహులుగా చరిత్రలో నిలిచి పోతారన్నారు. కాగా, కేబినెట్ భేటీకి వెళుతున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి 54 వేల పట్టాలు అందించిన సందర్భంగా బహుజన పరిరక్షణ సమితి నాయకులు జేజేలు పలుకుతూ ధన్యవాదాలు తెలపడంతో ముకుళిత హస్తాలతో ఆయన అభివాదం తెలిపారు. నాయకులు మాదిగాని గురునాథం , ఇందుపల్లి సుభాషిణి, పెరికే వరప్రసాద్, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం , పులి దాసు, బొలిమేర శ్యామ్యూల్, పల్లె బాబు, కారుమూరి పుష్పరాజ్, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

మహిళపై అఘాయిత్యానికి నేపాల్ యువకుల యత్నం

- బస్టాండ్‌లో ఒంటరిగా ఉన్న మహిళను ఆటోలో తీసుకెళ్లిన యువకులు
- తప్పించుకున్న మహిళ.. సమీపంలోని యువకుడి సాయంతో దిశ యాప్‌లో ఫిర్యాదు
- వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మహిళను కాపాడిన పోలీసులు



పోలీసుల అదుపులో యువకులు

కందుకూరు: అర్ధరాత్రి ఊరికి వెళ్లేందుకు బస్టాండ్‌లో ఒంటరిగా ఉన్న మహిళపై కన్నేసిన ముగ్గురు యువకులు అఘాయిత్యానికి విఫలయత్నం చేశారు. దిశ యాప్‌లో వచ్చిన ఫిర్యాదుతో స్పందించిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఇద్దరు నేపాల్‌కు చెందిన యువకులు కాగా, మరొకరు పట్టణానికి చెందిన యువకుడు. మంగళవారం అర్ధరాత్రి నెల్లూరు జిల్లా కందుకూరు పట్టణంలోని మాచవరం రోడ్డులో ఈ ఘటన జరిగింది. డీఎస్పీ రామచంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. మాచవరం గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన ఓ మహిళ మంగళవారం సాయంత్రం వ్యక్తిగత పనులపై పట్టణానికి వచ్చింది. అయితే ఆలస్యం కావడంతో రాత్రి 11 గంటల వరకు పట్టణంలోనే ఉండిపోయింది. ఆ సమయంలో తమ ఊరికి వెళ్లే బస్సు కోసం పామూరు బస్టాండ్‌లో వేచి చూస్తోంది. అదే సమయంలో కందుకూరు పట్టణంలోని గూర్ఖాలుగా పనిచేస్తున్న నేపాల్‌కు చెందిన యువకులు కరణ్, జ్యోషిలతో పాటు, పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ సయ్యద్ ఫిరోజ్ ముగ్గురూ మహిళ వద్దకు వచ్చారు. ఆమెను బలవంతంగా ఆటోలో ఎక్కించుకుని మాచవరం వైపు తీసుకెళుతున్నారు. ఎస్ఆర్ పెట్రోల్ బంకు సమీపంలో నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో అప్రమత్తమైన ఆమె అక్కడి నుంచి తప్పించుకుని పెట్రోల్ బంకు వద్దకు చేరుకుంది. దీంతో పెట్రోల్ బంకులో పనిచేసే యువకుడు దిశ యాప్ ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మహిళకు రక్షణ కల్పించి యువకుల కోసం గాలించారు. అయితే అప్పటికే వారు పారిపోవడంతో ఆటో ఆధారంగా బుధవారం నిందితులు ముగ్గురినీ అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

ముంబైలో శ్రీబాలాజీ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

హాజరైన మహారాష్ట్ర సీఎం, డిప్యూటీ సీఎం, టీటీడీ చైర్మన్



భూమిపూజ చేస్తున్న మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, చిత్రంలో వై.వి.సుబ్బారెడ్డి

తిరుపతి కల్చరల్: నవీ ముంబైలోని ఉల్వేలో మహారాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 10 ఎకరాల స్థలంలో శ్రీవేంకటేశ్వర స్వామి (బాలాజీ) ఆలయ నిర్మాణానికి బుధవారం శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండేతో పాటు డిప్యూటీ సీఎం దేవేందర్ ఫడ్నవీస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా 'వేంకటరమణా గోవిందా' అంటూ ప్రసంగాన్ని ప్రారంభించిన సీఎం.. నవీ ముంబైలో తిరుపతి బాలాజీ మందిర నిర్మాణానికి శంకుస్థాపన జరగడం మహారాష్ట్రకు మరుపురాని రోజు అని చెప్పారు. మహారాష్ట్ర ప్రజల చిరకాల కోరికను నెరవేర్చి మనల్ని ఆశీర్వదించడానికి తిరుమల బాలాజీ నవీ ముంబైలో కొలువుదీరబోతున్నారని తెలిపారు. ముంబై ట్రాన్స్‌హార్బర్ లింక్‌లోని 22 కిలోమీటర్ల పొడవైన సింగిల్ బ్రిడ్జిని త్వరలో మహాలక్ష్మి ఆలయానికి అనుసంధానించనున్నట్లు తెలిపారు. ఆలయ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయడానికి ప్రభుత్వం పూర్తిస హకారం అందిస్తుందని ఆయన చెప్పారు. టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ మహారాష్ట్ర ప్రజల చిరకాల వాంఛ అయిన బాలాజీ ఆలయాన్ని తిరుమల ఆలయం తరహాలో నిర్మించాలని ఏపీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సూచించారని తెలిపారు. ఆలయ నిర్మాణ ఖర్చును రేమండ్ గ్రూప్ సీఎండీ గౌతమ్ హరి సింఘానియా భరిస్తున్నారని చెప్పారు. రెండేళ్లలో ఆలయ నిర్మాణం పూర్తిచేస్తామన్నారు. గౌతమ్ సింఘానియా మాట్లాడుతూ అందరి సహకారంతో ఆలయాన్ని అత్యంత వేగంగా నిర్మిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో ఎ.వి.ధర్మారెడ్డి, బోర్డు సభ్యుడు మిలిందర్ నర్వేకర్, ఆమోల్ కాలే, రాజేష్‌శర్మ, సౌరభ్ బోరా, సిడ్కో వీసీ డాక్టర్ సంజయ్ ముఖర్జీ, టీటీడీ ఎస్ఈ జగదీశ్వర్‌రెడ్డి, మహారాష్ట్ర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలు, ఆస్పత్రుల్లో యాంటిరేబిస్ టీకాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి (పీహెచ్‌సీల నుంచి) అన్ని ఆస్పత్రుల్లో యాంటీరేబిస్ వ్యాక్సిన్ నిల్వలు ఉండేలా చూడాలని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఆదేశించారు. వెలగపూడిలోని సచివాలయంలో బుధవారం రాష్ట్ర జూనోసిస్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన కృష్ణబాబు మాట్లాడుతూ హైరిస్క్ వర్గాలైన మున్సిపల్ కార్మికులు, వెటర్నరీ ల్యాబ్ సిబ్బంది, ఇతరులకు రేబిస్ టీకాల పంపిణీకి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని చెప్పారు. కాకినాడ, తిరుపతి స్విమ్స్‌లో రేబిస్ వ్యాధి నిర్ధారణ సౌకర్యాన్ని మెరుగుపరచాలన్నారు. జంతువులు, పశువుల నుంచి మానవులకు వచ్చే జూనోటిక్ వ్యాధుల సమాచారంతో ప్రత్యేక డ్యాష్‌బోర్డ్‌ను అందుబాటులో ఉంచాలని చెప్పారు. మునిసిపల్, పంచాయతీరాజ్ విభాగాల సహకారంతో పశువుల ఆస్పత్రుల్లో కుక్కలకు టీకాల అందుబాటు పెంచాలన్నారు. జూనోటిక్ వ్యాధుల బారినపడిన వ్యక్తుల జీవనశైలిని సిద్ధార్థ మెడికల్ కాలేజీ, ఎన్టీఆర్ కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్సెస్ వైద్యుల బృందం అధ్యయనం చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ నివాస్, ఏపీవీవీపీ కమిషనర్ వెంకటేశ్వర్, ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ డాక్టర్ రామిరెడ్డి, పశుసంవర్ధక, ఔషధ నియంత్రణ అధికారులు పాల్గొన్నారు.

వర్సిటీలను రాజకీయ కేంద్రాలుగా మార్చారు

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని యూనివర్సిటీలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాజకీయ, సంఘవ్యతిరేక కార్యకలాపాలకు కేంద్రంగా మార్చిందని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఒక ప్రకటనలో విమర్శించారు. అందువల్లే రాష్ట్రంలోని వర్సిటీల ర్యాంకింగ్‌లు పడిపోయాయని పేర్కొన్నారు. నాలుగేళ్లుగా ఏపీ వర్సిటీల ర్యాంకింగ్ పడిపోతున్న విషయం ఎన్ఐఆర్ఎఫ్ నివేదికను పరిశీలిస్తే అర్థం అవుతోందని తెలిపారు. 2019లో 29వ ర్యాంక్‌లో ఉన్న ఆంధ్రా వర్సిటీ ఇప్పుడు 76వ స్థానానికి పడిపోయిందని, శ్రీవేంకటేశ్వర వర్సిటీ కనీసం టాప్ 100లో స్థానం పొందలేకపోవడం విచారకరమని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ విధానాల వల్లే కీలకమైన ఉన్నత విద్యారంగం నాశనమైందని విమర్శించారు. వర్సిటీల్లో అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయడంలేదని పేర్కొన్నారు.

ట్రాక్టర్ ప్రమాదంలో బాలుడు మృతి




గోపి మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

కురిచేడు: ట్రాక్టర్ ప్రమాదంలో బాలుడు మృతి చెందిన ఘటన ప్రకాశంజిల్లా కురిచేడు మండలంలోని పెద్దవరం గ్రామంలో బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే... గ్రామంలో విద్యుత్ స్తంభాలకు తీగలు మార్చుతున్నారు. ఆ తీగలు లాగే కార్మికులు బుధవారం మధ్యాహ్నం నారెబోయిన యోగయ్య ఇంటి సమీపంలో ట్రాక్టరును నిలిపారు. తాళం తీయకుండా భోజనానికి వెళ్లారు. ఆ సమయంలో ఆటలాడుకుంటూ వెళ్లిన యోగయ్య కుమారుడు గోపి (9) ట్రాక్టర్ ఎక్కి, తాళం ఉండటంతో స్టార్ట్ చేశాడు. ట్రాక్టర్ గేరులో ఉండటంతో ఒక్కసారిగా ఎదురుగా ఉన్న రేకుల షెడ్డులోకి దూసుకుపోయింది. ఈ క్రమంలో ట్రాక్టర్‌పైన ఉన్న గోపి మెడకు రేకులు కోసుకోవడంతో కిందపడిపోయాడు. వెంటనే బాలుడిని కురిచేడు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. నారబోయిన యోగయ్య, నాగమణి దంపతులకు ముగ్గురు సంతానం కాగా, గోపి పెద్ద వాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

గోల్డ్ బాండ్‌గా దుర్గమ్మ బంగారం

8.780 కిలోల బంగారం భద్రపరచిన ఆలయ అధికారులు




బ్యాంక్ అధికారులకు బంగారం అప్పగిస్తున్న దుర్గగుడి చైర్మన్ రాంబాబు, ఈవో భ్రమరాంబ

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దుర్గమ్మకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన బంగారు ఆభరణాలు, బంగారపు వస్తువులు, వినియోగంలో లేని బంగారాన్ని విజయవాడ దుర్గగుడి అధికారులు బాండ్ స్కీమ్ రూపంలో బ్యాంక్‌లో భద్రపరిచారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని మహామండపం 4వ అంతస్తులోని చాంబర్‌లో దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ, దేవదాయ శాఖ రాజమహేంద్రవరం రీజనల్ జాయింట్ కమిషనర్ ఎం.వి.సురేష్‌బాబు, జ్యుయలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ దుర్గాభవానీ, దుర్గగుడి ముఖ్య అర్చకులు ఆర్.శ్రీనివాసశాస్త్రి, పర్యవేక్షకుడు కె.శ్రీనివాసరావు సమక్షంలో 8.780 కేజీల బంగారాన్ని బ్యాంక్ అధికారులకు అప్పగించారు.

రెడ్డి సామాజికవర్గంపై లోకేశ్ మొసలి కన్నీరు..

ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి



సాక్షి, అమరావతి/కృష్ణలంక(విజయవాడ తూర్పు): రెడ్డి సామాజికవర్గాన్ని అన్ని రకాలుగా అణచివేతకు గురిచేసిన టీడీపీకి రెడ్ల సమస్యలపై మాట్లాడే అర్హతే లేదని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి మండిపడ్డారు. బుధవారం ఆయన మాట్లాడారు. రెడ్డి సామాజికవర్గంపై నారా లోకేశ్ మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో రాష్ట్రంలో 350 మందికిపైగా రెడ్లు దారుణ హత్యకు గురయ్యారని గుర్తు చేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేయకుండా, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ఇవ్వకుండా, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయకుండా మోసం చేసిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. రెడ్ల వ్యతిరేక వైఖరి అవలంభించడం వలన గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ నుంచి 51 మంది రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు ఎన్నికైతే టీడీపీ నుంచి ఒక్క రెడ్డి ఎమ్మెల్యే కూడా గెలవలేదన్నారు. గత ఐదేళ్ల చంద్రబాబు ప్రభుత్వంలో రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ తదితర విభాగాల్లో ఉన్నత పదవులు రెడ్లకు కేటాయించకుండా వివక్ష చూపి, అణచివేసిన సంగతి లోకేశ్ గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. రెడ్ల అణచివేతపై టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు కానీ, లోకేశ్ కానీ దమ్ముంటే తనతో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. అన్ని సామాజిక వర్గాల మాదిరిగానే రెడ్డి సామాజిక వర్గాన్ని కూడా ప్రభుత్వ పరంగా సీఎం వైఎస్ జగన్ ఆదుకుంటారనే నమ్మకం తమకు ఉందన్నారు.

నేడు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు శిక్షణ

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, రాత్రి కాపలాదారులకు ఒకరోజు శిక్షణ ఇవ్వనున్నట్టు మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర సంచాలకులు డాక్టర్ నిధి మీనా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో విజయవాడ బందర్ రోడ్డులోని మనోరమ హోటల్‌లో నిర్వహిస్తున్న ఈ శిక్షణలో 26 జిల్లాల్లో నియమితులైన వంట తయారీ, సహాయకులు, పాఠశాల కాపలాదారులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం 'వంటల పోటీ' కూడా జరుగుతుందని పేర్కొన్నారు. పోటీలో విజేతలకు బహుమతులు అందించనున్నట్టు నిధి మీనా తెలిపారు.

ఎస్వీయూ కృత్రిమ ఇసుక తయారీకి పేటెంట్

తిరుపతి ఎడ్యుకేషన్: ఎస్వీ యూనివర్సిటీలోని డీఎస్టీ పర్స్ సెంటర్ ఆవిష్కరించిన కృత్రిమ ఇసుక తయారీ విధానానికి పేటెంట్ లభించింది. ప్రొఫెసర్ విజయభాస్కర్‌రావు, డాక్టర్ సంగటి చెన్నకేశవరెడ్డి నేతృత్వంలో నిర్మాణాలకు ఉపయోగించే ఇసుకను రూపొందించారు. ఇది రవాణా చేయడానికి కూడా వీలుగా ఉంటుంది. ఇసుకతో వాటర్ ఫిల్టర్, పెయింటింగ్ వంటి వాటిని తయారు చేసేందుకు వారు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఆవిష్కరణ చేపట్టిన ఈ బృందాన్ని ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ కె.రాజారెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మహమ్మద్ హుస్సేన్ అభినందించారు.

ప్రభుత్వంపై దుష్ప్రచారం.. తెనాలి యువకుడికి పోలీసుల నోటీసు

తెనాలి రూరల్: సోషల్ మీడియాలో ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాడన్న కారణంగా వైఎస్సార్ జిల్లా పులివెందుల పోలీసులు తెనాలి యువకుడికి నోటీసులు అందచేశారు. గుంటూరు జిల్లా తెనాలి ఐతానగర్‌కు చెందిన వేమూరి మదన్.. ఫేక్ ఐడీతో సోషల్ మీడియాలో ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తూ పోస్టులు పెడుతున్నట్టు పులివెందుల పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో బుధవారం తెనాలి వచ్చిన పులివెందుల పోలీసులు మదన్ ఇంటికి వెళ్లారు. అతడు లేకపోవడంతో అతని తండ్రి మధుకు 41ఎ నోటీసు అందచేశారు. తాము పిలిచినప్పుడు పులివెందుల పోలీస్ స్టేషన్‌కు హాజరుకావాలని సూచించి వెళ్లారు.

10న గీతం స్నాతకోత్సవం

కొమ్మాది (విశాఖ జిల్లా): గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం 14వ స్నాతకోత్సవం ఈ నెల 10న నిర్వహిస్తున్నట్లు వీసీ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం తెలిపారు. తేజ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ సృష్టికర్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కోట హరినారాయణకు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ (డాక్టర్ ఆఫ్ సైన్స్), ప్రముఖ సినీనటి వాణిశ్రీకి డిలిట్ గౌరవ డాక్టరేట్‌ను అందజేస్తామని ప్రకటించారు. భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం(డీఎస్‌టీ) కార్యదర్శి డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై పట్టభద్రులను ఉద్దేశించి ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

ఇండిగో విమానం దారిమళ్లింపు

గోపాలపట్నం (విశాఖపట్నం): బెంగళూరు నుంచి విశాఖకు బుధవారం రాత్రి 7.55 గంటలకు రావాల్సిన ఇండిగో విమానాన్ని ఈదురుగాలుల వల్ల విజయవాడకు మళ్లించినట్లు ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు. వాతావరణం అనుకూలించిన అనంతరం విజయవాడ నుంచి 9.25 గంటలకు విశాఖ వచ్చిన ఈ విమానంలో 173 మంది ప్రయాణికులున్నారు. ఈ విమానం తిరిగి 179 మంది ప్రయాణికులతో బెంగళూరుకు బయలుదేరింది.

భర్తపై పెట్రోలు పోసి నిప్పంటించిన భార్య

ఆస్పత్రికి తరలిస్తుండగా మృత్యువాత

అన్నమయ్య జిల్లాలో కలకలం




కుమారుడు, భార్య మమతతో ఆర్మీ మాజీ ఉద్యోగి శ్రీధర్(ఫైల్)

కురబలకోట : ఇంట్లో మిద్దెపై గదిలో నిద్రిస్తున్న భర్తపై పెట్రోల్ పోసి నిప్పంటించి ప్రాణాలు తీసిందో భార్య. అన్నమయ్య జిల్లాలో బుధవారం తెల్లవారు జామున జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం తెట్టు గ్రామం పూజారివారిపల్లెవాసి ఇ.శ్రీధర్(37). 15 ఏళ్ల పాటు ఆర్మీలో పని చేసి అనారోగ్య కారణాల వల్ల రిటైరయ్యాడు. నాలుగేళ్లుగా ఇంటి వద్దనే ఉంటున్నాడు. శ్రీధర్ తమ ఊరికే చెందిన క్లాస్‌మేట్ మమత(36)ను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి లక్కీ(15), దీపక్(13) అనే ఇద్దరు మగ పిల్లలు. అయితే భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. మనస్పర్థల కారణంగా మూడు రోజులుగా మమత పుట్టింట్లో ఉంటోంది. ఈ నేపథ్యంలో బుధవారం తెల్లవారుజామున మిద్దెపై నిద్రిస్తున్న శ్రీధర్‌కు ఒళ్లంతా మంటలు రేగడంతో గట్టిగా కేకలు వేశాడు. హుటాహుటిన కింద గదిలో ఉన్న తల్లిదండ్రులు వచ్చారు. అప్పటికే స్థానికులు కూడా చేరుకున్నారు. మంటలార్పి 108లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో శ్రీధర్ వద్ద మరణవాంగ్మూలాన్ని తీసుకున్నారు. అందులో భార్యే తనపై పెట్రోల్ పోసి నిప్పంటించిందని చెప్పాడు. అనంతరం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గంమధ్యలో ప్రాణాలు విడిచాడు. భౌతికకాయాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ఆస్తి, కుమారుడి బీమా సొమ్ము కోసమే తన కోడలు తన కుమారుడిని బలి తీసుకుందని శ్రీధర్ తండ్రి లక్ష్మయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మమతపై హత్య కేసు నమోదు చేసినట్టు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శివాంజనేయులు తెలిపారు. మదనపల్లె డీఎస్పీ కేశప్ప సంఘటన స్థలాన్ని పరిశీలించి.. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. కాగా, ఈ విషయమై శ్రీధర్ భార్య మమత మాట్లాడుతూ తన భర్తను తాను చంపలేదని, ఏం జరిగిందో తనకు తెలియదన్నారు.

తమిళనాడు రాష్ట్ర టాపర్‌కు జీఆర్‌టీ జ్యువెలర్స్ రూ.లక్ష సాయం

- స్టేట్ బోర్డ్ 12వ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపిన నందిని



నందినికి చెక్కు అందజేస్తున్న ఆనంద్ అనంత పద్మనాభన్, జీఆర్ రాధాకృష్ణన్

చెన్నై : తమిళనాడులో స్టేట్ బోర్డ్ నిర్వహించిన 12వ తరగతి ఫలితాల్లో ఆ రాష్ట్ర టాపర్‌గా నిలిచిన ఎస్.నందినికి బుధవారం జీఆర్‌టీ జ్యువెలర్స్ రూ.లక్ష రూపాయల సాయం అందించింది. ఈ సందర్భంగా జీఆర్‌టీ జ్యువెలర్స్ డైరెక్టర్ ఆనంద్ అనంత పద్మనాభన్ మాట్లాడుతూ చదువులో అసాధారణ ప్రతిభను, అంకితభావాన్ని ప్రదర్శించిన నందినికి తాము అందిస్తున్న సహకారం.. ఆమె భవిష్యత్ విజయాలకు సోపానం అవుతుందని ఆశిస్తున్నట్టు చెప్పారు. జీఆర్‌టీ జ్యువెలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ జీఆర్ రాధాకృష్ణన్ మాట్లాడుతూ విద్యలో నందినికి మద్దతుగా నిలవడం ద్వారా ఆ దిశగా యువతను ప్రేరేపించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు.

ఉల్సూరులో రామ్‌రాజ్ షోరూం ప్రారంభం



సాక్షి, బెంగళూరు: బెంగళూరులోని ఉల్సూరులో బుధవారం రామ్‌రాజ్ షోరూమ్ ప్రారంభమైంది. బజారు వీధిలోని సూర్యలేఖ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఈ షోరూమ్‌ను ముఖ్యఅతిథిగా పాల్గొన్న అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ రామచంద్ర లాంఛనంగా ప్రారంభించారు. సూర్య బిల్డర్స్ అండ్ డెవలపర్స్ భాగస్వామి సి.కిషన్‌లాల్ కొఠారి తొలి కొనుగోలు చేశారు.

క్లుప్తంగా...

బీజేపీపై వ్యతిరేకత ఉంది

దేశ ప్రజలు మార్పు కోరుకుంటున్నారు: శరద్‌పవార్

ఔరంగాబాద్: ప్రస్తుతం దేశంలో బీజేపీ వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని, ప్రజలు మార్పు కోరుకుంటున్నారని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) చీఫ్ శరద్ పవార్ తెలిపారు. ఇదే కొనసాగితే దేశం రాబోయే ఎన్నికల్లో మార్పును చూస్తుందన్నారు. ఈ విషయం చెప్పడానికి జ్యోతిష్యుని అవసరం లేదని, కర్ణాటక ఫలితాలు పరిగణనలోకి తీసుకుంటే సరిపోతుందని వ్యాఖ్యానించారు. ఔరంగాబాద్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. లోక్‌సభ, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరిగే విషయమై ప్రశ్నించగా తనతోపాటు తమ పార్టీ మిత్రపక్షాలు కూడా అదే కోరుకుంటున్నాయని తెలిపారు. అయితే.. కర్ణాటక ఎన్నికల ఫలితాల దృష్ట్యా ఒకేసారి రెండు ఎన్నికలు నిర్వహించడానికి బీజేపీ సిద్ధపడదని ఆయన వ్యాఖ్యానించారు. రైతులకు పెట్టుబడి సాయంలో 'తెలంగాణ మోడల్'పై ఆయన స్పందిస్తూ.. చిన్న రాష్ట్రం కాబట్టి అది సాధ్యమయ్యిందని, దానికి బదులుగా రైతులకు మౌలిక వసతుల కల్పనకు నిధులను వెచ్చిస్తే సరిపోతుందని అభిప్రాయపడ్డారు. మహారాష్ట్రలో ప్రతి చిన్న ఘటనకూ మతం రంగు పులుముతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది మంచి సంకేతం కాదన్నారు. రాష్ట్రంలో రైతుల సమస్యలపై శరద్‌పవార్ ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల నుంచి ఇంతవరకూ ప్రభుత్వం పత్తిని కొనుగోలు చేయలేదని, చెరుకు రైతులకు మద్దతు ధరలేదని, ఈ విషయంలో రైతుల పోరాటానికి తమ పార్టీ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు.

హార్ట్ స్పెషలిస్టు గుండెపోటుతో మృతి

జామ్‌నగర్: విధి వైచిత్రి ఇది. గుండె ఆపరేషన్లలో పేరుగాంచిన డాక్టర్ గౌరవ్‌గాంధీ 41 ఏళ్ల వయసులో గుండెపోటుకు గురై మరణించారు. ఆరోగ్యకరమైన యువ డాక్టర్, మంచి జీవనశైలిని కలిగి ఉన్న వ్యక్తి నిద్రలోనే గుండెపోటుతో కన్నుమూయడం జామ్‌నగర్ వైద్యవర్గాలను విస్మయానికి గురిచేసింది. డాక్టర్ గౌరవ్ గాంధీకి కెరీర్‌లో 16,000 పైచిలుకు గుండె ఆపరేషన్లు నిర్వహించిన అనుభవం ఉంది. సోమవారం రాత్రి ఎప్పటిలాగే కొందరు పేషెంట్లను చూసి ఇంటికి వచ్చిన గౌరవ్ ఆహారం తీసుకొని నిద్రకు ఉపక్రమించారు. రోజూ ఉదయం ఆరు గంటలకల్లా నిద్రలేచే ఆయన మంగళవారం సమయం దాటినా లేవకపోవడంతో కుటుంబీకులు గౌరవ్‌ను తట్టిలేపగా.. ఎలాంటి స్పందనా లేదు. వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే డాక్టర్ గౌరవ్ మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. నిద్రలోనే గుండెపోటు రావడంతో తుదిశ్వాస విడిచినట్లు తెలిపారు.

ఎన్నికల చిత్రం మారుతోంది!

మన దేశంలో ఎన్నికల తీరుతెన్నులను 2014కు ముందు, తర్వాత అని స్పష్టంగా ఒక విభజన రేఖ గీయొచ్చు. కేంద్రంలో నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల్లో విభిన్నమైన ధోరణులు కనిపించాయి. ఒకప్పుడు వివిధ రాష్ట్రాల్లో బహుముఖ పోరు ఉంటే, ఇప్పుడు రెండు పార్టీలే నేరుగా తలపడుతున్న రాష్ట్రాల సంఖ్య పెరుగుతోంది. బీజేపీ వివిధ రాష్ట్రాల్లో బలపడడం, కాంగ్రెస్ బలహీనపడడం , రాష్ట్రాల్లో మొదటి, రెండు స్థానాల్లో ఉండే కీలక పార్టీల వైపే ఓటర్లు మొగ్గు చూపిస్తూ ఉండడంతో ఎన్నికల ట్రెండ్స్ మారిపోతున్నాయి. ఇటీవల జరిగిన కర్ణాటక ఎన్నికల్లో త్రిముఖ పోరు నెలకొంటుందని అందరూ భావించినప్పటికీ జేడీ(ఎస్) తన ప్రాభవాన్ని కోల్పోయి బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్యే నేరుగా పోటీ జరగడం అతి పెద్ద ఉదాహరణ. ఇకపై ఎన్నికల్లో కింగ్‌మేకర్లు అన్న పదమే వినిపించేలా లేదన్న కామెంట్లు వినిపిస్తున్నాయి.

- హిందీ హార్ట్‌ల్యాండ్‌గా పిలుచుకునే రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఢిల్లీ రాష్ట్రాల్లో ఒకప్పుడు ముఖాముఖి పోరు నెలకొని ఉండేది. ఇప్పుడు ఎన్నికల తీరుతెన్నుల్ని చూస్తే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఒడిశా, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో కూడా రెండు పార్టీల మధ్యే ప్రధానంగా పోరు నెలకొని ఉంది. గుజరాత్, పంజాబ్, తెలంగాణ రాష్ట్రాల్లో రెండు పార్టీల మధ్య పోరు ఉంటే, ఇప్పుడు ఆ రాష్ట్రాల్లో పార్టీల మధ్య బహుముఖ పోరాటం నెలకొంది.
- కొన్ని రాష్ట్రాల్లో ప్రధాన పార్టీలే మారిపోయే పరిస్థితి వచ్చింది. ఉదాహరణకి ఢిల్లీ తీసుకుంటే 2014కి ముందు ఆ రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ మధ్య ముఖాముఖి పోరు ఉండేది. కానీ కాలక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ పుంజుకోవడం, కాంగ్రెస్ బలహీనపడడం మొదలైంది. దీంతో దేశరాజధానిలో ఆప్, బీజేపీ మధ్య ముఖాముఖి పోరు నెలకొంది. మరోవైపు హరియాణాలో బీజేపీ బలం పుంజుకోవడంతో అక్కడ ముఖాముఖి పోరు కాస్త బహుముఖ పోరుగా మారింది. బీజేపీ, ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ (ఐఎన్ఎల్‌డీ), జననాయక్ జనతా పార్టీ (జేజేపీ)ల మధ్య ఎన్నికల్లో రసవత్తరంగా పోరు నడుస్తోంది.
- కొన్ని రాష్ట్రాల్లో పోలయిన ఓట్లను విశ్లేషిస్తే రెండు ప్రధాన పార్టీలకే ఓట్లు వేసే ధోరణి కనిపిస్తుంది. ఒకటి, రెండు స్థానాల్లో ఉండే పార్టీలే అత్యధిక ఓటు షేర్‌ని సొంతం చేసుకున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో మాయావతికి చెందిన బీఎస్పీ, కర్ణాటకలో జేడీ(ఎస్), బెంగాల్‌లో వామపక్ష పార్టీలకు ఓట్లు వేసినా ఉపయోగం లేదన్న భావన ఓటర్లలో వచ్చింది. అందుకే రెండు పార్టీల్లో ఏదో ఒకదానిపైనే మొగ్గు చూపించే రోజులొచ్చాయని విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

రాష్ట్రాల్లో పెరుగుతున్న ముఖాముఖి పోరు
తగ్గిపోతున్న త్రిముఖ, బహుముఖ పోరాటాలు
బీజేపీ బలపడుతుండటమే ప్రధాన కారణం

2014 నుంచి పెరిగిపోతున్న కొత్త ధోరణి

రెండు ప్రధాన పార్టీలు | ఇతరులు (శాతాల్లో)

మధ్యప్రదేశ్ ముఖాముఖి పోరు

లోక్‌సభ	రెండు ప్రధాన పార్టీలు	ఇతరులు
2009	83.6	16.4
2014	88.9	11.1
2019	92.5	7.5
అసెంబ్లీ		
2008	70.1	29.9
2013	81.3	18.7
2018	81.9	18.1

తమిళనాడు బహుముఖ పోరు

లోక్‌సభ	రెండు ప్రధాన పార్టీలు	ఇతరులు
2009	48	52
2014	67.9	32.1
2019	52.3	47.7
అసెంబ్లీ		
2011	60.8	39.2
2016	72.4	27.6
2021	70.9	29.1

పంజాబ్ ముఖాముఖి నుంచి బహుముఖ పోరు

లోక్‌సభ	రెండు ప్రధాన పార్టీలు	ఇతరులు
2009	79.1	20.9
2014	59.3	40.7
2019	67.6	32.4
అసెంబ్లీ		
2012	74.8	25.2
2017	63.7	36.3
2022	64.9	35.1

పశ్చిమ బెంగాల్ బహుముఖ నుంచి ముఖాముఖి పోరు

లోక్‌సభ	రెండు ప్రధాన పార్టీలు	ఇతరులు
2009	64.3	35.7
2014	62.1	37.9
2019	83.5	16.5
అసెంబ్లీ		
2011	69.1	30.9
2016	64.7	35.3
2021	85.9	14.1

2014లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాల అసెంబ్లీలలో కమలనాథులు పట్టు బిగిస్తే, కాంగ్రెస్ పార్టీ ప్రాభవం తగ్గుతూ వచ్చింది. ఒడిశా, త్రిపుర రాష్ట్రాలే దీనికి ఉదాహరణ. ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ పాగా వేస్తూ ఇతర పార్టీల ఓటు బ్యాంకును కొల్లగొట్టడం వల్ల ఎన్నికల తీరు మారిపోయి రెండు పార్టీల మధ్య పోరు నెలకొంది.

పలు రాష్ట్రాల్లో ఎన్నికల పోరాటాల తీరుతెన్నులు మారుతూ వస్తున్న వైనం

2014కు ముందు	2019 తర్వాత
ముఖాముఖి పోరు ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, ఢిల్లీ, పంజాబ్, మధ్యప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఏపీ, గుజరాత్	**బహుముఖ పోరు** గుజరాత్, పంజాబ్, తెలంగాణ
బహుముఖ పోరు కర్ణాటక, ఒడిశా, ఉత్తరప్రదేశ్ పశ్చిమ బెంగాల్, ఒడిశా, బిహార్ జార్ఖండ్, హరియాణా, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు	**ముఖాముఖి పోరు** కర్ణాటక, ఒడిశా, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్

రైతుకు మరింత దన్ను

- 2023–24 ఖరీఫ్ సీజన్‌కు గానూ 14 రకాల పంటలకు కనీస మద్దతు ధర పెంచిన కేంద్రం
- వరి మద్దతు ధరపై రూ.143 పెంపు.. సాధారణ రకం క్వింటాల్ రూ.2,183, గ్రేడ్–ఎ రకం రూ.2,203
- పెసరపై ఏకంగా రూ.803 పెంపు, మద్దతు ధర రూ.8,558



సాక్షి, న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు విస్తరిస్తున్న వేళ రైతులకు కేంద్రం తీపికబురు చెప్పింది. ఖరీఫ్ సీజన్ ఆరంభమవుతున్న వేళ 2023–24 మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి 14 రకాల పంటల కనీస మద్దతు ధరలు పెంచుతూ నిర్ణయం చేసింది. వ్యవసాయదారుల ఉత్పత్తులకు లాభదాయక ధరలు నిర్ధారించేలా, పంటల వైవిధ్యతను ప్రోత్సహించేలా మద్దతు ధరల పెంపునకు బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. వరి సాధారణ, గ్రేడ్–ఏ రకాలపై ప్రస్తుతం ఉన్న మద్దతు ధరను రూ.143 పెంచింది. దీంతో ప్రస్తుతం సాధారణ రకం వరి క్వింటాల్ ధర రూ.2,040 ఉండగా, అది ప్రస్తుత కేంద్రం నిర్ణయంతో రూ.2,183కి పెరగగా, గ్రేడ్–ఏ రకం వరి ధర రూ.2,060 నుంచి రూ.2,203కి చేరింది.

పప్పుధాన్యాలకు పెరిగిన మద్దతు..

ఇటీవలి కాలంలో కేంద్రం పప్పుధాన్యాలు, నూనెగింజలు, తృణధాన్యాల పంటల సాగును ప్రోత్సహిస్తోంది. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, జాతీయ ఆహార భద్రతా మిషన్ వంటి పథకాల ద్వారా పంటల వైవిధ్యం ఉండేలా రైతులను ప్రోత్సహిస్తోంది. 2022–23 మూడవ ముందస్తు అంచనాల ప్రకారం, దేశంలో మొత్తం ఆహారధాన్యాల ఉత్పత్తి రికార్డు స్థాయిలో 330.5 మిలియన్ టన్నులుగా అంచనా వేయగా, ఇది మునుపటి ఏడాది 2021–22తో పోలిస్తే 14.9 మిలియన్ టన్నులు ఎక్కువగా ఉంది. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని పప్పుధాన్యాలు, నూనెగింజల ధరలను కేంద్రం గరిష్టంగా పెంచింది. పెసర ధరను ఏకంగా రూ.803కి పెంచింది. దీంతో పెసర ధర రూ.7,755 నుంచి రూ.8,558కి పెరిగింది. కంది మద్దతు ధరను రూ.400, మినప ధరను రూ.350 మేర పెంచింది. నూనెగింజల విషయంలో వేరుశనగకు రూ.527, సన్‌ఫ్లవర్ రూ.360, సోయాబీన్ రూ.300, నువ్వులు రూ.805 చొప్పున ధరలు పెంచింది. వ్యవసాయ ఖర్చులు ధరల కమిషన్ సిఫార్సుల ఆధారంగా ఎప్పటికప్పుడు మద్దతు ధరని నిర్ణయిస్తున్నామని, గత ఏడాదులతో పోలిస్తే ఈ ఏడాది అత్యధికంగా ధరలను పెంచామని కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ వ్యవహారాల శాఖ మంత్రి పియూశ్‌గోయల్ పేర్కొన్నారు.

పంటల వారిగా ప్రకటించిన ధరలు, పెంపుదల ఇలా... (క్వింటాల్‌కు రూపాయల్లో)

పంట	గత ధర	ప్రస్తుత ధర	పెంపు
వరి(సాధారణం)	2,040	2,183	143
వరి (ఏ)	2,060	2,203	143
జొన్న(హైబ్రిడ్)	2,970	3,180	210
జొన్న(మల్దండి)	2,990	3,225	235
సజ్జలు	2,350	2,500	150
రాగి	3,578	3,846	268
మొక్కజొన్న	1,962	2,090	128
కందులు	6,600	7,000	400
పెసర	7,755	8,558	803
మినుములు	6,600	6,950	350
వేరుశనగ	5,850	6,377	527
పొద్దుతిరుగుడు	6,400	6,760	360
సోయాబీన్	4,300	4,600	300
నువ్వులు	7,830	8,635	805
ఒడిసలు(నైగర్‌సీడ్)	7,257	7,734	447
పత్తి (మీడియం స్టేపుల్)	6,080	6,620	540
పత్తి(లాంగ్ స్టేపుల్)	6,380	7,020	640

రైతు సంక్షేమ సంస్కరణల్లో భాగమిది: మోదీ

దాదాపు 14 ఖరీఫ్ పంట రకాలకు కనీస మద్దతు ధర పెంచడంపై ప్రధాని మోదీ స్పందించారు. 'గత తొమ్మిదేళ్లలో రైతు సంక్షేమం కోసం మా ప్రభుత్వం చేపట్టిన పలు సంస్కరణల క్రమంలో భాగమే ఈ ఎంఎస్పీ పెంపు నిర్ణయం. ఈ పెంపుతో రైతులు తమ పంటకు లాభసాటి ఆదాయం పొందటంతోపాటు వైవిధ్య పంటల సాగు విధానం మరింత పటిష్టమవనుంది' అని మోదీ ట్వీట్‌చేశారు. వరికి క్వింటాల్‌కు రూ.143 పెంచుతూ కేంద్ర కేబినెట్ నిర్ణయించడంపై మోదీ సంతోషం వ్యక్తం చేశారు. గత దశాబ్దకాలంలో ఇంతగా ధర పెంచడం ఇది రెండోసారి. గత పదేళ్లలో చూస్తే గరిష్టంగా 2018–19లో క్వింటాల్‌కు రూ.200 పెంచారు. 2023–24 ఖరీఫ్ పంటలకు 5.3 శాతం నుంచి 10.35 శాతం శ్రేణిలో కనీస మద్దతు ధర పెంచారు.



వరద నీటితో నిండా మునిగిపోయిన ఖేర్సన్‌లోని వీధులు



స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న ఉక్రెయిన్ సైనికులు

ఉక్రెయిన్‌ను ముంచెత్తిన వరద

సురక్షిత ప్రాంతాలకు వలసపోతున్న జనం

ఖేర్సన్(ఉక్రెయిన్): ఉక్రెయిన్ భూభాగాలపై రష్యా దురాక్రమణకు దిగాక ఇన్నాళ్లూ బాంబుదాడులకు భయపడి ప్రాణాలు అరచేత పట్టుకుని వలసపోయిన జనం ఇప్పుడు వరదరూపంలో వచ్చిన జలఖడ్గం దాటికి సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్నారు. నీపర్ నదీ ప్రవాహంపై నిర్మించిన కఖోవ్కా ఆనకట్ట, జలవిద్యుత్ ప్లాంట్‌పై బాంబుల వర్షం నేపథ్యంలో డ్యామ్ బద్దలై వరదనీరు దిగువ ప్రాంతాలను ముంచెత్తింది. దీంతో దక్షిణ ఉక్రెయిన్ ప్రాంతాలు జలమయమయ్యాయి. కొందరు ఇళ్లపైకి ఎక్కి అక్కడే గడిపారు. ఎమర్జెన్సీ ఆపరేషన్ మొదలుపెట్టి స్థానిక పాలనా యంత్రాంగాలు పౌరులను వేరే చోట్లకు హుటాహుటిన తరలిస్తున్న దృశ్యాలు అంతర్జాతీయ మీడియాలో ఆవిష్కృతమయ్యాయి.

దొరికింది తీసుకెళ్తూ ఏదో ఒకదాంట్లో వలసపోతూ..

చేతికందినంత నిత్యావసర వస్తువులు తీసుకుని మిలటరీ ట్రక్కులు, రాఫ్ట్‌లపై ఎక్కి జనం ఓవైపు వలసపోతుంటే శతఘ్ని పేలుళ్ల చప్పుళ్లతో ఆ ప్రాంతం భయానకంగా మారింది. ఇంకొందరు బస్సుల్లో, రైళ్లలో వెళ్లిపోయారు. డ్యామ్ కుప్పకూలి 24 గంటలు గడుస్తున్నా ఇంతవరకు ఆ దాడికి కారకులు ఎవరో తెలియరాలేదు. మీరంటే మీరని ఉక్రెయిన్, రష్యాలు పరస్పర దూషణలు మాత్రం ఆపట్లేవు. కొంతకాలంగా రష్యా ఆక్రమిత భూభాగంలో ఉన్న ఈ డ్యామ్ పరిసరాల్లో తరచూ బాంబు దాడులు జరుగుతున్నాయి. రణక్షేత్రంగా మారిన ఈ ప్రాంతంపై ఇరుపక్షాల్లో ఒకరు పొరపాటున భారీ దాడి చేసిఉంటారని, నిర్లక్ష్యం కూడా అయి ఉండొచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆగకుండా వస్తున్న వరదనీటితో దిగువ ప్రాంతాల్లో వచ్చే 20 గంటల్లో మరో మూడు అడుగులమేర నీరు నిలుస్తుందని అధికారుల ఆందోళన వ్యక్తంచేశారు. విస్తారమైన ప్రాంతాలకు తాగునీరు, సాగునీరు అందిస్తున్న ప్రపంచంలోని అతిపెద్ద రిజర్వాయర్‌లలో కఖోవ్కా డ్యామ్ కూడా ఒకటి. గత ఏడాది రష్యా ఆక్రమించిన ఖేర్సన్ ప్రాంతంలోనే ఈ డ్యామ్ ఉంది. ఖేర్సన్ సిటీకి కేవలం 44 మైళ్లదూరంలో ఈ డ్యామ్ ఉండటంతో ఇప్పటికే వరదనీరు సిటీలోకి ప్రవేశించింది. వరదనీటి మట్టం పెరిగితే ఖేర్సన్‌కు కష్టాలు పెరుగుతాయి. డ్యామ్ పూర్తిగా పాడవలేదని, ఇంకా చాలా నీరు నిల్వ ఉందని, కొద్దిరోజుల్లో మొత్తం డ్యామ్ నేలమట్టమైతే మరో దఫా వరద ఖాయమని బ్రిటన్ రక్షణ శాఖ తన తాజా అప్‌డేట్‌లో పేర్కొంది. ఈ శాఖ తరచూ యుద్ధసమాచారాన్ని అందరితో పంచుకుంటోంది.

తాగేందుకు నీరే లేదు: జెలెన్‌స్కీ

'కుట్ర పన్ని రష్యా ఈ డ్యామ్‌ను నేలమట్టం చేసింది. వేలాది మంది ప్రజలకు కనీసం తాగు నీరు లేకుండా పోయింది' అని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ టెలిగ్రామ్‌లో పోస్ట్‌చేశారు.

ఇది రష్యా పనే: అమెరికా మేథో సంస్థ

'నీపర్ దిగువ ప్రాంతాలను వరదమయం చేస్తే రష్యాకే మేలు. ఉక్రెయిన్ సేనలు మళ్లీ ఆప్రాంతాలను చేజిక్కించుకోకుండా ఆలస్యం చేయడం రష్యా ఎత్తుగడ. అందుకే తమకు కొంచెం నష్టం జరుగుతుందని తెల్సికూడా ఇలా డ్యామ్‌ను పేల్చేసింది' అని రక్షణ, విదేశీవ్యవహారాల విశ్లేషణ మేథోసంస్థ, అమెరికాకు చెందిన లాభాపేక్షలేని 'స్టడీ ఆఫ్ వార్' వ్యాఖ్యానించింది.

పొంచి ఉన్న ధరాఘాతం

గోధుమలు, బార్లీ, పొద్దుతిరుగుడు నూనె, ఇతర ఆహార ఉత్పత్తుల్ని భారీ స్థాయిలో పండిస్తూ ప్రపంచ ఆహార అవసరాలు తీర్చడంలో ఉక్రెయిన్ కీలక భూమిక పోషిస్తోంది. డ్యామ్ వరదనీటితో పంట నష్టం వాటిల్లి ఇక్కడి నుంచి విదేశాలకు ఎగుమతులు తగ్గి డిమాండ్ పెరిగి ధరలు ఎక్కువయ్యే ప్రమాదం పొంచి ఉంది. డ్యామ్ కూలిన ఈ కొద్ది గంటల్లోనే గోధుమ ధరలు 3 శాతం ఎగబాకాయి. ఆఫ్రికా, మధ్య ప్రాచ్యం, ఆసియాలోని కొన్ని దేశాలు ఉక్రెయిన్ ఆహార ఉత్పత్తులపై ఆధారపడుతున్నాయి. డ్యామ్ కూల్చివేత కారణంగా కలిగే నష్టాన్ని ఇప్పుడే అంచనా వేయలేమని రష్యా, ఉక్రెయిన్, ఐక్యరాజ్యసమితి అధికారులు చెబుతున్నారు. డ్యామ్‌ను బాగుచేసి మళ్లీ పూర్వ స్థితికి తీసుకురావాలంటే ఈ యుద్ధతరుణంలో ఎన్నేళ్లు పడుతుందో చెప్పలేని పరిస్థితి.

ఆర్డినెన్స్ విషయంలో అండగా ఉంటాం

కేజ్రీవాల్‌కు ఎస్పీ చీఫ్ అఖిలేశ్ భరోసా



లక్నో: ఢిల్లీ రాష్ట్రంలో ప్రభుత్వ ఉన్నతాధికారుల పదోన్నతి, బదిలీల వంటి పాలనా సేవలపై సర్వాధికారం విషయంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్‌ను తాము వ్యతిరేకిస్తామని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) ప్రకటించింది. ఈ విషయంలో మద్దతు కోరుతూ తనను కలవడానికి వచ్చిన ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ అభయహస్తం అందించారు. రాజ్యసభలో ఆర్డినెన్స్‌ను నిలువరించేందుకు తగిన బలం పెంచుకునేందుకు పలు విపక్ష పార్టీల అగ్రనేతలను కలుస్తున్న ఆప్ చీఫ్ కేజ్రీవాల్ లక్నోలో బుధవారం ఎస్పీ చీఫ్‌తో భేటీ అయ్యారు. తర్వాత కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడారు. ' రాజ్యసభలో ఆర్డినెన్స్ వచ్చినపుడు ఎస్పీ పార్టీ మాకు మద్దతు ఇస్తుందని అఖిలేశ్ హామీ ఇచ్చారు. అందుకు మా కృతజ్ఞతలు' అని కేజ్రీవాల్ అన్నారు. 'ఆర్డినెన్స్ పూర్తి అప్రజాస్వామికం. ఈ విషయంలో మా పూర్తి మద్దతు మీకే. ఢిల్లీలో విద్య, ఆరోగ్యరంగాల్లో మీరు చేసిన మంచి పనులు బీజేపీకి నచ్చడం లేదు. ఎందుకంటే ఆ మంచి పని బీజేపీని ఎన్నికల్లో తుడిచిపెట్టేస్తుందని వారి భయం' అని అఖిలేశ్ వ్యాఖ్యానించారు. ' బీజేపీయేతర పార్టీలన్నీ ఏకమై సభలో బిల్లును ఓడిస్తే అది రాజ్యసభలో మెజారిటీ లేని బీజేపీకి సెమీఫైనల్‌లా నిలుస్తుంది. ఆర్డినెన్స్ ఓటమి వచ్చే సార్వత్రిక ఎన్నికలకు బలమైన సందేశాన్ని పంపుతుంది' అని కేజ్రీవాల్ అన్నారు. సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు, శివసేన(యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, ఎన్సీపీ అధినేత శరద్ పవార్, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీలను నేరుగా కలిసి కేజ్రీవాల్ వారి మద్దతు కోరారు. బిహార్ ముఖ్యమంత్రి, జేడీ(యూ) చీఫ్ నితీశ్ కుమార్, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సైతం కేజ్రీవాల్‌కు తమ మద్దతు ప్రకటించారు. ఢిల్లీలో గ్రూప్–ఏ అధికారుల నియామకాలు, బదిలీలుసహా రాష్ట్రంలో పాలనాసేవలపై సర్వాధికారం ఆ రాష్ట్ర సర్కార్‌కే ఉంటుందని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం మే 11న తీర్పు చెప్పడం తెల్సిందే. పోలీసు, శాంతిభద్రతలు, భూములు మినహా మిగతా అధికారాలు రాష్ట్రానికే ఉంటాయని తీర్పు చెప్పింది. అయితే తీర్పు వెలువడిన వారం రోజులకే దానికి పూర్తి భిన్నంగా ఆ అధికారం లెఫ్టినెంట్ గవర్నర్‌కు కట్టబెడుతూ మోదీ సర్కార్ మే 19వ తేదీన ఒక ఆర్డినెన్స్ తేవడం విదితమే.

లక్నో కోర్టు ఆవరణలో గ్యాంగ్‌స్టర్ హత్య

సంజీవ్ మహేశ్వరి జీవాను కాల్చిన దుండగులు



లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని లక్నో సివిల్ కోర్టు ఆవరణలో పట్టపగలే దారుణం జరిగింది. గ్యాంగ్‌స్టర్ సంజీవ్ మహేశ్వరి జీవా దారుణ హత్యకు గురయ్యాడు. లాయర్ దుస్తుల్లో వచ్చిన షూటర్లు కాల్పులు జరిపినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఘటనలో ఒక పోలీసు, ఓ మైనర్ బాలిక గాయపడ్డారని, నిందితుడిని అక్కడికక్కడే పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఓ క్రిమినల్ కేసులో జీవాను కోర్టులో హాజరు పరిచేందుకు తీసుకొచ్చిన సమయంలో ఈ ఘటన జరిగిందని లక్నో పోలీస్ కమిషనర్ ఎస్‌బీ శిరాడ్కర్ తెలిపారు. కాల్పులు అనంతరం కోర్టు ఆవరణలో పోలీసులను భారీగా మోహరించారు. గాయపడిన కానిస్టేబుల్, బాలికను ఆస్పత్రికి తరలించారు. బాలిక పరిస్థితి ఆందోళనకరంగా, కానిస్టేబుల్ ఆరోగ్యం నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు. వివాదాస్పద నేత ముక్తార్ అన్సారీకి అనుచరుడైన జీవా (48) ముజఫర్‌నగర్ జిల్లా వాసి. బీజేపీ ఎమ్మెల్యే కృష్ణానంద్‌రాయ్, మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నేత బ్రహ్మ దత్తా ద్వివేది హత్య కేసులో నిందితుడు. మరో 24 కేసుల్లోనూ నిందితుడిగా ఉన్నాడు. 1997 ఫిబ్రవరిలో ఫరూఖాబాద్ జిల్లాలో ద్వివేది హత్యకు గురయ్యాడు. ద్వివేదితోపాటు అతని గన్‌మెన్ హత్య కేసులో ట్రయల్‌కోర్టు జీవాను దోషిగా నిర్ధారించింది. జీవిత ఖైదు విధించింది. కోర్టు ఆవరణలోనే కాల్పుల ఘటన చోటుచేసుకోవడంతో పోలీసులకు వ్యతిరేకంగా న్యాయవాదులు ఆందోళనకు దిగారు. శాంతిభద్రతల పరిరక్షణలో, భద్రతా ఏర్పాట్లో విఫలమయ్యాయని ఆరోపించారు.

వాన నుంచి తప్పించుకోబోతే ప్రాణాలు పోయాయి

ఒడిశాలో మరో విషాద రైలు ప్రమాద ఘటన

భువనేశ్వర్: జోరువానలో తడవకుండా ఉందామని ఆగి ఉన్న గూడ్సు రైలు కింద తలదాచుకున్న ఆరుగురు రైల్వే కార్మికులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఆగి ఉన్న రైలు బోగీ హఠాత్తుగా కదలడంతో దాని చక్రాల కింద నలిగి రైల్వే కార్మికులు మరణించిన విషాద ఘటన ఒడిశాలోని జాజ్‌పూర్‌రోడ్ రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం జరిగింది. సంబంధిత వివరాలను తూర్పుతీర రైల్వే అధికార ప్రతినిధి వెల్లడించారు. 'జాజ్‌పూర్ కియోన్‌గఢ్ రైల్వేస్టేషన్ వద్ద రైల్వే సైడింగ్ వద్ద కొందరు రైల్వే కార్మికులు పనిలో నిమగ్నమై ఉండగా ఒక్కసారిగా భారీ వర్షం ముంచెత్తింది. భారీ ఈదురుగాలులు దానికి తోడయ్యాయి. దాంతో తలదాచుకుందామని అప్పటికే అక్కడే నిలిపి ఉంచిన ఒక గూడ్సు రైలు బోగీ కిందకు చేరారు. ఆ బోగీకి ఇంజన్ అనుసంధానం లేదు. అయితే హఠాత్తుగా ఆ రైలు కదలడం మొదలైంది. దీంతో బయటకు వచ్చే వీలులేక ఆ చక్రాల కింద నలిగి ఆరుగురు రైల్వే కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని కటక్‌లోని ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.

మణిపూర్‌లో హింసకు మరో ముగ్గురు బలి

- అంబులెన్స్‌కు నిప్పుపెట్టిన అరాచక మూక
- తల్లి, కుమారుడు సహా ముగ్గురు దుర్మరణం

కోల్‌కతా: నివురుగప్పిన నిప్పులా మారిన మణిపూర్ మరో ముగ్గురు అమాయకుల ప్రాణాలు బలితీసుకుంది. రాష్ట్రంలోని పశ్చిమ ఇంఫాల్ జిల్లాలో చిన్నారిని తరలిస్తున్న ఒక అంబులెన్సుకు అల్లరిమూక నిప్పుపెట్టింది. దీంతో అంబులెన్సులో ఉన్న ఎనిమిదేళ్ల బాలుడు, అతని తల్లి, మరో బంధువు ప్రాణాలు కోల్పోయారు. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ ఘటన తాలూకు వివరాలు తాజాగా వెలుగుచూశాయి. సంబంధిత వివరాలను అధికారులు వెల్లడించారు. కాంగ్‌చుప్ ప్రాంతంలోని అస్సాం రైఫిల్స్ బలగాల శిబిరం వద్ద మెయిటీ వర్గానికి చెందిన ఒకావిడ తన కుమారుడితో కలిసి నివసిస్తోంది. ఆదివారం సాయంత్రం క్యాంప్‌పైకి కాల్పులు మొదలయ్యాయి. ఈ ఘటనలో బాలుడి తలకు బుల్లెట్ గాయమైంది. దీంతో బాలుడిని హుటాహుటిన అంబులెన్సులో తల్లి, ఆమె బంధువు తరలిస్తున్నారు. కొంతదూరం వీరికి రక్షణగా వచ్చిన అస్సాం రైఫిల్స్ బలగాలు తర్వాత ఆ బాధ్యతను స్థానిక పోలీసులకు అప్పజెప్పి వెనుతిరిగారు. కాంగ్‌పోక్‌పీ జిల్లా సరిహద్దుకు రాగానే ఐసోసెంబా ప్రాంతంలో అంబులెన్సును ఓ అల్లరిమూక అడ్డుకుని తగలబెట్టింది. దీంతో మంటల్లో చిక్కుకుని బాలుడు, అతని తల్లి, బంధువు ప్రాణాలు కోల్పోయారు. ఘటన జరిగిన ప్రాంతంలో కుకీ గిరిజనుల గ్రామాలు ఎక్కువ. మృతులు మెయిటీ సామాజిక వర్గానికి చెందినవారు. ఈ ప్రాంతంలో కొద్దిరోజులుగా ఇరువర్గాల మధ్య హింస, ఎదురుకాల్పుల ఘటనలు జరుగుతున్నాయి.

షా ఇంటివద్ద కుకీ వర్గీయుల నిరసన

ఢిల్లీలోని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా నివాసం వద్ద మణిపూర్ కుకీ వర్గీయులు నిరసనకు దిగారు. 'కుకీల ప్రాణాలు కాపాడండి' అంటూ నినాదాలు ఇచ్చారు. నలుగురు కుకీ ప్రతినిధులను షా ఇంట్లోకి సమావేశం కోసం అనుమతించామని మిగతా వారిని జంతర్‌మంతర్‌కు తరలించామని ఢిల్లీ పోలీసులు చెప్పారు. కుకీ, మెయిటీ వర్గాల మధ్య మొదలైన జాతి వైరం హింసాత్మకంగా మారి నెలరోజుల వ్యవధిలో 98 మంది ప్రాణాలు బలిగొంది.

మున్సిపల్ నియామకాల్లో అవకతవకలు

బెంగాల్‌లో 20 చోట్ల సీబీఐ సోదాలు

న్యూఢిల్లీ/కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో మున్సిపల్ కార్పొరేషన్లలో నియామకాల్లో భారీ స్థాయిలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) రంగంలోకి దిగింది. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా 20 చోట్ల సోదాలు నిర్వహించినట్లు సీబీఐ అధికారులు తెలిపారు. డమ్ డమ్, హలీసహర్, బడానగర్ మున్సిపల్ కార్పొరేషన్లుసహా మొత్తం 14 కార్పొరేషన్ల కార్యాలయాల్లో సోదాలు జరిగాయి. ఈ అవకతవకలకు పాల్పడ్డట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితులు అయాన్ సిల్, అతని ఆఫీస్, మరో ముగ్గురికి చెందిన ప్రాంతాల్లోనూ తనిఖీలు చేశారు. సాల్ట్ లేక్ ప్రాంతంలోని రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ కార్యాలయంలోనూ సోదాలు కొనసాగాయి. ముడుపులు తీసుకుని కొలువులు కట్టబెట్టారనే ఆరోపణలు వెల్లువెత్తడంతో సీబీఐ రంగప్రవేశం చేసింది. అయితే ఇదంతా కేంద్రంలోని బీజేపీ సర్కార్ కుట్రలో భాగమని పశ్చిమబెంగాల్ రాష్ట్ర మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఫిర్హాద్ హకీమ్ వ్యాఖ్యానించారు.

తెలంగాణ గవర్నర్‌ను కలిసిన వీఐటీ చాన్స్‌లర్

వేలూరు: తెలంగాణ, పుదుచ్చేరి రాష్ట్రాల గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్‌ను తమిళనాడులోని వేలూరు వీఐటీ యూనివర్సిటీ చాన్స్‌లర్ విశ్వనాథన్ మర్యాద పూర్వకంగా హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. వేలూరు వీఐటీ యూనివర్సిటీ జాతీయ స్థాయిలో ప్రత్యేక స్థానం సాధించిన నేపథ్యంలో చాన్స్‌లర్ విశ్వనాథన్‌ను తమిళిసై అభినందించారు. ఈ మేరకు వీఐటీ అధికారులు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.


తమిళసైకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న విశ్వనాథన్

న్యూస్‌రీల్

నేడు 17 ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం

తిరువొత్తియూరు: చెన్నైలోని 17 ప్రాంతాల్లో గురువారం ఉదయం 6 గంటల నుంచి శుక్రవారం ఉదయం 6 గంటల వరకు తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు చెన్నై డ్రింకింగ్ వాటర్ బోర్డు బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. నెమ్మెలిలో ఉన్న 110 మిలియన లీటర్ ఫర్ డే సీ వాటర్ డీశాలినేషన్ ప్లాంట్‌లో నిర్వహణ పనుల కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అందులో పేర్కొంది. వేళచ్చేరి, తిరువాన్మియూరు, పల్లికరనై, మడిపాక్కం, పులిదివాక్కం, పెరుంగుడి, పాలవాక్కం, కొట్టివాక్కం, వెట్టువెట్టు వాంగని, నీలాంగరై, ఈచ్చంబాక్కం, అక్కరై, షోలింగనల్లూరు, షోలింగ కన్నగి నగర్, ఎలిల్ నగర్, పెరుంబాక్కం ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజలు ముందుజాగ్రత్త చర్యగా సరిపడా నీటిని నిల్వ చేసుకోవాలని సూచించారు.

రామనాథస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1.68 కోట్లు

అన్నానగర్: రామేశ్వరం రామనాథస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.కోటి 68 లక్షలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. మంగళవారం హుండీ కానుకలు లెక్కించామన్నారు. ఇందులో నగదు 1.68 కోట్లు, బంగారం 130 గ్రాములు, వెండి 6 కిలోలు, 155 విదేశీ డాలర్లు ఉన్నట్లు ఆలయ జాయింట్ కమిషనర్ మారియప్పన్ తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో రామనాథపురం అసిస్టెంట్ కమిషనర్ జ్ఞానశేఖరన్, మేనేజర్ మారియప్పన్, ఇన్‌స్పెక్టర్ ప్రభాకరన్ పాల్గొన్నారు.

స్కూటర్‌ను ఢీకొన్న కారు

– నవ వధువు సహా తల్లి, తండ్రి మృతి


మృతి చెందిన పూంగొడి, తండ్రి, తల్లి (ఫైల్)

తిరువొత్తియూరు: స్కూటర్‌పై వెళుతున్న సమయంలో కారు ఢీకొని నవ వధువు, ఆమె తల్లి, తండ్రి మృతి చెందారు. వివరాలు.. సేలం కొండలం పట్టి సమీపంలోని లల్పారపట్టి సెంభాగ్య పట్టి ప్రాంతానికి చెందిన వెంకటాచలం (53) నేత కార్మికుడు. ఇతని భార్య మారియమ్మాళ్ (49). ఈ దంపతుల కుమార్తె పూంగొడి (23). ఈమెకు మూడు నెలల క్రితం వివాహమైంది. ఈ క్రమంలో మంగళవారం వెంకటాచలం, మారియమ్మాళ్, కుమార్తె పూంగొడి అవ్వ ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్నారు. వారు ఉత్తమ చోళపురం వద్ద వస్తున్న సమయంలో కోవై నుంచి సేలానికి వెళుతున్న కారు వారి స్కూటర్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో పూంగొడి, వెంకటాచలం, మారియమ్మాళ్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే ట్రాక్‌పై కొబ్బరిచెట్టు

– ఇంజిన్‌లో చిక్కుకున్న వైనం

సాక్షి, చెన్నై: చెన్నై నుంచి తిరువళ్లూరు వైపుగా వెళ్లే రైల్వే మార్గంలో ట్రాక్‌పై సగం కత్తిరించిన కొబ్బరి చెట్టును గుర్తుతెలియని వ్యక్తులు తీసుకొచ్చి పడేశారు. ఇది ఓ రైలు ఇంజిన్‌లో చిక్కుకుంది. సకాలంలో లోకోపైలెట్ స్పందించి దానిని తొలగించారు. వివరాలు.. ఒడిశా ప్రమాదం తదుపరి రైల్వే యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. రైళ్ల బోగీలు, ట్రాక్‌ల పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ పరిస్థితుల్లో తిరువళ్లూరు రైల్వే మార్గంలోని తిరునింద్రవూరు వద్ద ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి సమయంలో సగం నరికిన కొబ్బరి చెట్టును తీసుకొచ్చి పడేశారు. ఇది అటువైపుగా వచ్చిన రైలు ఇంజిన్ కింది భాగంలో చిక్కుకుంది. డ్రైవర్ గుర్తించి రైలును ఆపేయడంతో ప్రమాదం తప్పింది. దాన్ని తొలగించిన అనంతరం అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తొలి మహిళా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా సుజిత


ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుజిత

కొరుక్కుపేట: ఆవడి కమిషనరేట్‌లో తొలి మహిళా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా 34 ఏళ్ల ఎస్. సుజిత నియమితులయ్యారు. ఆవడి పోలీసు కమిషనర్ ఎ. అరుణ్ ఆమెకు కొత్త బాధ్యతలను అప్పగించి శుభాకాంక్షలు తెలిపారు. 2022లో ఆవడి కొత్త పోలీసు కమిషనరేట్‌గా ఏర్పడింది. సందీప్ రాయ్ రాథోడ్ మొదటి కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆయన స్థానంలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన అరుణ్ కొత్త పోలీసు కమిషనర్‌గా నియమితులయ్యారు. ఈ క్రమంలో ఆవడి పోలీసు కమిషనరేట్‌లో తొలి మహిళా ట్రాఫిక్ కమిషనర్‌గా సుజితను నియమించారు. గతంలో సుజిత స్టేట్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరోలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా సుజిత మాట్లాడుతూ 2011లో సబ్‌ఇన్‌స్పెక్టర్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించానని పేర్కొన్నారు. ఆవడి పోలీసు కమిషనరేట్ తొలి మహిళా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించడంపై సంతోషం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరుస్తానని స్పష్టం చేశారు.

చిన్నమ్మ ఝలక్

అన్నాడీఎంకే రాజకీయాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. ఇటీవల చిన్నమ్మ శశికళను కలిసేందుకు అవకాశం రావడంతో ఆనందంలో ఉన్న పన్నీరు సెల్వంకు, ఆయన కొత్త మిత్రుడు టీటీవీ దినకరన్‌కు కొత్త షాక్ తగిలింది. మాజీ మంత్రి వైద్యలింగం ఇంటి వివాహ వేడుకకు చిన్నమ్మ దూరం కావడం ఆ పార్టీలో కొత్త చర్చకు దారి తీసింది. పన్నీరు, దినకరన్ తాజా ప్రయత్నాలకు చెక్ పెట్టే విధంగా అన్నాడీఎంకే వర్గపోరులో తటస్థంగా వ్యవహరించాలని చిన్నమ్మ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. అదే సమయంలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళణి స్వామితో రాయబారానికి ఆమె ప్రయత్నిస్తుండడం గమనార్హం.


వేదికపై పన్నీరు, దినకరన్ తదితరులు

- పన్నీరు, టీటీవీకి షాక్
- వివాహ వేడుకకు దూరంగా శశికళ
- పార్టీ వర్గపోరులో తటస్థంగా ఉండాలని నిర్ణయం
- పళణి స్వామితో రాయబారానికి ప్రయత్నాలు?


శశికళ, పన్నీరు, దినకరన్ (ఫైల్)

సాక్షి, చెన్నై: ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకేలో నెలకొన్న వర్గ విభేదాల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. న్యాయ పోరాటం ద్వారా, మెజారిటీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్య నేతల మద్దతుతో అన్నాడీఎంకేను మాజీ సీఎం పళని స్వామి తన గుప్పెట్లోకి తెచ్చుకున్నారు. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శిగా రాజకీయ వ్యూహాలకు పదును పెట్టారు. ఇక పళణి స్వామి తనను దూరం పెట్టడంతో వేరు కుంపటి పెట్టిన మరో మాజీ సీఎం పన్నీరు సెల్వం ఆ పార్టీని ఎలాగైనా కైవసం చేసుకోవడం లక్ష్యంగా వ్యూహాలకు పదును పెట్టి ఉన్నారు. ఇందులో భాగంగా గతంలో అన్నాడీఎంకే నుంచి బయటకు వచ్చి అమ్మ మక్కల్ మున్నేట్ర కళగంతో రాజకీయ పయనం సాగిస్తున్న టీటీవీ దినకరన్‌ను చేతులు కలిపారు. ఒకప్పుడు బద్ధ శత్రువులుగా ఉన్న ఈ ఇద్దరు ప్రస్తుతం మంచి మిత్రులయ్యారు. అలాగే టీటీవీ దినకరన్ ద్వారా దివంగత సీఎం జయలలిత నెచ్చెలి, చిన్నమ్మ శశికళను ప్రసన్నం చేసుకుని అన్నాడీఎంకే కైవశం లక్ష్యంగా మరింతగా వ్యూహాలకు పదును పెట్టాలనే ఆశతో ఉన్న పన్నీరుకు ప్రస్తుతం షాక్ తప్పలేదు.

పెద్ద దిక్కుగా ఉండాలని..

అన్నాడీఎంకేలో తాజా పరిణామాల వ్యవహారంలో ఎవరో ఒకరి వైపుగా నిలబడకుండా తటస్థంగా వ్యవహరించి పార్టీకి పెద్ద దిక్కుగా నిలబడాలనే వ్యూహంతో చిన్నమ్మ ఉన్నట్టు సమాచారాలు వెలువడ్డాయి. అందుకే ఆమె పన్నీరు, టీటీవీ దినకరన్ హాజరైన ఈ వివాహ వేడుకకు దూరంగా ఉన్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. అయితే ఈ వివాహ వేడుకకు చిన్నమ్మ వస్తారనే ఎదురు చూపుల్లో దక్షిణ తమిళనాడులోని కీలక సామాజిక వర్గం వేచి ఉన్నా, చివరకు ప్రయోజనం లేకుండా పోయింది. అదే సమయంలో చిన్నమ్మ శశికళ అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళణిస్వామితో భేటీకి ప్రయత్నాల్లో ఉన్నట్టు తెలుస్తోంది. దక్షిణ తమిళనాడులోని బలమైన సామాజికవర్గం తన వెంట, పన్నీరు, దినకరన్ వెనుక ఉన్నా, ప్రస్తుతం పార్టీతో పాటుగా ముఖ్య నేతల బలం, మద్దతు పళణి స్వామి చేతిలో ఉండడాన్ని చిన్నమ్మ పరిగణనలోకి తీసుకుని ఉన్నారు. అందుకే పళణిస్వామితో సంప్రదింపులతో రాష్ట్రవ్యాప్తంగా అన్నాడీఎంకే ఐక్యతను చాటే విధంగా కొత్త ప్రయత్నాలకు చిన్నమ్మ సిద్ధమై తాజాగా తటస్థంగా వ్యవహరించే పనిలో పడ్డట్టు ఆమె సన్నిహితులు పేర్కొంటున్నారు. అలాగే, పళణికి రాయబారానికి దక్షిణ తమిళనాడుకు చెందిన మాజీ మంత్రులు నలుగుర్ని చిన్నమ్మ రంగంలోకి దించినట్లు చెబుతున్నారు. ఈ నలుగురు ప్రస్తుతం పళణి స్వామి వెన్నంటే ఉన్నా, లోక్‌సభ ఎన్నికల నాటికి అందరూ ఐక్యతతో అన్నాడీఎంకేకు తిరుగులేని విజయం అందించాలన్న కాంక్షతో ఈ రాయబార ప్రయత్నాలకు సిద్ధమైనట్టు చర్చ జరుగుతోంది.

వేదికగా మారిన వైద్యలింగం ఇంటి కల్యాణం

తన మద్దతుదారుడైన వైద్యలింగం ఇంటి వివాహ వేడుకను రాజకీయ వ్యూహాలకు పదును పెట్టే వేదికగా మార్చుకునేందుకు పన్నీరు సెల్వం సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా టీటీవీ దినకరన్ ద్వారా చిన్నమ్మ శశికళ ప్రసన్నం పొంది రాజకీయ ప్రయాణాన్ని విస్తృతం చేయవచ్చు అనే ధీమాతో ఉన్న పన్నీరుకు నిరాశే మిగిలింది. తంజావూరు వేదికగా బుధవారం జరిగిన వివాహ వేడుకకు దినకరన్ హాజరయ్యారు. అయితే చిన్నమ్మ శశికళ గైర్హాజరయ్యారు. అదే సమయంలో ఈ ఇద్దరు నేతలు వేదికపై ప్రసంగించే సమయంలో పరిస్థితుల కారణంగా గతంలో విడిపోయామని, ఇప్పుడు మళ్లీ ఏకమయ్యామంటూ తన ఐక్యతను చాటుకునే ప్రయత్నం చేశారు. అలాగే మళ్లీ రాష్ట్రంలో దివంగత సీఎం జయలలిత పాలనే లక్ష్యంగా ఐక్యతతో, సమష్టిగా అందరం ముందుకెళ్లాలని పిలుపు నివ్వడం గమనార్హం.

తిరుత్తణిలో స్థానిక భక్తులకు ప్రత్యేక దర్శనం


చైర్మన్ శ్రీధరన్ అధ్యక్షతన సమావేశమైన పాలక మండలి సభ్యులు

తిరుత్తణి: తిరుత్తణి ఆలయంలో ప్రతి మంగళవారం స్థానిక భక్తులు ప్రధాన ద్వారంలో వెళ్లి స్వామిని దర్శించుకునే విధంగా ట్రస్టు బోర్డు సమావేశంలో తీర్మానించారు. వివరాలు.. తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్‌గా శ్రీధరన్ ఇతర ట్రస్టు బోర్డు సభ్యులు పదవీ బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారిగా బుధవారం ట్రస్టుబోర్డు సమావేశం నిర్వహించారు. చైర్మన్ శ్రీధరన్ అధ్యక్షత వహించారు. డిప్యూటీ కమిషనర్ విజయ స్వాగతం పలికారు. ఇందులో ట్రస్టుబోర్డు సభ్యులు నాగన్, ఉషారాణి, రవి, సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గతంలోగే తిరుత్తణి ఆలయంలో స్థానిక భక్తులు ప్రతి మంగళవారం ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రధాన గేటు మార్గంలో ఉచితంగా వెళ్లి స్వామిని దర్శించుకునేందుకు అనుమతించాలని నిర్ణయించారు. ఏడాది కిందట డిప్యూటీ కమిషనర్ విజయ స్థానికులు ఉచిత దర్శనానికి బ్రేకులు వేశారని, దీంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా డిప్యూటీ కమిషనర్ ఉచిత దర్శనానికి అనుమతి ఇవ్వలేదు. ఈ క్రమంలో ట్రస్టుబోర్డు సమావేశంలో స్థానిక భక్తులకు మంగళవారం ఉదయం 6.30 నుంచి 7.30 వరకు అలాగే సాయంత్రం 3.30 నుంచి 4.30 వరకు ప్రధాన మార్గంలో వెళ్లి స్వామిని దర్శించుకునేందుకు అనుమతిస్తూ తీర్మానం ఆమోదించారు. దీనిపై తిరుత్తణి వాసులు హర్షం వ్యక్తం చేశారు.

హీరో విజయ్ మరో ముందడుగు

- 2026 ఎన్నికలే లక్ష్యంగా వ్యూహాలు?
- 17న విద్యార్థులతో సమావేశం కావాలని నిర్ణయం
- నియోజకవర్గానికి ముగ్గురి చొప్పున ఎంపిక


హీరో విజయ్

సాక్షి, చెన్నై: రాజకీయ అరంగ్రేటంలో భాగంగా దళపతి విజయ్ మరో అడుగు ముందుకు వేశారు. 2026 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా వ్యూహాలకు ఆయన పదును పెడుతున్నట్లు ప్రస్తుతం రాజకీయవర్గాల్లో చర్చ జోరందుకుంది. ఇటీవల కాలంగా సేవలు విస్తృతం అవుతున్న నేపథ్యంలో ఈనెల 17వ తేదీన పది, ప్లస్–2లో ఉత్తమ మార్కులను సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో భేటీకి విజయ్ సిద్ధమయ్యారు.

నేపథ్యం ఇదీ..

సినీ నటుడు విజయ్ రాజకీయ ప్రవేశ చర్చ తరచూ తెర మీదకు వస్తున్న విషయం తెలిసిందే. అలాగే ఇటీవల కాలంలో తన చిత్రాల్లో రాజకీయంగా చర్చకు తావిచ్చే డైలాగులతో ఆయన ముందుకు సాగుతున్నారు. ఇది వివాదాలకు సైతం దారి తీస్తున్నాయి. అలాగే విజయ్ ఇటీవల కాలంగా వేస్తున్న అడుగులు 2026 అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని పయనం సాగిస్తున్నట్టుగా పలువురు భావిస్తున్నారు. అభిమానులతో జిల్లాల వారీగా సమీక్షలు, సమావేశాలతో విజయ్ అప్పుడప్పుడూ బీజీగానే ఉన్నారు. అలాగే, ఒకే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా అభిమానుల ద్వారా సేవా కార్యక్రమాలను విస్తృతం చేయిస్తున్నారు. అలాగే, దివంగతులైన నేతల జయంతి కార్యక్రమాలను, ముఖ్య కార్యక్రమాలను అభిమానుల ద్వారా చేయిస్తున్నారు. అలాగే విజయ్ ఇయక్కంలో జాలర్లు, మహిళలు, విద్యార్థి విభాగాలను సైతం ఏర్పాటు చేసి ఉండడంతో రాజకీయ అరంగ్రేటానికి సమయం సమీపించిందనే చర్చ జోరందుకుంది. ఈ సమయంలో విజయ్ విద్యార్థులతో సంప్రదింపులకు సిద్ధమయ్యారు. ఇటీవల వెలువడ్డ పది, ప్లస్–2 ఫలితాలలో ఉత్తమ ర్యాంకులు సాధించిన వారిని పిలిపించి, సత్కరించాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని 234 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఒక్కో నియోజక వర్గానికి ముగ్గురిని ఎంపిక చేశారు. ఈ విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులతోనూ సమావేశం కావాలని విజయ్ నిర్ణయించడం గమనార్హం. ఈనెల 17న ఈసీఆర్‌లోని ఓ కన్వెన్షన్ సెంటర్ వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

స్టెరిలైట్‌ను పరిశీలించిన అధికారుల బృందం

- పర్యవేక్షించిన సబ్ కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ
- వ్యర్థాలు తొలగించాలని కోర్టు ఆదేశాలు



స్టెరిలైట్ పరిశ్రమ

సాక్షి, చెన్నై: తూత్తుకుడిలోని స్టెరిలైట్ పరిశ్రమలో నిల్వ ఉన్న జిప్సమ్ తదితర వ్యర్థాలను రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలో తొలగించాలని కోర్టు ఆదేశాలు ఇచ్చింది. దీంతో సబ్ కలెక్టర్ గౌరవ్ కుమార్ నేతృత్వంలోని తొమ్మిది మందితో కూడిన స్థానిక కమిటీ చర్యలు ప్రారంభించింది. మూతబడి ఉన్న ఆ పరిశ్రమలోకి బుధవారం ఈ కమిటీలోని ప్రతినిధులు వెళ్లి పరిశీలించారు. వివరాలు.. తూత్తుకుడిలోని స్టెరిలైట్ పరిశ్రమకు వ్యతిరేకంగా దశాబ్దం కాలానికి పైగా ఉద్యమం జరిగిన విషయం తెలిసిందే. 2018లో ఈ ఉద్యమ జ్వాల మహోద్యమంగా మారింది. ఈ పరిస్థితులు అల్లర్లకు దారి తీశాయి. ఈ ఘటనలో 13 మంది మరణించారు. దీంతో స్టెరిలైట్ పరిశ్రమకు అన్నాడీఎంకే పాలకులు శాశ్వతంగా తాళం వేశారు. అప్పటి నుంచి స్టెరిలైట్‌కు పడ్డ తాళాన్ని ఎలాగైనా తొలగించుకునేందుకు వేదాంతా గ్రూప్ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. న్యాయ పోరాటం సాగిస్తోంది. పరిశ్రమలో పేరుకుపోయిన జిప్సమ్ తదితర వ్యర్థాల తొలగింపు పేరిట స్టెరిలైట్‌లోకి ప్రవేశించే ప్రయత్నాలు విస్తృతం చేసింది. దీంతో ఆ వ్యర్థాలను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఇందు కోసం కమిటీని నియమించింది. ఇందుకు అయ్యే ఖర్చు అంతా వేదాంతా గ్రూప్ భరించే విధంగా ఆదేశాలు జారీ అయ్యాయి. అదే సమయంలో వేదాంతా గ్రూప్ న్యాయ పోరాటంలో భాగంగా ఈ వ్యర్థాల వ్యవహారం కోర్టులో చర్చకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వమే ఈ వ్యర్థాల తొలగింపునకు చర్యలు తీసుకునే విధంగా కోర్టు సైతం ఆదేశాలు ఇచ్చింది. దీంతో ప్రభుత్వ కమిటీ బుధవారం రంగంలోకి దిగింది. తూత్తుకుడి సబ్ కలెక్టర్ గౌరవ్‌కుమార్ నేతృత్వంలోని పోలీసులు, రెవెన్యూ, అగ్నిమాపక విభాగాలతో పాటు స్టెరిలైట్ ప్రతినిధులు ఇద్దరితో ఈ కమిటీ రంగంలోకి దిగింది. కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య స్టెరిలైట్‌లో సమగ్ర పరిశీలనకు ఉదయాన్నే ఈ కమిటీలోని ప్రతినిధులు వెళ్లారు. ఇక్కడ ఏ మేరకు జిప్సమ్ నిల్వ ఉన్నయో అధ్యయనం చేస్తున్నారు. వీటిని ఎలా కట్టుదిట్టమైన భద్రత నడుమ బయటకు తరలించాలి అనే అంశంపై సుదీర్ఘ పరిశీలన సాగుతోంది.

హజ్ యాత్రకు శ్రీకారం

- చెన్నై నుంచి పయనమైన తొలి బృందం


హజ్ యాత్రికులతో మంత్రి సెంజి మస్తాన్

సాక్షి, చెన్నై: మూడేళ్ల అనంతరం చెన్నై నుంచి హజ్ యాత్ర బుధవారం ప్రారంభమైంది. చెన్నై నుంచి రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోని హజ్ హౌస్ నేతృత్వంలో తొలి రోజు రెండు విమానాలు టేకాఫ్ తీసుకున్నాయి. తమ వారికి వీడ్కోలు పలికేందుకు ముస్లింలు పెద్దఎత్తున తరలి రావడంతో మీనంబాక్కం విదేశీ టెర్మినల్ కిట కిటలాడింది. వివరాలు.. ముస్లింల పవిత్ర క్షేత్రం మక్కా. ఇస్లాంలోని ఐదు సూత్రాల్లో చిట్ట చివరిదిగా హజ్ తీర్థ యాత్రను పరిగణిస్తారు. ప్రతి ముస్లిం తన జీవిత కాలంలో కనీసం ఒక్కసారైనా ఈ యాత్ర చేయాల్సి ఉంటుంది. ఆ మేరకు ఏటా బక్రీదు నెలలో హజ్ యాత్ర ఆరంభం అవుతుంది. ప్రపంచ దేశాల్లోని ముస్లింలు ఈ యాత్రతో మక్కానగరానికి చేరుకుంటారు. బక్రీద్ పండుగ పర్వదినాన మక్కాలో ప్రత్యేక ప్రార్థనలకు చేస్తారు. జీవిత కాలంలో తాము చేసిన పాప కర్మల నుంచి విముక్తి కల్పించాలని అల్లాను వేడుకుంటారు.

విరామం తరువాత..

రాష్ట్రంలోని ముస్లింలను ఏటా హజ్ కమిటీ ద్వారా మక్కాకు పంపించడం జరుగుతోంది. ఏటా ఈ యాత్రకు వెళ్లే ముస్లిం సోదరులకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీ, సౌకర్యాలను కల్పిస్తోంది. హజ్ కమిటీ ద్వారా అర్హులైన వాళ్లను ఎంపిక చేయడం జరుగుతోంది. కరోనా మహమ్మారి రూపంలో రెండేళ్ల హజ్ యాత్రకు సౌదీ ప్రభుత్వం అనుమతించ లేదు. గత ఏడాది అనుమతి కల్పించినా చెన్నై నుంచి విమానం టేకాఫ్ కాలేదు. కట్టుదిట్టమైన ఆంక్షలు అమల్లో ఉన్న నేపథ్యంలో గత ఏడాది కేరళ రాష్ట్రం తిరువనంతపురం నుంచి తమిళనాడుకు చెందిన హజ్ యాత్రికులు బయలుదేరి వెళ్లారు. ఈ ఏడాది చెన్నై నుంచే విమానాలు బయలు దేరడంతో పెద్ద సంఖ్యలో హజ్ యాత్ర కోసం ముస్లింలు దరఖాస్తు చేసుకున్నారు. వీరందరిలో కొందరిని లాటరీ పద్ధతిలో ఎంపిక చేశారు. రాష్ట్రానికి మూడు వేల మేరకు హాజీలను ఈ యాత్రకు అనుమతించే విధంగా చర్యలు తీసుకున్నారు. దీంతో చెన్నైలోని హజ్ హౌస్‌లో హజ్ యాత్రకు వెళ్లే తొలి బృందానికి గత రెండు రోజులు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. సౌదీ పద్ధతులు, అక్కడ వ్యవహరించాల్సిన విధానాలను, కల్పించ బడ్డ సదుపాయాలు, సహకరించే అధికారుల గురించి విశదీకరించారు.

తొలి బృందానికి పచ్చజెండా

404 మంది హాజీలతో రెండు విమానాలలో తొలి బృందాన్ని సౌదీకి పంపించేందుకు హజ్ హౌస్ వర్గాలు ఏర్పాట్లు చేశాయి. పాస్ పోర్టులు, వీసా, తదితర వాటిని హాజీలకు అందజేశారు. ఉదయం ప్రార్థనల అనంతరం హజ్ హౌస్ నుంచి హాజీలను ప్రత్యేక బస్సుల్లో విమానాశ్రయానికి తరలించారు. కొందరు అయితే, తమ సొంత వాహనాల్లో విమానాశ్రయానికి చేరుకున్నారు. హజ్ యాత్రకు వెళ్లే తమ వాళ్లకు వీడ్కోలు పలికేందుకు బంధువులు, ఆప్తులు పెద్దఎత్తున మీనంబాక్కానికి తరలి రావడంతో ఆ పరిసరాలు కిట కిటలాడాయి. దీంతో విమానాశ్రయం విదేశీ టెర్మినల్ పరిసరాల్లో గట్టి భద్రత కల్పించారు. రాష్ట్ర మంత్రి సెంజి మస్తాన్, వక్ఫ్‌బోర్డు ప్రతనిధులు, రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ విభాగం అధికారులు విమానాశ్రయానికి చేరుకుని హాజీలకు వీడ్కోలు పలికారు. ఇక గురువారం నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో చెన్నై నుంచి జట్లు.. జట్లుగా హజ్ యాత్రకు ఎంపిక చేసిన హాజీలు విమానాల్లో వెళ్లనున్నారు.

'కరుణ' శత జయంతి ఉత్సవాలకు శ్రీకారం


మొక్క నాటి నీరు పోస్తున్న సీఎం స్టాలిన్

- ఇక, ఏడాది పొడవునా వేడుకలు
- చెన్నైలో విజయవంతంగా భారీ బహిరంగ సభ

సాక్షి, చెన్నై : మాజీ ముఖ్యమంత్రి ఎం. కరుణానిధి శత జయంతి ఉత్సవాలకు బుధవారం శ్రీకారం చుట్టారు. ఉత్తర చెన్నై వేదికా జరిగిన భారీ బహిరంగ సభతో వేడుకలు మొదలయ్యాయి. వివరాలు.. ద్రవిడ సిద్ధాంతకర్త పెరియార్‌కు శిష్యుడిగా, ద్రవిడ పార్టీల ఆవిర్భావ కర్త అన్నాదురైకు తమ్ముడిగా తమిళ రాజకీయల్లోనే కాదు దేశ రాజకీయాల్లోనూ చక్రం తిప్పిన నాయకుడు ఎం. కరుణానిధి. ఈనెల 3వ తేదీన కరుణానిధి శత జయంతి కార్యక్రమం జరిగింది. దీంతో ఆ రోజు నుంచి ఏడాది పొడివున వేడుకలకు డీఎంకే ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, ఒడిశా రైలు ప్రమాదం నేపథ్యంలో వేడుకలను రద్దు చేశారు. ఆ రోజున నిరాడంబరంగా నివాళులర్పించే కార్యక్రమాలు మాత్రమే జరిగాయి. ఈ పరిస్థితులలో బుధవారం రాత్రి ఉత్తర చెన్నైలో జరిగిన భారీ బహిరంగ సభతో కరుణ శతజయంతి ఉత్సవాలకు డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ శ్రీకారం చుట్టారు. ఈ వేడుకకు ద్రవిడ కళగం నేత వీరమణి, ఎండీఎంకే నేత వైగో, సీపీఎం నేత బాలకృష్ణన్, సీపీఐ నేత ముత్తరసన్, ముస్లీం లీగ్ నేత ఖాదర్ మోహిద్దీన్, వీసీకే నేత తిరుమావళవన్, మనిద నేయమక్కల్ కట్చి నేత జవహరుల్లా, కొంగునాడు మక్కల్ దేశీయ కట్చి నేత ఈశ్వరన్, తమిళగ వాల్వురిమై కట్చి నేత వేల్ మురుగన్, కాంగ్రెస్ పార్టీ నేత కేఎస్ అళగిరి హాజరయ్యారు. ఇందులో కరుణానిధి సేవలను గుర్తు చేశారు. జాతీయ స్థాయిలో బీజేపీ యేతర పార్టీలన్నీ ఏకం కావాలని, బలమైన కూటమిగా లోక్‌సభ ఎన్నికలను ఎదుర్కోవాలని ఈ వేదికపై నేతలు పిలుపు నిచ్చారు.

రహదారుల వద్ద 5 లక్షల మొక్కలు..

ముందుగా గిండిలోని హైవే సర్వే స్టేషన్ ఆవరణలో కరుణ శతజయంతి ఉత్సవాల స్మారకంగా సీఎం స్టాలిన్ మొక్కలు నాటారు. రాష్ట్రవ్యాప్తంగా రహదారుల్లో 5 లక్షల మొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో మంత్రులు దురై మురుగన్, కేఎన్ నెహ్రూ, పొన్ముడి, ఏవీ వేలు, ఎం. సుబ్రమణియన్, ఎంపీలు టీఆర్‌బాలు, తమిళచ్చి తంగపాండియన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నలుగురు చిన్నారులకు పునర్జన్మ


చిన్నారిని పలకరిస్తున్న సత్యనారాయణన్

కొరుక్కుపేట: గుండెలో ఏర్పడిన రంధ్రాలను ఎటువంటి శస్త్ర చికిత్స లేకుండా ఒకే రోజులో నలుగురు చిన్నారులకు ఉచితంగా చికిత్సలను అందించి ఎస్ఆర్ఎం మెడికల్ కాలేజ్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ కార్డియాలజీ విభాగం వైద్యులు పునర్జన్మ ప్రసాదించారు. ఈ మేరకు బుధవారం ఎస్ఆర్ఎం ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రొ వైస్ చాన్స్లర్ (అకడమిక్స్) డాక్టర్ సత్యనారాయణన్ మాట్లాడుతూ వైద్యులు డాక్టర్ వి. శ్రీరామ్ నేతృత్వంలోని కార్డియాలజీకి చెందిన వైద్యుల బృందం ఒకే రోజు ముగ్గురు చిన్నారులు ప్రియదర్శిని (4 ఏళ్లు) , కవిన్ (5 ఏళ్లు) వన్నమతి (13 ఏళ్లు)కు ఏఎస్డీ (ఏట్రియాల్ సెప్టల్ డిఫెక్ట్) క్లోజర్ పరికరం అనే బటన్లాంటి పరికాన్ని చొప్పించి శస్త్రచికిత్స లేకుండానే గుండెకు చికిత్స అందించామని తెలిపారు. పట్టుకతోనే వీరికి గుండెలో రంధ్రం ఉందేదన్నారు. అలాగే మరో 12 ఏళ్ల బాలుడు అనీస్ బృహద్ధమని, పల్మనరీ ఆర్టరీ సమస్యతో బాధపడుతుండగా, ఆ బాలుడికి పేటెంట్ డక్టస్ ఆర్టెరియోసస్ పద్ధతిలో విజయవంతంగా చికిత్స అందించామని తెలిపారు. వీరందరికీ ఉచితంగా చికిత్స అందించి తమ ఆసుపత్రి వైద్యులు పునర్జన్మ ప్రసాదించారని వెల్లడించారు. శస్త్రచికిత్సలేకుండానే గుండె రంధ్రాలను సరిచేయటం వంటి చికిత్స విధానాలు రాష్ట్రంలోని కొన్ని ఆసుపత్రుల్లో మాత్రమే ఉన్నాయని అందులో ఎస్ఆర్ఎం ఆసుపత్రి ఒకటని వివరించారు.

అన్ని రంగాల్లో దేశాభివృద్ధి


సమావేశంలో మాట్లాడుతున్న డాల్ఫిన్ శ్రీధర్

తిరువళ్లూరు: ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ బాధ్యతలు స్వీకరించిన తరువాత దేశం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాల్ఫిన్ శ్రీధర్ స్పష్టం చేశారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిదేళ్లు పూర్తయిన నేపథ్యంలో జిల్లా పార్టీ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు అశ్విన్కుమార్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉపాధ్యాక్షుడు డాల్ఫిన్ శ్రీధర్ హాజరయ్యారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు అరుణ్ సుబ్రమణ్యం, గాయత్రీదేవీ, సీనియర్ నేత భాస్కరన్, ప్రధాన కార్యదర్శులు అర్యశ్రీనివాసన్, కరుణాకరన్ పాల్గొన్నారు.

'వేలుమణి' మెడకు టెండర్ల ఉచ్చు

- కేసుల నమోదుకు డీవీఏసీ కసరత్తు

సాక్షి, చెన్నై: మాజీ మంత్రి ఎస్పీ వేలుమణి మెడకు టెండర్ల వ్యవహారం ఉచ్చుగా మారింది. ఈ అంశంపై పూర్తిస్థాయి విచారణకు బుధవారం మద్రాసు హైకోర్టు అనుమతి ఇచ్చింది. దీంతో కేసుల నమోదుతో విచారణ వేగవంతం చేయాలని డీవీఏసీ భావిస్తోంది. వివరాలు.. అన్నాడీఎంకే హయాంలో జరిగిన అవినీతి అక్రమాలపై ప్రస్తుత డీఎంకే పాలకులు కన్నెర్ర చేసిన విషయం తెలిసిందే. గతంలో తమకు లభించిన ఆధారాల మేరకు మాజీ మంత్రులు పలువురి భరతం పట్టే విధంగా దూసుకెళ్తున్నారు. పలువురు మాజీలను టార్గెట్ చేసి ఇప్పటికే డైరెక్టర్ ఆఫ్ విజిలెన్స్ అండ్ యాంటీ కరెప్షన్ (డీవీఏసీ) విభాగం దాడులు నిర్వహించి, ఆధారాలు సేకరించాయి. ఇందులో గతంలో మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ , గ్రామీణాభివృద్ధి, ప్రత్యేక కార్యక్రమాల అమలు శాఖమంత్రిగా పనిచేసిన ఎస్పీ వేలుమణిని ఉక్కిరిబిక్కిరి చేసే విధంగా కేసులతో చుట్టుముట్టి ఉన్నారు. వీటిని ఎదుర్కోవడంతో పాటు, ఆధార రహిత కేసుల నుంచి విముక్తి కల్పించాలని కోర్టులో ఆయన న్యాయ పోరాటం చేస్తున్నారు. ఈ పరిస్థితులల్లో టెండర్ల వ్యవహారం మాత్రం ఆయన్ని వీడడం లేదు.

కోర్టు అనుమతి..

గతంలో అరప్పోర్ ఇయక్కం ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా డీవీఏసీ వర్గాలు ఎస్పీ వేలుమణికి


మాజీ మంత్రి ఎస్పీ వేలుమణి

వ్యతిరేకంగా ఆధారాలు సేకరించాయి. అయితే, విచారణను ముందుకు తీసుకెళ్ల లేని పరిస్థితి. 2018–19లో చెన్నై కార్పొరేషన్ పరిధిలో రూ. 590 కోట్లతో 37 పనులకు జరిగిన టెండర్ల కేటాయింపు నిధులు దుర్వినియోగమైనట్లు అరప్పోర్ ఇయక్కం కోర్టును సైతం ఆశ్రయించింది. ఆ ఇయక్కం ప్రతినిధి జయరాం వెంకటేశ్ దాఖలు చేసిన ఈ పిటిషన్పై ప్రాథమిక విచారణ ముగిసినా, విచారణ ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఇందుకు కారణం, అప్పటి హైకోర్టు న్యాయమూర్తులు తదుపరి చర్యలకు స్టే పేరిట చెక్ పెట్టి ఉండడమే. ఎట్టకేలకు ఈ పిటిషన్ బుధవారం హైకోర్టు కొత్త సీజే సంజయ్ విజయ్ కుమార్ గంగా పుర్వాల బెంచ్ ముందు విచారణకు వచ్చింది.

ప్రాథమిక ఆధారాలు ఉన్నప్పుడు..

ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ షణ్ముగ సుందరం ప్రభుత్వం తరపున తన వాదనలను బెంచ్ముందు ఉంచారు. చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగానే ఉందని, అయితే, గత కోర్టు ఉత్తర్వులు అడ్డంకిగా మారినట్లు పేర్కొన్నారు. దీంతో గత ఆదేశాలను రద్దు చేస్తూ , ప్రాథమిక విచారణలో లభించిన ఆధారాలకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకునే అధికారాన్ని ప్రభుత్వానికి ఇస్తున్నామని న్యాయమూర్తి ప్రకటించారు. ప్రాథమిక విచారణలో ఆధారాలు ఉన్నప్పుడు ఆ తదుపరి విచారణలకు అడ్డంకులు ఉండకూడదని పేర్కొన్నారు. దీంతో డీవీఏసీ వర్గాలు విచారణ వేగం పెంచేందుకు కసరత్తులు చేపట్టాయి. ప్రాథమిక విచారణలో వెలుగు చూసిన ఆధారాల మేరకు ఎస్పీ వేలుమణితోపాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై తొలుత కేసులు నమోదు కానున్నాయి. ఆ తదుపరి విచారణ వేగవంతమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. కాగా, ప్రాథమిక విచారణలో ఎలాంటి ఆధారాలు వెలుగు చూశాయో అన్న వివరాలను డీవీఏసీ వర్గాలు గోప్యంగా ఉంచాయి. కోర్టుకు షీల్డ్ కవర్లో నివేదిక రూపంలో వివరాలను అందజేసి ఉండడంతో ఈ అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో టెండర్ల వ్యవహారం ఈసారి ఎస్పీ వేలుమణి మెడకు ఉచ్చుగా మారే అవకాశాలున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఆలయానికి సీల్

- దళితులకు ప్రవేశం నిరాకరణ
- అగ్రవర్గాల నిర్ణయంతో అధికారుల కన్నెర్ర
- నిఘా వలయంలో విల్లుపురం మేల్ పాది గ్రామం


సీల్ వేస్తున్న అధికారులు

సాక్షి, చెన్నై: దళిత సామాజిక వర్గానికి చెందిన వారిని ద్రౌపది అమ్మన్ ఆలయంలోకి అగ్రవర్ణాలకు చెందిన వారు అనుమతించక పోవడం వివాదానికి దారి తీసింది. అధికారులు చర్చలు జరిపినా అగ్రవర్ణ నేతలు తగ్గలేదు. దీంతో నిఘా నీడలో ఆలయానికి అధికారులు సీల్ వేశారు. పరిస్థితి అదుపు తప్పకుండా రెండు వేల మంది పోలీసులతో గ్రామాన్ని నిఘా నీడలోకి తెచ్చారు. వివరాలు.. విల్లుపురం జిల్లా మేల్ పాది గ్రామంలో ద్రౌపది అమ్మవారి ఆలయం ఉంది. గత నెల రోజులుగా ఇక్కడ ఉత్సవాలు జరుగుతున్నాయి. అయితే ఈ ఆలయంలోకి దళిత సామాజిక వర్గానికి చెందిన వారిని అనుమతించకుండా అగ్రవర్ణ సామాజిక వర్గం పెద్దలు అడ్డుకుంటూ వచ్చారు. పలు మార్లు తమ సంప్రదాయం మేరకు ద్రౌపది అమ్మవారికి పూజలు చేయడానికి దళిత సామాజికవ ర్గం ప్రయత్నాలు చేసినా ఫలితం శూన్యం. వీరిని ఆలయం వైపు మార్గంలోకి కూడా అనుమతించకుండా ఆ గ్రామ పెద్దలు కొందరు వ్యవహరించారు. చివరకు వ్యవహారం విల్లుపురం జిల్లా కలెక్టర్ పళణి దృష్టికి ఫిర్యాదు రూపంలో చేరింది. ఇరు సామాజిక వర్గాల పెద్దలను ఆర్డీఓ రవిచంద్రన్ పిలిపించి మాట్లాడారు. చివరకు కలెక్టర్ పళణి కూడా చర్చలు జరిపారు. అయితే అగ్రవర్ణాలకు చెందిన వారు తగ్గేదే లేదు అన్నట్లుగా వ్యవహరించడంతో అధికారులు కన్నెర్ర చేశారు. బుధవారం ఉదయాన్నే 2 వేల మంది పోలీసులను రంగంలోకి దించారు. ఆ గ్రామాన్ని నిఘా నీడలోకి తెచ్చారు. ఆర్డీఓ రవిచంద్రన్ నేతృత్వంలోని అధికారులు ద్రౌపతి అమ్మవారి ఆలయానికి సీల్ వేశారు. ఈ ఆలయం దేవాదాయ శాఖ పరిధిలో ఉన్నట్టు, ఇందులోకి అందరికీ అనుమతి ఉందని, దీనిని అడ్డుకునే అధికారం ఇతరులకు లేని అధికారులు హెచ్చరించారు. ఆలయానికి తాత్కాలికంగా సీల్ వేశామని, ఇరు సామాజిక వర్గాలు శుక్రవారం చర్చలకు రావాలని, ఇందులో తీసుకునే నిర్ణయం మేరకు సీల్ తొలగిస్తామని అధికారులు పేర్కొనడం గమనార్హం. ఆలయానికి తాళం వేసిన నేపథ్యంలో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు.

తండ్రిని కడతేర్చిన కుమారుడు

అన్నానగర్: దిండుక్కల్ ఓఎంఆర్ పట్టికి చెందిన ఆంథోనిసామి (72) తన కుటుంబం నుంచి విడిపోయి దిండుక్కల్లోని భారతీపురం పాస్ శ్రీనివాసన్ నగర్లో ఒంటరిగా ఉంటున్నాడు. ఈ స్థితిలో మంగళవారం మధ్యాహ్నం అతని ఇంటి నుంచి అరుపులు వినిపించాయి. ఇరుగుపొరుగు వారు అక్కడికి వెళ్లేసరికి ఆంథోనిస్వామి రక్తపు మడుగులో ప్రాణాలతో పోరాడుతున్నాడు. అనంతరం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. ఈ ఘటనపై దక్షిణాది పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆంథోనిసామిని అతని కుమారుడు ఆరోగ్యదాస్ హత్య చేసినట్లు తెలిసింది. దీంతో పోలీసులు నిందితుడు ఆరోగ్యదాస్ను అరెస్టు చేసి ప్రశ్నిస్తున్నారు.

విద్యుత్ చార్జీల వడ్డనకు వేళాయె

- 4 శాతం మేరకు పెంపునకు కసరత్తు

సాక్షి, చెన్నై: రాష్ట్ర ప్రజలకు జూలైలో విద్యుత్ చార్జీల మోతకు అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈనెలాఖరు లోపు కొత్త వడ్డన వివరాలను వెల్లడించేందుకు విద్యుత్ రెగ్యులేటరీ బోర్డు కసరత్తులు చేస్తోంది. ఈ మేరకు 4 శాతం వరకు చార్జీల పెంపునకు అవకాశం ఉన్నట్లు సమాచారం. వివరాలు.. రాష్ట్రంలో రోజు రోజుకూ విద్యుత్ వాడకం పెరుగుతున్న విషయం తెలిసిందే. 2014లో ఓ పర్యాయం విద్యుత్ చార్జీలను వడ్డించారు. ఆ తర్వాత విద్యుత్ చార్జీలు పెరగలేదు. 2016 ఎన్నికల అనంతరం 100 యూనిట్ల ఉచిత పథకం అమల్లోకి రావడంతో పాటుగా ఇతర వ్యయాలు పెరగడంతో విద్యుత్ బోర్డుకు కష్టాలు పెరిగాయి. అప్పులు ఎక్కువయ్యాయి. ఈ అప్పుల భారాన్ని తగ్గించుకునే విధంగా ప్రస్తుత డీఎంకే ప్రభుత్వం గత ఏడాది చాకచక్యంగా వ్యవహరించి చార్జీలను పెంచారు. అయితే, గతంలో విధించిన విద్యుత్ చార్జీలలో ప్రస్తుతం వాడకానికి అనుగుణంగా రూ. 50 నుంచి రూ. వందలోపు పెరుగుతుందని చెప్పి, చివరకు తమ చేతి వాటాన్ని ప్రదర్శించారు. అయితే, ఇతర రాష్ట్రాలతో పోల్చితే తమిళనాడు చార్జీలు కాస్త తక్కువ. రెండు నెలలకు ఒక పర్యాయం ఈ వసూళ్లు జరుగుతున్నాయి. దీనిని ప్రతినెలా వసూలు చేసే విధంగా, సంవత్సరానికి ఓ మారు ఆరు శాతం వరకు చార్జీల పెంపునకు గత ఏడాదే నిర్ణయించారు. అయితే, నెల సరి బిల్లుల వసూళ్లకు నోచుకోవడం లేదు. అదే సమయంలో చార్జీలను పెంచి ఏడాది కావొస్తుండడంతో ప్రస్తుతం మళ్లీ వడ్డకు సిద్ధమయ్యారు. ఇందుకు సంబంధించిన కసరత్తుల్లో విద్యుత్ రెగ్యులేటరీ బోర్డు నిమగ్నమైంది. గృహ అవసరాలకు ఒక యూనిట్కు 11 పైసల మేరకు పెంచేందుకు సిద్ధమవుతోంది. బహుళ అంతస్తులు, పరిశ్రమలు, వర్తక తదితర వాటికి 4 నుంచి 6 శాతం లోపు విద్యుత్చార్జీల పెంపునకు సంబంధించిన కసరత్తు చేస్తోంది. ఈజాబితా ఈనెలాఖరులో వెలువడే అవకాశం ఉంది. అదేసమయంలో లోక్సభ ఎన్నికల నేపథ్యంలో ఈవడ్డన తమకు వ్యతిరేకంగా మారొచ్చనే బెంగతో ఈ సారికి వడ్డన నిలుపుదల చేయించేందుకు డీఎంకే పాలకులు రెగ్యులేటరీ బోర్డుకు సిఫారసు చేసినట్లు తెలిసింది.



ఖననం చేసేందుకు నిరాకరణ


వాగ్వాదానికి దిగిన బంధువులు

వేలూరు: తిరుపత్తూరు జిల్లా జోలార్పేట సమీపంలోని ఏలగిరి కొండ సమీపంలో పీఎం మట్టం గ్రామానికి చెందిన హనుమంతన్(60) బీడి కార్మికుడిగా పనిచేసేవాడు. ఇతనికి భార్య, పిల్లలున్నారు. హనుమంతన్ అనారోగ్యం క్షీణించడంతో మంగళవారం మృతి చెందాడు. మృతదేహాన్ని పూడ్చేందుకు బంధువులు సమీపంలోని శ్మశానంలో గోతి తవ్వారు. శ్మశానం సమీపంలో వ్యవసాయ భూములు ఉన్న రైతులు మృతదేహాన్ని పూడ్చేందుకు అనుమతించకుండా ఘర్షణకు దిగారు. దీంతో హనుమంతన్ బంధువులకు రైతులకు వాగ్వాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న జోలార్పేట పోలీసులు, రెవెన్యూ అధికారులు గ్రామానికి చేరుకుని విచారణ జరిపారు. ఖననం చేసేందుకు అధికారులు అనుమతి ఇవ్వడంతో సమస్య పరిష్కారమైంది.

15 నుంచి ఏసీఎంఈఈ 2023 సాంకేతిక సదస్సు

- ప్రారంభించనున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

కొరుక్కుపేట: చెన్నైనందంబాక్కంలోని చెన్నై ట్రేడ్ సెంటర్ వేదికగా అంబత్తూరు పారిశ్రామికవాడ ఉత్పత్తిదారుల సంఘం (ఏఐఈఎంఏ) ఆధ్వర్యంలో ఏసీఎంఈఈ -2023 పేరుతో అంతర్జాతీయ సాంకేతిక సదస్సు, యంత్రపరికరాల ప్రదర్శన ఈనెల 15 నుంచి ప్రారంభం అవుతుందని ఆ సంఘం అధ్యక్షుడు టి. నల్లంగిల్లీ తెలిపారు. ఈ మేరకు బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 15 తేదీ నుంచి 19వ తేదీ వరకు ఐదురోజులుపాటు నిర్వహించనున్న ఈ అంతర్జాతీయ సాంకేతిక మ్యాన్ ఫ్యాక్చరింగ్ సదస్సు రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి ప్రారంభించనున్నారని తెలిపారు. గౌవర అతిథులుగా వైపార్ డైమ్లర్ ఇండియా కమర్షియల్ వెహికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యకమ్ ఆర్యా, షంక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సతీష్ సదాశివన్ పాల్గొంటారన్నారు. ఏసీఎంఈఈ -2023


సమావేశంలో మాట్లాడుతున్న టి. నల్లంగిల్లీ, సాయి సత్యకుమార్

చైర్మన్ కె. సాయి సత్యకుమార్ మాట్లాడుతూ ఈ సదస్సులో 23 దేశాలకు చెందిన పారిశ్రామిక సంస్థలు ప్రత్యేక్షంగా పాల్గొంటాయని , దేశ విదేశాల నుంచి 435 సంస్థల ప్రతినిధులు కూడా పాల్గొంటున్నట్లు తెలిపారు. పరిశ్రమలను ఆధునీకరించడంలో, దేశంలో పెట్టుబడులను ప్రోత్సాహించడంలో సహాయపడడం, సరికొత్త సాంకేతికతను అందిపుచ్చుకునే ఉద్దేశంతో ఈ సదస్సు జరుగుతుందని ఆయన వెల్లడించారు.

నూతన చిత్ర ప్రారంభోత్సవంలో నటుడు విక్రమ్ ప్రభు



ఒకే సమయంలో మూడు చిత్రాలు

తమిళసినిమా: ఒక చిత్రాన్ని నిర్మించి విడుదల చేయడం గగనమైపోతున్న ఈ రోజుల్లో, ఒకే సారి మూడు చిత్రాలను నిర్మిస్తూ తమిళ చిత్ర పరిశ్రమలో ప్రత్యేకతను చాటుకుంటోంది లెమన్ లీఫ్ క్రియేషన్స్ సంస్థ. ఈ సంస్థ అధినేతలు ఆర్.గణేశ్ మూర్తి, జీ.సౌందర్యలు ఒకే సమయంలో మూడు చిత్రాలను నిర్మిస్తున్నారు. వీటిలో నటుడు యోగిబాబు, లక్ష్మీ మీనన్ జంటగా నటిస్తున్న మల్లై చిత్రం నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకుని త్వరలో విడుదలకు సిద్ధం అవుతోంది. కాగా నటుడు అశోక్ సెల్వన్, శాంతను, నటి కీర్తీ పాండియన్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న బ్లూస్టార్ చిత్రం చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని నిర్మాణాంతర కార్యక్రమాలను జరుపుకుంటోంది. ఇలాంటి పరిస్థితుల్లో తాజాగా నటుడు విక్రమ్ప్రభు కథానాయకుడిగా మరో చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం బుధవారం చెన్నైలో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. నటి ఈషారెబ్బా నాయకిగా నటిస్తున్న ఈ చిత్రం ద్వారా దర్శకుడు సుశీంద్రన్, సర్గుణంల శిష్యుడు రమేశ్ రవిచంద్రన్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. దీనికి జిబ్రాన్ సంగీతాన్ని, రాసామది ఛాయాగ్రహణం అందిస్తున్నారు. వైవిద్య కథ, కథనాలతో కూడిన ఈ చిత్ర షూటింగ్ను నిర్విరామంగా నిర్వహించనున్నట్లు యూనిట్ వర్గాలు తెలిపారు.

కోలీవుడ్ టాక్స్

మరుగున పడుతున్న విషయాలతో 'తండట్టి'


తండట్టి చిత్ర ఆడియో ఆవిష్కరణలో యూనిట్ సభ్యులు

తమిళసినిమా: కాలానుగుణంగా పలు సంప్రదాయ విషయాలు మరుగున పడుతున్నాయని అలాంటి వాటిలో తండట్టి (పూర్వం మహిళల చెవి పోగులు) ఒకటని నిర్మాత ఎస్.లక్ష్మణన్ పేర్కొన్నారు. ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై సర్దార్, కారీ, రన్ బేబీ రన్ వంటి పలు విజయవంతమైన చిత్రాలను నిర్మించిన ఈయన తాజాగా రూపొందించిన చిత్రం తండట్టి. పశుపతి ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రంలో నటి రోహిణి, అమ్ము అభిరామి, వివేక్ ప్రసన్న, దీప తదితరులు ముఖ్య పాత్రలన పోషించారు. వీరితో పాటు మదురై జిల్లా, ఉసిలం పట్టికి చెందిన చెవులకు పోగులు కలిగిన పలువురు బామ్మలు నటించడం విశేషం. కేఎస్ సుందరమూర్తి సంగీతాన్ని, మహేశ్ ముత్తుసామి ఛాయాగ్రహణం అందించిన ఈ చిత్రం ద్వారా రామ్ సంగైయ్య దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఎ.వెంకటేశన్ సహ నిర్మాతగా వ్యవహరించిన తండట్టి చిత్రం నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకుని ఈ నెల 23వ తేదీన తెరపైకి రానుంది. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం చిత్ర ఆడియో, ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని చెన్నైలోని ఒక స్టార్ హోటల్లో నిర్వహించారు. చిత్ర నిర్మాత ఎస్.లక్ష్మణన్ మాట్లాడుతూ నిజంగా చాలా సంతోషంగా ఉందన్నారు. దర్శకుడు రామ్ సంగైయ్య కథ చెప్పగానే చిత్రాన్ని నిర్మించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ఇది మన నేటివిటితో కూడిన కథా చిత్రం అన్నారు. యధార్థ కథకు చూసిన సంఘటనలకు కొంచెం కల్పన జోడించి దర్శకుడు చిత్రాన్ని చాలా బాగా తెరకెక్కించారని తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాలు కాలానుగుణంగా మరుగున పడిపోతున్నాయన్నారు. అలాంటి ఒక విషయంతో రూపొందించిన చిత్రం తండట్టి అని చెప్పారు. ఇందులో ప్రధాన పాత్రకు తాము అనుకున్నది నటుడు పశుపతి అని ఆయనే నటించడానికి అంగీకరించడం సంతోషం కలిగించిందని తెలిపారు. చిత్ర షూటింగ్ను తేనీలో ఒకే షెడ్యూల్లో పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.



బలమైన కథ కావడంతోనే నటించాను

తమిళసినిమా: ప్రొగన్ మూవీస్ పతాకంపై పీటర్ రాజ్ నిర్మించి ముఖ్య పాత్రలో నటించిన చిత్రం బెల్. వెంకట్ భువన్ దర్శకత్వం వహించిన ఇందులో నటుడు గురుసోమసుందరమ్, శ్రీధర్ మాస్టర్, నితీష్ వీరా, దుర్గ, శ్వేతా తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. భరణీ కన్నన్ ఛాయాగ్రహణం, రాబర్ట్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా మంగళవారం చెన్నైలో నిర్వహించిన మీడియా సమావేశంలో దర్శకుడు వెంకట్ భువన్ మాట్లాడుతూ చిత్రానికి నిర్మాతనే ముఖ్యమన్నారు. ఈ చిత్ర నిర్మాత పీటర్ రాజ్ తనకు మంచి మిత్రుడన్నారు. తాను చిత్రాన్ని నిర్మిస్తాను మీరు దర్శకత్వం వహించండి అని చెప్పడంతో ముందుగా కాస్త భయం అనిపించిందన్నారు. దీంతో కథపై దృష్టి పెట్టి చాలా పరిశోధనలు చేసి బెల్ చిత్ర కథను సిద్ధం చేసినట్లు చెప్పారు. పీటర్ రాజ్ ఈ చిత్రానికి నిర్మాత మాత్రమే కాకుండా, ఒక సహాయ దర్శకుడిగా తనతోనే ఉంటూ ఎంతగానో సహకరించారని చెప్పారు. ఇది ప్రకృతి సిద్ధ వైద్యుల నేపథ్యంలో సాగే విభిన్న కథా చిత్రమని చెప్పారు. కాగా ఇందులో ప్రతినాయకుడిగా ప్రధాన పాత్రను పోషించిన నటుడు గురు సోమసుందర్ మాట్లాడుతూ ఈ చిత్రం నిర్మాత పీటర్రాజ్కు పెట్టిన పెట్టుబడి తిరిగిరావాలన్నారు. చాలా పొటాన్షియల్ ఉన్న కథ కావడం , తన పాత్ర కొత్తగా ఉండటంతో నటించడానికి అంగీకరించినట్లు చెప్పారు. చిత్ర సంగీతం కూడా బాగా వచ్చిందనీ, కచ్చితంగా బెల్ చిత్రం సక్సెస్ అవుతుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.


నటి ప్రియమణి

తమిళసినిమా: నటి ప్రియమణి తెగ సంబరపడిపోతున్నారు. కారణం ఏమిటో చూసేద్దామా. పరుత్తివీరన్ చిత్రంలో నటించి ఏకంగా జాతీయ ఉత్తమ నటి అవార్డును గెలుచుకున్న ఈ భామ ఆ తరువాత ఇక్కడ కొన్ని చిత్రాల్లో నటించినా, తెలుగులో ఆఫర్స్ రావడంతో అటువైపు దృష్టి సారించారు. అక్కడ కూడా స్టార్ హీరోలతో జత కట్టి మంచి స్థాయికి ఎదిగారు. ఇక పెళ్లి చేసుకుని కూడా నటించడానికి సిద్ధం అయిన ప్రియమణికి హీరోయిన్ అవకాశాలు తగ్గిపోయాయి. దీంతో క్యారెక్టర్ ఆర్టిస్ట్గా మారిపోయారు. ఇటీవల కస్టడీ చిత్రంలో ముఖ్యమంత్రిగా నెగిటీవ్ షేడ్స్ కలిగిన పాత్రలో నటించారు. ఇకపోతే తాజాగా హిందీలో జవాన్ చిత్రంలో కీలక పాత్రను పోషిస్తున్నారు. బాలీవేడ్ బాద్షా షారూఖ్ ఖాన్, నయనతార జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని కోలీవుడ్ యువ దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే.అనిరుద్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రం హిందీతో పాటు, తమిళం, తెలుగు, మలయాళం, కన్నడం భాషల్లో సెప్టెంబర్ 7వ తేదీన తెరపైకి రావడానికి ముస్తాబవుతోంది. పఠాన్ వంటి బాక్సాఫీస్ను షేక్ చేసిన చిత్రం తరువాత రానుండడంతో

గుర్తు పట్టరనుకున్నాను.. కానీ!

జవాన్ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇకపోతే నటి ప్రియమణి ఇంతకు ముందు షారూఖ్ ఖాన్, దీపికా పడుకొనే జంటగా నటించిన చెన్నై ఎక్స్ప్రెస్ చిత్రంలో సింగిల్ సాంగ్లో నటించిన విషయం తెలిసిందే. మళ్లీ రెండోసారి జవాన్ చిత్రంలో నటించడం గురించి సంతోషాన్ని వ్యక్తం చేశారు. దీని గురించి ఈమె ఒక భేటీలో పేర్కొంటూ జవాన్ చిత్రంలో నటించినప్పుడు షారూఖ్ ఖాన్ తనను గుర్తు పెడతారా? లేదా? అన్న ఆలోచనలో ఉండగా తొలి రోజే షూటింగ్ స్పాట్లో తనను చూసి దగ్గరకు వచ్చి కౌగిలించుకున్నారని, చెన్నై ఎక్స్ప్రెస్ చిత్రం తరువాత మిమ్మల్ని కలుసుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నట్లు తెలిపారు. ప్రతి నిత్యం ఎందరో నటీనటులను, ఇతరులను కలుసుకునే ఆయన చెన్నై ఎక్స్ప్రెస్ చిత్రంలో ఒక్క పాటలో నటించిన తనను గుర్తుపెట్టుకోవడం చాలా ఆశ్చర్యం కలిగిందని ప్రియమణి తెగ సంబరపడిపోయారు. ఇంతకీ జవాన్ చిత్రంలో తన పాత్ర ఏమిటన్నది మాత్రం రివీల్ చేయలేదు.

ప్రియా భవానీశంకర్కు జాక్పాట్?

తమిళసినిమా: అనిశ్చితికి మారు పేరు చిత్ర పరిశ్రమ అనవచ్చు. ఈ రంగుల లోకం ఎప్పుడు ఎవరిని అందలం ఎక్కిస్తుందో తెలియదు. ఎవరిని తొక్కేస్తుందో కూడా తెలియదు. అయితే ప్రతిభకు, కృషికి తగిన గుర్తింపు మాత్రం కచ్చితంగా ఉంటుంది. నటి ప్రియా భవానీ శంకర్ గురించి చెప్పడానికి ఇదంతా చెప్పాల్సి వచ్చింది. టీవీ యాంకర్గా రంగప్రవేశం చేసి, ఆ తరువాత బుల్లితెర నటిగా ఎంట్రీ ఇచ్చి , ఆపై వెండితెరకు పరిచయం అయిన లక్కీ నటి ఈ భామ. తొలి చిత్రం మేయాదమాన్ చిత్రంతోనే ఈమెను లక్కు పలకరించింది. అంతే ప్రియా భవానీశంకర్కు కెరీర్ పరంగా వెనక్కు తిరిగి చూసుకోవలసిన అవసరం లేకపోయ్యింది. వరుసగా రెండవ కేటగిరి నటులతో జత కట్టి తన స్థాయిని పెంచుకుంటూ వస్తోంది. డబ్బు కోసమే ఈ రంగంలోకి వచ్చాను అని నిర్మొహమాటంగా చెప్పే ఈ అమ్మడు తక్కువ కాలంలోనే బాగానే కూడ బెట్టేసింది. గ్రామరస్ ఫొటోలతో సోషల్ మీడియాలో తరచూ కనిపిస్తూ అభిమానుల్ని కవ్వించే ప్రియా భవానీశంకర్ను అదృష్టం మాత్రం వరిస్తూనే ఉంది. చేతి నిండా చిత్రాలతో బిజీగా ఉన్న ఈమెను తాజాగా సూపర్ ఛాన్స్ వరించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. దళపతి విజయ్తో రొమాన్స్ చేసే అవకాశం ఈ బ్యూటీ కోసం ఎదురు చూస్తున్నట్లు టాక్ వైరల్ అవుతోంది. విజయ్ ప్రస్తుతం లియో చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. దీని తరువాత వెంకట్ప్రభు దర్శకత్వంలో నటించడానికి ఆయన రెడీ అవుతున్నారు. ఈ నెల 22వ తేదీనే ఈ చిత్రం ప్రారంభం కానున్నట్లు సమాచారం. ఇకపోతే ఇందులో విజయ్కు జంటగా నటించే హీరోయిన్ల పేర్లలో ముందుగా నటి నయనతార పేరు వినిపించింది. ఆ తరువాత నటి కృతిశెట్టి పేరు వైరల్ అయ్యింది. తాజాగా నటి ప్రియా భవానీశంకర్ పేరు హల్చల్ చేస్తోంది. త్వరలోనే హీరోయిన్ ఎవరనే విషయంపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.


నటి ప్రియాభవానీశంకర్

క్లుప్తంగా

కళాశాల విద్యార్థి మృతి

తిరువొత్తియూరు: బైక్ అదుపు తప్పి కిందపడిన ప్రమాదంలో కళాశాల విద్యార్థి దుర్మరణం చెందాడు. కన్యాకుమారి జిల్లా మనవాలం కురిచ్చి సమీపంలోని కట్టియపట్టినానికి చెందిన జోష్‌రాజ్ జాలరి. ఇతని కుమారుడు సహాయ అజయ్. ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం అజయ్ తన మోటారు సైకిల్‌పై తిరిగి వెళుతున్నాడు. కూటు మంగళం వద్ద బైక్ నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని ఆచారిపల్లం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతిచెందినట్లు తెలిపారు. వారి బంధువులు మనవాలం కురిచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ట్విట్టర్‌లో పోస్టుపై ఫిర్యాదు.. వ్యక్తి అరెస్టు

తిరువొత్తియూరు: డీఎంకే పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా సామాజిక మాధ్యమంలో పోస్టు పెట్టిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. పల్లడం కరైపుత్తూరు పాళయానికి చెందిన డీఎంకే యువజన విభాగం కో–ఆర్డినేటర్ బాలసుబ్రమణ్యం. ఇతను తిరుపూర్ జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుపూర్ జిల్లా సెంబాగౌండర్ పాళయం పంచాయతీ యూనియన్ ప్రాంతంలో కల్తీ సారా విక్రయానికి సంబంధించి డీఎంకే పార్టీకి కళంకం కలిగించే విధంగా ఓ వ్యక్తి ట్విట్టర్‌లో పోస్టు చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో తిరుపూర్ ఎస్పీ స్వామినాథన్ ఆదేశాల మేరకు జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి మంగళవారం శరవణ ప్రసాద్ (52)ను అరెస్టు చేశారు. ఇతను చెన్నై పల్లవన్ తాంగల్ ప్రాంతానికి చెందిన బీజేపీ మద్దతుదారుడిగా గుర్తించారు.

గోడౌన్‌లో అగ్నిప్రమాదం

అన్నానగర్: మైలాడుదురైలోని ఓ గోడౌన్‌లో మంగళవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. రూ.5 లక్షల విలువైన పాఠశాల పరికరాలు దగ్ధమయ్యాయి. కామరాజర్ బస్టాండ్, కొత్త బస్టాండ్‌లలో ప్రభుత్వ టాస్మాక్ దుకాణం ఉంది. టాస్మాక్ షాపు సమీపంలోని రోడ్డు పక్కన చెత్త పేరుకుపోయి ఉంది. మంగళవారం సాయంత్రం చెత్తకు ఒక్కసారిగా మంటలు చెలరేగాయని, ఈ మంటల సమీపంలో టేమూరామ్‌కు చెందిన పాఠశాల సామగ్రి ఉన్న గోడౌన్‌కు వ్యాపించింది. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చి చాలాసేపు పోరాడి మంటలను ఆర్పారు. ఇందులో రూ.5 లక్షల విలువైన పాఠశాల వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటన గురించి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ఫ్యాన్సీ షాపు గోడౌన్‌లో మంటలు

అన్నానగర్: అరుమనైలోని ఫ్యాన్సీ స్టోర్ గోదాములో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో రూ.10 లక్షల విలువైన వస్తువులు దగ్ధమయ్యాయి. కన్యాకుమారి జిల్లా అరుమనై సమీపంలోని మంజలుముడ్ జంక్షన్ వద్ద విల్సన్ ఫ్యాన్సీ దుకాణాన్ని నడుపుతున్నాడు. మొదటి అంతస్తులో గోదాం నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం పాఠశాల ప్రారంభం కానుండడంతో విద్యార్థులకు కావాల్సిన నోటు పుస్తకాలు సహా వివిధ సామగ్రి ఉంచారు. మంగళవారం మధ్యాహ్నం మొదటి అంతస్తులోని గోదాములో భారీ అగ్నిప్రమాదం జరిగింది. అగ్నిమాపక సిబ్బంది సుమారు 3 గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో రూ.10 లక్షలు విలువైన వస్తువులు కాలిపోయాయి.

ప్రాణం తీసిన ఈత సరదా

తిరువొత్తియూరు: బావిలో ఈత నేర్చుకుంటున్న సమయంలో ప్లస్–2 విద్యార్థిని నీటిలో మునిగి మృతి చెందింది. ధర్మపురి జిల్లా మలక్కోడులో కళయరసి (16) మంగళవారం నాగేంద్ర మంగళం సమీపంలోని తన పిన్ని ఇంటికి వెళ్లింది. అక్కడ ఈత నేర్చుకోవడం కోసం అదే ప్రాంతానికి చెందిన బాలికలతో కలిసి వ్యవసాయ బావిలోకి దిగింది. ఈత నేర్చుకుంటున్న సమయంలో హఠాత్తుగా నీట మునిగిపోయింది. బాలికలు కేకలు వేయడంతో స్థానికులు బావిలోకి దిగి విద్యార్థినిని బయటకు తీసుకురావడానికి ప్రయత్నించారు. కాని వీలు కాలేదు. సమాచారం అందుకున్న పాలకోడు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మృతదేహాన్ని బయటకు తీసి శవ పరీక్ష కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మహేంద్ర మంగళం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

తాగునీటి ప్రాముఖ్యతపై అవగాహన

సాక్షి, చెన్నై: పెర్నోడ్ రికార్డ్ ఇండియా ఆధ్వర్యంలో తాగునీటి ప్రాముఖ్యతపై అవగాహన ప్రచారాన్ని ప్రారంభించారు. స్థానికంగా జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ అధికారి కార్తిక్ మహేంద్ర మాట్లాడుతూ, దేశంలో వినియోగ దారుల ఆరోగ్య క్షేమాన్ని కాంక్షించే విధంగా నీటి ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఎక్కువగా నీటిని తాగడం వల్ల శరీరంలోని అన్ని అవయవాలు ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. ప్రధానంగా మద్యం అలవాటు కలిగిన వారు మరింతగా నీటిని తీసుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. తమ అవగాహన ప్రచారం 30 మిలియన్ ప్రజల్లోకి చేర్చడమే లక్ష్యంగా ఈ పయనం జరుగుతోందన్నారు. బాధ్యత గల కార్పొరేట్‌గా తాము వినియోగ దారులకు అవగాహన, వారి హక్కులను తెలియజేసే కార్యక్రమాలు చేపట్టామన్నారు. అలాగే, పరిశ్రమలు, ప్రభుత్వాలు, స్థానికుల సహకారంతో తాము ఈ అవగాహన ప్రచారం విస్తృతంగా ముందుకు తీసుకెళ్తామన్నారు.

కాకలూరు సిప్‌కాట్‌కు విద్యుత్ అంతరాయం

- సబ్‌స్టేషన్‌ను ముట్టడించి ఆందోళన చేసిన కార్మికులు



కాకలూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న సిప్‌కాట్ కార్మికులు

తిరువళ్లూరు: కాకలూరు సిప్‌కాట్‌కు 24 గంటల పాటు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడడాన్ని నిరసిస్తూ సబ్‌స్టేషన్‌ను ముట్టడించి కార్మికులు, ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. తిరువళ్లూరు జిల్లా కాకలూరు సిప్‌కాట్‌లో ఆటోమొబైల్స్, ఇంజినీరింగ్, ఫర్నిచర్‌లను తయారు చేసే చిన్న మధ్య తరహా పరిశ్రమలు 350 వరకు ఉన్నాయి. ఇక్కడ సుమారు 6 వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. కాకలూరు సిప్‌కాట్‌కు అదే ప్రాంతంలోని సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. అయితే కాకలూరు సబ్‌స్టేషన్‌లోని 110కేవీ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఆయిల్ లీకేజీ కారణంగా మంగళవారం మూడు గంటల నుంచి విద్యుత్ ఆగిపోయింది. దీంతో సిప్‌కాట్‌లోని పరిశ్రమల కార్యకలాపాలు పూర్తిగా నిలిపోయి వస్తువుల ఉత్పత్తి ఆగిపోయింది. గంటల తరబడి విద్యుత్ పునరుద్ధరణ కాకపోవడంతో సిప్‌కాట్ పరిశ్రమల యాజమాన్య సంక్షేమ సంఘం నేతలు మంగళవారం ఉదయం సబ్‌స్టేషన్ ఉన్నత అధికారులను సంప్రదించి వివరణ అడిగారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయిన కారణంగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించలేమని, బుధవారం నాటికి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అయితే బుధవారం ఉదయం 11 గంటల వరకు విద్యుత్ పునరుద్ధరణ జరగకపోవడంతో కార్మికులు, పరిశ్రమలకు చెందిన యజమానులు, ఉద్యోగులు సబ్‌స్టేషన్ వద్దకు చేరుకుని ఆందోళన నిర్వహించారు. విద్యుత్‌శాఖకు చెందిన ఉద్యోగుల నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ నినాదాలు చేశారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో కోట్ల రూపాయల మేరకు నష్టం ఏర్పడిందని వాపోయారు. విషయం తెలుసుకున్న విద్యుత్‌శాఖ ఉన్నత ఉద్యోగులు సిప్‌కాట్ ఉద్యోగులతో చర్చలు జరిపారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసే ఆలోచన చేస్తున్నామని..పూర్తి స్థాయిలో విద్యుత్ పునరుద్ధరణకు మరో మూడు రోజులు పట్టే అవకాశం ఉందని అధికారులు నచ్చచెప్పారు. అనంతరం కాకలూరు, హౌసింగ్‌బోర్డు కాలనీ, ఈకాడు, సెవ్వాపేటతో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లే గృహ వినియోగ విద్యుత్‌ను సాయంత్రం ఐదు గంటల వరకు నిలిపివేసి సిప్‌కాట్‌కు విద్యుత్‌ను పునరుద్ధరించడంతో ఆందోళన విరమించారు.

పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ



స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రాజా, రాజశేఖర్

కొరుక్కుపేట: చెన్నైతో పాటు పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 500మంది పేద విద్యార్థులకు విద్యా ఉపకార వేతనాలను అందజేశారు. చెన్నై టి.నగర్ జీఎన్‌శెట్టి రోడ్డులోని సర్ పిట్టి త్యాగరాయ భవనం వేదికగా కింగ్ మేకర్స్ సంస్థ చైర్మన్, అఖిల భారత రియల్ ఎస్టేట్ సమాఖ్య జాతీయ కార్యదర్శి డాక్టర్ ఎస్.రాజశేఖర్ జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యా సహాయకాలను పంపిణీ చేశారు. సమాఖ్యకు చెందిన డాక్టర్ ఎ.హెన్రి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విరుగంబాక్కం ఎమ్మెల్యే ఎ.ఎం.వి.ప్రభాకర్ రాజా, గౌరవ అతిథులుగా మక్కల్ టీవీ సమన్వయకర్త, నీదియిన్ కురల్ వ్యవస్థాపకుడు అచ్చిమిల్‌లై సీఆర్ భాస్కరన్, ఆమ్ ఆద్మీ పార్టీ తమిళనాడు రాష్ట్ర సమన్వయకర్త ఎస్.ఎ.ఎన్.వసీగరన్, ప్రత్యేక అతిథులుగా నటులు సెంథిల్, మన్సూర్ అలీఖాన్, తమిళ నటుడు ఆదవన్, తమిళనాడు పత్రికా ప్రతినిధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డీఎస్ఆర్ సుభాష్, డీఎస్పీ మార్టిన్, సీనియర్ న్యాయవాది తేన్‌మొళి, వ్యాపారవేత్త వెట్రిమారన్, జాన్, జయచంద్రన్, శివశంకరి రాజశేఖర్ పాల్గొని పేద విద్యార్థులకు ఉపకారవేతనాలు అందించారు.

యువతి ప్రాణం తీసిన ప్రేమోన్మాది

అన్నానగర్: యువతిని గొంతు కోసి దారుణంగా హత్య చేసిన ఘటన ధర్మపురిలో చోటుచేసుకుంది. ఓల్డ్ రైల్వే లైన్ ప్రాంతానికి చెందిన భువనేశ్వరన్ కుమార్తె హర్ష (23) బుధవారం ఉదయం అతియామాన్‌కోట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కదురన్ కోట్టై నరసింగపురం కొంబై అటవీ ప్రాంతంలో హత్యకు గురైంది. పక్కనే ట్రావెల్ బ్యాగ్ పడి ఉంది. అటుగా వెళుతున్న ప్రజలు అదియమాన్ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని హర్ష మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ధర్మపురి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం పోలీసులు ఆ ప్రాంత ప్రజలను విచారించారు. మంగళవారం సాయంత్రం ఆ ప్రాంతంలో ఓ యువకుడు హర్షతో మాట్లాడుతుండగా వాగ్వాదానికి దిగాడని తెలిపారు. కాగా యువకుడిని పెళ్లి చేసుకోవడానికి హర్ష ఇంటి నుంచి వెళ్లిందని.. అయితే అతను నిరాకరించడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగినట్లు తెలిసింది. ఈ క్రమంలో గొంతు కోసి హత్య చేసి పారిపోయాడని తేలింది. పోలీసులు కేసు నమోదు చేసి ప్రియుడి కోసం గాలిస్తున్నారు.

నకిలీ వీసాతో రూ.12 లక్షలు మోసం

అన్నానగర్: కోయంబత్తూరు నుంచి శ్రీలంక వెళ్లేందుకు నకిలీ వీసా ఇచ్చి మిల్లు కార్మికుడి నుంచి రూ.12 లక్షలు మోసం చేసిన ఏజెన్సీ యజమానిని అరెస్టు చేశారు. శ్రీలంకకు చెందిన ప్రేమరత్న కుమారుడు మంగళనిశాంత (48). తిరుపూర్ జిల్లా తెక్కలూరులో ఉన్న ఓ ప్రైవేటు మిల్లులో పని చేసేవాడు. కోయంబత్తూర్‌లోని ఆర్‌ఎస్‌పురంలో ప్రైవేటు ఏజెన్సీ నిర్వహిస్తున్న జాష్వా (34)ని తనకు, తన బంధువులకు వీసాలు ఇప్పించాలని కోరాడు. ఇందుకు సంబంధించిన పత్రాలను కూడా సమర్పించాడు. అప్పుడు వీసా కావాలంటే రూ.11లక్షలకు పైగా ఖర్చు అవుతుందని జాష్వా తెలిపాడు. అందుకోసం మంగళ నిశాంత, బంధువులు జాష్వా బ్యాంకు ఖాతాకు వివిధ వాయిదాల్లో రూ.11.71 లక్షలు చెల్లించారు. ఆ తరువాత వారికి వీసాలు ఇచ్చారు. మంగళనిశాంత బంధువు అమరసింహ ప్రభుత్వ వీసా ద్వారా శ్రీలంక వెళ్లాడు. ఆ సమయంలో కొలంబో విమానాశ్రయ అధికారులు తనిఖీలు చేశారు. అది నకిలీ వీసా అని తేలింది. దీంతో పోలీసులు అతన్ని అరెస్టు చేసి జైలులో పెట్టారు. ఈ విషయం విని షాక్‌కు గురైన మంగళనిశాంత ఆర్‌ఎస్ పురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏజెన్సీ యజమాని జాష్వాని బుధవారం అరెస్టు చేసి విచారణ చేస్తున్నారు.

జల్లికట్టులో గాయపడిన యువకుడి మృతి

అన్నానగర్: తిరుమనూరులో జల్లికట్టు ఎద్దు దాడికి గాయపడిన యువకుడు బుధవారం మృతి చెందాడు. అరియలూరు జిల్లా తిరుమనూరు యూనియన్ పరిధిలోని కల్లూరు గ్రామంలో కొద్ది రోజుల క్రితం జల్లికట్టు నిర్వహించారు. వెంకనూరు గ్రామానికి చెందిన తమిళరసు కుమారుడు కవియరసు (22) తన స్నేహితులు బాలాజీ, దినేష్, అజిత్‌కుమార్‌లతో కలిసి చూసేందుకు వెళ్లాడు. వాడివాసల్ గేటు నుంచి ఎద్దు పరిగెత్తుకుంటూ వచ్చి కవియరసును కొమ్ముతో పొడిచి దూరంగా విసిరేసింది. చుట్టుపక్కల వారు అతడిని రక్షించి 108లో అరియలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం తంజావూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం కవియరసు మృతి చెందాడు. కీలప్పలువూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బావిలో దూకి అక్కాచెల్లెలు ఆత్మహత్య

అన్నానగర్: బావిలో దూకి అక్కాచెల్లెలు మృతిచెందిన ఘటన తిరుచ్చి జిల్లా ద్వారంకురిచ్చిలో చోటుచేసుకుంది. వలనాడు అయన్‌పుదుపట్టికి చెందిన పిచ్చైకు భార్య అఖిలాండేశ్వరి, కుమార్తెలు విద్య (21), గాయత్రి (20) ఉన్నారు. వీరిద్దరూ తిరుపూర్ జిల్లా కాంగేయంలో ఉంటున్న ఓ ప్రైవేటు టెక్స్‌టైల్ కంపెనీలో పని చేస్తున్నారు. అయన్‌పుదుపట్టిలో జరిగిన ఆలయ ఉత్సవాల కోసం విద్య, గాయత్రి తల్లిదండ్రులతో కొద్ది రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చారు. ఆ సమయంలో కూతుళ్ల ప్రేమ వ్యవహారం వెలుగులోకి రావడంతో అఖిలాండేశ్వరి ఇద్దరిని మందలించింది. బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన విద్య, గాయత్రి ఎంతసేపటికి తిరిగి ఇంటికి రాలేదు. అదే ప్రాంతంలోని ఓ బావి ఒడ్డున రెండు సెల్‌ఫోన్లు పడి ఉండడంతో అనుమానం వచ్చిన బంధువులు బావిలోకి చూడగా ఇద్దరు మహిళల మృతదేహాలు కనిపించాయి. వలనాడు పోలీసులకు, ద్వారం కురిచ్చి అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని మృతదేహాలను వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం మనపారై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వలనాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ కోతలపై నిరసన



ఆందోళన చేస్తున్న ప్రజలు

తిరువొత్తియూరు: చెన్నై ఆలందూరులో అర్ధరాత్రి సమయంలో విద్యుత్ కట్ చేస్తున్నారని ఆరోపిస్తూ స్థానికులు ఈబీ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. చెన్నై సమీపం ఆలందూరు బైపాస్ రోడ్డులోని పొన్నియమ్మన్ ఆలయం వీధి, జిన్నా వీధిలో 20 రోజులుగా రోజూ రాత్రి సమయంలో విద్యుత్ కట్ చేస్తున్నట్లు తెలిపారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా విద్యుత్ బోర్డు అధికారులు చర్యలు తీసుకోలేదని తెలిసింది. మంగళవారం రాత్రి కూడా విద్యుత్ కోత విధించారు. దీంతో ప్రజలు ఆగ్రహించి బుధవారం ఆలందూరు ఎంకేఎన్ రోడ్డులో బైఠాయించి ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసు ఇన్‌స్పెక్టర్ చెల్లప్పన్, పోలీసులు వారికి నచ్చజెప్పి శాంతింపజేశారు.

నగరంలో అడయార్‌కు ప్రత్యేక చరిత్ర



కళా ప్రదర్శనను ప్రారంభిస్తున్న సమయ్ సింగ్

కొరుక్కుపేట: సముద్ర తీర ప్రాంతాలు, అరుదైన కట్టడాలు ,స్వాతంత్ర సమరయోధులు, చారిత్రాత్మక ప్రదేశాలతో చెన్నై నగరంలోని అడయార్ ప్రాంతానికి ప్రత్యేక చరిత్ర ఉందని రాష్ట్ర ప్రభుత్వ డిప్యూటీ పోలీసు కమీషనర్ (ట్రాఫిక్) సమయ్ సింగ్ అన్నారు. ఈ మేరకు నేను అడయార్.. అడయార్ అంటే నేను.. అనే పేరుతో ఫెడరల్ బ్యాంక్ –అడయార్ బ్రాంచ్ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. తద్వారా అడయార్ విశిష్టతను తెలిపే పోరాటాలు, విజయాలు సంబంధించిన 100 కథలను సేకరించారు. అందులో 40 ఉత్తమ కథలను ఎంపిక చేసి అడయార్ బ్రాంచ్‌లో ప్రముఖుల చిత్రపటాలతో ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశారు. అంతే కాకుండా ఫెడరల్ బ్యాంకు చుట్టూ రంగు రంగుల చిత్రలేఖనాలను అడయార్ ప్రముఖ ప్రదేశాలను తెలిపే ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సమయ్ సింగ్ పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి ప్రదర్శనను ప్రారంభించారు . అనంతరం ఆయన మాట్లాడుతూ అడయార్ గొప్పతనాన్ని తెలిపేలా ఈ ప్రదర్శన ఉందని ఈ ప్రాంతానికి ఎంతో చరిత్ర ఉందన్నారు. ఇందులో ఫెడరల్ బ్యాంక్ చెన్నై జోన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, జోనల్ హెడ్ ఎక్బాల్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటిక్ సంగీత పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, చెన్నై: హెచ్‌సీఎల్ ఫౌండేషన్ నేతృత్వంలో భారతీయ శాస్త్రీయ ప్రదర్శనలు, కళా రంగం, కర్ణాటిక్ సంగీత కార్యక్రమాల పోటీల నిమిత్తం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ది కర్ణాటిక్ క్రెస్ట్ పేరిట జరిగే ఈ కార్యక్రమాలకు 18 నుంచి 30 ఏళ్ల వయసు కలిగిన కర్ణాటిక్ సంగీతకారులు ఈనెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. బుధవారం ఈ వివరాలను స్థానికంగా హెచ్‌సీఎల్ కాన్సర్ట్స్ హెడ్ అన్షుల్ అధికారి వెల్లడించారు. గాత్రం, వయోలిన్, వీణ, ఫ్లూట్ తదితర కళాకారులు మొదటి రౌండ్ పోటీలకు ప్రస్తుతం తమ హెచ్‌సీఎల్ కాన్సర్ట్స్ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవచ్చునని సూచించారు. తమప్రతిభను చాటుకునే ప్రయత్నంలో ఉన్న కళాకారులకు ఇది ఒక వేదికగా పేర్కొన్నారు. పోటీ దారుల ప్రయోజనం లక్ష్యంగా, వారి అత్యుత్తమ ప్రదర్శనలకు బహుమతులను అందజేస్తామన్నారు.

అన్నాడీఎంకే నేత ఇంట్లో చోరీ



ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

తిరువళ్లూరు: అన్నాడీఎంకే నాయకురాలి ఇంటి తలుపులు పగలగొట్టి 40 సవర్ల బంగారు నగలు, రూ. 5.60 లక్షల నగదు ఎత్తుకెళ్లిన సంఘటన తిరువళ్లూరు జిల్లాలో కలకలం రేపింది. తిరువళ్లూరు జిల్లా తొయ్యూరు గ్రామానికి చెందిన కౌసల్య. భర్త మనోహరన్ అనారోగ్యం కారణంగా ఇటీవలే మరణించారు. ఈ నేపథ్యంలో కొడుకు అఖిలన్‌తో కలిసి స్థానికంగా నివాసం ఉంటున్నారు. మంగళవారం రాత్రి కౌసల్య కుమారుడు అఖిలన్ పూండీ నొవేలి వద్ద వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి రాత్రి అక్కడే ఉన్నారు. ఒంటరిగా ఉండడానికి బయపడిన కౌసల్య రాత్రి తన సోదరి ఇంటికి వెళ్లి నిద్రించారు. బుధవారం ఉదయం 6 గంటలకు తిరిగి ఇంటికి రాగా తలుపులు పగులగొట్టి ఉండడం చూసి షాక్‌కు గురైంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉంచిన 40 సవర్ల బంగారు నగలు, 3 కేజీల వెండి, రూ.5.60 లక్షల నగదు, 23 విలువైన పట్టుచీరలు మాయమైనట్లు గుర్తించింది. సెవ్వాపేట పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు చోరీ జరిగిన ప్రాంతంలో వేలిముద్రలను సేకరించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కలశపాక్కంలో రైతుల ధర్నా



వ్యవసాయ కార్యాలయం ఎదుట నూతన పద్ధతిలో ధర్నా చేస్తున్న రైతులు

వేలూరు: తిరువణ్ణామలై జిల్లా కలశపాక్కం సమీపంలోని తెన్‌పల్లిపట్టులో ఉన్న వ్యవసాయ విస్తరణ కేంద్రంలో అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి తిరుమాల్ అధ్యక్షతన రైతుల గ్రీవెన్‌సెల్ జరిగింది. ఇందులో జిల్లాలోని అన్ని రైతుల సంఘాలకు చెందిన రైతులు పాల్గొన్నారు. ఆ సమయంలో రైతులు ఉన్న ఫలంగా రైతులు వ్యవసాయం చేసేందుకు ఉపయోగించే మడకలను భుజంపై వేసుకొని వినూత్న పద్ధతిలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తిరువణ్ణామలై జిల్లాలోనే అధికంగా కలశపాక్కం ప్రాంతంలోనే అధికంగా రైతులు పంటలను పండించి దిగుబడి చేస్తున్నారని అయితే ఇక్కడ రెండు రైతు గిడ్డంగిలు మాత్రమే ఉన్నాయన్నారు. అయితే గతంలో ఎనిమిది వ్యవసాయ గిడ్డంగులు ఉండేవని రైతులు పండించిన పంటలను ఇక్కడ తీసుకెళ్లి విక్రయించేవారని తెలిపారు. అయితే ప్రస్తుతం రెండు మాత్రమే ఉండడంతో రైతులు పండించిన పంటలను క్యూలో ఉంచి ఎండకు ఎండి, వర్షానికి తడిచి పంటలు పూర్తిగా నాశనం అవుతుందన్నారు. అధికారులు స్పందించి వ్యవసాయ గిడ్డంగిలు అధికంగా ఏర్పాటు చేసి రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న వ్యవసాయ శాఖ అధికారులు రైతులతో చర్చలు జరిపి ధర్నాను విరమింపజేశారు.

సమన్వయంతో పనిచేస్తేనే సత్ఫలితాలు



సమావేశంలో ప్రసంగిస్తున్న చేనేతశాఖ మంత్రి గాంధీ

తిరువళ్లూరు: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తేనే సత్ఫలితాలు వస్తాయని.. ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని చేనేతశాఖమంత్రి గాంధీ అన్నారు. తిరువళ్లూరు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి హోదాలో జిల్లాలోని అన్ని శాఖలకు చెందిన అధికారులతో ప్రభుత్వ పథకాల అమలు, అబివృద్ధి పనులపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గతంలో ముఖ్యమంత్రిగా కరుణానిధి ఉన్న సమయంలో ప్రజల అవసరాలను గుర్తించి వాటిని వెంటనే అమలు చేయడంతో పాటు నిధుల కేటాయింపులోనూ చురుగ్గా వ్యవహరించేవారని గుర్తు చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసేలా ప్రోత్సహించేవారన్నారు. ఆయన అడుగుజాడల్లోనే ప్రస్తుత సీఎం స్టాలిన్ వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే జరుగుతున్న అబివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరారు. అవసరమైన పనులకు నిధులపై నివేదిక ఇస్తే ముఖ్యమంత్రితో చర్చించి జిల్లాకు న్యాయం జరిగేలా చేస్తానని చెప్పారు. ప్రజాప్రతినిధులు సైతం ప్రజలకు అవసరమైన పనులను గుర్తించడంలో కీలక పాత్ర పోషించాలని, మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. రాష్ట్రాభివృద్ధిలో ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రణాళికతో వెళుతున్నారన్నారు. సీఎం ఆశయాలకు అనుగుణంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పని చేయాలని సూచించారు. కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్, ఎస్పీ పకెర్లా సెఫాస్ కల్యాణ్, డీఆర్వో అశోకన్, ఎంపీ జయకుమార్, ఎమ్మెల్యేలు వీజీ రాజేంద్రన్, కృష్ణస్వామి, చంద్రన్, గణపతి, టీజే గోవిందరాజన్, జెడ్పీ చైర్‌పర్సన్ ఉమామహేశ్వరి, సబ్‌కలెక్టర్‌లు రిషబ్, ఐశ్వర్యరామనాథన్, కేత్రిన్ శరణ్య, గాయత్రి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

నలుగురు మహిళా పోలీసుల సస్పెన్షన్

కొరుక్కుపేట: టీ తాగి డబ్బులు చెల్లించకపోగా దుకాణదారుడిని చంపేస్తామని బెదిరించిన నలుగురు మహిళా పోలీసులను సస్పెండ్ చేస్తూ తాంబరం కమిషనర్ అమల్‌రాజన్ ఉత్తర్వులు జారీ చేశారు. చెన్నైలోని గుడువాంచేరిలోని మహిళా పోలీసు స్టేషన్‌లో విజయలక్ష్మి(40) ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 3వ తేదీ రాత్రి పాతప్పాయి ప్రాంతంలో పెట్రోలింగ్‌లో పాల్గొన్నారు. ఆ సమయంలో ఆమెతో పాటు హెడ్ కానిస్టేబుల్ జయమాల (35), కానిస్టేబుళ్లు ఐశ్వర్య (25), కౌసల్య (25) ఉన్నారు. ఓ టీ దుకాణంలో ఇన్‌స్పెక్టర్ సహా నలుగురు మహిళా పోలీసులు టీ తాగి వెళ్లిపోయేందుకు ప్రయత్నించారు. డబ్బులు ఇవ్వాలని దుకాణాదారుడు కోరడంతో నలుగురు పోలీసులు వాగ్వాదానికి దిగారు. ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి దుకాణాదారుడిని దూషించి డబ్బులు అడిగితే చంపేస్తానని బెదిరించింది. దీనిపై టీ దుకాణదారుడు తాంబరం పోలీసు కమిషనర్ అమల్‌రాజన్‌కు ఫిర్యాదు చేశారు. విచారణలో నిజం అని తేలడంతో నలుగురు మహిళా పోలీసులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నాణ్యమైన వైద్యసేవలను కొనసాగిస్తాం



అర్బన్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్, ఎమ్మెల్యే నాజర్

తిరువళ్లూరు: ఆవడి నియోజవర్గంలో 25 లక్షల వ్యయంతో నిర్మించిన అర్బన్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను ఎమ్మెల్యే నాజర్, కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ ప్రసంగిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలను అందించడానికే అర్బన్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కేంద్రాల్లో యోగా, ప్రసూతి విభాగం, ఫిజియోథెరపీతో పాటు ఇతర వైద్యసేవలను అందిస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే నాజర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా స్టాలిన్ బాధ్యతలు స్వీకరించిన తరువాత వైద్యం, విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. విద్యాశాఖకు ఏటా 30 వేల కోట్లు రూపాయలను ఖర్చు చేస్తుండగా, సుమారు రూ. 40 వేల కోట్లు వైద్యరంగానికి ఖర్చుచేసినట్లు తెలిపారు. నిరుపేదలకు నాణ్యమైన వైద్యాన్ని అందించే విషయంలో రాజీ ఉండదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ జవహర్‌లాల్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైలులో పోగొట్టుకున్న నగలు అప్పగింత

అన్నానగర్: నెల్‌లెక్కి చెందిన మహిళ బుధవారం సెంగోట్టై ఎక్స్‌ప్రెస్ రైలులో 40 సవర్ల నగలను పోగొట్టుకుంది. రైల్వే పోలీసులు నగలను స్వాధీనం చేసుకుని మహిళకు తిరిగి ఇచ్చారు. పాళయంకోట్టై కేటీసీ నగర్‌కు చెందిన కుమార్, భార్య శ్రీదేవి (45) ఈ నెల 6వ తేదీ రాత్రి చెన్నైలోని తాంబరం నుంచి సెంగోట్టై ఎక్స్‌ప్రెస్ రైలులో తిరునెల్వేలి వెళ్లాడు. తంజావూరు జిల్లా పట్టుకోట్టై సున్నంబుక్కర వీధికి చెందిన మహ్మద్ షేర్షా కుమార్తె లుఫ్నా నజరత్ (32) కూడా అదే రైలులో ప్రయాణం చేశారు. రైలు పట్టుకోట్టై వద్దకు రాగానే లుఫ్నా నజరత్ రైలు నుంచి దిగి ఇంటికి వెళ్లింది. బుధవారం ఉదయం నెల్‌లై వద్ద దిగిన శ్రీదేవి ఇంటికి వెళ్లి చూడగా 40 సవర్ల నగలు ఉన్న ట్రావెల్ బ్యాగ్ కనిపించలేదు. దీంతో షాక్ తిన్న ఆమె నెల్‌లై రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు పట్టుకోట్టై రైల్వేస్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో పట్టుకోట్టై రైల్వే పోలీసులు శ్రీదేవితో పాటు ప్రయాణిస్తున్న లుఫ్నా నజరత్ ఇంటికి వెళ్లారు. శ్రీదేవి ట్రావెల్‌బ్యాగ్ అక్కడే ఉందని అప్పుడు తెలిసింది. ఆ బ్యాగులో 40 సవర్ల నగలు కూడా భద్రపరిచారు. లుఫ్నా నజరత్ శ్రీదేవి ఇద్దరి ట్రావెల్ బ్యాగ్‌లు ఒకేలా ఉండడంతో పొరపాటున శ్రీదేవి బ్యాగ్‌ను లుఫ్నా నజరత్ తీసుకెళ్లినట్లు తేలింది. దీంతో పట్టుకోట్టై రైల్వే పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ జగదీశన్ శ్రీదేవిని పిలిపించి ఆభరణాలు ఉన్న ట్రావెల్‌బ్యాగ్‌ను అందజేశారు.

పళ్లిపట్టు పట్టణ పంచాయతీ సమావేశం రద్దు



బోసిపోయిన పట్టణ పంచాయతీ కౌన్సిల్ హాల్

పళ్లిపట్టు: పట్టణ పంచాయతీ సమావేశం బుధవారం రద్దు కావడంతో కౌన్సిల్ హాల్ బోసిపోయింది. పళ్లిపట్టు టౌన్ పంచాయతీ చైర్‌పర్సన్‌గా డీఎంకేకు చెందిన మణిమేగళై, వైస్ చైర్మన్‌గా జ్యోతికుమార్ వ్యవహరిస్తున్నారు. మొత్తం 15 కౌన్సిలర్లలో 13 మంది డీఎంకే సభ్యులు కాగా మరో ఇద్దురు ఇండిపెండెంట్లు ఉన్నారు. అభివృద్ధి పనులు చేపట్టడంతో డీఎంకే సభ్యులు రెండు వర్గాలుగా విడిపోయాయి. ప్రధానంగా లేఅవుట్లకు అనుమతులు, పన్నులు, జనన, మరణ సర్టిఫికెట్ల పంపిణీకి సంబంధించి చైర్‌పర్సన్ కార్యనిర్వహణాధికారిని సంతకాలు పెట్టాలని ఆదేశిస్తున్నట్లు, ప్రభుత్వ నిబంధనలతో సంబంధం లేకుండా పనులు చేయాలని, తాత్కాలిక సిబ్బంది నియామకంలో చైర్‌పర్సన్ కుటుంబీకులనే నియమించుకోవడం టౌన్ పంచాయతీలో పెను దుమారానికి దారి తీసింది. ఈ క్రమంలో బుధవారం కౌన్సిలర్ల సమావేశానికి చైర్‌పర్సన్ సభ్యులకు అజెండా రూపొందించి ఉత్తరాలు పంపగా చివరకు తనకు కార్యాలయ ఓఏ మహిళ తన ఇంటికి అందజేయాలని చైర్‌పర్సన్ పట్టుపడగా ఇష్టంలేని ఓఏ రెండు రోజుల పాటు సెలవులపై వెళ్లారు. చివరకు కార్యనిర్వహణాధికారి చైర్‌పర్సన్ ఇంటికి వెళ్లి సమావేశం అజెండా అందజేసినా స్వీకరించేందుకు నిరాకరించారు. ఈ క్రమంలో జిల్లా మంత్రి రివ్యూ సమావేశం ఉందంటూ బుధవారం ఉదయం 10 గంటలకు సమావేశం రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం.

రూ.500 నోట్లు మారుస్తామని మోసం

- రూ.60 లక్షల రూ.500 నోట్లు స్వాధీనం
- ముగ్గురు అరెస్ట్, పరారీలో ఇద్దరు
- విశాఖలో ఘటన



డీసీపీ వి.విద్యాసాగర్ నాయుడు

అల్లిపురం (విశాఖ దక్షిణ): పది శాతం కమీషన్‌పై రూ.500 నోట్లను రూ.2 వేల నోట్లుగా మార్చుతామని చెప్పి.. రూ.60 లక్షల రూ.500 నోట్లు తీసుకుని పరారైన ముగ్గురిని విశాఖ టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.60 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. విశాఖ డీసీపీ వి.విద్యాసాగర్ నాయుడు బుధవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. విశాఖ మహారాణిపేటలో కొత్త సాలిపేటకు చెందిన పాదిలాపు ధర్మారావుకు కాకినాడకు చెందిన అహ్మద్ మొహిద్దూన్‌తో పరిచయం ఏర్పడింది. రూ.500 నోట్లను రూ.2 వేల నోట్లుగా మారిస్తే పది శాతం కమీషన్ వస్తుందని మాట్లాడుకున్నారు. ఈ విషయాన్ని అహ్మద్‌కు పరిచయం ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు అప్పల రాములరెడ్డి, రామారావులకు చెప్పారు. వీరు తమ చిన్ననాటి స్నేహితుడైన విజయవాడకు చెందిన దుస్తుల వ్యాపారి కిశోర్‌కు భీమిలి పరిసరాల్లో భూమి కొనుగోలు చేయాలని చెప్పి.. డబ్బులు పంపించాలని సూచించారు. దీంతో ఈ నెల 3న కిశోర్ ఇద్దరు వ్యక్తులతో రూ.90 లక్షలు పంపించారు. గొల్లలపాలెం స్టేట్ బ్యాంకు వద్ద వాటిని రూ.2 వేలు నోట్లుగా మారుస్తామని.. అందులో రూ.60 లక్షల రూ.500 నోట్లను తీసుకుని రామారావు, అప్పల రాములరెడ్డి, వీరిద్దరితోపాటు వచ్చిన డాలా సునీల్ అనే వ్యక్తి పరారయ్యారు. ఈ విషయాన్ని విజయవాడ నుంచి వచ్చిన ఇద్దరు వ్యక్తులు కిశోర్‌కు తెలిపారు. దీంతో ఆయన ఈ నెల 3న విశాఖ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన సీఐ బి.తిరుమలరావు నిందితుల్లో అహ్మద్ మొహిద్దూన్, పాదిలాపు ధర్మారావు, డాలా సునీల్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.60 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు రామారావు, అప్పల రాములరెడ్డి కోసం గాలింపు చేపట్టారు.

నీటి అడుగు రాజ్యాలు.. కాలుష్య కాసారాలు

సముద్రాల్లోకి ఏటా 12 మిలియన్ టన్నుల ప్లాస్టిక్

- 2050 నాటికి సముద్రాల్లో చేపల కంటే ప్లాస్టిక్ ఎక్కువగా ఉంటుందని అంచనా
- సముద్ర కాలుష్యం వల్ల ఏటా 100 మిలియన్ జీవుల మృత్యువాత
- ఇప్పటికే మహా సముద్రాల్లో 500 డెడ్ జోన్‌లు
- ఇక్కడ ఆక్సిజన్ లేక జీవం ఉనికి ప్రశ్నార్థకం
- కాలిఫోర్నియాలో విక్రయించే చేపల పొట్టల్లో ప్లాస్టిక్
- వాటిని తింటున్న మనుషులకూ అనారోగ్యం
- 2030 నాటికి 30 శాతం సముద్రాలను రక్షించాలని ప్రపంచ దేశాల తీర్మానం

నేడు మహా సముద్రాల దినోత్సవం



మహా సముద్రాలు మన గ్రహానికి ఊపిరితిత్తులు. మానవ తప్పిదాల కారణంగా ఆ మహా సముద్రాలు కాలుష్య కాసారాలుగా మారి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. భూ ఉపరితలంపై దాదాపు 70 శాతం నీటితో విలువైన వనరులుగా ఉంటూ.. భూమికి ఆక్సిజన్ సరఫరా చేయడంతోపాటు అనేక జాతుల మొక్కలకు, జంతువులకు నిలయంగా జీవ వైవిధ్యాన్ని కాపాడుతున్నాయి. అంతటి మహా సముద్రాలను ప్లాస్టిక్ పొరలు చుట్టేస్తున్నాయి. సాగర గర్భంలోని జాతులను నాశనం చేస్తున్నాయి. సముద్ర కాలుష్యంపై నిర్వహించిన అధ్యయనాల ప్రకారం ఏటా సుమారు 12 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ సముద్రంలో కలుస్తోంది. దీని బరువు లక్ష నీలి తిమింగలాలకు సమానం. ఇది ఇలాగే కొనసాగితే 2050 నాటికి ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రాల్లోని చేపల కంటే ఎక్కువగా ఉంటాయని పరిశోధకులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే అతిపెద్ద గ్రేట్ పసిఫిక్ గార్బేజ్ ప్యాచ్‌తో నిండిపోయింది. ఇందులో 1.8 ట్రిలియన్ ప్లాస్టిక్ ముక్కలు ఉన్నాయి. దీని విస్తీర్ణం అమెరికాలోని టెక్సాస్ భూ భాగానికి రెండింతలు.

సాక్షి, అమరావతి

మహా సముద్రాల్లో 500 డెడ్ జోన్లు

వివిధ రకాల సముద్ర కాలుష్యం కారణంగా ఏటా 100 మిలియన్ సముద్ర జంతువులు ప్రాణాలు కోల్పోతున్నట్టు శాస్త్రవేత్తల అంచనా. ఇది వెయ్యికి పైగా సముద్ర జాతుల ఉనికిపై ప్రభావం చూపుతోందని చెబుతున్నారు. మహా సముద్రాల కాలుష్యం 500 డెడ్ జోన్లను సృష్టించింది. ఇక్కడి ఆక్సిజన్ స్థాయిలు చాలా తక్కువ ఉండటంతోపాటు జీవం ఉనికే ఉండని పరిస్థితి ఏర్పడింది. సముద్రాల్లో మితిమీరిన చేపల వేట కూడా ప్రమాదకరమని అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. మితిమీరిన చేపలు వేట, కాలుష్యం కారకాల నుంచి సముద్రాలను రక్షించాలని ఐక్యరాజ్య సమితిలోని సభ్య దేశాలు తీర్మానించాయి. 2030 నాటికి ప్రపంచంలోని 30 శాతం భూమి, సముద్రాల్లో జీవ వైవిధ్యాన్ని పరిరక్షించాలని ఒప్పందం చేసుకున్నాయి. ఇక స్విస్ ఆధారిత ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్) రెడ్ లిస్ట్ జాబితా ప్రకారం నీటి అడుగున మొక్కలు, జంతువులు 10 శాతం అంతరించిపోయే స్థితిలో ఉన్నట్టు తెలుస్తోంది.

చేపల ద్వారా మానవ దేహంలోకి ప్లాస్టిక్

సముద్రాల్లో ప్లాస్టిక్ సీసాలు, బ్యాగ్‌లు, సిగరెట్ పీకలు, స్ట్రాలు, టైర్లు, వేట వలలు వంటివి చేపలు, ఇతర జీవుల మరణాలకు కారణమవుతున్నాయి. తాబేళ్లు, సముద్ర పక్షులు కొన్నిసార్లు వాటిని ఆహారంగా భావించి తినడంతో వాటి జీర్ణ వ్యవస్థ కోసుకుపోయి.. చివరికి ఆకలితో మరణిస్తున్నాయి. సాగరాల్లోని మైక్రో ప్లాస్టిక్‌లను చేపలు తింటుంటే.. ఆ చేపలను తిన్న మనుషుల శరీరాల్లోకి ప్లాస్టిక్ చేరుతోంది. ఉత్తర పసిఫిక్ తీరంలోని చేపలు ఏడాదికి 24 వేల టన్నుల ప్లాస్టిక్ ముక్కలు తింటున్నట్టు.. అవి మానవుల ఆహారంలో కలుస్తున్నట్టు కనుగొన్నారు. కాలిఫోర్నియాలోని మార్కెట్‌లో విక్రయించే నాలుగింట ఒక వంతు చేపల పొట్టల్లో ప్లాస్టిక్ మైక్రో ఫైబర్స్‌ను గుర్తించారు. ఇక్కడ ఒక వ్యక్తి ఏడాదికి సగటున 74 వేల మైక్రో ప్లాస్టిక్‌లు తింటున్నట్టు తేల్చారు. భారతదేశంలో సముద్రంలో చేరే చెత్తలో 60 శాతం ప్లాస్టిక్ ఉంటోంది. స్వచ్ఛ్ సాగర్, సురక్షిత్ సాగర్ క్యాంపెయిన్ ప్రకారం ఇక్కడి సముద్ర తీరంలోని ప్రతి కిలో మీటరుకు సగటున 0.98 మెట్రిక్ టన్నుల చెత్తను గుర్తించారు.



సముద్ర కాలుష్యం ఇలా..

- సముద్ర కాలుష్యం అనేది కేవలం ప్లాస్టిక్, ఇతర కాలుష్య కారకాల వల్లే కాకుండా.. ఓడలు నుంచి వెలువడే శబ్ద కాలుష్యం కూడా పెను ప్రమాదంగా ఉంది. తిమింగలాలు, డాల్ఫిన్లు వంటి అనేక సముద్ర క్షీరదాలు నీటిలో తమ పరిసరాలను అర్థం చేసుకోవడానికి శబ్దాలు చేయడం ద్వారా సంభాషించుకుంటాయి. దీనిని ఎకోలోకేషన్‌గా పిలుస్తారు. అయితే ఓడలు, సోనార్లు, ఇతర పరికరాల నుంచి వచ్చే కృత్రిమ శబ్దాలు సముద్ర జీవుల కమ్యూనికేషన్‌ను దెబ్బతీస్తున్నాయి. ఫలితంగా వలసలు చెదిరిపోవడంతో పాటు వాటి పునరుత్పత్తి, ఆహార వేట ప్రక్రియలను ప్రభావితం చేస్తోంది. ఒక్కోసారి ఓడలను ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలై మృత్యువాత పడుతున్నాయి.
- చర్మ సౌందర్యానికి వినియోగించే సన్ స్క్రీన్‌ల తయారీలో పగడాలు, ఇతర సముద్ర జీవులను వాడటం వాటికి ప్రాణాంతకంగా మారుతున్నాయి. ఆ జీవుల్లోని ఆక్సిబెంజోన్, ఆక్టినోక్సేట్ వంటి రసాయనాలు చర్మ రక్షణకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.
- సముద్రంలో ముడి చమురు ట్యాంకర్లు రవాణా చేస్తున్నప్పుడు చమురు లీకవడంతో ఆ నీటిలో ఆక్సిజన్ స్థాయిలను తగ్గుతున్నాయి. ఆ చమురు సముద్ర జీవుల రెక్కలకు బలంగా అంటుకోవడంతో ఈదే శక్తిని కోల్పోతున్నాయి. ఆ నీటిలోని చేపలు తినడంతో మానవ ఆరోగ్యంపై ప్రభావం పడుతోంది.
- వ్యవసాయంలో విచ్చలవిడిగా వినియోగించే కృత్రిమ రసాయనాలు, పరిశ్రమల ద్వారా వెలువడే కలుషిత నీరు.. చిన్నచిన్న ప్రవాహాలు, నదుల ద్వారా సముద్రాల్లోకి కలుస్తాయి. లోతైన సముద్రపు మైనింగ్ కారణంగా నీటి అడుగున జీవం ఉనికి కోల్పోతోంది.
- కృత్రిమ కాంతి కాలుష్యం కూడా సముద్ర జీవుల జీవనాన్ని ప్రభావితం చేస్తోంది. ఉదాహరణకు.. ఒక పిల్ల తాబేలు దాని గుడ్డు నుంచి బయటకు వచ్చినప్పుడు, అది సముద్రాన్ని కనుగొనడానికి చంద్రకాంతిని అనుసరిస్తుంది. సముద్రతీర రెస్టారెంట్లు, బీచ్ సైడ్ క్యాబనాస్ (గుడారాలు), క్యాంప్ ఫైర్‌ల వెలుతురు వాటిని అడ్డుకుంటుంది.

• తెలంగాణ

అప్పు ఇచ్చి అఘాయిత్యం!

- ఒత్తిడి చేసి కోరిక తీర్చుకున్న ఎంబీఏ విద్యార్థి
- వీడియో తీసి వైరల్ చేసిన యువకుడు
- స్నేహితులతో కలిసి మళ్లీ బ్లాక్ మెయిల్
- షీటీమ్‌ను ఆశ్రయించిన యువతి

హిమాయత్‌నగర్: కాల్ మనీ తరహా ఉదంతం హైదరాబాద్ నడిబొడ్డున చోటుచేసుకుంది. ఎంబీఏ విద్యార్థినికి అప్పు ఇచ్చిన ఆమె క్లాస్‌మేట్ తిరిగి చెల్లించలేకపోవడాన్ని అదునుగా భావించి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. షీ టీమ్ ద్వారా వివరాలు తెలుసుకున్న నారాయణగూడ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. నారాయణగూడలోని ఓ కళాశాలలో ఎంబీఏ ఫస్టియర్ చదువుతున్న యువతి ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో కొన్ని నెలల క్రితం తన క్లాస్‌మేట్ నుంచి డబ్బు తీసుకుంది. నిర్ణీత సమయంలో ఆ యువతి ఈ బకాయి తీర్చలేకపోయింది. దీంతో అతడు ఎట్టి పరిస్థితుల్లో వెంటనే నగదు చెల్లించాలంటూ ఒత్తిడి చేసి ఆమెను నిస్సహాయురాలిని చేశాడు. ఆ డబ్బు అడగకుండా ఉండాలంటే తన కోరిక తీర్చాలని ఒత్తిడి చేశాడు. గత్యంతరం లేని ఆమె అంగీకరించడంతో కొన్ని రోజుల క్రితం నారాయణగూడలోని ఓయో రూమ్‌కు వెళ్లారు. అక్కడ ఇద్దరూ ఏకాంతంగా ఉండగా సదరు యువకుడు రహస్యంగా వీడియో చిత్రీకరించాడు. దాన్ని మరుసటి రోజు తన స్నేహితులకు చూపించాడు. అప్పటి నుంచి ఇతడితోపాటు మరో నలుగురు యువకులు తమ కోరిక తీర్చాలంటూ ఆమెను బ్లాక్‌మెయిల్ చేయడం మొదలెట్టారు. అలా చేయకుంటే వీడియో వైరల్ చేస్తామని బెదిరించారు. ఆ యువతి ఒప్పుకోకపోవడంతో ఆ వీడియోను కొన్ని వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ చేశారు. ఇన్‌స్టాగామ్‌లో ఓ పేజ్ క్రియేట్ చేసి మరీ పోస్ట్ చేశారు. ఈ పరిణామాలతో తీవ్ర మానసిక క్షోభకు గురైన యువతి ఇటీవల షీ టీమ్‌ను ఆశ్రయించింది. షీటీమ్ ఇన్‌స్టాతోపాటు వాట్సాప్ గ్రూపుల నుంచి ఆ వీడియో డిలీట్ చేయించింది. నిందితులపై కేసు నమోదు చేయాలని నారాయణగూడ పోలీసులకు సిఫార్సు చేసింది. దీంతో నాలుగు రోజుల క్రితం ఐదుగురు యువకులపై కేసు నమోదు చేశారు. నిందితుల కోసం గాలిస్తున్నారు.

దిల్ 'మ్యాంగో' మోర్

- మార్కెట్‌ను ముంచెత్తుతున్న మామిడి పండ్లు
- రూ.100కే మూడు, నాలుగు కిలోలు

సాక్షి, విశాఖపట్నం: మార్కెట్‌ను మామిడి పండ్లు ముంచెత్తుతున్నాయి. నగరంలో రోడ్లు, వీధుల్లో ఇవి దర్శనమిస్తున్నాయి. పైగా చౌకధరకే లభిస్తున్నాయి. అంతేకాదు.. గతం కంటే రుచి, నాణ్యతతో ఉంటున్నాయి. తొలుత వీటి ధర ప్రియంగా ఉండడమే కాదు.. పులుపు, చప్పదనంతో రుచి తక్కువగా ఉండేవి. ఆకర్షణీయమైన రంగుకు ఆకర్షితులైన మామిడి ప్రియులు వీటిని కొనుగోలు చేసి పెదవి విరిచే వారు. కానీ పక్షం రోజుల నుంచి మార్కెట్లోకి మంచి రుచి కలిగిన మామిడి పండ్లు వస్తున్నాయి. వీటి ధర కూడా అందుబాటులోనే ఉంటోంది. నెల కిందట కిలో రూ.60–70 ధర పలికిన మామిడి పండ్లు.. ఇప్పుడు రూ.25–30కే దొరుకుతున్నాయి. ప్రస్తుతం బంగినపల్లి, సువర్ణరేఖ, రసాలు వంటి పండ్లు మూడు, నాలుగు కిలోలు రూ.100కే లభ్యమవుతున్నాయి. మరికొన్ని రకాలైతే రూ.100కు ఐదారు కిలోలు చొప్పున విక్రయిస్తున్నారు. రోడ్ల పక్కన దుకాణాలు ఏర్పాటు చేసి కొందరు, తోపుడు బండ్లపై మరికొందరు, పోగులుగా పెట్టి ఇంకొందరు ఎక్కడికక్కడే అమ్ముతున్నారు. చౌకగా లభిస్తున్న మామిడి పండ్లను పెద్ద సంఖ్యలో కొనుగోలు చేస్తున్నారు.



ఈ ఏడాది ఎగుమతులు లేకే..



ఏటా ఈ ప్రాంతంలో పండిన మామిడి పండ్లు ఎక్కువగా ఇతర రాష్ట్రాలకు వ్యాపారులు ఎగుమతి చేస్తుంటారు. ఎగుమతి చేయగా మిగిలిన పండ్లను స్థానిక మార్కెట్లకు తరలిస్తుంటారు. వాస్తవానికి నిరుడు, ఈ ఏడాది మామిడి పంట ఆశాజనకంగా లేదు. 50 శాతానికి మించి దిగుబడి లేదు. మామిడి దిగుబడి తగ్గిన సంవత్సరం ధరలు అధికంగా ఉంటాయి. కానీ ఈ సంవత్సరం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. కాపు తగ్గినా ధర మాత్రం సరసంగానే ఉంటోంది. ఎగుమతులు క్షీణించడం వల్లే ఈ ఏడాది మామిడి ధర తగ్గడానికి కారణమని వ్యాపారులు చెబుతున్నారు. విశాఖ నగరంలో మామిడి పండ్లను విక్రయించే వారు కాకినాడ జిల్లా తుని, అనకాపల్లి జిల్లా నర్సీపట్నం తదితర ప్రాంతాల నుంచి హోల్‌సేల్‌గా కొనుగోలు చేస్తున్నారు. 20 కిలోల మామిడి పండ్లు రూ.150–200 కొని నగరంలో కిలో రూ.20–30కి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం మామిడి పండ్లు పక్వానికి వచ్చిన కావడం వల్ల రుచిగా ఉంటున్నాయని, ధర కూడా అందుబాటులో ఉండడం వల్ల వీటి విక్రయాలు బాగున్నాయని అక్కయ్యపాలెంలో రాజు అనే అమ్మకందారుడు చెప్పాడు. తాను రోజుకు 400–500 కిలోలు విక్రయిస్తున్నానని, గతంలో కిలో, రెండు కిలోలు తీసుకెళ్లిన వారిప్పుడు రెట్టింపునకు పైగా కొనుగోలు చేస్తున్నారని తెలిపాడు. మరికొద్ది రోజుల పాటు చౌక ధరలే కొనసాగుతాయని, నెలాఖరు వరకు మామిడి పండ్లు అందుబాటులో ఉంటాయని వివరించాడు.

ఉద్యానం.. మరింత విస్తారం

- ఈ ఏడాది 180 ఎకరాల విస్తీర్ణం పెంపు లక్ష్యం
- ఇప్పటికే జిల్లాలో 10,328 ఎకరాల్లో ఉద్యాన పంటలు
- డ్రాగన్, టిష్యూ అరటి, బొప్పాయి సాగుకు ప్రోత్సాహం
- ఈ ఉత్పత్తుల విక్రయాలకు మార్కెటింగ్ శాఖతో ఒప్పందం



సాక్షి, విశాఖపట్నం: ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని విస్తృతం చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం రైతులకు రాయితీలిచ్చి ప్రోత్సహిస్తోంది. రాష్ట్రీయ కృషి వికాస్ యోజనలో ఉద్యాన విస్తరణ పథకం కింది ఏటా కొంతమేర దీనిని విస్తరించాలని లక్ష్యాన్ని నిర్దేశించింది. విశాఖపట్నం జిల్లాలో 10,328 ఎకరాల ఉద్యాన పంటల విస్తీర్ణం ఉంది. ఈ ఏడాది అదనంగా మరో 180 ఎకరాల్లో ఈ పంటలను విస్తరించాలని జిల్లా ఉద్యానశాఖ నిర్ణయించింది. ఇందుకు అవసరమైన ప్రక్రియను ఉద్యానశాఖ అధికారులు చేపట్టారు. ఉద్యాన విస్తరణ పథకం కింద డ్రాగన్ ఫ్రూట్, టిష్యూ కల్చర్ అరటి, బొప్పాయి, కూరగాయలు తదితర పంటలు సాగు చేస్తారు. వీటితో పాటు జిల్లాలో మరో 500 ఎకరాల్లో ఆయిల్‌పాం తోటలు పెంచేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ పథకంలో సాగు చేసే పంటలకు ప్రభుత్వం రాయితీ కూడా ఇస్తోంది. మొక్కలు, ఎరువులతో పాటు సాగుకు అవసరమైన పనిముట్లకు కూడా యూనిట్ ధరను బట్టి గరిష్టంగా 50 శాతం వరకు సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహిస్తోంది. ఇందుకోసం ప్రస్తుతం జిల్లా ఉద్యానశాఖ అధికారులు ఆర్బీకే స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉద్యాన సాగు పెంపు ఆవశ్యకత, అధిక దిగుబడులనిచ్చే వంగడాలు, ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు తదితర అంశాలను రైతులకు వివరిస్తున్నారు. అదే సమయంలో వీటికి అర్హులైన రైతులను గుర్తింపు ప్రక్రియను కూడా మొదలు పెట్టారు. ఈ నెల 15 వరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. అనంతరం అవసరమైన నర్సరీలను కూడా ఎంపిక చేసి మొక్కలను పంపిణీ చేస్తారు. ఉద్యాన పంటల విస్తరణకు నీటి పారుదల, డ్రిప్, స్ప్రింక్లర్లు వంటి సదుపాయాలు కలిగి ఉండాలి. మరోవైపు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకాన్ని కూడా ప్రోత్సహిస్తున్నారు. ఇందులో మొక్కలను ఉచితంగా ఇవ్వడమే కాకుండా ఇందుకు అవసరమయ్యే కూలీలను కూడా ఈ పథకంలో సమకూరుస్తారు. ఇది రైతులకు ఆర్థికంగా ఎంతో వెసులుబాటు చేకూర్చనుంది.



ఉద్యాన విస్తరణ పథకంపై వేములవలసలో సమావేశమైన ఉద్యానశాఖ అధికారులు

మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తాం



రైతులు పండించిన ఈ ఉద్యాన పంటలకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తాం. ఈ ఉత్పత్తులను రైతు బజార్లలో విక్రయించేలా మార్కెటింగ్ శాఖ ద్వారా చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం ఈ రైతులకు కార్డులను జారీ చేస్తాం. ఉద్యాన పంటల నాణ్యత, దిగుబడులు పెంచడం, రైతులకు మంచి ధర గిట్టుబాటు అయ్యేలా చూడడం వంటివి లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నాం.
– మన్మథరావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి, విశాఖపట్నం



ఆన్‌లైన్ గేమ్‌లతో ఆనందం ఆవిరి.!

- పబ్జీ గేమ్‌లకు బానిసలవుతున్న యువత
- స్మార్ట్ ఫోన్లకు అతుక్కుపోతున్న విద్యార్థులు
- మెదడుపై ప్రభావం చూపుతుందంటున్న వైద్యులు
- సంప్రదాయ క్రీడలే మేలంటున్న వైద్య నిపుణులు

విశాఖ విద్య: 'పెదవాల్తేరుకు చెందిన అవినాష్ నగరంలోని ఓ ప్రైవేటు స్కూల్లో ఆరో తరగతి చదువుతున్నాడు. రాత్రి వేళ నిద్రలో కూడా వింత వింత శబ్దాలు చేస్తున్నాడు. బాలుడి పరిస్థితిని చూసిన తల్లిదండ్రులు ఏమైందోననే ఆందోళనతో వైద్యుని వద్దకు తీసుకెళ్లారు. రెండు పర్యాయాల పరిశీలన అనంతరం బాలుడి అసలు సమస్యను వైద్యులు గుర్తించారు. గంటల తరబడి సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్‌లు ఆడడం వల్ల అబ్బాయి మెదడుపై ప్రభావం చూపిందని తేల్చిచెప్పారు. స్మార్ట్ ఫోన్‌కు దూరంగా ఉంచి, కొన్ని రోజులు జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు'.

విశాఖ నగరంలోని ఒక్క అవినాషే కాదు.. వందలాది మంది విద్యార్థులు, యువత ఆన్‌లైన్ గేమ్‌లతో రేయింబవళ్లు కాలక్షేపం చేస్తూ మానసిక ఆనందానికి దూరమైపోతున్నారు. స్మార్ట్ ఫోన్‌తో ప్రపంచం అరచేతిలోకి వచ్చేసింది. సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతున్న తరుణంలో ఆండ్రాయిడ్ ఫోన్ల వినియోగం బాగా పెరిగింది. పోటీ ప్రపంచంలో నెగ్గాలంటే విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాల్సిందే. దీంతో స్మార్టు ఫోన్లు వినియోగం తప్పనిసరైంది. అయితే స్మార్ట్ ఫోన్‌తో ఎంతటి లాభం ఉందో, అదే స్థాయిలో నష్టాన్ని చేకూరిస్తోంది.



బెట్టింగ్‌కు బలైపోతున్న యువత

గుట్టుచప్పుడు కాకుండా ఆన్‌లైన్ బెట్టింగ్ జోరుగా సాగుతోంది. విశాఖ కేంద్రంగా సాగుతున్న బెట్టింగ్ మాఫియాను పోలీసులు సైతం గుర్తించారు. వివిధ యాప్స్ ద్వారా నిర్వహిస్తున్న ఆన్‌లైన్ పేకాటకు అన్ని వర్గాల వారు బానిసలైపోతున్నారు. దీంతో పాటు డ్రీమ్ యాప్ ద్వారా క్రికెట్, కబడ్డీ, ఫుట్‌బాల్ ఆటలు ఉన్నాయి. గేమ్‌లో కొంత మందిని ఎంపిక చేసుకుని బెట్టింగ్ పెడతారు. వారు బాగా ఆడినట్లైతే వచ్చే పాయింట్లు బట్టి గెలుపును నిర్ధారిస్తారు. ప్రైజ్ మనీగా రూ.10 నుంచి రూ.లక్ష వరకు ఉండడంతో ఎక్కువ మంది ఈ గేమ్‌లోనే మునిగి తేలుతూ డబ్బులు పోగొట్టుకోవడమే కాకుండా, సమయం వృథా చేస్తూ వాటికి బానిసలైపోతున్నారు.

పబ్జీతో మొద్దుబారుతున్న మెదడు

కొన్నేళ్లు బ్యాన్ చేసిన పబ్జీగేమ్ మళ్లీ సరికొత్త గా స్మార్ట్‌ఫోన్‌లోకి వచ్చి చేరింది. పబ్జీతో పాటు, ఫ్రీ ఫైర్, కాల్ ఆఫ్ డ్యూటీ వంటి ఆన్‌లైన్ ఆటలు ఎక్కువ మంది ఆడుతున్నారు. వీటిని నలుగురు కలిసి ఒకేసారి ఆడవచ్చు. వేర్వేరు ప్రాంతాలు, ఇతర రాష్ట్రాలకు చెందిన వారైనా సరే నలుగురు మాట్లాడుకుంటూ గేమ్‌లో పాల్గొనే అవకాశం ఉంది. దీంతో ఎక్కువగా పాఠశాల, కాలేజీ స్థాయి విద్యార్థులు పబ్జీ గేమ్‌లకు బానిసలవుతున్నారు.

ఆన్‌లైన్ గేమ్‌లతో ప్రమాదం



పిల్లలు, అందులోనూ చదువుకునే వారు ఆన్‌లైన్ గేమ్‌లు ఆడటం ఎంత మాత్రం శ్రేయస్కరం కాదు. ఆన్‌లైన్ గేమ్‌ల వల్ల మానసిక ఆనందం కోల్పోతారు. మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. శారీరకంగా అలసట కలిగే ఆటలు ఆడుకోవాలి. పుస్తక పఠనం మంచి పద్ధతి. ఈ విషయంలో తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకమైనదే.
– డాక్టర్ రమేష్‌బాబు, మానసిక వైద్య నిపుణులు, విశాఖపట్నం

తల్లిదండ్రులు ఓ కంట కనిపెట్టాలి



ఏదో కాలక్షేపం కోసమని కొద్దిసేపు ఆన్‌లైన్ గేమ్ ఆడితే పరవాలేదు. కానీ అదే పనిగా గంటల తరబడి స్మార్ట్‌ఫోన్‌కు అతుక్కుపోతుంటే, ఓ కంట కనిపెట్టాల్సిందే. ఈ విషయంలో తల్లిదండ్రులు బాధ్యత కూడా ఎక్కువగా ఉంటుంది. పిల్లాడి ఆనందం కోసమని స్మార్ట్‌ఫోన్ ఇచ్చేసి, వదిలేయకూడదు. వారితో రోజులో కొద్దిసేపు అయినా గడిపి, కబుర్లతో కాలక్షేపం చేయాలి.
– డాక్టర్ జి.సీతారాం, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు

ఉలెన్ గౌను అల్లాలంటే...
పాపాయి మనింట్లోనే ఉండాలా?
మన పాపాయి పెద్దయింది. ఓకే...
మరో ఇంటి బుజ్జి పాపాయి కోసమూ అల్లచ్చు.
మన చుట్టూ...
గౌను అల్లుకునే సమయం లేని అమ్మ ఉంటుంది.
అల్లుకోవడం చేతరాని అమ్మలు ఉంటారు.
ఖరీదైన గౌను కొనుక్కోలేని అమ్మ కూడా ఉంటుంది.
ఆ అమ్మల బిడ్డలకు తాను అమ్మమ్మ ఎందుకు కాకూడదు?
'ఇన్నేళ్లు... మన కోసం మనం జీవించాం.
ఇకపై సమాజం కోసమూ పని చేద్దాం'
తెన్నేటి మాట ఇది.


తెన్నేటి విజయలక్ష్మీ రావు

అనుబంధాల అల్లిక

తెన్నేటి విజయలక్ష్మీరావు 1984లో యూఎస్‌కి వెళ్లారు. పుట్టిన నేల నుంచి దూరంగా వెళ్లేటప్పుడు అదే తన స్థిరనివాసం అవుతుందని అనుకోలేదామె. దాదాపు నలభై ఏళ్లు... అక్కడి నేల, నీరు, గాలితో మమేకమై జీవించిన విజయలక్ష్మి చిన్నప్పటి హాబీలను పునరుద్ధరించుకున్నారు. విశ్రాంత జీవితాన్ని సమాజానికి అంకితం చేస్తున్న విజయలక్ష్మి 'సాక్షి'తో పంచుకున్న వివరాలివి.

అమ్మ ముందుచూపు!

మా అమ్మ చిన్నప్పుడు రకరకాల కుట్లు, అల్లికలు నేర్పించింది. ఇన్ని రకాలెందుకంటే... 'ప్రతిదీ ఒక కళ. అలాగే ఇవన్నీ అన్నం పెట్టే కళలు. ఎప్పుడు ఎలాంటి అవసరం వస్తుందో చెప్పలేం. ఎన్ని నేర్చుకుంటే జీవితానికి అంత భరోసా' అనేది. షార్ట్ హ్యాండ్, టైప్, డ్రాయింగ్, పెయింటింగ్, నిట్టింగ్, క్రోషియో అల్లకం, గార్మెంట్ మేకింగ్‌లో శిక్షణ ఇప్పించింది. అల్లికలతో ఇప్పుడు ప్రతి రోజునూ ఉత్సాహవంతంగా మార్చుకున్నాను. నా హాబీ కరోనా సమయంలో బాగా ఉపయోగపడింది. వందలాది క్లాత్ మాస్కులు కుట్టిచ్చాను. కుట్టిన వాటిని గేటుకు మెయిల్ బాక్స్ పక్కనే మరో బాక్స్ పెట్టి అందులో ఉంచితే అవసరమైన వాళ్లు తీసుకెళ్లేవారు. ఇక్కడి వాళ్లు కొన్ని విషయాల్లో చాలా మంచి విలువలు పాటిస్తారు. తనకు అవసరమైనంత వరకే తీసుకుని మిగిలిన వాటిని అలాగే ఉంచుతారు.



విజయలక్ష్మి అల్లిన ఊలు గౌను, పిల్లలు ఆడుకునే బొమ్మ.

ఇక్కడ వాతావరణానికి ఉలెన్ క్యాప్‌లు, సాక్స్, స్వెటర్, బ్లాంకెట్‌లు ఉండి తీరాలి. వాటిని అల్లడం నాకిష్టమైన వ్యాపకం. అవసరమైన వాళ్లకు ఇవ్వడం సంతోషకరం. చిన్న పిల్లల తల్లులు తమ ఉద్యోగాలు, ఇల్లు చూసుకోవడంతో రోజు పూర్తయిపోతుంది. అలాంటి వారికి నా సర్వీస్ చాలా ఉపయోగపడుతోంది. ఇక్కడ అందరికీ నన్ను ఆత్మీయురాలిని చేసింది ఈ హాబీలే. నా కొడుకు పిల్లలకు నానమ్మని. కానీ మా టౌన్‌లో పిల్లలందరికీ అమ్మమ్మని. నా మరో హాబీ వంట. నేను పుట్టింది, పెరిగింది నాగపూర్‌లో. నార్త్, సౌత్ అన్నీ వండుతాను. నేను ఎవరింటికి వెళ్తున్నా, ఏ వేడుకకు వెళ్తున్నా ఏదో ఒక వంట చేసుకుని వెళ్తాను. దాంతో ఫలానా వంట చేసుకురమ్మని మరీ చెబుతారు కూడా.

రోజూ బిజీ!

నాకిప్పుడు 67 ఏళ్లు. మా వారితో కలిసి ఉదయం గార్డెనింగ్ చేస్తాను. నన్ను నేను బిజీగా ఉంచుకోవడానికి ఎన్ని పనులనైనా చేస్తాను. మన నేల మీద రూపుదిద్దుకున్న కళలు, మన సమాజం నేర్పించిన విలువలను ఈ తరానికి పరిచయం చేయడమే ప్రధానంగా ఉంటాయి మా ప్రోగ్రామ్‌లన్నీ. ఇప్పుడు కూడా మేముంటున్న మాన్లియస్ పట్టణంలో రచయిత, స్వరకర్త వీణాపాణి గారి ప్రోగ్రామ్ కోసం ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ పట్టణం న్యూయార్క్, గ్రేటర్ సైరక్యూజ్ పరిధిలోకి వస్తుంది. మాది చిన్న పట్టణం, చాలా సౌకర్యంగా ఉంటుంది జీవనం. యూఎస్ మమ్మల్ని బంధీని చేసినప్పటికీ ఇండియాకి తరచూ వస్తుంటాం.

ఇల్లు.. ఉద్యోగం.. స్నేహితులు

''మా వారు ఫిజిసిస్ట్, పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌తో మనదేశ ఎల్లలు దాటాం. ఆ ఫెలోషిప్ పూర్తయిన తరవాత ఇండియాకి వచ్చేయాలనే ఉద్దేశమే అప్పట్లో. బిడ్డనెత్తుకుని అమెరికా విమానం ఎక్కాను. ఆ వెళ్లడం వెళ్లడం అలాగే ఉండిపోతామని ఏ మాత్రం ఊహించలేదు. ఇండియాలో ఎమ్ఈడీ, ఎం ఫిల్ చేసి ఇక్కడికి (యూఎస్) వచ్చాను. కొంతకాలం స్టోర్స్‌లో పార్ట్‌టైమ్ జాబ్స్ చేసి, ఆ తర్వాత కంప్యూటర్స్‌లో అసోసియేట్ డిగ్రీ చేసి క్యారియర్ కార్పొరేషన్‌లో ఉద్యోగంలో చేరాను. అమ్మానాన్న ఓ అబ్బాయి... ఇదీ మా న్యూక్లియర్ ఫ్యామిలీ. ఉద్యోగం, ఇల్లు చూసుకుంటూ భారతీయుల సమావేశాలకు హాజరుకావడం, సాంస్కృతిక, ధార్మిక, సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో స్వచ్ఛందంగా పని చేయడంలో చురుగ్గా ఉండే దాన్ని. దాంతో నాకు స్నేహితులూ ఎక్కువే.

జీవితం పరీక్ష పెట్టింది

ఇదిలా ఉండగా జీవితం పెట్టిన విషమ పరీక్ష మా కుటుంబాన్ని కదిలించి వేసింది. మా వారికి తీవ్రమైన అనారోగ్యం, ఆయనకు ఆపరేషన్‌లు జరుగుతుండగా నాకు తరచూ విపరీతమైన తలనొప్పి రావడం మొదలైంది. మొదట్లో ఆయన ఆరోగ్యం గురించి ఆందోళనతో ఒత్తిడి లోనవడంతో తలనొప్పి వస్తోందనుకున్నాం. నాకు 2009లో బ్రెయిన్ సర్జరీ చేయాల్సి వచ్చింది. జీవితం పెట్టిన పరీక్షలో ఇద్దరమూ నెగ్గాం. విజేతలుగా తిరిగి మా జీవితాన్ని కొనసాగించాం. అయితే ఆ పరీక్షలు మాలో చాలా మార్పు తెచ్చాయని తర్వాత తెలిసింది. జీవితం పట్ల, సమాజం పట్ల మా దృష్టి కోణం పూర్తిగా మారిపోయింది. హాబీల పునరుద్ధరణతో నా సెకండ్ ఇన్నింగ్స్ మొదలైంది'' అన్నారు తెన్నేటి విజయలక్ష్మీరావు.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

రీసైకిల్




'మీ దగ్గర పాడైన
పిల్లల సైకిళ్లుంటే ఇవ్వండి.
రిపేరు చేసి పేద విద్యార్థులకు ఇస్తాం'
అని కేరళలోని ఒక స్కూల్ విద్యార్థులు
వాట్సప్‌లో ప్రచారం చేశారు.
30 సైకిళ్లు వస్తే గొప్ప అనుకున్నారు.
కాని ఆ స్కూల్ ఉన్న ఊరే కాదు
మొత్తం జిల్లాయే స్పందించింది.
122 సైకిళ్లు వచ్చిపడ్డాయి.
కేరళ స్పీకర్ వచ్చి జెండా ఊపగా
ఇంతకుముందు
సైకిల్ లేని పిల్లలందరూ
సైకిళ్ల మీద రయ్యిమని దూసుకెళ్లారు.
ఎంత బాగుంది ఇది.
మన ఊళ్లో చేద్దామా?

ఇలా మన ఊళ్లో చేద్దామా?

'ఇచ్చుటలో ఉన్న హాయి వేరెచ్చటనూ లేనే లేదు' అన్నాడో సినీ కవి. మన దగ్గర ఉన్న దానిలో కాస్తో కూస్తో అక్కర ఉన్నవారికి ఇస్తే, వారి కళ్లల్లో సంతృప్తిని చూస్తే కలిగే హాయి అంతా ఇంతా కాదని కవి భావం.

కేరళలోని కన్నూరు జిల్లాలోని పయ్యనూర్ అనే ఊళ్లో 'షెనాయ్ హయ్యర్ సెకండరీ స్కూల్' అనే స్కూల్ విద్యార్థులు ఈ పాఠం బాగానే వంట బట్టిచ్చుకున్నట్టున్నారు. 6 నుంచి 12 తరగతి విద్యార్థులు అక్కడ చదువుకుంటారు. అదే స్కూల్‌లో మన ఎన్.సి.సిలాగా 'స్టూడెంట్ పోలీస్ క్యాడెట్' విభాగం ఉంది. వేసవి సెలవుల్లో ఈ పోలీస్ క్యాడెట్ లంతా సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్ని పాత వస్తువులను రీయూజ్ చేయడం ఎట్లా అనే అంశంపై ప్రయోగాలు చేశారు. ఆ సమయంలోనే ఆ క్యాడెట్‌కు శిక్షణ ఇచ్చే సి.వి.రాజు అనే టీచర్‌కు 'రీసైకిల్' ఆలోచన వచ్చింది.



స్కూల్‌కు సైకిల్ మీద

షెనాయ్ స్కూల్‌కు చాలా మంది విద్యార్థులు సైకిళ్ల మీద వస్తారు. అయితే సైకిల్ కొనుక్కోలేక, కాలి నడకన వచ్చే విద్యార్థులు చాలామంది ఉన్నారు. 'మాకో సొంత సైకిల్ ఉంటే' అనే భావన వారి కళ్లల్లో కనిపిస్తూ ఉంటుంది. 'చాలామంది తల్లిదండ్రులు సైకిళ్లు కొని పిల్లలు పెద్దవాళ్లయ్యారనో, పాతవయ్యాయనో, పాడయ్యాయనో వాడకుండా ఇళ్లల్లో పడేసి ఉంటారు. అలాంటివి డొనేట్ చేయమని అడుగుదాం. రిపేర్ చేసి మన స్కూల్‌లోని పేద పిల్లలకు ఇద్దాం' అని ఆ టీచర్ ప్రతిపాదిస్తే స్టూడెంట్స్ 'ఓఎస్' అన్నారు.

వాట్సప్ ప్రచారం

'మీరు వాడకుండా పడేసిన సైకిళ్లను పేద విద్యార్థుల కోసం ఇవ్వండి' అనే వాట్సప్ ప్రచారాన్ని షెనాయ్ స్కూల్ విద్యార్థులు మొదలెట్టారు. ఇరవయ్యో ముప్పయ్యో సైకిళ్లు వస్తాయని భావించారు. కాని పయ్యనూర్‌లో మాత్రమే కాదు కన్నూరు జిల్లాలో, పక్కనే కాసర్‌గోడ్ నుంచి కూడా ఎందరో ఫోన్లు చేసి 'సైకిల్ ఉంది తీసుకెళ్లండి' అని చెప్పారు. అనూహ్య స్పందన వచ్చింది. వీటిని సేకరించడానికి ఒక మహానుభావుడు వెహికిల్‌ను అరేంజ్ చేస్తే, కొంతమంది విద్యార్థులు ఆ వెహికిల్ మీద జిల్లా అంతా తిరిగి సైకిళ్లు తెచ్చారు. 122 సైకిళ్లు వచ్చాయి. ఇంకా ఫోన్ కాల్స్ వస్తూనే ఉన్నా చాలని ఆపారు. వచ్చి పడ్డ సైకిళ్లతో స్కూల్ సైకిల్ ఫ్యాక్టరీగా మారింది.

రిపేర్ సేన

ఇప్పుడు స్పేర్‌పార్ట్‌లు, రిపేర్లు ఎలా? కొంత మంది దాతలు స్పేర్‌పార్ట్‌లకు డబ్బులు ఇచ్చారు. కాని ఏ సైకిల్ మెకానిక్ దగ్గరకు వెళ్లి 'పుణ్యకార్యం... రిపేర్లు చేసి పెట్టండి' అంటే ఎవరూ రాలేదు. కాని ప్రేమ్‌రాజ్ అనే మెకానిక్ మాత్రం 'మీకు నేర్పుతాను. మీరే రిపేర్లు చేయండి' అని 44 మంది ఇంటర్ విద్యార్థులను సెలెక్ట్ చేసి మూడు నాలుగు రోజులు ట్రైనింగ్ ఇచ్చాడు. ఇక ఆ ఇంటర్ విద్యార్థులే సైకిల్ మెకానిక్‌లుగా మారి దశల వారీగా రిపేర్లు చేశారు. 'మా టీమ్‌లో అమ్మాయిలు, అబ్బాయిలు ఉన్నారు. అందరం మంచి మెకానిక్‌లుగా రిపేర్లు చేశాం. పెయింట్లు కూడా వేశాం' అని విద్యార్థులు తెలిపారు.

మంచి పనికి పెద్దలు

సైకిళ్లు రెడీ. ప్రతి క్లాస్‌లోని క్లాస్ టీచర్ ఆ క్లాస్‌లో అత్యంత నిరుపేద విద్యార్థులను ఎంపిక చేసి పట్టిక రెడీ చేశారు. ఈ మంచి పని గురించి తెలుసుకున్న అసెంబ్లీ స్పీకర్ ఏ.ఎస్. షమీర్ స్కూల్‌కు హాజరయ్యి విద్యార్థులకు సైకిళ్లు బహూకరించి జెండా ఊపారు. తమకంటూ ఒక సైకిల్ వచ్చినందుకు ఆ పిల్లలంతా సంబరంతో రయ్యిమని తొక్కుతూ ఉంటే అందరూ ఎంతో సంతోషించారు. షెనాయ్ స్కూల్లో సగంమందీ... మిగతా స్కూళ్ల నుంచి సగం మంది పేద విద్యార్థులు ఈ సంవత్సరం తమ సొంత సైకిళ్ల మీద స్కూళ్లకు వెళ్లనున్నారు.

ఇదేం పెద్ద పని కాదు. మన ఊళ్లో ట్రై చేద్దామా!

విజయపథం

టెక్నోస్టార్

పుణెలోని ఆ ఇంట్లో మరాఠీ, హిందీ పాటలతో పాటు పాఠాలు కూడా వినిపించేవి.

అయితే అవి క్లాస్‌రూమ్ పాఠాలు కాదు. ఎన్నో రంగాలలో ఎన్నో అద్భుత విజయాలు సాధించిన మహిళల గురించిన గెలుపు పాఠాలు. ఆ పాఠాలు వింటూ వింటూ 'నేను కూడా సాధిస్తాను' అన్నది చిన్నారి నేహ.

అవును ఆమె సాధించింది!

ఫోర్బ్స్ అమెరికా 'రిచ్చెస్ట్ సెల్ఫ్-మేడ్ ఉమెన్-2023' జాబితాలో వివిధ రంగాలకు చెందిన వందమంది మహిళలకు చోటు దక్కింది. వీరిలో పదకొండు మంది నలభై ఏళ్ల వయసులోపు ఉన్నవారు. వారిలో ఒకరు 38 సంవత్సరాల టెక్నాలజీ ఎంటర్‌ప్రెన్యూర్ నేహ నర్ఖడే....

మహారాష్ట్రలోని పుణెలో పుట్టి పెరిగింది నేహ. ఎనిమిది సంవత్సరాల వయసులో ఉన్నప్పుడు తల్లిదండ్రులు తనకు కంప్యూటర్ కొనిచ్చారు. అప్పుడు టెక్నాలజీపై మొదలైన ప్రేమ అలా కొనసాగుతూనే ఉంది. టెక్నాలజీ ఎంటర్‌ప్రెన్యూర్‌గా కొత్త కొత్త విజయాలు సాధించేలా చేస్తూనే ఉంది.

తన బలం 'తల్లిదండ్రులు' అని చెప్పుకుంటుంది నేహ. 'మొదట చదువు విలువ గురించి చెప్పారు. చదువుపై ఆసక్తి పెరిగేలా చేశారు. ఎంతోమంది మహిళా రోల్‌మోడల్స్ గురించి చెప్పేవారు. నువ్వు కూడా ఏదైనా సాధించాలి అంటూనే... యస్. నువ్వు సాధించగలవు అనే ధైర్యాన్ని ఇచ్చారు. ఎప్పటికప్పుడు కొత్త విషయాలు నేర్చుకునేలా ప్రోత్సహించారు' అంటుంది నేహ.

పుణె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంప్యూటర్ టెక్నాలజీలో చదువుకున్న నేహ ... జార్జియా (యూఎస్)లో కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ చేసింది.

జార్జియాలో చదువుకునే రోజుల్లో ఎలాంటి కెరీర్ ఎంచుకోవాలి అనే విషయంలో ఎంతోమంది స్నేహితులతో చర్చిస్తూ ఉండేది. 'ఒరాకిల్'లో ప్రిన్సిపల్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా తొలి ఉద్యోగం చేసిన నేహ ఆ తరువాత 'లింక్డ్ ఇన్'లో చేరింది. ఆ సమయంలో రకరకాల స్టార్టప్‌లు, వాటి విజయాల గురించి తెలుసుకోవడం మొదలుపెట్టింది.

సొంతంగా ఏదైనా చేయాలనే ఆలోచనతో 'అపాచీ కాఫ్కా' అనే ఓపెన్ సోర్స్ ప్లాట్‌ఫామ్‌కు శ్రీకారం చుట్టింది. కంపెనీలు తమ డాటాతో వేగంగా యాక్సెస్ అయ్యే అవకాశాన్ని ఈ ప్లాట్‌ఫామ్ కల్పిస్తుంది.

'ఎలాంటి జటిలమైన సమస్యను అయినా పరిష్కరించే సామర్థ్యాన్ని పెంచుకోవాలి' అనేది లక్ష్యంగా నిర్ణయించుకుంది. రెండు సంవత్సరాల తరువాత 'కన్‌ఫ్లూయెంట్' అనే ఫుల్-స్కేల్ డాటా స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించింది నేహ. ప్రపంచవ్యాప్తంగా వేలాది కంపెనీలు 'కన్‌ఫ్లూయెంట్' నుంచి సేవలు పొందుతున్నాయి.



> టైమ్ మేనేజ్‌మెంట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి. ఒత్తిడికి దూరంగా ఉండాలి. ఏ రోజైనా సరే... చేయాల్సిన పనిపై పక్కా ప్రణాళిక ఉండాలి.
> – నేహ

కంపెనీకి సంబంధించి భాగస్వాములు, ఉద్యోగులను ఎంచుకోవడంలో నేహ అనుసరించే పద్ధతి ఏమిటి? ఆమె మాటల్లో చెప్పాలంటే... 'తెలివితేటలతో పాటు కష్టపడే స్వభావం ముఖ్యం. వీరితో ఐడియాలు షేర్ చేసుకుంటే సౌకర్యవంతంగా ఉంటుంది అనిపించాలి. సమస్య తలెత్తినప్పుడు మెరుపు వేగంతో పరిష్కరించే సామర్థ్యం ఉండాలి'

నేహ ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రయాణం మొదలు పెట్టినప్పుడు స్టార్టప్ కల్చర్‌పై ఇప్పుడు ఉన్నంత అవగాహన లేదు. ప్రతి అడుగు ఆచితూచి వేసినా ఎక్కడో ఏదో తప్పు జరుగుతుండేది. వెంటనే ఆ తప్పును దిద్దుకొని ముందుకు సాగేది.

నేహా నర్ఖడే విజయరహస్యం ఏమిటి?

'వ్యూహాలు, ప్రతివ్యూహాల సంగతి తరువాత. ఎంటర్‌ప్రెన్యూర్‌లకు తప్పనిసరిగా కావాల్సింది మానసిక బలం. ఆ బలం ఉంటే యుద్ధరంగంలో అడుగు ముందుకు వేయగలం. విజయాలు సాధించగలం. ఇది నా దారి... అంటూ పరుగెత్తడం కాదు. చుట్టూ ఏం జరుగుతుందో అనేదానిపై పరిశీలన దృష్టి ఉండాలి. మన తప్పుల నుంచీ కాదు ఇతరుల తప్పుల నుంచి ఎన్నో పాఠాలు నేర్చుకోవచ్చు. టైమ్ మేనేజ్‌మెంట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి. ఒత్తిడికి దూరంగా ఉండాలి. ఏ రోజైనా సరే... చేయాల్సిన పనిపై పక్కా ప్రణాళిక ఉండాలి' అంటుంది నేహ.

నేహ ఇప్పుడు ఎంతోమంది మహిళలకు రోల్‌మోడల్, తన రోల్‌మోడల్ మాత్రం ఎలక్ట్రిక్ కార్ స్టార్టప్ 'నియో' ఫౌండర్, సీఈవో పద్మశ్రీ వారియర్.

'రోల్‌మోడల్ స్థానంలో మనల్ని మనం చూసుకుంటే వారిలా విజయం సాధించడం కష్టం కాదు' అంటుంది నేహ నర్ఖడే.

సైబర్ టాక్

టీచర్లూ.. డిజిటల్ పాఠాలకు సిద్ధమేనా?!

టెక్నాలజీ యుగం అవడంతో స్కూల్ పిల్లలు కూడా డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌ను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. గేమింగ్, బ్రౌజింగ్, షాపింగ్.. వంటివి ఎలాంటి సంకోచం లేకుండా వాడేస్తుంటారు. ఇక కొంతమంది పిల్లలు సోషల్‌మీడియా, వాట్సాప్ గ్రూప్‌ల్లో తమకు నచ్చే, నచ్చని టీచర్లపై కామెంట్స్ విసురుతుంటారు. టెక్నాలజీ వాడకంలో పిల్లల నైపుణ్యాలు ఎలా పెరగాలి? భవిష్యత్తు పట్ల వారు ఎంత సురక్షితంగా ఉండాలి? ఈ విషయాల గురించి స్టూడెంట్స్‌కు వివరించడానికి టీచర్లు తమను తాము సిద్ధం చేసుకోవాల్సిన సమయం ఇది.

త్వరలో స్కూళ్లు తిరిగి ప్రారంభమవబోతున్నాయి. ఇప్పటికే వేసవి సెలవుల్లో ఇంట్లో ఉన్న పిల్లలు చాలా వరకు డిజిటల్ అడిక్షన్‌కు లోనై ఉంటారు. దీనితో పాటు స్కూళ్లలో టెక్నాలజీ వాడకం ఈ రోజుల్లో తప్పనిసరి అయ్యింది. ఇలాంటప్పుడు ఆన్‌లైన్ ప్రయోజనాలను పొందుతూనే తమ డేటాను సురక్షితంగా ఉంచడానికి, డిజిటల్ టెక్నాలజీని వాడుతున్నప్పుడు తమను తాము సురక్షితంగా ఉంచుకోవడం ఎలాగో విద్యార్థులకు నేర్పడానికి టీచర్లు సిద్ధమవ్వాలి.

టెక్నాలజీ ప్రయోజనాలివి:

- పిల్లలకు వారి జ్ఞానాన్ని పెంపొందించడానికి వివిధ రకాల సమాచారాన్ని ఇస్తుంది.
- సాంకేతికత పిల్లలను ఒంటరి తనం నుంచి దూరం చేయడానికి, సామాజిక సంబంధాలను మెరుగుపరుచుకోవడానికి భౌతిక అడ్డంకులను తొలగిస్తుంది.
- సాంకేతికత అభ్యాసం వల్ల నైపుణ్యాలు మెరుగుపడతాయి.
- ఆన్‌లైన్ గేమ్‌లు, ఇతర కార్యకలాపాలు గ్రూప్ కృషిని, సృజనాత్మకతను మెరుగుపరుస్తాయి.
- పిల్లలకు శారీరకమైన కదలికలకు సంబంధించిన చురుకుదనం కలిగిస్తూ, అందులో నైపుణ్యాలను పెంచుతాయి.
- జ్ఞానానికి సంబంధించిన నైపుణ్యాలు మెరుగుపడతాయి.
- పోటీ నైపుణ్యాలు పెరుగుతాయి.



టీచర్లు తల్లిదండ్రులకు చెప్పాల్సినవి..

ఈ రోజుల్లో ప్రీ-టీన్స్, టీనేజ్ పిల్లల రోజువారీ జీవితంలో ఇంటర్నెట్ భాగమైపోయింది. చాలా మంది టీనేజర్స్ స్మార్ట్‌ఫోన్ లేదా టాబ్లెట్‌ను ఉపయోగించి ఇంటర్నెట్‌ను వాడుతున్నారు. ఇతరులతో సంబంధాలను కొనసాగిస్తున్నారు. అనేక రకాల సోషల్ నెట్‌వర్కింగ్ సైట్‌లు, గేమింగ్ సైట్‌లను ఉపయోగిస్తున్నారు. డిజిటల్ ప్లాట్‌ఫారాల మీద ఇతరుల గొడవలకు సంబంధించిన రహస్యాలను బయటపెట్టడం, లింక్‌అప్‌లు, హుక్-అప్‌లు, ద్వేషం సర్వసాధారణం. వీటితో పాటు మరో చీకటి కోణాన్ని గమనించాల్సి ఉంటుంది. టీచర్లు, హెడ్‌మాస్టర్లపై ప్రేమ, సరస, వ్యంగ్యపూరితమైన కామెంట్స్ ఆందోళన కలిగిస్తుంటాయి. అందుకని, టీచర్లు తల్లిదండ్రులతో పరస్పరం చర్చించాలి. సాంకేతిక పిల్లల భవిష్యత్తు జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో పేరెంట్స్‌కు తెలియజేయాలి.

- పిల్లలు వాడే కమ్యూనికేషన్ సాధనాల సమాచారాన్ని తల్లిదండ్రులు తప్పక చూడాలి. మూలాలను చెక్ చేయాలి.
- పిల్లల డిజిటల్ కార్యకలాపాల్లోని మంచి చెడులపై క్రాస్‌చెక్ ఉందా అని పర్యవేక్షించాలి.
- మీ పిల్లలు ఎవరి నుంచి సూచనలు పొందుతున్నారు, వారికి ఎవరు సూచనలు ఇస్తున్నారో తెలుసుకోవాలి. దీనివల్ల ప్లాట్‌ఫారంలో వారు ఎంత సురక్షితంగా ఉన్నారో తెలుస్తుంది.
- పై జాగ్రత్తలన్నింటి వల్ల మీ కమ్యూనిటీలో వారు సురక్షితంగా ఉంటారని గుర్తించాలి.


ఆన్‌లైన్ ప్రమాదాల గురించి టీచర్లు గుర్తించాల్సినవి..

- క్లాస్‌రూమ్‌ను సైబర్ సేఫ్టీగా మార్చాలి. అంటే, విద్యార్థుల వ్యక్తిగత డేటాను రక్షించడంలో ఇది మొదటి దశ.
- విద్యార్థులకు ఆన్‌లైన్ గోప్యత, భద్రత గురించి బేసిక్స్ నేర్పించాలి.
- టెక్నాలజీని మితిమీరి ఉపయోగించడం వల్ల కలిగే నష్టాలను కూడా తెలియజేయాలి. మానవ సంబంధాలను, భవిష్యత్తు కెరీర్, వ్యక్తిగత జీవితాలను ఎలా దెబ్బతీస్తుందో తెలియజేయాలి.
- క్లాస్‌రూమ్‌లో, ఇంట్లో టెక్నాలజీ వాడకం ఒక ప్రయోజనానికి మాత్రమేనని, అంతే తప్ప పరధ్యానంగా ఉండటానికి కాదని చెప్పాలి.

తల్లిదండ్రులకు సేఫ్టీ పద్ధతులు..

ఏదైనా ఇబ్బంది కలిగించే విషయం ఇంటర్నెట్‌లో కనిపిస్తే ఏం చేయాలో పిల్లలతో మాట్లాడాలి. మీరూ, పిల్లలూ పరస్పరం మాట్లాడుకోకపోతే, మీరు వారికి దగ్గరగా వెళ్లినప్పుడు ల్యాప్‌టాప్ మూసేస్తారు లేదా స్క్రీన్‌ను ఆఫ్ చేస్తారు. పిల్లల స్క్రీన్ సమయాన్ని నియంత్రించడం కష్టంగా ఉంటుంది. పిల్లలకు ఎంత స్క్రీన్ సమయం సరిపోతుందో పరిశీలించడానికి టీచర్లు తల్లిదండ్రులతో తప్పనిసరిగా ఇంటరాక్ట్ కావాల్సి ఉంటుంది.

- అన్ని యాప్స్, గేమింగ్, బ్రౌజర్లకు కంట్రోల్స్ ఆప్షన్లు ఉంటాయి. ఇవి పిల్లలు ఆన్‌లైన్‌లో గడిపే సమయాన్ని పరిమితం చేయడానికి, కంటెంట్ విషయంలో వారి యాక్సెస్‌ను పరిమితం చేయడానికి, షాపింగ్, చాటింగ్ వంటి ఫంక్షన్లను స్విచ్ ఆఫ్ చేయడానికి పెద్దలకు అవకాశం ఉంటుంది అని చెప్పాలి.
- యాప్ కొనుగోళ్లను ఆపేయాలంటే అన్ని అప్లికేషన్‌లు, గేమింగ్, ఇ-కామర్స్ సైట్‌లు తమ యూజర్లకు షాపింగ్, ఎక్స్‌ట్రా పాయింట్స్ కొనుగోలు చేయడం వంటి ఇతర ప్రయోజనాలను అందిస్తాయి. పిల్లలు మీకు తెలియకుండానే సులభంగా వాటిని కొనుగోలు చేయవచ్చు, జాగ్రత్త పడాలి.
- చిన్నపిల్లలకు ఆన్‌లైన్ ప్రమాదాల గురించి తెలియదు. తల్లిదండ్రులుగా మీరు మీ పిల్లలకు నాణ్యమైన సమయాన్ని కేటాయించాలి. భవిష్యత్తులో వారి కెరీర్‌ను ప్రభావితం చేసే సైబర్ బెదిరింపు, గోప్యతల గురించి వివరించాలి.
- ఫ్యామిలీ ఇమెయిల్ తప్పనిసరి అవసరం. ఆన్‌లైన్‌లో కొత్త గేమ్‌లు, వెబ్‌సైట్‌లకు సైన్‌అప్ చేసేటప్పుడు మీ పిల్లలు ఉపయోగించే ఫ్యామిలీ ఇమెయిల్ అకౌంట్‌ను సెటప్ చేయండి. అంటే, కుటుంబ సభ్యులందరూ ఈ ఇమెయిల్‌ను చూడవచ్చు అని వివరించాలి.
- మీ గూగుల్ సెర్చ్ ఇంజిన్‌లో 'గూగుల్ సేఫ్ సెర్చ్'ని యాక్టివేట్ చేయడం ద్వారా పిల్లలు అనవసరమైన కంటెంట్‌ను చూడకుండా చేసేందుకు like https://www.kiddle.co వంటి సెర్చ్ ఇంజన్‌లను ఉపయోగించవచ్చు.
- చిన్నపిల్లలు ఆన్‌లైన్‌లో ఆడే సురక్షితమైన గేమ్‌లనే తల్లిదండ్రులు ఎంచుకోవాలి. అన్ని గేమ్‌లకు రేటింగ్, ఏజ్ బార్స్ ఉంటాయి. వయసు పరిమితులను బట్టి ఉండే గేమ్స్‌కు, సైట్స్ సైన్ అప్ చేయడానికి సపోర్ట్ ఇవ్వవచ్చు.
- స్క్రీన్ టైమ్ ఒప్పందాన్ని ఇంట్లో అందరూ పాటించేలా చూడాలి. ముఖ్యంగా బెడ్‌రూమ్, భోజనం చేసేటప్పుడు, కార్.. వంటి టెక్‌ఫ్రీ జోన్ల గురించి పిల్లలకు అర్థమయ్యేలా చెప్పాలి.
- యాంటీ ర్యాగింగ్, జెండర్ ఈక్వాలిటీ మాదిరిగా డిజిటల్ వెల్‌బీయింగ్ కౌన్సిల్‌ను సృష్టించాలి. ఈ కౌన్సిల్ పిల్లలకు మంచి డిజిటల్ పరిశుభ్రత, సైబర్ నైతికతను పెంపొందించడానికి సహాయపడుతుంది.



ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్



రెండో వన్డేలోనూ విండీస్‌దే విజయం

యూఏఈతో షార్జాలో జరిగిన రెండో వన్డేలో వెస్టిండీస్ 78 పరుగుల తేడాతో గెలిచి మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను 2-0తో దక్కించుకుంది. ముందుగా విండీస్ 49.5 ఓవర్లలో 306 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు బ్రాండన్ కింగ్ (64; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), జాన్సన్ చార్లెస్ (63; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించడంతోపాటు తొలి వికెట్‌కు 129 పరుగులు జోడించారు. అనంతరం యూఏఈ 50 ఓవర్లలో 7 వికెట్లకు 228 పరుగులు చేసి ఓడిపోయింది. అలీ నాసర్ (57 ; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) మినహా మిగతావారు విఫలమయ్యారు.

రాణించిన చమీరా: శ్రీలంకదే వన్డే సిరీస్

అఫ్గానిస్తాన్‌తో మూడో వన్డేలో శ్రీలంక తొమ్మిది వికెట్ల తేడాతో నెగ్గి సిరీస్‌ను 2-1తో సొంతం చేసుకుంది. హంబన్‌టోటాలో బుధవారం జరిగిన మ్యాచ్‌లో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' చమీరా (4/63), హసరంగ (3/7) ధాటికి అఫ్గానిస్తాన్ 22.2 ఓవర్లలో 116 పరుగులకే కుప్పకూలింది. అనంతరం శ్రీలంక 16 ఓవర్లలో వికెట్ నష్టానికి 120 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు నిసాంక (51 ; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), కరుణరత్నే (56 నాటౌట్; 7 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు.



తొలి రోజే 'తల'పోటు...

పిచ్‌పై తేమ, కాస్త పచ్చిక, ఆకాశం మేఘావృతం ... అన్నీ పేస్ బౌలింగ్‌కు అనుకూలించే పరిస్థితులే. రోహిత్ శర్మ టాస్ గెలిచాడు. ఈ స్థితిలో ఏ కెప్టెనైనా ఏం చేస్తాడో అతను కూడా అదే చేస్తూ ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. మ్యాచ్ ఆరంభంలో షమీ, సిరాజ్ బౌలింగ్ చూస్తుంటే ఫీల్డింగ్ ఎంచుకున్న నిర్ణయం సరైందనిపించింది... ఒక గంట గడిచింది. వాతావరణం అంతా మారిపోయింది... పిచ్ ఒక్కసారిగా బ్యాటర్ల పక్షాన చేరింది... హెడ్, స్మిత్ దీనిని అద్భుతంగా వాడుకున్నారు. సంపూర్ణ ఆధిపత్యం కనబరుస్తూ ఆసీస్ భారీ స్కోరుకు బాటలు వేశారు. మెరుపు వేగంతో ఆడిన హెడ్ సెంచరీతో చెలరేగగా, స్మిత్ శతకానికి చేరువయ్యాడు. చివరి సెషన్‌లోనైతే మన బౌలర్లు పూర్తిగా చేతులెత్తేసిన పరిస్థితి... డబ్ల్యూటీసీ ఫైనల్ పోరులో తొలి రోజు పూర్తిగా ఆస్ట్రేలియాదే. రెండో రోజు వారిని నిలువరించలేకపోతే భారత్ ఈ టెస్టుపై ఆశలు కోల్పోవాల్సిందే!

- 156 బంతుల్లో అజేయంగా 146 పరుగులు చేసిన ట్రవిస్ హెడ్
- స్టీవ్ స్మిత్ 95 బ్యాటింగ్
- ఆస్ట్రేలియా 327/3
- భారత్‌తో డబ్ల్యూటీసీ ఫైనల్



హెడ్



షమీ



సిరాజ్



స్మిత్

లండన్: వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ మొదటి రోజును ఆస్ట్రేలియా ఘనంగా ముగించింది. భారత్‌తో బుధవారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో ఆట ముగిసే సమయానికి ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 85 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 327 పరుగులు చేసింది. ట్రవిస్ హెడ్ (156 బంతుల్లో 146 బ్యాటింగ్; 22 ఫోర్లు, 1 సిక్స్), స్టీవ్ స్మిత్ (227 బంతుల్లో 95 బ్యాటింగ్; 14 ఫోర్లు) చెలరేగారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు అభేద్యంగా 251 పరుగులు జోడించారు. భారత తుది జట్టులో అశ్విన్‌కు స్థానం దక్కకపోగా, కీపర్‌గా భరత్‌కే చోటు లభించింది. ఇటీవల ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదంలో మరణించిన వారి కోసం టీమిండియా ఆటగాళ్లు మౌనం పాటించగా, ఇరు జట్ల క్రికెటర్లు నల్లబ్యాండ్‌లు ధరించి బరిలోకి దిగారు.

రాణించిన వార్నర్...

పేసర్లు షమీ, సిరాజ్ పదునైన బంతులతో ఆసీస్ ఆటగాళ్లను తీవ్రంగా ఇబ్బంది పెట్టారు. మొదటి మూడు ఓవర్లు మెయిడిన్ కాగా, తర్వాతి ఓవర్లో ఫలితం దక్కింది. సిరాజ్ బంతిని ఆడలేక ఉస్మాన్ ఖ్వాజా (10 బంతుల్లో 0) కీపర్ భరత్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. తొలి గంటలో 12 ఓవర్లు ఆడిన ఆస్ట్రేలియా 29 పరుగులే చేసింది. చెరో 2 ఓవర్లు వేసిన షమీ, సిరాజ్ వేసిన అనేక బంతులు వార్నర్ (60 బంతుల్లో 43; 8 ఫోర్లు), లబుషేన్ (62 బంతుల్లో 26; 3 ఫోర్లు) శరీరానికి తాకాయి. అయితే ఇద్దరు బ్యాటర్లు పట్టుదలగా నిలబడి ఇన్నింగ్స్‌ను నడిపించారు. ఉమేశ్ ఓవర్లో నాలుగు ఫోర్లు బాది జోరు ప్రదర్శించిన వార్నర్ ఆ తర్వాతా దానిని కొనసాగించాడు. ఆసీస్ పటిష్ట స్థితికి చేరుతున్న దశలో శార్దుల్ భారత్‌కు కీలక వికెట్ అందించాడు. లంచ్ సమయానికి కాస్త ముందు లెగ్‌సైడ్ వెళుతున్న బంతిని వార్నర్ వెంటాడగా భరత్ అద్భుతంగా అందుకున్నాడు. వార్నర్, లబుషేన్ రెండో వికెట్‌కు 69 పరుగులు జోడించారు. విరామం తర్వాత షమీ చక్కటి బంతితో లబుషేన్‌ను బౌల్డ్ చేయడంతో భారత్ ఊపిరి పీల్చుకుంది.

భారీ భాగస్వామ్యం...

ఐదు పరుగుల వ్యవధిలో రెండు వికెట్లు పడగొట్టిన టీమిండియా ఆనందాన్ని తర్వాతి భాగస్వామ్యం పూర్తిగా దెబ్బ కొట్టింది. స్మిత్, హెడ్ కలిసి ఇన్నింగ్స్‌ను నిర్మించారు. తాను ఎదుర్కొన్న తొలి 16 బంతుల్లోనే 6 ఫోర్లతో దూకుడు చూపించిన హెడ్ 60 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకోగా, రెండో సెషన్‌లో భారత్‌కు వికెట్ దక్కలేదు. చివరి సెషన్‌లోనూ ఈ జంట మరింత పట్టుదలగా ఆడింది. 144 బంతుల్లో స్మిత్ హాఫ్ సెంచరీ పూర్తయిన కొద్దిసేపటికే హెడ్ 106 బంతుల్లోనే కెరీర్‌లో ఆరో శతకాన్ని అందుకున్నాడు. ఇదే ఊపులో భాగస్వామ్యం 200 పరుగులు దాటగా, భారత బృందం బేలగా చూస్తుండిపోయింది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: వార్నర్ (సి) భరత్ (బి) శార్దుల్ 43; ఖ్వాజా (సి) భరత్ (బి) సిరాజ్ 0; లబుషేన్ (బి) షమీ 26; స్మిత్ (బ్యాటింగ్) 95; హెడ్ (బ్యాటింగ్) 146; ఎక్స్‌ట్రాలు 17; మొత్తం (85 ఓవర్లలో 3 వికెట్లకు) 327. వికెట్ల పతనం: 1-2, 2-71, 3-76. బౌలింగ్: షమీ 20-3-77-1, సిరాజ్ 19-4-67-1, ఉమేశ్ 14-4-54-0, శార్దుల్ 18-2-75-1, జడేజా 14-0-48-0.

అంచనా తప్పి... అశ్విన్‌ను తప్పించి...



అగ్రశ్రేణి స్పిన్నర్ అశ్విన్‌కు తుది జట్టులో స్థానంపై మ్యాచ్ ముందు రోజే కెప్టెన్ రోహిత్ శర్మ సందేహం వ్యక్తం చేయగా, చివరకు అదే జరిగింది. 'పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని' అశ్విన్‌ను ఆడించడం లేదని, బాధగా ఉన్నా తప్పట్లేదని రోహిత్ అన్నాడు. అయితే తొలిరోజు భారత బౌలర్ల ప్రదర్శనను చూసిన తర్వాత అశ్విన్ లేని లోటు కనిపించింది. ఆరంభంలో కొద్దిసేపు మాత్రమే పిచ్‌పై తేమ ఉండి ఆ తర్వాత అంతా సాధారణంగా మారిపోయింది. పరిస్థితుల విషయంలో భారత్ అంచనా తప్పిందని మాజీ క్రికెటర్లు పాంటింగ్, హాడిన్, మంజ్రేకర్ అభిప్రాయపడ్డారు. ఆస్ట్రేలియాపై అశ్విన్‌కు అద్భుత రికార్డు ఉండటంతోపాటు ఆ జట్టు టాప్-7లో నలుగురు ఎడంచేతి వాటం బ్యాటర్లు ఉన్నారు. పిచ్ ఎలా ఉన్నా అతను కచ్చితంగా ప్రభావం చూపేవాడని వారు విశ్లేషించారు. మ్యాచ్‌కు ముందు సచిన్ టెండూల్కర్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశాడు. అయితే టీమ్ మేనేజ్‌మెంట్ మాత్రం మరోలా ఆలోచించి నలుగురు పేసర్లకు అవకాశం కల్పించింది. మరోవైపు జడేజా కూడా పూర్తిగా విఫలమయ్యాడు. రెండేళ్ల క్రితం న్యూజిలాండ్‌తో ఫైనల్లో భారత్ ఇద్దరు స్పిన్నర్లతో ఆడగా, కివీస్ నలుగురు పేసర్లతో బరిలోకి దిగింది. పరిస్థితులన్నీ పేస్ బౌలింగ్‌కు అనుకూలించాయి. అప్పుడు 'పొరపాటు' చేసినట్లుగా గుర్తించిన జట్టు ఈసారి దానిని సరిదిద్దుకోబోయే మరో పొరపాటు చేసినట్లుంది!

15 వరకు నిరసనలకు విరామం

- ఆలోపు బ్రిజ్‌భూషణ్‌పై పోలీసుల విచారణ పూర్తి కావాలి
- కేంద్ర క్రీడల మంత్రితో చర్చల అనంతరం రెజ్లర్ల నిర్ణయం



క్రీడల మంత్రి నివాసంలో రెజ్లర్లు సత్యవర్త్, సాక్షి మలిక్, బజరంగ్ పూనియా

న్యూఢిల్లీ: లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై పోలీసుల విచారణ పూర్తయ్యే వరకు నిరసనలకు విరామం ఇవ్వాలని కేంద్ర క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్ అభ్యర్థనకు రెజ్లర్లు అంగీకరించారు. ఈనెల 15వ తేదీ వరకు తాము నిరసన కార్యక్రమాలను తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు భారత స్టార్ రెజ్లర్లు బజరంగ్ పూనియా, సాక్షి మలిక్ తెలిపారు. క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్ ఆహ్వానం మేరకు బుధవారం బజరంగ్, సాక్షి మలిక్, సాక్షి భర్త సత్యవర్త్ కడియాన్, జితేంద్ర కిన్హా తదితరులు మంత్రి నివాసానికి వెళ్లారు. రెజ్లర్లతో మంత్రి దాదాపు ఆరు గంటలపాటు చర్చించారు. రెజ్లర్ల డిమాండ్లకు సానుకూలంగా స్పందించిన మంత్రి బ్రిజ్‌భూషణ్‌పై విచారణ ముగిసేవరకు ఆందోళన కార్యక్రమాలకు విరామం ఇవ్వాలని కోరారు. మంత్రి అభ్యర్థనకు అంగీకరించిన రెజ్లర్లు ఈనెల 15లోపు బ్రిజ్‌భూషణ్‌పై విచారణ ముగియాలని... ఇప్పటికే ఆయన మూడు పర్యాయాలు సమాఖ్య అధ్యక్షుడిగా పనిచేశారని... ఆయన అనుచరులు కూడా ఈసారి ఎన్నికలకు దూరంగా ఉండాలని... మే 28న ఢిల్లీ పోలీసులు తమపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకోవాలని కోరారు. వీటన్నింటికి క్రీడల మంత్రి అంగీకరించడంతో రెజ్లర్లు కూడా మెట్టు దిగారు. ప్రభుత్వ విన్నపం మేరకు తాము ఈనెల 15 వరకు ఆందోళనకు విరామం ఇచ్చామని, అంతేగానీ తమ నిరసనను పూర్తిగా ముగించలేదని బజరంగ్, సాక్షి స్పష్టం చేశారు. భారత రెజ్లింగ్ సమాఖ్య ఎన్నికలు జూన్ 30లోపు జరుగుతాయని ... సమాఖ్యలో మహిళా అధ్యక్షురాలిగా అంతర్గత ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేస్తామని రెజ్లర్లతో చర్చల అనంతరం మంత్రి అనురాగ్ ఠాకూర్ వెల్లడించారు. హరియాణాలో ఉండటంతో మరో స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ క్రీడల మంత్రితో సమావేశానికి హాజరుకాలేదు.

సెమీస్‌లో స్వియాటెక్, బీత్రిజ్



స్వియాటెక్



బీత్రిజ్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ ఇగా స్వియాటెక్ (పోలాండ్), బీత్రిజ్ హదాద్ మయా (బ్రెజిల్) సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో టాప్ సీడ్ స్వియాటెక్ 6-4, 6-2తో గత ఏడాది రన్నరప్, అమెరికా టీనేజర్ కోకో గాఫ్‌ను ఓడించగా... 14వ సీడ్ బీత్రిజ్ 3-6, 7-6 (7/5), 6-1తో ప్రపంచ ఏడో ర్యాంకర్ ఆన్స్ జబర్ (ట్యునీషియా)ను బోల్తా కొట్టించింది. ఈ గెలుపుతో బీత్రిజ్ ఓపెన్ శకంలో (1968 నుంచి) ఫ్రెంచ్ ఓపెన్ టోర్నీలో సెమీఫైనల్ చేరిన తొలి బ్రెజిల్ క్రీడాకారిణిగా గుర్తింపు పొందింది. నేడు జరిగే సెమీఫైనల్స్‌లో కరోలినా ముకోవా (చెక్ రిపబ్లిక్)తో రెండో సీడ్ సబలెంకా (బెలారస్), స్వియాటెక్‌తో బీత్రిజ్ తలపడతారు.

అల్‌కరాజ్ అలవోకగా...

పురుషుల సింగిల్స్ విభాగంలో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్) సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. క్వార్టర్ ఫైనల్లో అల్‌కరాజ్ 6-2, 6-1, 7-6 (7/5)తో ఐదో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్)పై గెలుపొందాడు. శుక్రవారం జరిగే సెమీఫైనల్లో మూడో సీడ్ జొకోవిచ్ (సెర్బియా)తో అల్‌కరాజ్ ఆడతాడు. మరో క్వార్టర్ ఫైనల్లో జ్వెరెవ్ (జర్మనీ) 6-4, 3-6, 6-3, 6-4తో ఎచెవరీ (అర్జెంటీనా)పై గెలిచి ఈ టోర్నీలో వరుసగా మూడో ఏడాది సెమీఫైనల్లోకి అడుగు పెట్టాడు.

సినిమా

మాస్ డ్యాన్స్ చేసేద్దాం...



• చిరంజీవి • తమన్నా • కీర్తి సురేశ్

శంకర్ మంచి జోష్ మీద ఉన్నాడు. అందుకే జోరుగా స్టెప్పులు వేస్తున్నాడు. ఒక్కడే కాదు.. ప్రేయసితో, చెల్లెలితో, ఇంకా చాలామందితో కలిసి మాస్ డ్యాన్స్ చేసేద్దాం అంటూ రెచ్చిపోతున్నాడు. చిరంజీవి టైటిల్ రోల్‌లో రూపొందుతున్న 'భోళా శంకర్'లోని పాట గురించే చెబుతున్నాం. ఈ చిత్రంలో చిరంజీవి సరసన తమన్నా, చెల్లెలి పాత్రను కీర్తీ సురేశ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ ముగ్గురితో పాటు చిత్రంలోని ఇతర ప్రధాన తారాగణం పాల్గొనగా హైదరాబాద్‌లో ఓ పాట చిత్రీకరిస్తున్నారు. ఈ పాట కోసం భారీ సెట్‌ని రూపొందించారు. చిత్ర సంగీతదర్శకుడు మహతి స్వర సాగర్ స్వరపరచిన ఈ మాస్ సాంగ్‌కు శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. మెహర్ రమేష్ దర్శకత్వంలో అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై రామ బ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ తుది దశకు చేరుకుంది. ఆగస్టు 11న విడుదల కానున్న ఈ చిత్రానికి కెమెరా: డడ్లీ, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: కిషోర్ గరికిపాటి.

నా టైమ్ స్టార్ట్ అయినట్లు అనిపిస్తోంది

\- సిద్ధార్థ్



"నేనో సినిమా తీయాలనుకుంటే ఆ సినిమాను తీసేంత స్వేచ్ఛ నాకు కావాలి. ఇదే నా డ్రీమ్. తమిళంలో నేను చేయగలుగుతున్నాను. కానీ తెలుగులో నాకు అంతగా సపోర్ట్ లభించలేదు. అయినా తెలుగు ఆడియన్స్‌కు, నాకు ఫుల్‌స్టాప్ కాదు కదా.. చిన్న కామా కూడా పడలేదు.. తెలుగు ప్రేక్షకులకు నాకు మధ్యలో ఉన్నది చిన్న టైమ్ గ్యాప్ మాత్రమే. ఇప్పుడు 'టక్కర్'తో టైమ్ కలిసొచ్చినట్లుగా నాకు అనిపిస్తోంది" అని సిద్ధార్థ్ అన్నారు. సిద్ధార్థ్, దివ్యాంశా కౌశిక్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'టక్కర్'. కార్తీక్ జి. క్రిష్ దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ప్యాషన్ స్టూడియోస్‌తో కలిసి టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నెల 9న తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రం రిలీజ్ కానున్న సందర్భంగా విలేకరుల సమావేశంలో సిద్ధార్థ్ చెప్పిన విశేషాలు.

- ధనవంతుణ్ణి కావాలనే లక్ష్యంతో సిటీకి వస్తాడు ఓ కుర్రాడు. అయితే అన్నీ అతని ఊహలకు వ్యతిరేకంగా జరుగుతుంటే ఏం చేస్తాడు? ఎవరితో అతను ఘర్షణ పడాల్సి వస్తుంది? అన్నదే 'టక్కర్' కథాంశం. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగే ఘర్షణ చుట్టూ ఈ సినిమా సాగుతుంది. హీరో, హీరోయిన్ రిలేషన్‌షిప్‌లోనూ చాలా షేడ్స్ ఉంటాయి. డబ్బు, అహం, లింగబేధం, వయసు.. ఇలాంటి అంశాలు కథలో చర్చకు వస్తాయి. కార్తీక్ క్రిష్ ఈ సినిమాను బాగా డైరెక్ట్ చేశారు.
- లవ్‌స్టోరీస్ సినిమాల గురించి చర్చకు వస్తే.. వాటిలో 'బొమ్మరిల్లు', 'నువ్వొస్తానంటే నేనొద్దంటానా!' సినిమాలు కచ్చితంగా ఉంటాయి. ఇప్పుడు ఎవరైనా నాకు లవ్‌స్టోరీ చెబితే, దాదాపు నో చెబుతాను. ఎందుకంటే ఇప్పుడు నేను ఒక లవ్‌స్టోరీ సినిమా చేసి, అది హిట్ అయితే నాకు మళ్లీ ఓ పదేళ్ల పాటు లవ్‌స్టోరీలే వస్తాయి. నేను లవ్‌స్టోరీస్ మాత్రమే చేయడానికి ఇండస్ట్రీకి రాలేదు. యాక్టర్‌గా డిఫరెంట్ సినిమాలు చేయాలి.
- రచయితగా 'గృహం' ఫ్రాంచైజీకి కథలు రెడీ చేస్తున్నాను. మా ప్రొడక్షన్ హౌస్‌లో కొత్తవారితో సినిమాలు నిర్మిస్తున్నాం. భవిష్యత్‌లో దర్శకత్వం చేస్తాను. 'బొమ్మరిల్లు 2' ఆలోచన ఉంది. కానీ అది పెద్ద చాలెంజ్‌తో కూడుకున్న పని.. చూడాలి.
- యాక్టర్‌గా నేను మంచి ఫామ్‌లోకి వచ్చిన ఫీలింగ్ ఇప్పుడు కలుగుతోంది. మళ్లీ తెలుగులో నా టైమ్ స్టార్ట్ అయినట్లు అనిపిస్తోంది. ప్రస్తుతం 'ఇండియన్ 2'లో కీలక పాత్ర, 'ది టెస్ట్'లో ఓ లీడ్ రోల్, 'చిన్నా' సినిమా చేస్తున్నాను. ఓ స్ట్రయిట్ లవ్‌స్టోరీ ఫిల్మ్ షూటింగ్ పూర్తి కావొచ్చింది. కార్తీక్ క్రిష్‌తో మరో సినిమా చేయనున్నాను.

మీకు ఇంకా మ్యారేజ్ చేసుకునే ఏజ్ రాలేదంటారా? అని ఓ విలేకరి అడగ్గా... 'మ్యారేజ్ చేసుకునే ఏజ్ నాకు వచ్చినప్పుడు.. ఆ పెళ్లి భోజనం తింటున్నప్పుడు మీకు తెలుస్తుంది. ప్రస్తుతం ఆ పెళ్లి భోజనం నాకు గొంతు దిగడం లేదు. సో.. దానికి ఓ టైమ్ ఉంది. డైరెక్షన్ నా డ్రీమ్. నా మ్యారేజ్ నా పేరెంట్స్ డ్రీమ్. నా పెళ్లి, రిలేషన్‌షిప్స్ గురించి వార్తలు వచ్చాయంటే అవి రాసిన వారిని అడగాలి" అని అన్నారు సిద్ధార్థ్.

ఆగస్టులో అర్జున



• వరుణ్ తేజ్

గాండీవాన్ని ఎక్కుపెట్టి థియేటర్స్‌లోకి రావడానికి రెడీ అవుతున్నాడు అర్జున. వచ్చే తేదీని కూడా ఫిక్స్ చేసుకున్నాడు. వరుణ్ తేజ్ టైటిల్ రోల్‌లో ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో రూపొందుతోన్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'గాండీవధారి అర్జున'. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఆగస్ట్ 25న విడుదల చేయనున్నట్లు బుధవారం ప్రకటించారు. ప్రస్తుతం విదేశాల్లో షూటింగ్ జరుగుతోంది. "స్టైలిష్ యాక్షన్ సీక్వెన్స్‌లతో రూపొందిస్తోన్న ఈ చిత్రంలో వరుణ్ తేజ్ పవర్‌ఫుల్ రోల్‌లో కనిపిస్తారు. ఇప్పటికే విడుదలైన వరుణ్ లుక్‌కి, వీడియో గ్లింప్స్‌కి మంచి స్పందన వచ్చింది. ఈ చిత్రంలో యాక్షన్ సీక్వెన్స్ హైలైట్‌గా నిలుస్తాయి. సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. మరోవైపు నిర్మాణానంతర కార్యక్రమాలు కూడా జరుగుతున్నాయి" అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్, కెమెరా: ముఖేష్.

యాక్షన్.. థ్రిల్



• గోపీచంద్ మలినేని, చైతన్య, సాహస్

సాహస్, దీపికా ముఖ్య తారలుగా నటించిన సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ '7:11'. నూతన నటీనటులతో చైతు మాదాలను దర్శకుడిగా పరిచయం చేస్తూ నరేష్ యనమదల, మాధురి రావిపాటి, వాణి కన్నెగంటి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ను దర్శకుడు గోపీచంద్ మలినేని విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ మాట్లాడుతూ– "మానవుల మనుగడకు సంబంధించిన కీలకమైన సమాధానాల కోసం హంసలదీవి అనే చిన్న ఇండియన్ టౌన్‌కి చేరుకుంటారు ఏలియన్లు. అదే రోజున ఆ టౌన్‌ని నాశనం చేయడానికి ప్రయత్నాలు జరుగుతుంటాయి. హీరో తన చేతిలోని టైమర్‌ను రాత్రి 7:11 లోపు డీయాక్టివేట్ చేయాలి. గడువు కంటే ముందే అతను మిస్టరీని ఛేదించాలి.. లేదంటే కార్డియాక్ అరెస్ట్‌తో అతని గుండె ఆగిపోతుంది. ఆ తర్వాత ఏం జరిగింది? అనేది ఆసక్తికరంగా ఉంటుంది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం" అని తెలియజేసింది. ఈ చిత్రానికి సంగీతం: జ్ఞాని, కెమెరా: శివ శంకర్, ఫాబియో కాపోడివెంటో.

పోలీసులే నిందితులైతే...



• రాహుల్ విజయ్

సాధారణంగా హత్యలకు కారణమైన దోషులకు శిక్ష పడేలా బాధ్యతగా విధులు నిర్వర్తిస్తుంటారు పోలీసులు. అయితే ఓ హత్య కేసులో పోలీసులే నిందుతులు అయితే ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయి? అన్న కథాంశంతో ఓ చిత్రం రూపొందుతోంది. తేజా మార్ని దర్శకత్వంలో శ్రీకాంత్, రాహుల్ విజయ్, వరలక్ష్మీ శరత్‌కుమార్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న చిత్రం ఇది. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు, విద్య నిర్మిస్తున్నారు. బుధవారం (జూన్ 7) రాహుల్ విజయ్ బర్త్ డే ఈ సందర్భంగా ఈ సినిమాలో ఎస్. రవి పాత్రను రాహుల్ విజయ్ చేస్తున్నట్లుగా వెల్లడించి, పోస్టర్ రిలీజ్ చేశారు. శివానీ రాజశేఖర్, పవన్ తేజ్, మురళీ శర్మ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు సంగీతం: మిధున్ ముకుందన్.

వాస్తవ ఘటనతో...



• అభి, రూప

గ్రామీణ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'భీమదేవరపల్లి బ్రాంచి'. డా. బత్తిని కీర్తిలతా గౌడ్, రాజా నరేందర్ చెట్లపెల్లి నిర్మించిన ఈ చిత్రంలో 'బలగం' ఫేమ్ సుధాకర్ రెడ్డి, అంజి వల్లమాన్, సాయి ప్రసన్న, అభి, రూప ప్రధాన పాత్రల్లో నటించారు. రమేష్ చెప్పాల రచన–దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం మైత్రీ మూవీస్ ద్వారా ఈ నెల 23న రిలీజ్ కానుంది. "ఒక మారుమూల గ్రామంలో జరిగిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం అయింది. ఆ ఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించాం. సహజమైన పాత్రలతో నవ్విస్తూనే భావోద్వేగానికి గురి చేసేలా ఈ సినిమా ఉంటుంది. ఈ సినిమా కంటెంట్ నచ్చి మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ రిలీజ్ చేయడానికి ముందుకు వచ్చింది" అని చిత్ర యూనిట్ పేర్కొంది.

ప్రత్యేక అతిథిగా...



• రాధికా ఆప్టే

విజయ్ సేతుపతి, కత్రినా కైఫ్‌ల వెండితెర క్రిస్మస్ వేడుకల్లో రాధికా ఆప్టే ప్రత్యేక అతిథిగా సందడి చేశారట. బాలీవుడ్ దర్శకుడు శ్రీరామ్ రాఘవన్ తాజా చిత్రం 'మెర్రీ క్రిస్మస్'లో విజయ్ సేతుపతి, కత్రినా కైఫ్ లీడ్ రోల్స్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలోని ఓ ప్రత్యేక అతిథి పాత్ర కోసం రాధికా ఆప్టేను ఎంపిక చేశారట. ఆమె పాత్ర చిత్రీకరణ పూర్తయిందని సమాచారం. హిందీ, తమిళ భాషల్లో రూపొంది, తెలుగులో కూడా విడుదల కానున్న ఈ సినిమా కొత్త విడుదల తేదీపై స్పష్టత రావాల్సి ఉంది. వాస్తవానికి గత ఏడాది క్రిస్మస్‌కి రిలీజ్ చేయాలనుకున్నారు. ఇక శ్రీరామ్ రాఘవన్ దర్శకత్వంలో వచ్చిన 'బదలాపూర్', 'అంధాధూన్'లో రాధికా ఆప్టే హీరోయిన్‌గా నటించిన విషయం గుర్తుండే ఉంటుంది.

మనిషి పుట్టిన క్షణం నుంచే..



• ప్రశాంత్ కార్తీ

ప్రశాంత్ కార్తీ హీరోగా నటించి, నిర్మించిన సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ 'అనంత'. రిత్తికా చక్రవర్తి హీరోయిన్‌గా, అనీష్ కురువిళ్ళ, లయ సింప్సన్, శ్రీనివాస్ జె గద్దం కీలక పాత్రల్లో నటించారు. మధుబాబు దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ప్రశాంత్ కార్తీ మాట్లాడుతూ– "నేను లీడ్ రోల్ చేసిన తొలి చిత్రం 'అనంత'. టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్‌తో సాగే ఇన్వెస్టిగేటివ్ చిత్రం ఇది. 'మనిషి పుట్టిన మరు క్షణం నుంచే ఆ శరీరం మరణం వైపు ప్రయాణం చేస్తుంటుంది' అనే ఈ సినిమాలోని డైలాగ్ సినిమాలోని సోల్‌ను తెలియజేస్తుంది. మా సినిమాకు వచ్చే వసూళ్లలో థియేటర్స్ ఖర్చులు పోను మిగిలే నగదును ఒరిస్సా రైలు దుర్ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు ఆర్థిక సహాయంగా అందించాలనుకుంటున్నాం" అన్నారు.

సాక్షి బిజినెస్

గురువారం
8-6-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	350	63,143
నిఫ్టీ ▲	127	18,726

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	13,142	▽	134
డోజోన్స్	33,638	▲	65
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,624	▽	4
డాక్స్	15,961	▽	32
షాంఘై	31,197	▲	2
నికాయ్	31,914	▽	593

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)		
60,028	▽	68
బంగారం (99.5 స్వచ్ఛత)		
59,788	▽	68
వెండి (కిలో)		
71,824	▽	80

బీఎస్‌ఎన్‌ఎల్‌కు రూ.89,047 కోట్ల ప్యాకేజీ

- 4జీ, 5జీ స్పెక్ట్రమ్ కేటాయింపులు
- కేంద్ర కేబినెట్ నిర్ణయం



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ టెలికం కంపెనీ బీఎస్‌ఎన్‌ఎల్ ప్రైవేటు కంపెనీలకు దీటుగా దేశవ్యాప్తంగా 4జీ, 5జీ సేవల ప్రారంభించేందుకు కీలక అడుగు పడింది. స్పెక్ట్రమ్ కేటాయింపులతో కూడిన రూ.89,047 కోట్ల విలువ చేసే మరో పునరుద్ధరణ ప్యాకేజీకి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈక్విటీ రూపంలో బీఎస్‌ఎన్‌ఎల్‌కు 4జీ, 5జీ స్పెక్ట్రమ్ కేటాయింపు ఈ ప్యాకేజీలో భాగంగా ఉంది. రూ.46,338 కోట్లు విలువ చేసే 700 మెగాహెర్ట్జ్ బ్యాండ్ స్పెక్ట్రమ్, 3300 మెగాహెర్ట్జ్ బ్యాండ్‌లో 70 మెగాహెర్ట్జ్ ఫ్రీక్వెన్సీ స్పెక్ట్రమ్ (రూ.26,184 కోట్లు), 26 గిగాహెర్ట్జ్ బ్యాండ్‌లో స్పెక్ట్రమ్ (రూ.6,565 కోట్లు), 2500 మెగాహెర్ట్జ్ బ్యాండ్ స్పెక్ట్రమ్ (రూ.9,428 కోట్లు) కేటాయించనుంది. దీంతో బీఎస్‌ఎన్‌ఎల్ అధీకృత మూలధనం రూ.1,50,000 కోట్ల నుంచి రూ.2,10,000 కోట్లకు పెరగనుంది. ఈ స్పెక్ట్రమ్ కేటాయింపులతో బీఎస్‌ఎన్‌ఎల్ దేశ వ్యాప్తంగా 4జీ, 5జీ సేవలను గ్రామీణ ప్రాంతాల్లోనూ అందించేందుకు అవకాశం ఏర్పడుతుంది. కేంద్ర ప్రభుత్వం 2019లో మొదటిసారి బీఎస్‌ఎన్‌ఎల్, ఎంటీఎన్‌ఎల్‌కు రూ.69,000 కోట్ల విలువ చేసే ప్యాకేజీ ప్రకటించింది. 2022లో మరో రూ.1.64 లక్షల కోట్ల ప్యాకేజీని ఇచ్చింది. కేంద్రం సాయంతో బీఎస్‌ఎన్‌ఎల్ రుణ భారం రూ.22,289 కోట్లకు దిగొచ్చింది.

జిమ్నీ వచ్చేసింది.. ధర రూ.12.74 లక్షల నుంచి..



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మారుతీ సుజుకీ జిమ్నీ మోడల్ ధరను ప్రకటించింది. ఢిల్లీ ఎక్స్‌షోరూంలో ధర రూ.12.74 లక్షల నుంచి ప్రారంభం. ఫోర్ వీల్ డ్రైవ్, 5-స్పీడ్ మాన్యువల్ ట్రిమ్స్ రూ.12.74 లక్షల నుంచి రూ.13.85 లక్షల వరకు ఉంది. అలాగే 4-స్పీడ్ ఆటోమేటిక్ ట్రిమ్స్ రూ.13.94 లక్షల నుంచి రూ.15.05 లక్షల వరకు నిర్ణయించింది. 5 డోర్ల ఎస్‌యూవీ అయిన జిమ్నీ 1.5 లీటర్ పెట్రోల్ ఇంజిన్‌తో రూపొందింది. గ్రౌండ్ క్లియరెన్స్ 210ఎంఎం ఉంది. మైలేజీ ఆటోమేటిక్ ట్రిమ్స్ 16.94, మాన్యువల్ ట్రిమ్స్ 16.39 కిలోమీటర్లు ఇస్తుందని కంపెనీ తెలిపింది. దేశంలోనే అతి పెద్ద ఎస్‌యూవీ తయారీదారుగా అవతరించాలన్న లక్ష్యంలో జిమ్నీ కీలక పాత్ర పోషిస్తుందని మారుతీ ఎండీ, సీఈవో హిసాటీ టాకేయూచీ తెలిపారు.

ఆర్‌బీఐ పాలసీ వెల్లడికి ముందు లాభాలు

- ఆరు నెలల తర్వాత 63 వేలపైకి సెన్సెక్స్
- 18,700 స్థాయిపైకి నిఫ్టీ



ముంబై: ఆర్‌బీఐ ద్రవ్య పాలసీ ప్రకటనకు ముందురోజు స్టాక్ మార్కెట్ లాభాలతో ముగిసింది. ద్రవ్య పరపతి విధాన సమీక్ష నుంచి సానుకూల నిర్ణయాలు వెలువడొచ్చనే ఆశలతో బుధవారం స్టాక్ సూచీలు ఆరునెలల గరిష్టంపై ముగిశాయి. అధిక వెయిటేజీ షేర్లు రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్, ఇన్ఫోసిస్ సూచీల ర్యాలీకి దన్నుగా నిలిచాయి. విదేశీ ఇన్వెస్టర్లు తిరిగి కొనుగోళ్లు చేపట్టడం, ఫారెక్స్ మార్కెట్లో డాలర్ మారకంలో రూపాయి బలోపేతం అంశాలు కలిసొచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందాయి. సెన్సెక్స్ 403 పాయింట్లు దూసుకెళ్లి 63,196 వద్ద, నిఫ్టీ 140 పాయింట్లు ఎగసి 18,739 వద్ద గరిష్టాలను నమోదు చేశాయి. చివర్లో స్వల్పంగా లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో సెన్సెక్స్ 350 పాయింట్ల లాభంతో 63,143 వద్ద స్థిరపడింది. ఆరు నెలల తర్వాత ఈ సూచి తొలిసారి 63 వేల స్థాయికి చేరుకుంది. అలాగే ఇందులోని 30 షేర్లలో ఐదు షేర్లు మాత్రమే నష్టపోయాయి. నిఫ్టీ 127 పాయింట్లు పెరిగి 18,726 వద్ద నిలిచింది. ముగింపు స్థాయిలు సూచీలకిది 6 నెలల గరిష్టం కావడం విశేషం. ముఖ్యంగా మెటల్, ఇంధన, ఎఫ్‌ఎంసీజీ షేర్లను కొనేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపడంతో మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు ఒకశాతానికి పైగా ర్యాలీ చేశాయి.

టెక్నో పెయింట్స్ ప్రచారకర్తగా మహేశ్ బాబు



మహేశ్ బాబుతో శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పెయింట్స్ తయారీలో ఉన్న టెక్నో పెయింట్స్ బ్రాండ్ అంబాసిడర్‌గా సినీ నటుడు మహేశ్‌బాబు నియమితులయ్యారు. 'యూత్ ఐకాన్‌గా మహేశ్‌బాబు బ్రాండ్ ఇమేజ్ సంస్థ విస్తరణకు దోహదం చేస్తుంది. దేశీయ పెయింట్స్ రిటైల్‌లో సుస్థిర స్థానం సంపాదించాలన్న మా లక్ష్యం నెరవేరుతుందన్న ధీమా ఉంది' అని టెక్నో పెయింట్స్‌ను ప్రమోట్ చేస్తున్న ఫార్చ్యూన్ గ్రూప్ ఫౌండర్ ఆకూరి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 'ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో రూ.12,000 కోట్ల పెయింట్స్ పరిశ్రమలో 12-18 నెలల్లో 25% వాటాను లక్ష్యంగా చేసుకున్నాం. 5,000 కేంద్రాల్లో మా ఉత్పత్తులను చేరుస్తాం. వుడ్ అధెసివ్, టైల్ ప్రైమర్, వుడ్ పాలిష్, వాటర్ ప్రూఫింగ్ కాంపౌండ్స్‌ను కొత్తగా ప్రవేశపెట్టాం. అన్ని జిల్లాల్లో డిపోలు, సెంట్రల్ వేర్ హౌజ్‌లను ఏర్పాటు చేస్తున్నాం' అని వివరించారు.

ఏఐతో వ్యాపారాల్లో శరవేగంగా మార్పులు

- చాట్‌జీపీటీ, డాల్-ఈ తదితర టెక్నాలజీల ప్రభావం
- ఆశావహంగా మెజారిటీ దేశీ కంపెనీలు
- బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ సర్వే

ముంబై: కొత్త తరం జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (జెన్‌ఏఐ) టెక్నాలజీలు వ్యాపార స్వరూపాలను శరవేగంగా మార్చేస్తున్నాయి. చాట్‌జీపీటీ నుంచి డాల్-ఈ తదితర సాంకేతికతలు పని ప్రదేశాల్లో చూపే సానుకూల ప్రభావాలపై దేశీయంగా మెజారిటీ కంపెనీలు ఆశావహంగా ఉన్నాయి. బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ) నిర్వహించిన సర్వేలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. 18 దేశాల్లో పలు పరిశ్రమలకు చెందిన ఎగ్జిక్యూటివ్‌లు మొదలుకుని ముందు వరుసలో పని చేసే సిబ్బంది వరకూ 12,800 మంది సిబ్బంది ఇందులో పాల్గొన్నారు. జెన్‌ఏఐ రంగం శరవేగంగా మారుతోందని, ప్రపంచవ్యాప్తంగా పని ప్రదేశాల్లో దానికి సంబంధించిన పరివర్తన ప్రభావాలు స్పష్టంగా తెలుస్తున్నాయని బీసీజీ ఎక్స్ (ఏఐ, సాఫ్ట్‌వేర్ విభాగం) గ్లోబల్ లీడర్ నికొలస్ డి బెల్‌ఫాండ్స్ తెలిపారు. సర్వేలో పాల్గొన్న దేశాలన్నింటిలోనూ భారతీయ ఎగ్జిక్యూటివ్‌లు ఏఐ ప్రభావాలపై అత్యంత ఆశావహంగా ఉన్నట్లు బీసీజీ ఎక్స్ ఇండియా హెడ్ నిపుణ్ కల్రా చెప్పారు. సర్వేలోని ముఖ్యాంశాలు..



- పని ప్రదేశాల్లో జెన్‌ఏఐ ప్రభావాలపై బ్రెజిల్ అత్యంత (71%) ఆశావహంగా ఉండగా, భారత్ (60%), మధ్యప్రాచ్యం (58%) తర్వాత స్థానాల్లో ఉన్నాయి. అమెరికా (46%), నెదర్లాండ్స్ (44%), జపాన్ (40%) దేశాల్లో అత్యంత తక్కువ స్థాయిలో ఆశావహ భావం నెలకొంది.
- ఏఐ గురించి ఆందోళనగా ఉన్న దేశాల్లో నెదర్లాండ్స్ (42 శాతం), ఫ్రాన్స్ (41 శాతం), జపాన్ (38 శాతం) ఉన్నాయి. పెద్దగా పట్టించుకోని ప్రాంతాల్లో మధ్యప్రాచ్యం (25 శాతం), బ్రెజిల్ (19 శాతం), భారత్ (14 శాతం) ఉన్నాయి.
- పని విషయంలో ఏఐ ప్రభావాలపై 2018లో 35 శాతం మంది సానుకూలంగా ఉండగా ప్రస్తుతం అది 52 శాతానికి చేరింది.
- భారత్ నుంచి సర్వేలో పాల్గొన్న 1,000 మంది ఉద్యోగుల్లో 61 శాతం మంది జెన్‌ఏఐ సాధనాలపై ఆశావహంగా ఉన్నారు. జెన్‌ఏఐతో పొంచి ఉన్న రిస్కులతో పోలిస్తే ప్రయోజనాలు ఎక్కువగా ఉంటాయని 72.8 శాతం మంది అభిప్రాయపడ్డారు. ఏఐతో తమ ఉద్యోగ విధుల్లో మార్పులు వచ్చే అవకాశం ఉందని దాదాపు 88 శాతం మంది భావించగా, ఏఐకి సంబంధించి నిర్దిష్ట నిబంధనలు అవసరమని 80 శాతం మంది అభిప్రాయపడ్డారు.
- సీనియర్ లీడర్లు మరింత తరచుగా జెన్‌ఏఐని ఉపయోగిస్తున్నారు. మిగతా ఉద్యోగులతో పోలిస్తే మరింత ఆశావహంగా ఉన్నారు. జెన్‌ఏఐపై వారిలో పెద్దగా ఆందోళన లేదు. 62 శాతం మంది లీడర్లు ఏఐ విషయంలో ఆశావహంగా ఉండగా, ముందు వరుసలో పని చేసే సిబ్బందిలో 42 శాతం మంది మాత్రమే సానుకూలంగా ఉన్నారు. మెజారిటీ లీడర్లు (80 శాతం) మంది తాము జెన్‌ఏఐ టూల్స్‌ను తరచుగా వినియోగిస్తున్నామని తెలపగా, ఇతర సిబ్బందిలో ఇది కేవలం 20 శాతంగానే ఉంది.
- జెన్‌ఏఐని తరచుగా ఉపయోగించే వారిలో 62 శాతం మంది దానిపై ఆశావహంగా ఉండగా, నాన్-యూజర్లలో ఇది 36 శాతంగా ఉంది. జెన్‌ఏఐని ఉపయోగించని వారిలో ఎక్కువగా ఫ్రంట్‌లైన్ సిబ్బందే (60 శాతం) ఉన్నారు.
- ఏఐ వల్ల తమ ఉద్యోగాలు పోతాయని భావిస్తున్నట్లు అంతర్జాతీయంగా 36% మంది తెలపగా, తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాల్సి ఉంటుందని విశ్వసిస్తున్నట్లు 86% మంది అభిప్రాయపడ్డారు.

డయాజియో సీఈవో ఇవాన్ కన్నుమూత



న్యూఢిల్లీ: ఆల్కహాలిక్ బేవరేజెస్ దిగ్గజం డయాజియోకి సారథ్యం వహిస్తున్న భారతీయ సీఈవో ఇవాన్ మాన్యుయెల్ మెనెజెస్ (64) లండన్‌లో కన్నుమూశారు. కడుపులో అల్సర్‌తో కొంత కాలంగా ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నెలాఖరులో ఆయన రిటైర్ కావాల్సి ఉంది. మెనెజెస్‌కు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. కొత్త సీఈవోగా నియమితులైన డెబ్రా క్రూ.. మెనెజెస్ చికిత్సా కాలంలో తాత్కాలికంగా ఆయన బాధ్యతలు నిర్వర్తిస్తారని డయాజియో సోమవారమే ప్రకటించింది. ఆ ప్రకటన చేసిన రెండు రోజులకే మెనెజెస్ కన్నుమూశారు. మెనెజెస్ మృతిపై డయాజియో చైర్మన్ జేవియర్ ఫెరాన్ సంతాపం వ్యక్తం చేశారు. 1959 జూలై 10న పుణేలో జన్మించిన మెనెజెస్.. ఢిల్లీలోని ప్రతిష్టాత్మక సెయింట్ స్టీఫెన్స్ కాలేజీ, అహ్మదాబాద్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో విద్యాభ్యాసం చేశారు. వర్ల్‌పూల్, నెస్లే తదితర కంపెనీల్లో పనిచేసిన మెనెజెస్ 1997లో డయాజియో ఏర్పాటైనప్పుడు అందులో చేరారు. అంచెలంచెలుగా ఎదిగి 2013 జులైలో సీఈవో స్థాయికి చేరారు. ఆయనకు బ్రిటన్, అమెరికా, ప్రవాస భారతీయ పౌరసత్వం ఉంది. 2023 జనవరిలో బ్రిటన్ ఆయనకు నైట్‌హుడ్ ప్రకటించింది.

ఆధార్‌తో కూడా గూగుల్‌పే యాక్టివేషన్



న్యూఢిల్లీ: డిజిటల్ చెల్లింపు సేవల యాప్ గూగుల్ పే తాజాగా మరో కొత్త ఫీచర్‌ను ప్రవేశపెట్టింది. డెబిట్ కార్డు అవసరం లేకుండా ఆధార్ నంబరుతో కూడా యూపీఐని యాక్టివేట్ చేసుకోవచ్చని తెలిపింది. అయితే, మొబైల్ ఫోన్ నంబరు, బ్యాంకు ఖాతా, ఆధార్ నంబరు ఒకదానికి మరొకటి అనుసంధానమై ఉంటేనే ఇది పనిచేస్తుంది. దీనితో తమ యూజర్లు డెబిట్ కార్డు లేకుండానే తమ యూపీఐ పిన్ నంబరును సెట్ చేసుకోవచ్చని గూగుల్ పే తెలిపింది. గూగుల్ పే యాప్‌లో ఇకపై ఖాతా యాక్టివేషన్ కోసం డెబిట్ కార్డు, ఆధార్ నంబరు ఆప్షన్లు కనిపిస్తాయి. యూజర్లు వీటిలో ఏదైనా ఒకటి ఎంచుకుని యాక్టివేట్ చేసుకోవచ్చని గూగుల్ ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ శరత్ బులుసు తెలిపారు.

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ హిస్టరీ కోసం | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఆంధ్రప్రదేశ్ పోలీసు ఉద్యోగాలకు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు. | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ ఆర్జీయూకేటీలో పీయూసీ, బీటెక్ ప్రవేశాలు

ఏపీలోని రాజీవ్ గాంధీ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ)..2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ప్రవేశాలకు ప్రకటన విడుదల చేసింది.

- » **ఏపీలో క్యాంపస్‌లు:** ఆర్‌కే వ్యాలీ క్యాంపస్, నూజివీడు క్యాంపస్, శ్రీకాకుళం క్యాంపస్, ఒంగోలు క్యాంపస్.
- » **మొత్తం సీట్లు, వివరాలు:** మొత్తం నాలుగు క్యాంపస్‌లలో 4000 సీట్లు భర్తీ కానున్నాయి. ప్రతి క్యాంపస్‌కు 1000 సీట్లు కేటాయించారు. 10 శాతం ఈడబ్ల్యూఎస్ కోటా కింద మరో 400 సీట్లు అదనంగా భర్తీ చేస్తారు.
- » మొత్తం సీట్లలో 85% రాష్ట్ర విద్యార్థులకు కేటాయిస్తారు. మిగిలిన 15% సీట్లకు రాష్ట్రంతోపాటు తెలంగాణ విద్యార్థులు కూడా పోటీపడతారు.
- » **అర్హత:** ఈ ఏడాది పదో తరగతి ఉత్తీర్ణులైన వారు మాత్రమే ప్రవేశాలకు అర్హులు.
- » **ఎంపిక విధానం:** ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు ప్రాధాన్యం ఉంటుంది. ఒకవేళ ఇద్దరు విద్యార్థుల స్కోర్ సమానంగా ఉంటే ఏడు కొలమానాలను పరిగణనలోకి తీసుకుంటారు. మొదట గణితంలో, తర్వాత సైన్స్, ఆంగ్లం, సాంఘిక శాస్త్రం, ప్రథమ భాషలో గ్రేడ్‌ను పరిశీలించి సీట్లు కేటాయిస్తారు. అవీ సమానంగా ఉంటే పుట్టిన తేదీ ఆధారంగా ఎక్కువ వయసు ఉన్న వారికి ప్రవేశం ఖరారు చేస్తారు. అది కూడా సమానంగా ఉంటే హాల్‌టికెట్ ర్యాండమ్ నంబరు విధానాన్ని పరిగణనలోకి తీసుకుంటారు.

ముఖ్యమైన తేదీలు

- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 26.06.2023
- » పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.rgukt.in

ట్రిపుల్‌ఐటీ బాసరలో ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రవేశాలు

బాసర రాజీవ్‌గాంధీ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ).. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ట్రిపుల్‌ఐటీలో ప్రవేశాల కోసం ప్రకటన విడుదలచేసింది.

- » **మొత్తం సీట్లు, వివరాలు:** మొత్తం 1650 ఇంటిగ్రేటెడ్ బీటెక్(ఇంటర్+బీటెక్) సీట్లు భర్తీ కానున్నాయి. యూనివర్సిటీలో 1500 సీట్లు ఉండగా.. 10 శాతం ఈడబ్ల్యూఎస్ కోటా కింద, మరో 150 అదనంగా భర్తీ చేస్తారు. మొత్తం సీట్లలో 85 శాతం రాష్ట్ర విద్యార్థులకు కేటాయిస్తారు. మిగిలిన 15 శాతం సీట్లకు రాష్ట్రంతోపాటు ఏపీ విద్యార్థులు కూడా పోటీపడతారు.
- » **అర్హత:** ఈ సంవత్సరం పదో తరగతి ఉత్తీర్ణులైన వారు మాత్రమే ప్రవేశాలకు అర్హులు. ఈ ఏడాది డిసెంబర్ 31 నాటికి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 21 ఏళ్లు, మిగిలిన వారు 18 ఏళ్ల లోపు ఉండాలి.
- » **ఎంపిక విధానం:** ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు వారి పదో తరగతి గ్రేడ్‌కు 0.40 స్కోర్ కలుపుతారు. ఒకవేళ ఇద్దరు విద్యార్థుల స్కోర్ సమానంగా ఉంటే.. ఏడు కొలమానాలను పరిగణనలోకి తీసుకుంటారు. మొదట గణితంలో, తర్వాత సైన్స్, ఆంగ్లం, సాంఘిక శాస్త్రం, ప్రథమ భాషలో గ్రేడ్‌ను పరిశీలించి సీట్లు ఇస్తారు. అవీ సమానంగా ఉంటే పుట్టిన తేదీ ఆధారంగా ఎక్కువ వయసు ఉన్న వారికి సీటు కేటాయిస్తారు.

ముఖ్య సమాచారం

- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 19.06.2023.
- » పూర్తి వివరాలకు వెబ్‌సైట్:www.rgukt.ac.in

ఆర్మీ పబ్లిక్ స్కూల్, గోల్కొండలో 18 టీచర్ పోస్టులు

హైదరాబాద్‌లోని గోల్కొండలో ఉన్న ఆర్మీ పబ్లిక్ స్కూల్(ఏపీఎస్).. టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 18
- » **పోస్టులు:** పీజీటీ, టీజీటీ, పీఆర్‌టీ.
- » **విభాగాలు:** సైకాలజీ, ఇంగ్లిష్,హిందీ, మ్యాథ్స్, సైన్స్, కంప్యూటర్స్, మ్యూజిక్ తదితరాలు.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత సబ్జెక్టుల్లో బీఈడీ/బీఈఐఈడీ /డీఈడీ/డీఈఐఈడీ/ బ్యాచిలర్స్ డిగ్రీ/మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
- » **ఎంపిక:** స్క్రూటినీ, ఇంటర్వ్యూ ద్వారా
- » **దరఖాస్తు ఇలా:** ఆఫ్‌లైన్ ద్వారా. **చిరునామా:** ప్రిన్సిపల్, ఆర్మీ పబ్లిక్ స్కూల్, గోల్కొండ.
- » **దరఖాస్తులకు చివరితేది:** 15.06.2023.
- » **వెబ్‌సైట్:** www.apsgolconda.edu.in

ఇండియన్ ఆర్మీలో టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ ప్రవేశాలు

ఇండియన్ ఆర్మీ జనవరి 2024లో ప్రారంభమయ్యే 50వ 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్(టీఈఎస్) కోర్సు శిక్షణలో ప్రవేశాలకు అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 90
- » **అర్హత:** గుర్తింపు పొందిన ఎడ్యుకేషన్ బోర్డు నుంచి కనీసం 60శాతం మార్కులతో 10+2(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్) లేదా దానికి సమానమైన పరీక్షతోపాటు జేఈఈ(మెయిన్స్) 2023లో ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** 16 నుంచి 19 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **ఎంపిక విధానం:** స్టేజ్-1, స్టేజ్-2 పరీక్షలు, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.06.2023.
- » **వెబ్‌సైట్:** www.joinindianarmy.nic.in

వాయుసేనలో ఆఫీసర్ కొలువు

దేశ రక్షణలో వెన్నెముక వంటి వాయుసేనలో చేరాలని కోరుకునే యువతకు అద్భుత అవకాశం స్వాగతం పలుకుతోంది. వివిధ విభాగాల్లో 276 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది!! జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ ఎంపిక ప్రక్రియలో విజయం సాధిస్తే.. ఎయిర్‌ఫోర్స్‌లో.. ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ విభాగాల్లో గెజిటెడ్ ఆఫీసర్ కొలువు సొంతమవుతుంది. నెలకు రూ.లక్షకు పైగా వేతనం అందుకునే అవకాశం లభిస్తుంది. ఏఎఫ్‌క్యాట్(2)-2023 నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో.. దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు తదితర వివరాలు..

- » ఏఎఫ్‌క్యాట్(2)-2023 నోటిఫికేషన్ విడుదల
- » ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ విభాగాల్లో 276 పోస్టులు
- » ఏఎఫ్‌క్యాట్ ద్వారా ఎంపిక

బ్యాచిలర్ డిగ్రీ, బీటెక్ అర్హతలుగా ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ విభాగాల్లో షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో పోస్టుల భర్తీకి నిర్వహించే ప్రక్రియే.. ఏఎఫ్‌క్యాట్. వాయుసేన ఏటా రెండుసార్లు ఈ పరీక్షను నిర్వహిస్తుంది.

మొత్తం 276 పోస్టులు

ఏఎఫ్‌క్యాట్ (2)-2023 ద్వారా మొత్తం 276 పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిల్లో ఫ్లయింగ్ బ్రాంచ్, గ్రౌండ్ డ్యూటీ టెక్నికల్, గ్రౌండ్ డ్యూటీ నాన్ టెక్నికల్, ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్(ఫ్లైయింగ్)ల్లో పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- **ఫ్లయింగ్ బ్రాంచ్:** ఎంపీసీ గ్రూప్‌తో ఇంటర్మీడియెట్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణతతో పాటు 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్ పాస్ అవ్వాలి.
- **ఏరోనాటికల్ ఇంజనీర్(ఎలక్ట్రానిక్స్):** నిర్దేశిత బ్రాంచ్‌లతో 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత సాధించాలి.
- **ఏరోనాటిక్ ఇంజనీర్(మెకానికల్):** ఏరోస్పేస్, ఏరోనాటికల్, ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటనెన్స్, మెకానికల్, మెకానికల్ ఇంజనీరింగ్ అండ్ ఆటోమేషన్, ప్రొడక్షన్, మెకట్రానిక్స్, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్, మాన్యుఫ్యాక్చరింగ్, ప్రొడక్షన్ అండ్ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్, మెటీరియల్ సైన్స్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్, ఏరోస్పేస్ అండ్ అప్లయిడ్ మెకానిక్స్, ఆటోమోటివ్, రోబోటిక్స్, నానో టెక్నాలజీ, రబ్బర్ టెక్నాలజీ అండ్ రబ్బర్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లతో బీటెక్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి.
- **గ్రౌండ్ డ్యూటీ-వెపన్ సిస్టమ్స్:** ఎంపీసీ గ్రూప్‌లో 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణతతోపాటు 60 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
- **గ్రౌండ్ డ్యూటీ-అడ్మినిస్ట్రేషన్ అండ్ లాజిస్టిక్స్:** 60 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత సాధించాలి.
- **గ్రౌండ్ డ్యూటీ-అకౌంట్స్:** 60 శాతం మార్కులతో బీకాం లేదా బీబీఏ/బీబీఎం/ బీబీఎస్(ఫైనాన్స్ స్పెషలైజేషన్) లేదా సీఏ/సీఎంఏ/సీఎస్/సీఎఫ్ఏ ఉత్తీర్ణత ఉండాలి.
- **గ్రౌండ్ డ్యూటీ ఎడ్యుకేషన్ బ్రాంచ్:** 50 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణులవ్వాలి.
- **గ్రౌండ్ డ్యూటీ మెటీయరాలజీ బ్రాంచ్:**60 శాతం మార్కులతో బీఎస్సీ(ఫిజిక్స్, మ్యాథమెటిక్స్) ఉత్తీర్ణత లేదా నిర్దేశిత బ్రాంచ్‌లతో బీఈ/బీటెక్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి.
- **ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్(ఫ్లయింగ్ బ్యాచ్):** ఎన్‌సీసీ ఎయిర్‌వింగ్ సీనియర్ డివిజన్ 'సి' సర్టిఫికెట్ ఉన్న అభ్యర్థులకు అందుబాటులో ఉన్న అవకాశం ఇది. వీరికి ఎన్‌సీసీ సర్టిఫికెట్‌తో పాటు 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ తప్పనిసరి. ఇంటర్ మ్యాథ్స్, ఫిజిక్స్‌ల్లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.

వయసు

- **ఫ్లయింగ్ బ్రాంచ్:** జూలై 1, 2004 నాటికి 20-24 ఏళ్లు (జూలై 2, 2000 -జూలై 1, 2004 మధ్యలో జన్మించి ఉండాలి).
- ఫ్లయింగ్ బ్రాంచ్‌కు సంబంధించి.. కమర్షియల్ పైలట్ లైసెన్స్ కలిగి ఉన్న వారికి గరిష్ఠ వయోపరిమితిలో రెండేళ్ల మినహాయింపు లభిస్తుంది. ఈ అభ్యర్థులు ఆగస్టు 1, 2004 నాటికి 20-26 ఏళ్ల మధ్యలో ఉండాలి.
- **గ్రౌండ్ డ్యూటీ:** జూలై 1, 2004 నాటికి 20-26 ఏళ్లు (జూలై 2, 1998-జూలై 1, 2004 మధ్యలో జన్మించి ఉండాలి) ఉండాలి.
- అన్ని విభాగాలకు అవివాహితులు మాత్రమే అర్హులు.

ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ

ఏఫ్‌క్యాట్‌లో భాగంగానే ఫ్లయింగ్ బ్రాంచ్‌లో ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్ కూడా ఉంది. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్‌లో పేర్కొన్న ఖాళీలు, అదే విధంగా ఏఎఫ్‌క్యాట్‌లో పేర్కొన్న సీట్లకు పది శాతం చొప్పున ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్‌కు కేటాయిస్తారు. ఈ విధానంలో దరఖాస్తు చేసుకోవాలంటే.. ఎన్‌సీసీ ఎయిర్ వింగ్ విభాగంలో 'సి' సర్టిఫికెట్ పొంది ఉండాలి.

ఏఎఫ్‌ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ

ఎంపిక ప్రక్రియలో భాగంగా ముందుగా ఎయిర్ ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్‌ను నిర్వహిస్తారు. ఇందులో నిర్దేశిత కటాఫ్ మార్కులు సాధించిన వారికి మలిదశలో ఎయిర్‌ఫోర్స్ సెలక్షన్ బోర్డ్ పరిధిలో మరో ఎంపిక ప్రక్రియ ఉంటుంది.

4 విభాగాలు-300 మార్కులు

ఎంపిక ప్రక్రియలో తొలి దశ ఏఎఫ్‌క్యాట్ 100 ప్రశ్నలు-300 మార్కులకు జరుగుతుంది. మొత్తం 4 విభాగాలు.. జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్ వెర్బల్ ఎబిలిటీ,న్యూమరికల్ ఎబిలిటీ అండ్ రీజనింగ్,మిలటరీ ఆప్టిట్యూడ్ టెస్ట్‌ల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు కేటాయిస్తారు. నెగెటివ్ మార్కింగ్ నిబంధన కూడా ఉంది. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. పరీక్షకు నిర్దేశించిన సమయం రెండు గంటలు.

ఏఎఫ్ఎస్‌బీ టెస్టింగ్

- తొలి దశ ఏఎఫ్‌క్యాట్‌లో విజయం సాధించిన వారికి రెండో దశలో ఎయిర్ ఫోర్స్ సెలక్షన్ బోర్డ్‌ల ఆధ్వర్యంలో ఏఎఫ్ఎస్‌బీ టెస్టింగ్ నిర్వహిస్తారు. ఈ ఎంపిక ప్రక్రియ మొత్తం మూడంచెల్లో ఉంటుంది.
- **తొలి దశ స్టేజ్-1:** ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్ టెస్ట్, పిక్చర్ పర్సెప్షన్ టెస్ట్.
- **రెండో దశ స్టేజ్-2:** సైకాలజికల్ టెస్ట్. ఇందులో భాగంగా అయిదు రోజులపాటు పలు అంశాల్లో పరీక్షలు నిర్వహిస్తారు. పర్సనల్ ఇంటర్వ్యూ కూడా ఉంటుంది.
- ఫ్లయింగ్ బ్రాంచ్ అభ్యర్థులకు ప్రత్యేకంగా కంప్యూటరైజ్డ్ పైలట్ సెలెక్షన్ సిస్టమ్ (సీపీఎస్ఎస్) విధానంలో ఇంకో పరీక్ష కూడా నిర్వహిస్తారు.
- ఎన్‌సీసీ ఎయిర్ వింగ్ 'సి' సర్టిఫికెట్ ద్వారా ఎన్‌సీసీ ఎంట్రీకి దరఖాస్తు చేసుకున్న వారికి ఏఎఫ్‌క్యాట్ నుంచి మినహాయింపు ఉంటుంది.
- ఇలా.. ఏఎఫ్‌క్యాట్‌తోపాటు ఏఎఫ్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియలో విజయం సాధించిన వారిని శిక్షణకు ఎంపిక చేస్తారు.

74, 52 వారాల శిక్షణ

- తుది విజేతలుగా నిలిచిన వారికి ఎయిర్‌ఫోర్స్ అకాడమీ (హైదరాబాద్)లో శిక్షణనిస్తారు. ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ-టెక్నికల్ విభాగాలకు ఎంపికైన వారికి 74 వారాలు, గ్రౌండ్ డ్యూటీ (నాన్-టెక్నికల్) బ్రాంచ్‌లకు 52 వారాల పాటు శిక్షణ ఉంటుంది. ఈ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి.. సంబంధిత విభాగాల్లో ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్‌గా కొలువు ఖరారు అవుతుంది. వీరికి ప్రారంభంలో రూ.56,100 - రూ.1,77,500 వేతన శ్రేణి లభిస్తుంది. శిక్షణ సమయంలో నెలకు రూ.56,100 స్టయిఫండ్ ఇస్తారు.



- ఎయిర్‌ఫోర్స్‌కు ఎంపికైన వారికి.. షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో పదేళ్ల పాటు విధులు నిర్వర్తించే అవకాశం కల్పిస్తారు. ఆ తర్వాత ఆసక్తి, ప్రతిభను అనుసరించి మరో నాలుగేళ్లపాటు పొడిగించుకునే వీలుంది. షార్ట్ సర్వీస్‌కమిషన్ విధానంలో మొత్తం 14 ఏళ్లు పూర్తి చేసుకున్న తర్వాత పర్మనెంట్ కమిషన్ హోదా పొందే అవకాశాన్ని కూడా ఎయిర్‌ఫోర్స్ కల్పిస్తోంది.

విజయం సాధించేలా

- **ఇంగ్లిష్:** కాంప్రహెన్షన్, ఇంగ్లిష్ గ్రామర్, సెంటెన్స్ కంప్లీషన్, సెంటెన్స్ ఫార్మేషన్, స్పాటింగ్ ద ఎర్రర్, యాంటానిమ్స్, సినానిమ్స్, క్లోజ్ టెస్ట్, ఇడియమ్స్, ఫ్రేజెస్, అనాలజీ, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూషన్‌లపై దృష్టి పెట్టాలి.
- జనరల్ అవేర్‌నెస్: చరిత్ర, జాగ్రఫీ, పాలిటీ, ఎకానమీలతోపాటు జాతీయ, అంతర్జాతీయ ప్రాముఖ్యం సంతరించుకున్న అంశాలు, సంఘటనలు, సైన్స్ అండ్ టెక్నాలజీ తాజా పరిణామాలు, రక్షణ రంగంలోని పరిణామాలపై దృష్టి సారించాలి.
- **న్యూమరికల్ ఎబిలిటీ:** టైమ్ అండ్ వర్క్, యావరేజెస్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్, సింపుల్, కాంపౌండ్ ఇంట్రస్ట్, టైమ్ అండ్ డిస్టెన్స్, నంబర్ సిరీస్, పెరిమీటర్, ఏరియా, ప్రాబబిలిటీ అంశాలపై అవగాహన పొందాలి.
- **రీజనింగ్ అండ్ మిలటరీ ఆప్టిట్యూడ్ టెస్ట్:** ఇందులో రాణించడానికి వెర్బల్, నాన్ -వెర్బల్ రీజనింగ్ అంశాలతోపాటు.. సీటింగ్ అరేంజ్‌మెంట్, రొటేటెడ్ బ్లాక్స్, హిడెన్ ఫిగర్స్, అనాలజీపై అవగాహన పొందాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** జూన్ 1 - జూన్ 30, 2023
- **ఏఎఫ్‌క్యాట్ తేదీ:** ఆగస్టు 25, 26, 27 తేదీల్లో ఆన్‌లైన్ పరీక్ష ఉంటుంది.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** గుంటూరు, హైదరాబాద్, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్
- **వెబ్‌సైట్:** https://afcat.cdac.in

క్లుప్తంగా...

16న హైదరాబాద్‌కు రాష్ట్రపతి రాక

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 16న సాయంత్రం హైదరాబాద్ పర్యటనకు రానున్నారు. 17న ఉదయం దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో నిర్వహించనున్నపాసింగ్ అవుట్ పరేడ్‌లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొంటారు. అనంతరం తిరిగి ఢిల్లీకి బయల్దేరి వెళ్తారు. 16న రాత్రి రాజ్‌భవన్‌లో రాష్ట్రపతి బసకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

12న డీఈఈ సెట్-2023

సాక్షి, అమరావతి : ప్రభుత్వ డైట్ కళాశాలలో రెండు సంవత్సరాల డీఈడీ కోర్సుల్లో ప్రవేశాల కోసం డీఈఈ సెట్-2023 12న జరగనుంది. ఆన్‌లైన్‌లో జరిగే ఈ పరీక్షను ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు నిర్వహిస్తామని కన్వీనర్ వి.మేరీచంద్రిక తెలిపారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్లను సెట్ వెబ్ సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకోవచ్చు.

పీజీ ప్రవేశాల ప్రక్రియ మరింత ఆలస్యం

జూలై, ఆగస్టు నెలల్లో జరిగే అవకాశం

సాక్షి, అమరావతి : వైద్య విద్య పీజీ కోర్సుల్లో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల ప్రక్రియ మొదలవ్వడానికి ఇంకా సమయం పట్టే అవకాశం ఉంది. జూలై /ఆగస్టులో ప్రవేశాల ప్రక్రియ మొదలవుతుందని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది మార్చి 5వ తేదీన దేశవ్యాప్తంగా నీట్ పీజీ-2023 పరీక్ష జరిగ్గా, అదే నెల 14నే ఫలితాలు వెలువడ్డాయి. అయితే ఇప్పటి వరకూ నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ నుంచి నీట్ పీజీ అర్హుల జాబితా ఆరోగ్య విశ్వవిద్యాలయానికి అందలేదు. వచ్చే వారంలో జాబితా అందే అవకాశం ఉంది. కాగా, ఈ ఏడాది నుంచి కౌన్సెలింగ్ నిర్వహించి అన్ని సీట్ల భర్తీని తామే చేపడతామని మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ(ఎంసీసీ) రాష్ట్రాల విశ్వవిద్యాలయాలకు లేఖ రాసింది. ఆరోగ్య విశ్వవిద్యాలయంలో నోడల్ అధికారులను నియమించి వారి వివరాలను ఎంసీసీకి పంపారు. అనంతరం కౌన్సెలింగ్ నిర్వహణపై ఎంసీసీ నుంచి ఎలాంటి సమాచారం రాలేదు. ఇప్పటి వరకూ ఆలిండియా కోటా సీట్లను మాత్రమే ఎంసీసీ భర్తీ చేసేది. రాష్ట్ర కోటా, బీ, సీ కేటగిరి సీట్లను విశ్వవిద్యాలయం భర్తీ చేపడుతూ వస్తోంది.

ఏపీ స్పేస్ అప్లికేషన్ సెంటర్ పునర్ వ్యవస్థీకరణ

ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి చైర్మన్‌గా 18 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ స్పేస్ అప్లికేషన్ సెంటర్‌ను పునర్ వ్యవస్థీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి చైర్మన్‌గా 18 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏపీ స్టేట్ ఫైబర్ నెట్, ఏపీ టవర్స్, ఏపీ డిజిటల్ కార్పొరేషన్ ఎండీలు, ఆర్థికశాఖ, ఇస్రో, ఎన్ఆర్ఎస్‌సీ, ఎస్ఐసీలు సూచించిన ప్రతినిధులు, ప్లానింగ్ విభాగం డైరెక్టర్, ఐటీశాఖ డైరెక్టర్లు కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఏపీఎస్ఏసీ వైస్ చైర్మన్ సభ్య కార్యదర్శిగా, ఏపీఎస్ఏసీ డైరెక్టర్ ప్రత్యేక ఆహ్వానితులుగా ఉంటారు. పంచాయతీరాజ్, జలవనరుల శాఖల ఇంజనీర్ ఇన్ చీఫ్, వ్యవసాయశాఖ, ఉద్యానవన శాఖ, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ శాఖల కమిషనర్లు ప్రత్యేక ఆహ్వానితులుగా ఉంటారని పేర్కొన్నారు.

నిన్ హైడ్రిన్ పరీక్షకు కోర్టు అనుమతి

వివేకా లేఖపై వేలిముద్రలు తెలిసే అవకాశం

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా ఆయన రాసిన లేఖకు నిన్ హైడ్రిన్ పరీక్ష చేసేందుకు సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌ను అనుమతించింది. ఈ పరీక్ష చేస్తే కంటికి కనిపించని, సాధారణ పరీక్షల్లో బయటపడని వేలిముద్రలు కూడా గుర్తించవచ్చు. ఒత్తిడి కారణంగానే వివేకా ఈ లేఖను రాసినట్లు 2021లో సీఎఫ్ఎస్ఎల్ తేల్చింది. అయితే వేలిముద్రలు కూడా గుర్తించాలని సీబీఐ కోరింది. దీనికి నిన్ హైడ్రిన్ పరీక్ష నిర్వహించాలని, అది చేస్తే లేఖలో ఇంకుతో ఉన్న అక్షరాలు చెరిగిపోయే అవకాశం ఉందని సీఎఫ్ఎస్ఎల్ వివరించింది. దీంతో వివేఖా లేఖను నిన్‌హైడ్రిన్ పరీక్షకు అనుమతించాలని, అందులోని అక్షరాలు చెరిగిపోతే విచారణపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ఆ లేఖ స్థానంలో కలర్ జిరాక్స్‌ను అనుమతించాలని కోరుతూ ప్రత్యేక న్యాయస్థానంలో సీబీఐ గత నెలలో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం నిన్ హైడ్రిన్ పరీక్షకు అనుమతించింది.

సచివాలయ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు మృతి

సాక్షి, అమరావతి: ఏపీ సచివాలయం ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు యర్రన్న యాదవ్ మృతి చెందారు. అనారోగ్య కారణాలతో హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఆయన మృతి చెందారు. ఉద్యోగుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన ఎర్రన్న యాదవ్ మృతి పట్ల సచివాలయ సంఘం ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తోందని సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నామన్నారు.

ఇంటర్నెట్ బిజినెస్‌లో అత్యధిక ఉద్యోగావకాశాలు



ఇండియా స్కిల్స్ రిపోర్ట్ -2023 వెల్లడి

- వచ్చే ఐదేళ్లలో దేశంలో 90 కోట్ల మందికి చేరనున్న ఇంటర్నెట్
- ఉద్యోగావకాశాలు 2023లో 50.3 శాతానికి పెరుగుదల
- గత ఆరేళ్లుగా ఉపాధి అర్హత కలిగిన యువతలో మహిళలే అత్యధికం
- అత్యధిక ఉపాధి నైపుణ్యాలున్న రాష్ట్రాలు ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్

సాక్షి, అమరావతి: దేశంలో ఇంటర్నెట్ బిజినెస్ రంగం వేగంగా విస్తరిస్తోందని, ఈ ఏడాది ఈ రంగంలో ఉద్యోగావకాశాలు అత్యధికంగా ఉంటాయని ఇండియా స్కిల్స్ రిపోర్ట్- 2023 వెల్లడించింది. భారతదేశంలో ప్రస్తుతం 74.9 కోట్ల మంది ఇంటర్నెట్ వినియోగదారులు ఉండగా.. వచ్చే ఐదేళ్లలో ఆ సంఖ్య 90 కోట్లకు చేరుతుందని రిపోర్ట్ స్పష్టం చేసింది. అత్యంత వేగంగా ఈ రంగం విస్తరిస్తోందని, భారతదేశం డిజిటల్ దిగ్గజంగా స్థిరపడేందుకు ఇది దోహదపడుతుందని పేర్కొంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఇంజినీరింగ్, తయారీ రంగంలో పెట్టుబడులపై దృష్టి సారిస్తోందని, ఫార్మాస్యూటికల్ రంగం కూడా గణనీయంగా విస్తరిస్తోందని, ఈ రంగాల్లో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపింది.

ఉపాధి అర్హతలో మహిళలే ముందు

గత ఆరేళ్లుగా ఉపాధి అర్హత గల యువతలో మహిళలే అత్యధికంగా ఉన్నట్లు రిపోర్ట్ తెలిపింది. 2017లో ఉపాధి అర్హతగల మహిళా వనరులు 40.88 శాతం ఉంటే 2023లో అది 52.80 శాతానికి పెరిగింది. దేశం వ్యాప్తంగా ఉపాధి అర్హత కలిగిన మహిళా వనరులుండటం విద్యలో భారతదేశం సాధించిన విజయాన్ని తెలియజేస్తోందని రిపోర్ట్ వ్యాఖ్యానించింది. దేశంలో అత్యధిక ఉపాధి నైపుణ్యాలు ఈ ఏడాది ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఉన్నట్లు రిపోర్ట్ తెలిపింది.



గత ఆరు సంవత్సరాలుగా దేశంలో ఉపాధి కల్పనలో మార్పులు ఇలా

సంవత్సరం	ఉపాధి శాతం
2017	40.44
2018	45.60
2019	47.38
2020	46.9
2021	45.9
2022	46.2
2023	50.3

గత ఆరు సంవవత్సరాలుగా ఉపాధి అర్హతగల పురుష, మహిళ వనరుల శాతం ఇలా

సంవత్సరం	పురుషులు	మహిళలు
2017	34.26	40.88
2018	34.26	38.15
2019	34.26	45.60
2020	34.26	47.00
2021	34.26	41.25
2022	47.28	53.28
2023	47.20	52.80

గత ఆరు సంవత్సరాలుగా ఉద్యోగాలు ఎక్కువగా కల్పించిన రంగాలు..

- 2017 - ఆయిల్ అండ్ గ్యాస్, స్టీల్, మినరల్స్, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, ఆటోమోటివ్స్.
- 2018 - బ్యాంకింగ్,ఫైనాన్స్, సర్వీస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ), రిటైల్.
- 2019 - బీఎఫ్ఎస్ఐ, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, మాన్యుఫ్యాక్చరింగ్.
- 2020 - బీఎఫ్ఎస్ఐ, ఐటీ, ఇంటర్నెట్ బిజినెస్.
- 2021 - బీఎఫ్ఎస్ఐ, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, ఐటీ, ఇంటర్నెట్ బిజినెస్.
- 2022 - ఇంటర్నెట్ బిజినెస్, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, ఐటీ, ఫార్మా.

ఈ ఏడాది ఉద్యోగావకాశాలు ఎక్కువ

దేశంలో గత ఆరేళ్లతో పోల్చితే ఈ ఏడాది ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయని ఇండియా స్కిల్స్ రిపోర్ట్ అంచనావేసింది. 2017లో 40.44 శాతమే ఉద్యోగావకాశాలుండగా ఈ ఏడాది 50.3 శాతం మేరకు అది పెరిగాయని రిపోర్ట్ పేర్కొంది. కోవిడ్ సంక్షోభం కారణంగా మూడేళ్లు అంటే 2020 నుంచి 2022 వరకు దేశంలో ఉద్యోగావకాశాలు 46 శాతానికే పరిమితమయ్యాయి.

'స్థానిక' ఖాళీలకు నేడే ఉప ఎన్నిక

- పూర్వ పశ్చిమ గోదావరి జెడ్పీ చైర్మన్, విజయనగరం డిప్యూటీ మేయర్ పదవులకు ఎన్నిక
- తెనాలి, నర్సీపట్నం, ధర్మవరం, నూజివీడు మునిసిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకూ..
- నాలుగు మండలాల్లో ఎంపీపీ, తొమ్మిది మండలాల్లో ఉపాధ్యక్ష పదవులకు ఎన్నిక

సాక్షి, అమరావతి : రాజీనామా చేయడం లేదా చనిపోవడం వంటి కారణాలతో గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలలో ఖాళీలు ఏర్పడిన పదవులకు గురువారం ఉప ఎన్నికలు జరగనున్నాయి. పూర్వ పశ్చిమ గోదావరి జిల్లా జెడ్పీ చైర్మన్, విజయనగరం నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ పదవులతో పాటు మరో నాలుగు మునిసిపాలిటీలలో రెండు చైర్మన్, మూడు వైస్ చైర్మన్ పదవులకు, 4 మండలాల్లో ఎంపీపీ, మరో 9 మండలాల్లో ఉపాధ్యక్ష పదవులకు ఉప ఎన్నికలు నిర్వహించేందుకు గత నెల 31న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలంసాహ్ని నోటిఫికేషన్ జారీ చేశారు. పరోక్ష పద్ధతిలో ఎన్నికలు జరిగేలా గురువారం ఉదయం 11 గంటలకు ఆయా స్థానిక ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలు కొనసాగనున్నాయి.

వాయిదా పడితే మరుసటి రోజే..

ఆయా పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల్లో ఏదైనా కారణంతో ఉప ఎన్నిక వాయిదా పడితే మరుసటి రోజు శుక్రవారం (9వ తేదీ) ఉదయం 11 గంటలకు తిరిగి ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని ఎన్నికల నోటిఫికేషన్లలో స్పష్టం చేశారు. చిత్తూరు జిల్లా రామకుప్పం మండల ఎంపీపీ, ఉపాధ్యక్ష స్థానాలతో పాటు నాలుగు పంచాయతీల్లో ఉప సర్పంచ్ ఎన్నిక గతంలోనే పలుమార్లు వాయిదా పడ్డాయి. ఆయా స్థానాలకు గురువారం ఎన్నికల ప్రక్రియను చేపడతారు. ఈ స్థానాల్లో ఏదైనా కారణంతో ఎన్నిక వాయిదా పడితే అక్కడ తిరిగి ఎన్నికల కమిషనర్ ఆదేశాలు జారీ చేసే వరకు ఎన్నిక జరిగే వీలుండదు.

ఎన్నికలు జరిగే స్థానాలివే..

నగరం/పట్టణం	ఎన్నిక జరిగే స్థానం
విజయనగరం నగరపాలక సంస్థ	డిప్యూటీ మేయర్
తెనాలి మునిసిపాలిటీ	వైస్ చైర్‌పర్సన్
నర్సీపట్నం మునిసిపాలిటీ	చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్
ధర్మవరం మునిసిపాలిటీ	చైర్‌పర్సన్
నూజివీడు మునిసిపాలిటీ	వైస్ చైర్‌పర్సన్

గ్రామీణ ప్రాంతాల్లో...

జెడ్పీ చైర్‌పర్సన్ :పూర్వ పశ్చిమ గోదావరి

ఎంపీపీ: రామకుప్పం (చిత్తూరు), బత్తలపల్లి (శ్రీసత్యసాయి), రాపూరు (నెల్లూరు), గాలివీడు (అన్నమయ్య).

మండల పరిషత్ ఉపాధ్యక్ష పదవులు: రామకుప్పం, విజయాపురం (చిత్తూరు), రాయదుర్గం, విడపనకల్లు (అనంతపురం), చెన్నే కొత్తపల్లి (శ్రీసత్యసాయి), ఎల్.కోట (విజయనగరం), పెంటపాడు (పశ్చిమ గోదావరి), సంతమాగులూరు (బాపట్ల), పెదకడబూరు (కర్నూలు)

కో-ఆప్షన్ సభ్యులు :చిత్తూరు, తనకల్ (శ్రీ సత్యసాయి)

ఉప సర్పంచ్ :53 గ్రామ పంచాయతీలు

విద్యార్థులకు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు

- ప్రతి జిల్లాలో జాబ్ మేళాలు నిర్వహించాలని మంత్రి బుగ్గన ఆదేశం
- ఈ ఏడాది 30 వేల మందికి ఉద్యోగాల కల్పన లక్ష్యం
- ఇప్పటివరకు 38 జాబ్ మేళాల ద్వారా 4,774 మందికి ఉపాధి



సాక్షి, అమరావతి: రాష్ట్ర విద్యార్థులకు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ప్రతి జిల్లాలో జాబ్ మేళాలు నిర్వహించాలని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ అధికారులను ఆదేశించారు. ఇందుకనుగుణంగా స్థానిక కంపెనీలతో భాగస్వామ్య ఒప్పందాలు చేసుకోవాలని సూచించారు. వీటిని నిర్దిష్ట గడువులోగా పూర్తి చేసేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నైపుణ్యాభివృద్ధి శాఖ చేపడుతున్న కార్యక్రమాలపై మంత్రి బుగ్గన బుధవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ఏడాదికి సంబంధించిన జాబ్ మేళా క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ ఏడాది 286 జాబ్ మేళాలు నిర్వహించడం ద్వారా 30 వేల మందికి ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అందులో ఇప్పటికే 38 జాబ్ మేళాల ద్వారా 4,774 మందికి ఉద్యోగావకాశాలు కల్పించినట్లు తెలిపారు. నైపుణ్య శిక్షణ పూర్తికాగానే ఉపాధి లభించేలా డిమాండ్ ఉన్న కోర్సులను గుర్తించాలని సూచించారు. దానికి అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 200 పరిశ్రమలు, సంస్థల్లో ఉపాధి కల్పించే విధంగా ఆగస్టు 15 కల్లా ఒప్పందాలు కుదుర్చుకోవాలన్నారు. పులివెందులలో ఏర్పాటు చేస్తున్న నైపుణ్య శిక్షణ అకాడమీని వైఎస్సార్ జయంతి సందర్భంగా సీఎం చేతుల మీదుగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాలిటెక్నిక్, ఐటీఐ కాలేజీల్లో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్స్‌లో వసతి ఏర్పాట్లను మంత్రి అడిగి తెలుసుకున్నారు. మారుతున్న అవసరాలకనుగుణంగా పాలిటెక్నిక్ సిలబస్‌లో మార్పులు చేయాలన్నారు. ఈ సమీక్షలో ఆర్థిక శాఖ కార్యదర్శులు.. కేవీవీ సత్యనారాయణ, గుల్జార్, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ వినోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పాత కక్షలతోనే హనుమాయమ్మ హత్య

- రాజకీయ రంగు పులమడం సరికాదు
- నిందితుని ఆచూకీ కోసం రెండు ప్రత్యేక బృందాల గాలింపు
- మద్దిపాడు ఫ్లైఓవర్ వద్ద అరెస్టు
- తల్లి శీలంపై నిందలు మోపడం సహించలేకే హత్యచేశానన్న నిందితుడు
- డీజీపీ ఆదేశాల మేరకు అన్ని కోణాల్లో దర్యాప్తు : ఎస్పీ మలికాగర్గ్



సాక్షి, అమరావతి/ఒంగోలు: పాత కక్షల నేపథ్యంలోనే సవళం హనుమాయమ్మ హత్యకు గురైందని ప్రకాశం జిల్లా ఎస్పీ మలికాగర్గ్ తెలిపారు. దీనికి రాజకీయ రంగు పులమడం సరికాదని పేర్కొన్నారు. ఈ హత్యకు సంబంధించి కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తలు వాస్తవం కాదన్నారు. టంగుటూరు మండలం రావివారిపాలెంలో జరిగిన మహిళ హత్యకు సంబంధించి బుధవారం గెలాక్సీ సమావేశ మందిరంలో ఎస్పీ విలేకరులతో మాట్లాడారు. వివరాలు ఆమె మాటల్లోనే... ఈ నెల 5వ తేదీ రాత్రి 7 గంటలకు ఇంటికి వస్తున్న సవళం హనుమాయమ్మను అదే గ్రామానికి చెందిన ఆమె బంధువు సవళం కొండలరావు అలియాస్ ఏడుకొండలు ట్రాక్టర్‌తో గుద్ది హత్య చేశాడు. ఏడుకొండలు కుటుంబ సభ్యులు మహేష్, రమణమ్మ, ఆదిలక్ష్మి కుట్రపన్ని హనుమాయమ్మను చంపేలా చేశారని, అడ్డువెళ్లిన ఆమె కుమార్తెను కూడా గాయపరిచినట్లు హతురాలి భర్త సుధాకరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుని ఆచూకీ కోసం ఒంగోలు డీఎస్పీ ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. బుధవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో స్థానిక మద్దిపాడు ఫ్లైఓవర్ వద్ద నిందితుడు ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేశారు. ఈ మేరకు నిందితుడ్ని విచారిస్తున్నారు. నిందితుడు ఏడుకొండలు 2013లో బీటెక్ పూర్తి చేసి రెండు సంవత్సరాలపాటు ఢిల్లీలో సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యాడు. 2018లో హైదరాబాద్‌లో రూ.16 లక్షల వార్షిక వేతనంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశాడు. అనంతరం 2019లో దక్షిణ ఆఫ్రికాలో పనిచేశాడు. అతనికి ఓటు హక్కు కూడా లేదు. తాను ఇంటికి వచ్చినప్పుడల్లా తన తల్లి శీలాన్ని శంకిస్తూ హనుమాయమ్మ నిందలు వేస్తుండడం, ఎగతాళి చేస్తుండడంతో తట్టుకోలేకనే హత్య చేసినట్లు విచారణలో చెప్పాడు. అనంతరం ట్రాక్టర్‌ను పొలంలో వదిలేసి పారిపోయినట్లు అంగీకరించాడు. ఈ హత్యకు సంబంధించి సీసీ టీవీ ఫుటేజ్‌లను సైతం పోలీసులు సేకరించారు. మృతురాలి కుటుంబానికి, నిందితుని కుటుంబాలకు మధ్య గతంలో కూడా గొడవలు జరిగాయి. 2007, 2021లో ఆ వివాదాలను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకున్నారు. కాగా, డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాన్ని నియమించి ఈ కేసులో ఇంకా ఏదైనా కుట్ర ఉందా అన్న కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. నిందితునికి న్యాయస్థానంలో శిక్షపడేలా చర్యలు తీసుకుంటున్నారు. కాగా, ఈ హత్యకు సంబంధించి టీడీపీ వారు రెండు రోజులుగా శవ రాజకీయాలు చేస్తూ ఆందోళనలకు దిగడం విశేషం.

రేపు కేరళకు 'నైరుతి'!

రాష్ట్రంలో కొనసాగనున్న వడగాడ్పులు

సాక్షి, విశాఖపట్నం: కొన్నాళ్లుగా దోబూచులాడుతున్న నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు కేరళను తాకనున్నాయి. సాధారణంగా ఏటా జూన్ ఒకటో తేదీకి ఇవి కేరళలోకి ప్రవేశిస్తాయి. కానీ మూడు రోజులు ఆలస్యంగా జూన్ 4న తాకుతాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ముందస్తుగా అంచనా వేసింది. అయితే ఆ అంచనాలు కూడా తప్పాయి. ఈనెల ఏడు, లేదా ఎనిమిది తేదీల్లో కేరళలోకి ప్రవేశించవచ్చని ఐఎండీ పేర్కొంది. ప్రస్తుతం కేరళలో రుతుపవనాల ప్రవేశానికి అనుకూల పరిస్థితులేర్పడ్డాయి. దక్షిణ అరేబియా సముద్రం మీదుగా పడమట గాలులు కొనసాగుతున్నాయి. పశ్చిమ గాలుల లోతులో పెరుగుదల, ఆగ్నే య అరేబియా సముద్రం, లక్షద్వీప్, కేరళ తీర ప్రాంతాలపై మేఘావృతం ఉధృతం వంటి పరిణామాలున్నాయి. దీంతో శుక్రవారం నాటికల్లా నైరుతి రుతుపవనాలు కేరళలో ప్రవేశించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని ఐఎండీ బుధవారం వెల్లడించింది. అనంతరం ఈ రుతుపవనాలు దక్షిణాది రాష్ట్రాల్లోని మరికొన్ని ప్రాంతాల్లో ముందుకు సాగుతాయని తెలిపింది.

ఐదారు రోజులు పెరగనున్న ఉష్ణోగ్రత

మరోవైపు రాష్ట్రంలో మరికొన్నాళ్ల వడగాడ్పులు కొనసాగనున్నాయి. మరో ఐదారు రోజులు పగటి ఉష్ణోగ్రతలు సాధారణంకంటే 2-4 డిగ్రీలు అధికంగా నమోదు కానున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో కొన్నిచోట్ల వడగాడ్పుల ప్రభావం ఉండనుంది. ఉష్ణతాపానికి తేమ తోడవడంతో అసౌకర్య వాతావరణం ఏర్పడనుంది. అదే సమయంలో రాష్ట్రంలో ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయి. ఉరుములు, మెరుపులతోపాటు అక్కడక్కడ పిడుగులు పడే అవకాశం ఉందని, గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని ఐఎండీ తెలిపింది.

లంకమల్లేశ్వర అభయారణ్యంలో కృష్ణజింక

అంతరించి పోతున్న జంతుజాతులలో కృష్ణజింక కూడా ఒకటి. అలాంటి వన్యప్రాణి వైఎస్సార్ జిల్లా అట్లూరు మండల పరిధిలోని లంకమల్లేశ్వర అభయారణ్యంలో కనిపించినట్లు సిద్దవటం రేంజర్ ప్రసాద్ తెలిపారు. కొండూరు బీట్ మచ్చాయకుంట సమీపాన కలివికోడి ఆవాస ప్రాంతంలో అమర్చిన ఓ కెమెరాలో చిత్రం లభ్యమైందని పేర్కొన్నారు. -అట్లూరు



కృష్ణజింక

మన చేపల్లో పాలీ కెమికల్స్ లేవు

- దుష్ప్రచారం మాని పరీక్ష చేయించి ధ్రువీకరించుకోండి
- ఈశాన్య రాష్ట్రాలకు స్పెషల్ సీఎస్ లేఖలు రాశారు
- అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ వెల్లడి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మంచినీటి చేపల సాగులో హానికరమైన పాలీ కెమికల్స్ ఆనవాళ్లు ఏమాత్రం లేవని ఏపీ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ స్పష్టం చేశారు. చెరువుల వద్దే శాంపిల్స్ టెస్ట్ చేస్తున్నామని.. రసాయన అవశేషాలు లేవని నిర్ధారణ అయిన తర్వాతే ఎగుమతులకు అనుమతిస్తారని చెప్పారు. బుధవారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. ఈశాన్య రాష్ట్రాల్లో కొంతమంది వ్యాపారులు ఏపీ నుంచి వస్తున్న చేపల్లో పాలీ కెమికల్స్ అవశేషాలు ఉంటున్నాయని చేస్తున్న దుష్ప్రచారం వల్ల ఆయా రాష్ట్రాలకు మన చేపల ఎగుమతికి అడ్డంకిగా మారుతోందన్నారు. మన రాష్ట్రం నుంచి నిత్యం 400 టన్నులకు పైగా చేపలు అసోం, మిజోరాం, నాగాలాండ్ తదితర ఈశాన్య రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంటాయన్నారు. సీఎం ఆదేశాల మేరకు మత్స్య శాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది ఆయా రాష్ట్రాల ఉన్నతాధికారులకు లేఖలు రాశారన్నారు. నిపుణులను పంపి నేరుగా చెరువుల వద్దే కావాల్సిన పరీక్షలు చేయించుకోవచ్చని, పాలీ కెమికల్స్ అవశేషాలు ఉంటే నిరూపించాలని సవాల్ విసిరారని చెప్పారు.

15 రోజులకు ఒకసారి రొయ్యల ధరలపై సమీక్ష

రాష్ట్రంలో ప్రతి 15 రోజులకు ఒకసారి రొయ్యల ధరల హెచ్చుతగ్గులను పర్యవేక్షిస్తూ ధరలు నిలకడగా కొనసాగేలా రైతు సాధికారత కమిటీ కృషి చేస్తోందని రఘురామ్ చెప్పారు. ఏజెంట్లు, షెడ్ల నిర్వాహకులు ఏ ప్రాసెసింగ్ కంపెనీలకు సరఫరా చేస్తున్నారో ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సిందేనని చెప్పారు. అప్సడా చట్టం ప్రకారం వారికి కూడా లైసెన్సులు జారీ చేస్తామని స్పష్టం చేశారు.

త్వరలో 'అల్లుడు సుద్దులు' పుస్తకం విడుదల



మహారాణిపేట(విశాఖపట్నం): చంద్రబాబుపై 'అల్లుడు సుద్దులు' అనే పుస్తకం రాసినట్లు రాష్ట్ర తెలుగు, సంస్కృత భాషా అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి తెలిపారు. ఆ పుస్తకాన్ని త్వరలోనే విడుదల చేస్తానని చెప్పారు. బుధవారం విశాఖలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీ.. చంద్రబాబు వల్ల అవినీతిమయమైందన్నారు. అందుకే టీడీపీని తాను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నానని చెప్పారు. లోకేశ్ చేస్తున్నది పాదయాత్ర కాదు.. ఈవెనింగ్ వాక్ అని ఎద్దేవా చేశారు. చంద్రబాబు హయాంలో అక్రమాల వల్లే పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యం జరిగిందన్నారు. పొత్తు కోసమే బీజేపీ నేత అమిత్‌షాను కలిసేందుకు చంద్రబాబు వెళ్లారని.. కానీ అక్కడ ఎదురుదెబ్బ తగిలిందన్నారు. సిగ్గు, అభిమానం ఏ మాత్రం లేని వ్యక్తి చంద్రబాబు అని విమర్శించారు. అందుకే తిరుపతి వచ్చినప్పుడు అమిత్‌షాపై రాళ్లు వేయించిన చంద్రబాబు.. ఇప్పుడు బీజేపీతో పొత్తు కోసం ఆయన దగ్గరికే వెళ్లారని చెప్పారు. వాజ్‌పేయి కాలం నుంచి బీజేపీని చంద్రబాబు మోసం చేస్తూనే ఉన్నారని విమర్శించారు. బుద్ధిలేని లోకేశ్ సీఎం జగన్‌ను అనుచిత భాషలో విమర్శిస్తున్నారని మండిపడ్డారు. వ్యక్తిగత విమర్శలు చేయడంలో చంద్రబాబు, లోకేశ్ ఇద్దరూ ఒకటేనని చెప్పారు. చంద్రబాబు, లోకేశ్ ఇంట్లో ఎన్నిసార్లు గొడవలు పడ్డారో తనకు తెలుసన్నారు. పవన్‌కళ్యాణ్ చంద్రబాబు రాజకీయ ఉచ్చులో చిక్కుకున్నారని.. టీడీపీతో జనసేన పొత్తును ఆ పార్టీ కార్యకర్తలే జీర్ణించుకోలేకపోతున్నారని చెప్పారు. వైఎస్ జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు.

కృష్ణా డెల్టాకు సాగు నీటి విడుదల

- ఖరీఫ్‌లో ముందస్తు పంటల సాగుకు రైతులు సిద్ధం కండి
- శరవేగంగా పోలవరం ప్రాజెక్టు పనులు
- జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



ఖరీఫ్‌కు నీటిని విడుదల చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు తదితరులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ/మంగళగిరి: కృష్ణా తూర్పుడెల్టాకు సాగునీటిని విడుదల చేశారు. ప్రకాశం బ్యారేజ్ వద్ద కృష్ణా ఈస్టన్ హెడ్ రెగ్యులేటర్ ద్వారా బుధవారం ఉదయం జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీ రావు, శాసనసభ్యులు, అధికారులు పూజా కార్యక్రమాలు నిర్వహించి కాలువకు నీటిని విడుదల చేశారు. తొలుత కాలువకు 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందు చూపుతో రైతులకు ఖరీఫ్‌లో ముందుగానే సాగునీరు అందించేందుకు ఇచ్చిన ఆదేశాలతో నెల ముందుగానే పంటలకు సాగు నీటిని విడుదల చేస్తున్నామన్నారు. కృష్ణా డెల్టాకు కుడి, ఎడమవైపు గుంటూరు, మొత్తం కృష్ణా డెల్టాలో 13 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తున్నామని చెప్పారు. గతంలో జూన్ నెలాఖరు, జూలై నెలలో సాగునీటిని విడుదల చేసేవారని, గత సంవత్సరం జూన్ 10వ తేదీన నీటిని విడుదల చేశామని గుర్తు చేస్తూ ఈ ఏడాది మూడు రోజులు ముందుగానే సాగునీరు విడుదల చేస్తున్నామని తెలిపారు. సాగునీటిని ముందుగానే అందించడం వల్ల రైతులు మూడు పంటలు పండించుకునేందుకు, తుపానులు వంటి ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటలను కాపాడుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. పులిచింతల ప్రాజెక్టులో 34 టీఎంసీల నీటి నిల్వ ఉందని మంత్రి చెప్పారు.

పట్టిసీమ అవసరమే లేకుండా..

నీరు సమృద్ధిగా ఉండడంతో పట్టిసీమ నుంచి నీటిని తీసుకొచ్చే అవసరం లేదని మంత్రి వివరించారు. నాగార్జున సాగర్ నుంచి కూడా నీరు విడుదల అయ్యే అవకాశం ఉందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు తొలి దశలో అవసరమయ్యే 12,911.16 కోట్ల రూపాయల వ్యయాన్ని ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించడం శుభ పరిణామం అన్నారు. శరవేగంగా పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామన్నారు. కృష్ణా నదికి వచ్చే వరద నుండి నగరవాసులకు రక్షణగా నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ నిర్మాణం మూడో దశ పనులు శరవేగంగా జరుగుతున్నాయని మంత్రి అన్నారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ పులిచింతల ప్రాజెక్టును దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో శంకుస్థాపన చేశామని, ఆయన పరిపాలనలోనే ప్రాజెక్టు నిర్మాణం శరవేగంగా జరిగి పూర్తి చేయడంతో 34 టీఎంసీల నీటి సామర్థ్యం కలిగి నేడు రైతుల అవసరాలు తీరుస్తుందని తెలిపారు. ఎమ్మెల్యేలు వెల్లంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణువర్ధన్, దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ హనుమంతరావు పాల్గొన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943